# తెలుగులో భక్తి కవిత్వం - సామాజిక విశ్లేషణ

పర్యవేక్షణ:
**ఆచార్య కె.కె.రంగనాథాచార్యులు**

పరిశోధన:
**పిల్లలమర్రి రాములు**
ఎం.ఏ.,ఎం.ఫిల్.

హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి పిహెచ్.డి పట్టం కోసమై
సమర్పించిన సిద్ధాంతవ్యాసం.
నవంబర్ - 1994.

# TELUGULO BHAKTI KAVITVAM - SAMAJIKA VISLESHANA

A Thesis submitted to the
University of Hyderabad
in partial fulfilment of the requirements for the award of the
degree of Doctor of Philosophy in Telugu

By
Pillalamarri Ramulu

Supervisor, Prof.K.K.Ranganadhacharyulu

Department of Telugu
University of Hyderabad, Hyderabad

1994

# DECLARATION

I hereby declare that the work embodied in this thesis entitled: **"Telugulo Bhakti Kavitvam - Samajika Visleshana,"** carried out by me under the supervision of Professor K.K.Ranganadhacharyulu, Department of Telugu, University of Hyderabad, Hyderabad is original. The thesis or a part thereof has not been submitted for any other degree at this University or any other University.

Dt: 4-11-1994
Hyderabad

Pillalamarri Ramulu

# CERTIFICATE

This is to certify that the thesis entitled: **"Telugulo Bhakti Kavitvam - Samajika Visleshana,"** submitted by Mr.Pillalamarri Ramulu, in partial fulfilment of the requirements for the award of the degree of Doctor of Philosophy in Telugu is original and the work has been carried out under my supervision. The thesis or a part thereof has not been submitted for any other degree at this University or any other University.

Date:

Hyderabad

K.K.Ranganadhacharyulu
(Supervisor)

HEAD Department of Telugu
University of Hyderabad, HYDERABAD

DEAN
SCHOOL OF HUMANITIES
University of Hyderabad,
Hyderabad-500 134

# ప్ర వే శి క

సజీవంగా కొనసాగే సమాజంలో ప్రతిచారిత్రక సందర్భంలోనూ అనేక వైవిధ్య పూరిత అంశాలతో కూడిన ప్రశ్నలు వెలువడటం సహజం. గత అర్ధశతాబ్ది కాలంగా వివిధ వర్ణాలలోని సామాజిక చలనం (Social mobility) కారణంగా సమాజ స్వరూపాన్ని, వివిధ వర్ణాలమధ్య సంబంధాలను గురించి విపులమైన పరిశోధనలు జరుగుతున్నాయి. భారతీయ సమాజంలోని అంతర వ్యవస్థ (Hierarchical System)ను, దానికి ప్రత్యామ్నాయంగా వచ్చిన వివిధ భావాలను, మతోద్యమాలను ఆధునిక పరిశోధకులు పరిశీలిస్తున్నారు. ఆక్రమంలో ఆంధ్రదేశంలోని సామాజిక స్వరూపాన్ని, మధ్యయుగాలనుండి వివిధ వర్ణాల భావజాలంలో కనిపిస్తున్న అతిప్రధాన అంశాలను చర్చించడం ఈ పరిశోధన ఆశయం.

మధ్యయుగాలనాటి భారతీయ సమాజంలో భక్తిఉద్యమం ఆధిపత్య వ్యతిరేక భావాలను ప్రచారం చేసిందని పరిశోధకులు గుర్తించిన అంశమే. ఆంధ్రదేశంలో ఈ భావాలకు వీరశైవ, వైష్ణవ మతోద్యమాలు ప్రాతిపదికను ఏర్పర్చాయి. కన్నడదేశంలో బలమైన సామాజిక ఉద్యమంగా రూపొంది ప్రజల జీవితంపై గాఢమైన ప్రభావాన్ని వేసిన వీరశైవం, తమిళదేశంలోని వైష్ణవమతం ఆంధ్రదేశంలో 12వ శతాబ్దినుండి ప్రచారమవుతూ వచ్చాయి. ఈ ఇరుమతాలతోపాటు భక్తిమార్గాన్ని అనుసరించిన రామదాసు, త్యాగరాజులు, యోగులుగా గుర్తింపుగల వేమన, వీరబ్రహ్మంలకు సామాజిక సంబంధాలపట్లగల అవగాహనను, వారనుసరించిన మార్గమాన్ని, వారి భావాలకుగల ప్రభావాన్ని ఈ పరిశోధనలో పరిశీలించాను. రామదాసు, వేమన, వీరబ్రహ్మం, త్యాగరాజులాంటి కవుల అనేక అంశాలను చర్చించినా,

వారందరిలో కనిపించే ఆధిపత్య నిరసన భావాలను పరిశీలించడానికే పరిమితమైనందున ఈ కవుల రచనల్లోని ఇతర అంశాలను పరిశీలనకు స్వీకరించలేదు. అందుకే వీరశైవ, వైష్ణవ మతోద్యమాలపైనే అధికంగా చర్చ చేయవలసి వచ్చింది.

అనూచానంగా కొనసాగే విశ్వాసాలు, విలువలను ఆక్షేపించి నూతన సంబంధాలను ఆపేక్షించడానికి సాంఘిక, ఆర్థిక సంబంధాల్లో వస్తున్న మార్పులు కారణమవుతాయనే సామాజిక శాస్త్రవేత్తల అభిప్రాయాలను ఆధారంగా చేసుకుని ఈ పరిశోధనను నిర్వహించాను.

నాపట్లగల అవ్యాజమైన వాత్సల్యంతో సామాజిక శాస్త్రాధ్యయనంపట్ల నాకున్న అభిమానాన్నిగుర్తించి మధ్యయుగాల సాహిత్యంలో అభివ్యక్తమైన భావాలను పరిశీలించడానికి ఈ పరిశోధనాంశం సూచించి, పరిశోధన ప్రాథమిక దశనుండి అనేక పుస్తకాలతోపాటు విలువైన సూచనలిచ్చి నా సామాజిక దృక్పథాన్ని, సాహిత్య జీవితాన్ని దీప్తిమంతం చేసిన గురువు కె.కె. రంగనాథాచార్యులు గారికి,

నా సాహిత్యకృషిపట్ల ఆసక్తితో పరిశోధనను ప్రోత్సహించిన స్నిగ్ధహృదయులు, తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య రవ్వా శ్రీహరిగారికి,

ఈ పరిశోధనకు అవకాశం కలిగించిన నాటి శాఖాధ్యక్షులు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారికి,

విశ్వవిద్యాలయంలో అధ్యయనం చేయడమే గర్వకారణంగా భావించేట్లు ఈ కేంద్రాన్ని రూపొందించిన మా జీ వైస్‌ఛాన్సలర్ భద్రిరాజు కృష్ణమూర్తిగారికి, తెలుగుశాఖ అధ్యాపక వర్గానికి ,

నా వ్యక్తిగత సమస్యలవల్ల జరుగుతున్న ఆలస్యానికి హెచ్చరిస్తూ, నా అభివృద్ధిని ఆకాంక్షించి వెన్నుతట్టి ప్రోత్సహించిన డా. ఎస్. గోపి గారికి,

నా అవగాహనను సునిశితం చేసుకోవడానికి తమ చర్చలు, రచనలతో దోహదపడిన పెద్దలు వెల్చేరు నారాయణరావు, చేకూరి రామారావు, వి. రామకృష్ణగారలకు,

ఎం.ఏ. విద్యార్థిగా ఉన్నప్పటినుంచి నన్ను అభిమానించే ఆచార్య ఎల్లూరి శివారెడ్డి గారికి,

అన్నయ్యలా ఆదరించి, విలువైన పుస్తకాలిచ్చి నాలో పరిశోధనా జిజ్ఞాసను పెంచిన ఆత్మీయులు అల్లూరి మురళి గారికి,

చిన్ననాటినుండి నాకు స్ఫూర్తిదాయకంగా ఉన్న మా బావ చెరిపల్లి సీతారాములు గారికి,

పరిశోధనను ప్రోత్సహించడమేగాక, ఒక ముఖ్యమైన సమయంలో సహాయపడిన మాతృహృదయి ఊర్మిళామేడం గారికి,

విషయసేకరణకై వివిధ గ్రంథాలయాలు సందర్శిస్తున్న కాలంలో ఆశ్రయమిచ్చిన దుర్గాప్రసాద్ (రామచంద్రాపురం, తూర్పుగోదావరి) గారికి,

ఈ పరిశోధనాకాలంలో తమ అపురూప గ్రంథాలయాన్ని వాడుకోవడానికి అవకాశమిచ్చిన సుందరయ్య విజ్ఞానకేంద్రం వారికి ముఖ్యంగా సూర్యనారాయణరాజుగారికి,
తెలుగు విశ్వవిద్యాలయం, సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్,

శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం, సారస్వతనికేతనం (వేటపాలెం), గౌతమీ గ్రంథాలయం (రాజమండ్రి), పి.ఎస్.ఆర్. కళాశాల (రామచంద్రాపురం) గ్రంథాలయ నిర్వాహకులకు,

పరిశోధన కొనసాగిన సుదీర్ఘకాలంలోని వివిధరకాల మానసిక చిత్తస్థితుల్లో, నాకు ఉత్సాహాన్నిచ్చిన ఆప్తులు - వజ్జాల అంజిరెడ్డి, యాకూబ్, చెన్నబసవయ్య, డా. అజయ్‌కుమార్, గోపాలకృష్ణ, రమణమూర్తి, అష్రఫ్, సీతారాం, ఎండ్లూరి సుధాకర్, అంజయ్య, కె.పి. అశోక్‌కుమార్, పళని, సోదరి విజయలక్ష్మి, లక్ష్మి గార్లకు,

నాపట్ల అభిమానంతో అత్యంత జాగరూకతతో శుద్ధప్రతిని తయారుచేసిన మిత్రులు పరమేశ్వర్ గారికి,

అక్షరానికి అందం తెచ్చిన ఆత్మీయమిత్రుడు హరిశంకర్‌కు,

నన్ను వెన్నంటి ఉండి అమితప్రేమతో సహాయపడిన తమ్ముళ్ళు రఘు, రామచంద్రం, చెల్లి వినోదలకు,

నా జీవితంలోనే ముఖ్యమార్పుకు కారణమైన ఆర్థికసహాయం చేసిన యు.జి.సి. వారికి,

కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

జీవితంలోని కడగండ్లు కల్లోలపరిచినా, నాచదువులోనే తమ జీవితాన్ని చూసుకున్న అమ్మ, నాన్నలను వినమ్రంగా స్మరిస్తూ ...

## వి ష య సూ చి క


పుట

I. భక్తి - వివిధ భావాలు 5-42

a) భారతీయ సామాజిక అంశాలు - అధ్యయనం

b) మతం - తాత్త్వికసిద్ధాంతాలు

c) భారతీయ సమాజం - కులం — 14.6.22

d) బ్రాహ్మణ భావజాలం

e) వీరశైవ, వైష్ణవ మతాల సాహిత్యాధ్యయనం

f) మతం - భక్తి

g) భక్తిమార్గం - లౌకిక జీవితం

h) ఆలంకారికుల దృష్టిలో భక్తి

i) సామాజిక శాస్త్రవేత్తల దృష్టిలో భక్తి

II. భారతీయ భక్తి ఉద్యమం - మౌలిక లక్షణాలు 43-63.

a) ఉపోద్ఘాతం

b) జయదేవుని మధురభక్తి సంప్రదాయం

c) మహానుభావ సంప్రదాయం

d) వర్కరీ సంప్రదాయం

e) కబీర్ పంథ్

f) నానక్‌పంథ్ (సిక్‌పంథ్)

g) ఉపసంహారం

III. వీరశైవ, వైష్ణవ మతోద్యమాలు 64-134

a) ఉపోద్ఘాతం

b) వీరశైవం

c) వైష్ణవం

d) పోతన - వైష్ణవేతర సంప్రదాయం

e) వీరశైవ, వైష్ణవమతాలు - అద్వైతమత ఖండన

f) ఆచారాలపట్ల భిన్నభావాలు

g) వైష్ణవం - మత సులభీకరణ

h) సామాజికోద్యమంగా వీరశైవం

i) ఆంధ్రదేశ వీరశైవులు - మతప్రామాణీకరణం

j) కులం - వీరశైవ మతావగాహన

k) వీరశైవ మతం - బ్రాహ్మణ సంప్రదాయాలు

l) బసవన - పండితారాధ్య, సోమనాథుల వ్యక్తిత్వం

m) ఉపసంహారం

IV. ఆంధ్రదేశ రాజకీయ, ఆర్థిక పరిణామాలు : సామాజిక చలనం 135-185

a) ఉపోద్ఘాతం

b) రాజకీయ పరిణామాలు

c) దేవాలయ నిర్మాణం

d) నగరీకరణ

e) సామాజిక అభివృద్ధి - వివిధకులాల్లో చలనం

f) వీరశైవ, వైష్ణవ మతాలు - నైతిక నియమాలు

g) రాజాస్థానానికి ప్రత్యామ్నాయంగా దేవాలయం

h) ఉపసంహారం

V. భక్తి, యోగమార్గాలు - ఆధిపత్య నిరసన భావాలు 186 - 219

a) ఉపోద్ఘాతం

b) రాక్షస - తంగిడి యుద్ధానంతర రాజకీయ, ఆర్థిక పరిణామాలు

c) వేమన, వీరబ్రహ్మం

d) స్థలపట్న, వేమన, వీరబ్రహ్మంల భిన్నదృక్పథాలు

e) రామదాసు

f) త్యాగరాజు

g) భక్తిసంప్రదాయంలో క్షేత్రయ్య భిన్నత్వం

h) ఉపసంహారం

VI. భక్తి, తత్త్వకవుల ప్రచార వాహిక - పరిశీలన 220 - 251

a) ఉపోద్ఘాతం

b) కబీర్ దోహా

c) సోమనాథుడి ద్విపద

d) కృష్ణమాచార్యులు, అన్నమాచార్యుల మాధ్యమం

e) క్షేత్రయ్య పదాలు

f) రామదాసు కీర్తనలు

g) వేమన పద్యం

h) వీరబ్రహ్మం తత్త్వాలు

i) త్యాగరాజు కీర్తనలు

j) ఉపసంహారం

VII. ఉపసంహారం 252 - 257

VIII. గ్రంథ సూచిక 258 - 277

...

# భక్తి-వివిధభావాలు

భారతీయ సమాజంలో వివిధ చారిత్రక సందర్భాలలో ఆధిపత్య వర్గాలను నిరసించి, ప్రత్యామ్నాయ సంస్కృతిని ప్రతిపాదించిన వర్గాల భావజాలాన్ని, వివిధ భాషాసాహిత్యాల్లో అది కొనసాగిన తీరుతెన్నులను విశ్లేషిస్తున్న ప్రత్యేక సందర్భంలో ఈ పరిశోధన కొనసాగుతుంది. క్రీ.పూ. దశలో నాటి వైదికమత[1] సంస్కృతికి నిరసనగా వచ్చిన జైన, బౌద్ధమతాల తరవాత ఆధునిక భారతీయ భాషల్లో వచ్చిన భక్తి ఉద్యమం సామాజికంగా లేవనెత్తిన ప్రశ్నలను, వాటి పరిష్కారంలో ఎదురైన సమస్యలను పలువురు సామాజిక శాస్త్రవేత్తలు విశదీకరించారు. ఆక్రమంలో తెలుగుసాహిత్యంలో ప్రచారమైన భక్తిఉద్యమ స్వరూపాన్ని విశ్లేషించడానికి ఈ పరిశోధన ఉద్దేశ్యమైంది.

తెలుగుసాహిత్యంలో భక్తిభావనను సాహితీ సంప్రదాయంలోకి తీసుకువచ్చిన తొలికవి మల్లికార్జున పండితారాధ్యుడు. పండితారాధ్యుడు తన సమకాలంలో కన్నడ దేశంలో ప్రచారంలో ఉన్న వీరశైవమతోద్యమంతో ప్రభావితుడై ఆ మతవిశ్వాసాలను అనుసరిస్తూ, 'శివతత్త్వసారం' రచించాడు. ఆతని తరువాతివాడైన పాల్కురికి సోమనాథుడు కన్నడదేశంలోని వీరశైవమత భావాలను, ఆంధ్రదేశంలో పండితారాధ్యుడు అనుసరించిన పద్ధతిని సమన్వయిస్తూ, వీరశైవమత ప్రచారంకోసం అనేక కృతులను రచించాడు.

---

1. వర్ణవ్యవస్థలో ప్రధాన వర్ణంగా గుర్తింపుగల బ్రాహ్మణులు అనుసరించే మత విశ్వాసాలను సూచించడానికి 'వైదికమతం' అని ఈ పరిశోధనలో ఉపయోగిస్తున్నాను. పాల్కురికి సోమనాథుడు బ్రాహ్మణులు అనుసరించే మతవిశ్వాసాన్ని 'వైదికమతం' అనే పిలిచాడు.

(పండితారాధ్య చరిత్ర, పే. ౮)

సోమనాథుడి తర్వాత వీరశైవ మతవిశ్వాసాలను అనుసరించిన వారిలో పిడుపర్తి కవులు, అత్యనూరి పాపకవిలాంటి రచయితలున్నప్పటికీ వీరశైవ మత భావాలను చర్చించిన కవులు పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథులే. అందువల్ల, వీరశైవ మత భావాలను విశ్లేషించడానికి ప్రస్తుత పరిశోధనలో పండితారాధ్యుడు, సోమనాథుల రచనలనే ఆధారం చేసుకోవడమైంది.

ఆంధ్రదేశంలో ప్రచారమైన భక్తిభావనలో వీరశైవమతోద్యమంతోపాటు వైష్ణవమతం అత్యంత ముఖ్యమైంది. ఆంధ్రదేశంలో వైష్ణవమత వ్యాప్తికి, ఆమతం సామాజికంగా చర్చించిన అనేక భావాలకు ప్రాతిపదికగా తమిళదేశంలోని వైష్ణవోద్యమం నిలిచింది. వైష్ణవమత విశ్వాసాలను అనుసరించినవారిలో కృష్ణమాచార్యులు, అన్నమాచార్యులు ముఖ్యులు. వీరిలో అన్నమాచార్యుడు రచించిన వేలకొలది ఆధ్యాత్మ, శృంగార సంకీర్తనలు వివిధ అంశాలపట్ల వైష్ణవమత దృక్పథాన్ని వివరిస్తాయి. అందువల్ల, వైష్ణవ మతానికి గల సామాజిక అవగాహనను పరిశీలించడానికి వీరిరువురి రచనలను ఆధారంచేసుకున్నాను.

వీరశైవ, వైష్ణవమతాలతోపాటు తెలుగుసాహిత్యంలో ప్రచారమైన స్వీయ భక్తిమార్గానికి చెందిన కవులలో క్షేత్రయ్య, రామదాసు, త్యాగయ్యలు ప్రథమగణ్యులు. తెలుగులో ప్రచారమైన వీరశైవ, వైష్ణవ, భక్తకవుల సంప్రదాయంలోకి తత్వసంప్రదాయానికి దగ్గరగావున్న సామాజిక కవి వేమనను, తత్వకవియైన వీరబ్రహ్మాన్ని సహితం పరిగణించి తెలుగుసాహిత్యంలో వచ్చిన భక్తకవుల సంప్రదాయాన్ని వారు ముందుకు తీసుకొనివచ్చిన

స్వీయ, సామాజిక అంశాలను పరిశీలించి భారతీయ భక్తి, ఉద్యమంలో[1] తెలుగు భక్తికవిత్వస్థానాన్ని విశదీకరించడం ఈ పరిశోధన లక్ష్యం.

## భారతీయ సామాజిక అంశాలు : అధ్యయనం

భారతీయ సామాజిక స్వరూపాన్ని, సాంప్రదాయకంగా కొనసాగుతూ వస్తున్న సాహిత్య, తాత్త్విక, రాజకీయ భావాలను అధ్యయనం చేయడానికి గత శతాబ్దినుండి కృషి కొనసాగుతుంది. తొలిదశలో ఈ కృషిని శక్తివంతంగానూ, వేగవంతంగానూ నిర్వహించినవారు పాశ్చాత్యదేశాలకు చెందిన మేధావులే. భారతీయ సమాజంపై రాజకీయ ఆధిపత్యం నిర్వహిస్తుండిన బ్రిటిష్‌వారికి దీని అవసరం అధికంగా ఉండింది. అందుకోసమే పలువురు పాశ్చాత్య మేధావులు భారతీయ సామాజిక, సాంస్కృతిక అంశాలను అధ్యయనం చేశారు. ఈ అధ్యయనాన్ని ఆధారం చేసుకునే కారల్‌మార్క్స్ భారతీయ సామాజిక స్వరూపంలోని లక్షణాలను విశ్లేషిస్తూ, ఇక్కడి ఆర్థికవిధానంపై, మతస్వరూపంపై తన అభిప్రాయాలను వెలువరించాడు. ఆ సందర్భంలోనే భారతీయ ఆర్థిక విధానాన్ని స్వయంపూర్ణ గ్రామీణ ఆర్థికవ్యవస్థగానూ, ఇక్కడిమతాన్ని అత్యంత ప్రాచీన లక్షణాలు (primitive mode) కలిగినదిగానూ అభివర్ణించి ఉన్నాడు.[2] అయితే గత అర్ధశతాబ్ది కాలంగా కొనసాగుతూ వస్తున్న పలుపరిశోధనలు పూర్వపరిశోధకుల అభి

---

1. ఒక భాషాసాహిత్యాన్ని, అందులో అభివ్యక్తమైన సామాజిక అంశాలను పరిశీలించడానికి భారతీయ సమాజం మొత్తంలో వచ్చిన పరిణామాలను భూమికగా తీసుకోవలసి ఉంటుందని విమర్శకులు అంగీకరించిన విషయమే.

   చూ. కె.కె. రంగనాథాచార్యులు : తెలుగుసాహిత్యం - మరోచూపు, పే. IX.
2. Marx & Engels : Collectedworks, Vol.XII P. 132.

ప్రాయాలను ప్రశ్నిస్తున్నాయి. భారతీయ సమాజాన్ని గురించి పాశ్చాత్య మేధావులు చేసిన పరిశోధనలన్నీ నూతన అభిప్రాయాలను ప్రకటిస్తున్నాయి.

గతశతాబ్దిలో కొనసాగిన పాశ్చాత్య మేధావుల అధ్యయనాన్ని పరిశోధకులు మూడు రకాలుగా విభజించారు.[1] 1. ప్రాచ్యవాద సిద్ధాంతం (Orientalism) 2. పాలకుల దృక్పథం (Administrative approach) 3. క్రైస్తవ మిషనరీల దృక్పథం (Missionary approach). ప్రాచ్యవాదులు భారతీయ మత, ధార్మిక గ్రంథాలను ఆధారంచేసుకుని భారతీయ సామాజిక స్వరూపాన్ని పరిశీలించారు. వారి అవగాహనలో క్రీ. శ. 3, 4 శతాబ్దుల్లోని ధర్మశాస్త్రాలు వెలువరించిన అభిప్రాయాలనే క్రీ.శ. 18వ శతాబ్దివరకూ భారతీయులు అనుసరించారని, ధర్మశాస్త్రాల్లోని భావాలను ప్రశ్నించకుండా వాటిని పాటించడంవల్ల, భారతీయసమాజం స్థిరమైన సామాజిక వ్యవస్థను కలిగి ఉందని అభిప్రాయపడ్డారు.

భారతీయ సమాజంలోని గ్రామం, కులం, కుటుంబాలను గూర్చి అధ్యయనం చేసిన అధికారవర్గాలు ఈ సమాజంయొక్క నిశ్చలనశీలత (Static stage) గ్రామీణ జీవనంలోనూ, సాంఘికవ్యవస్థ (Social organization)లోనూ ఉందని భావించారు. ఇక మూడవవారైన మిషనరీలు ప్రాచ్యవాదుల దృక్పథానికి భిన్నంగా అధిపత్యవర్గంగా పరిగణింపబడే బ్రాహ్మణవిధానాన్ని తీవ్రంగా విమర్శించారు. బ్రాహ్మణులు దుస్స్వభావం కలిగినవారని, ఆచారరహితులని, వారనుసరించే మతవిశ్వాసాలలో అనేక వైరుధ్యాలున్నాయని ఆక్షేపించారు.

---

1. See. S.C. Malik : Dissent, Protest and Reform in Indian Civilization, P. 2.

పైమూడు వర్గాల అభిప్రాయాలలోని సామంజస్యాన్ని పరిశీలించడానికి భారతీయ సమాజంలోని మౌలిక లక్షణాలను, ఈ దేశంలోని సామాజిక స్వరూపాన్ని అవగతం చేసుకోవడానికి పరిశోధనలు కొనసాగాయి. ఫలితంగా భారతీయ సామాజిక విధానంపై పాశ్చాత్యుల అభిప్రాయాలతో పరిశోధకులు విభేదించారు. దానిలో భాగంగానే భారతీయ సామాజిక వ్యవస్థను అధ్యయనం చేసిన కారల్‌మార్క్స్, మాక్స్‌వెబర్, దర్ఖీమ్ (Durkheim) లాంటి సామాజిక శాస్త్రవేత్తల అభిప్రాయాలతో విభేదించారు.[1]

భారతదేశంలోని వైదికమతంపై కారల్‌మార్క్స్ చెప్పిన అభిప్రాయాలలో లోపాలున్నట్టుగా పరిశోధకులు పేర్కొంటున్నారు. అందుకు మార్క్స్ అనుసరించిన పద్ధతికారణంగాక ఆనాటికి ఆయనకు అందుబాటులో ఉన్న అధ్యయనాలు ఇచ్చిన అవగాహనా ఫలితమని వివరించారు.[2] భారతీయ సమాజంలో ఎలాంటి మార్పు లేదనే అంశాలతో ఆధునిక పరిశోధకులు విభేదిస్తున్నారు. భారతదేశంలో ఆధిపత్య వ్యతిరేక భావాలను అధ్యయనం చేసిన యస్.సి. మాలిక్ సామాజికవ్యవస్థ మార్పుకోసం జరిగిన ప్రయత్నాన్ని గురించి ఇలా పేర్కొంటాడు. " ... in India, from time to time the fundamentals of socio-cultural structure have

---

1. (a) "What Marx himself said about India cannot be taken as it stands".
   D.D. Kosambi: Introduction to the study of Indian History, P. XI.
   (b) Irfan Habib: "Problems of Marxist Historiography" in Social Scientist, Vol. 187, P.3.
   (c) Romila Thaper; "Durkheim and Weber on theories of Society and Race relating to Pre-colonial India" in Interpreting Early India.
2. Trevorling: Karl Marx and Religion - In Europe and India, P.72.

definitely been questioned with attempts to provide alternative categories. Thus, not only was the hierarchy idea prevalent in the wide-ranging socio-cultural system questioned but even other ideas, such as egalitarianism, were also practised and preached. A major consequence of such movements was that these non-comformist ideas manifested themselves in various ways in the socio-cultural, economic and value systems. The significant contributions of radical or heterodox ideas therefore appear to be in terms the corrections they provided to the various imbalances created at particular points of time thereby rectifying the inadequacies of the prevailing traditions".[1]

క్రీ.పూ. దశనుండి వస్తున్న అనేక పరిణామాలలో బౌద్ధం, జైనం పూర్వ సంప్రదాయాలపై నిరసనగా, తిరుగుబాటుగానే వచ్చాయి. అయితే సాంప్రదాయక (ఆధిపత్య, ఆధిపత్యేతర) భావాలు ఒకేక్రమంలో కొనసాగలేదు. థేరవాద బౌద్ధం తొలిదశలో బ్రాహ్మణాధిపత్యాన్ని వ్యతిరేకించగా కాలవ్యవధిలో అది ఆధిపత్య సంప్రదాయంగా అవతరించింది. థేరవాద బౌద్ధానికి వ్యతిరేకంగా అనేక శాఖలు ఏర్పడ్డాయి.

---

1. S.C. Malik: Dissent, Protest and Reform in Indian Civilization, P.9.

బౌద్ధంలోని వివిధ శాఖలు సమాజంలోని ఉన్నతవర్గాలను ఆకర్షించడానికి జరిపిన ప్రయత్నంలో తమ నిరసన తీవ్రతను కోల్పోయాయి. అందుకే భారతదేశంలో సామాజిక స్వరూపాన్ని సంపూర్ణంగా మార్చగలిగిన సిద్ధాంతంగాని, మార్పుకు అవసరమైన ఉద్యమం గాని ఏనాడూ స్థిరంగా కొనసాగలేదని చరిత్రకారులు భావిస్తున్నారు.[1]

భారతీయ సామాజికవ్యవస్థను సంపూర్ణంగా మార్చడానికి కావలసిన కృషిని కొనసాగించిన మతోద్యమంగాని, సాంఘికోద్యమాలుగాని లేవని అంగీకరించినప్పటికీ సామాజిక ఆధిపత్యాన్ని నిరసించిన ఉద్యమాలు ప్రాథమిక దశనుండి కొనసాగుతున్నాయని పరిశోధకులు గుర్తించారు. అందువల్ల వాటి స్వరూప, స్వభావాలను విశ్లేషించడానికి ఉద్యమాల అవిచ్ఛిన్నతను పరిశీలించడానికి కృషి జరపవలసి ఉంది. తద్వారానే గతానికి, వర్తమానానికి గల సంబంధాలను అర్థంచేసుకోగల్గుతాం. ప్రముఖ చరిత్రకారుడు ఇర్ఫాన్ హబీబ్ అభిప్రాయపడినట్లు, "It is inherent in the unity of past and present that Marxist historiography must continuously uncover fresh aspects to explore and re-explore and fresh questions to answer."[2]

ఒక సామాజిక వ్యవస్థను విశ్లేషించడానికి ఆర్థిక సంబంధాలు ప్రధాన అంశాలే అయినప్పటికీ భావజాలానికిగూడా అధిక ప్రాధాన్యం ఉంటుంది. ఆర్థిక రంగంలో అనేకమార్పులు వచ్చినకాలంలో కూడా ప్రాథమిక దశలో ఏర్పడిన భావాలు ప్రచారం గావచ్చు. ఆర్థిక

---

1. Romila Thaper: "Dissent and Protest in Early Indian Tradition", P. 195.

2. Irfan Habib: "Problems of Marxist Historiography," P. 3.

సంబంధాలకు అతీతంగా కొనసాగే భావాలుంటాయని గ్రహించే ఒక సందర్భంలో ఎంగెల్స్, 'ప్రతి అంశానికి ఆర్థిక నియతినే పరిగణనలోకి తీసుకోవద్దని, తరాలుగా వస్తు తాత్త్విక, రాజకీయ, మతభావాలకుగూడా ప్రాధాన్యత ఉందని తెలిపాడు.[1] అయితే భావజాలంలో వచ్చే నూతన అంశాలను అర్థంచేసుకోవడానికి సామాజికపరిణామాన్ని పరిశీలించవలసి ఉంటుంది. అంటే ఒక ప్రత్యేక భావజాలం ఏర్పడడానికి కారణమైన ఉత్పత్తిపరికరాలు, సంబంధాలను పరిశీలించడంద్వారా ఆయా ప్రత్యేకకాలాలనాటి సామాజిక చరిత్రను నిర్మించడానికి వీలవుతుంది. తద్వారా సాహిత్యంలో అభివ్యక్తమైన భావాలకు గల చరిత్రను గ్రహించవచ్చు.

భారతదేశానికి సంబంధించినంతవరకు తాత్త్విక అంశాలను పరిగణనలోకి తీసుకుని సామాజిక చరిత్రను నిర్మించడం గహనతరమైన పని. ఎందుకంటే భారతదేశంలో ప్రచారమైన ప్రధాన తాత్త్విక భావాలు లౌకికసమాజాన్ని ఆధారంచేసుకోకుండానే కొనసాగాయి.[2] ఈ తాత్త్వికభావాలు సమాజ సమగ్ర అభివృద్ధికి ఉపయోగపడే దిశలో కొనసాగకుండా దేహం, ఆత్మ, పరమాత్మ, జన్మ, కర్మలగురించిన చర్చల్లోనే ఉండిపోయాయి. ఈ భావాలకు ఉపనిషత్తుల కాలంలో బలమైన ప్రాతిపదిక ఏర్పడగా క్రీ.శ. 8వ శతాబ్దం (శంకరాచార్యులు), క్రీ.శ. 12వ శతాబ్దం (రామానుజాచార్యులు)లోనూ గూడా వాటిమీనే భాష్యాలు వెలువడ్డాయి. అయితే ఈ ప్రధాన ధోరణికి భిన్నంగా చార్వాకం భౌతిక జీవితానికి ప్రాధాన్యమిచ్చి, సుఖవంతమైన జీవితాన్ని ఆకాంక్షించింది

---

1. Karl Marx & Engels: Selected correspondence, PP.394-5.

2. దేవీప్రసాద్ ఛటోపాధ్యాయ : భారతీయ తత్త్వశాస్త్రం, పే. 31.

నప్పటికీ[1] అది ప్రజల జీవనవిధానంలో భాగం కాలేకపోయింది.

భారతీయ సమాజాన్ని తాత్త్వికసిద్ధాంతాలకంటె మతమే అధికంగా ప్రభావితం చేయగలిగింది. ప్రాథమిక దశలో జైన, బౌద్ధమతాలు, ఆ తర్వాత కాలంలో వీరశైవ, వైష్ణవమతాలు, కబీర్‌పంథ్, సిక్కు మతంలాంటివి. అయితే సమాజమార్పుకు మతోద్యమాలే చోదకశక్తిగా ఉపకరించినప్పటికీ మతానికుండే పరిమితులే సమాజమార్పును నిరోధించాయని కోశాంబి అభిప్రాయపడ్డాడు.[2] ప్రాచీన, మధ్యయుగాలలో మతవిశ్వాసాలు జీవితంలో ప్రధానమైన అంశాలుగావడంవల్ల, ఏ అభిప్రాయాలు తెలుపడానికైనా మతమే మూలమయ్యింది. ఆధిపత్యవర్గాలు తమ భావాలను ప్రచారం చేయడానికి మతాన్ని, దైవాన్ని వాడుకున్నాయి. వాటిని వ్యతిరేకించే వర్గాలు సహితం మతం, దైవాలపైనే ఆధారపడ్డాయి. అయితే వీటి స్వరూపంలో కొన్ని తేడాలుంటాయి. ఆధిపత్య వర్గాలు అభిమానించే దైవం ఒకరు గావచ్చు. తద్వ్యతిరేకులు వేరొకదైవాన్ని ప్రతీకగా నిలుపుకోవచ్చు. లేదా ఒకే దైవం ఉన్నప్పటికీ తమ భావాలను ప్రతిబింబించే విధంగా మలుచుకోవచ్చు. ఈ క్రమంలో వీరు ప్రత్యేక నియమావళిని రూపొందించుకుంటారు. అంతేగాక, తమలో మరిన్ని వర్గాలను కలుపుకోవడం కోసమై ఇతరుల ఆచార వ్యవహారాలను గూడా అంగీకరిస్తారు. ఆరకంగా వివిధ కర్మకాండలకు ఒక పవిత్రతను ఆపాదిస్తారు. సరిగ్గా ఇదేపనిని ఆధిపత్యవర్గాలు మరొక రకంగా చేస్తాయి.

---

1. ''యావజ్జీవేత్సుఖం జీవేదృణం కృత్వా ఘృతం పిబేత్
భస్మీభూతస్య దేహస్య పునరాగమనం కుతః''
Cf.డా. పుల్లెల శ్రీరామచంద్రుడు : ''శ్రీ శంకర భగవత్పాదుల వేదాన్త ప్రకరణ గ్రంథాలు'' - జగద్గురు సాహితీలహరి, పే. 2.

2. D.D. Kosambi : The culture and civilization of Ancient India, P.16.

ఆధిపత్య భావజాలాన్ని వ్యతిరేకించి ఉద్యమాలు నడిపిన వ్యక్తుల అభిప్రాయాలను తాము పరిగణనలోకి తీసుకోవడంలో మనుగడ ఉందని భావించినపుడు వారి అభిప్రాయాలను వ్యవస్థీకరిస్తారు. ఇట్లా వ్యవస్థీకరించే సమయంలో వారి అభిప్రాయాలకు వేదాలనుండి, ఉపనిషత్తులనుండి తుల్యభావాలు ఉదహరిస్తారు. అపుడు శిష్టవర్గంవారు తాత్విక అంశాలను చర్చిస్తారు. సాధారణ ప్రజలు ఉద్యమ వ్యక్తులను దైవంగా పూజిస్తారు. దీనితో ఉద్యమనేతల భావాలు తాత్వికచర్చల్లో భాగమై, తమ సామాజిక ప్రాసంగికతను కోల్పోతాయి. వారు ఏర్పర్చిన నియమాలు కర్మకాండల్లో భాగమవుతాయి. తద్వారా ఆధిపత్యవర్గాలు తమ భావజాలాన్ని, వర్ణవ్యవస్థను కొనసాగిస్తాయి.

ఈ అంశాల ఆధారంగా మతాలు ప్రచారం చేసిన భావజాలం, అవి వ్యాపించిన తీరు, వాటికున్న పరిమితులు, తిరిగి ఆధిపత్యభావాల్లో కలిసిపోవడానికి ఏర్పడిన స్థితిని పరిశీలించడం ద్వారా సామాజిక మార్పుకు ఉపకరించే సమగ్ర సిద్ధాంతాన్ని ఊహించడానికి వీలవుతుంది.

## భారతీయ సమాజం - కులం

ఒకదేశ సామాజిక చరిత్రను అవగాహన చేసుకోవడమంటే ఆ దేశంలోని ఉత్పత్తి, శక్తులు, సంబంధాలను క్రమపద్ధతిలో పరిశీలించడమని చారిత్రకులు పేర్కొంటారు.[1] భారతీయ సమాజంలోని ఉత్పత్తిశక్తులు ప్రధానంగా కులప్రాతిపదికపై ఆధారపడిఉన్నాయి. సాంప్రదాయకంగా ఒక కులంవారు ఏవృత్తినైతే అనుసరిస్తారో వారి సంతానంగూడా

1. D.D. Kosambi: Introduction to the Study of Indian History, P. 7.

అదే వృత్తిని నిర్వహించడం ఈ కులవిధానంలోని మౌలికలక్షణం. అంతేగాక ఒక వృత్తికి సంబంధించినవారు మరొకవృత్తిని నిర్వహించగూడదనే అభిప్రాయం గూడా బలంగా ఏర్పడిన సామాజిక విధానమిది.[1]

భారతీయ సమాజంలో ప్రధాన అంశమైన కులవిధానం శతాబ్దాలుగా కొన సాగడానికి రెండంశాలలో దానికి పునాదులున్నాయి. భౌతికంగా ఉత్పత్తివిధానంతో ముడిపడి ఉండటం ఒక కారణం కాగా, భావజాలపరంగా వివిధ కులాలకు నియతమైన స్థాయీభేదాలు రెండవకారణం. ''ఎంతమార్పులేకుండా ఉన్నా (మరింత బాగా చెప్పాలంటే - కనిపించకుండా మార్పు చెందుతున్నా) కులం, గ్రామీణ వ్యవస్థ తప్పకుండా సామాజిక వ్యవస్థలే. అవి శతాబ్దాలపాటు కొనసాగాయికూడా. అంతకాలం కొన సాగటానికి వీలుకలిగించిన సైద్ధాంతిక, సాంస్కృతిక ఉపరితలానికి (నాగరికతకు) చారిత్రక విలువ, చారిత్రక అవసరం ఉండితీరాలి. లేకుంటే ఆ నాగరికత చారిత్రక రంగస్థలంమీదినుంచి అదృశ్యమైపోయి, కాలగర్భంలో కలిసిపోయి ఉండేది.[2]''
ఇట్లా బలీయమైన లక్షణం కలిగిన కులవిధాన ఆవిర్భావం గురించి సామాజిక శాస్త్రవేత్తల్లో పలురకాలైన అభిప్రాయాలున్నాయి. కొందరు తమతమ అభిరుచులకనుగుణంగా అనుసరించిన వృత్తిని బట్టి కులం ఏర్పడిందని భావించగా తమశక్త్యనుసారం చేపట్టిన

---

1. ''శ్రేయాన్స్వధర్మోవిగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్,
స్వధర్మేనిధనంశ్రేయః పరధర్మో భయావహః (భగవద్గీత, III -35.

2. ఎస్.జి. సర్దేశాయి : ప్రాచీన భారతదేశంలో ప్రగతి : సాంప్రదాయవాదం
PP. 64 - 65.

వృత్తివల్ల, ఒక కులానికి సంబంధించిన వారిగా ఏర్పడ్డారని మరొక అభిప్రాయం ఉంది. వ్యక్తులు పాటించిన శుద్ధి, అశుద్ధిని బట్టి కులం ఏర్పడిందని మరికొందరు విశ్వసిస్తున్నారు.[1] ఉత్పత్తివిధానం ఆధారంగా క్రీ. పూ. 3000 - 1750లమధ్య సింధూనది పరివాహక ప్రాంతంలో ప్రారంభమైన ఆహారోత్పత్తి దశనుండి నూతన పద్ధతుల్లో, వ్యవసాయాభివృద్ధి జరిగిన దశలో కులవ్యవస్థకు పునాదులు ఏర్పడ్డాయని కోశాంబి భావించారు.[2] ఈ విధానాన్ని అధ్యయనం చేసిన ఇతర పరిశోధకులు గూడా మొహెంజదారో, హరప్పా నాగరికతాకాలంనుండే కులవిధానానికి మార్గం ఏర్పడిందని విశ్వసిస్తున్నారు.[3]

కులవిధాన ఆవిర్భావం గురించి భగవద్గీతలో విపులమైన చర్చ ఉంది. కృష్ణార్జునులమధ్య జరిగిన సంభాషణలో కృష్ణుడు,

''చాతుర్వర్ణ్యం మయాసృష్టం గుణకర్మవిభాగశః,
తస్యకర్తారమపిమాం విద్ధ్యకర్తారమవ్యయమ్'' (గీత. IV -13)

ఆయావ్యక్తుల గుణకర్మ విభాగాలనుబట్టి నాలుగు వర్ణాలను తానే సృష్టించానని పేర్కొంటాడు. వీరిలో ఏకులానికి సంబంధించినవారయినా తనను సేవించి మోక్షం పొందవచ్చునని తెలిపే సందర్భంలో స్త్రీ, వైశ్య, శూద్రులను అధములుగానూ, బ్రాహ్మణ, క్షత్రియులను పవిత్రకులోద్భవులుగానూ పేర్కొంటాడు.[4] వివిధవర్ణాలపట్ల తరతమ స్థాయీభేదాలను కల్పించటం ప్రాథమికదశనుండి కనిపిస్తుంది. నాలుగు వర్ణాలు సృష్టికర్తయైన బ్రహ్మనుండే ఆవిర్భవించాయంటూ వేదాలలో ఒక సూక్తాన్ని ప్రక్షిప్తం చేశారు.

---

1. See, R.S. Sharma: Perspectives in Social and Economic History of India, PP. 23-25.
2. D.D. Kosambi: The Culture and Civilization of Ancient India, P.51.
3. S.C. Malik: Indian Civilization: The Formative period. Cf. Suvira Jaiswal: "Studies in Early Indian Social History", P.11
4. భగవద్గీత - IX - 32,33.

''బ్రాహ్మణో஽స్య ముఖమాసీత్, బాహూరాజన్యకృతః
ఊరూతదస్య యద్వైశ్యః పద్భ్యామ్ శూద్రో అజాయత''[1]

ఈ శ్లోకం ఋగ్వేదంలోప్రక్షిప్తమే అయినప్పటికీ[2] దీనిని ఆధారం చేసుకునే ఆయావర్గాల సామాజికస్థాయి ప్రచారమయ్యింది. ఈసూక్తంలో ప్రస్తావిత మైన అంశాలనుబట్టి ఆయా అవయవాలకుండే ప్రాధాన్యం, గౌరవం అవయవాలనుండి ఆవిర్భవించిన వర్గాలకు ఆపాదితమైనాయి. దీనివల్ల జన్మించిన కులాన్నిబట్టి వ్యక్తిగత సామాజికస్థాయి, వివాహనియమం, వివిధ సామాజిక కార్యకలాపాల్లో పాల్గొనేఅవకాశం నిర్ణయమవుతాయి. కులాల సామాజికస్థాయిని స్థిరీకరిస్తూ, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులను ద్విజులుగానూ, శూద్రులను నాలుగవవర్ణంగా పరిగణించారు. ద్విజులుగా పరిగణింపబడిన మూడు వర్ణాల్లో ప్రముఖమైంది, సులభంగా గుర్తించగలిగింది, బ్రాహ్మణవర్ణం. వివిధకర్మకాండల్లో పాల్గొనే అవకాశం వల్ల సమాజంలో బ్రాహ్మణులకు విశిష్టత ఏర్పడింది. ఆవిశిష్టత కలగడానికి పుట్టుకే కారణమైనప్పటికీ ఆ సంప్రదాయాలను క్రమపద్ధతిలో పాటించవలసిన అవసరమూ ఉండేది. సమాజం స్థిరంగా ఉండడానికి బ్రాహ్మణ ధర్మాలను రక్షించడం రాజ్యం యొక్క ప్రధానధ్యేయమని చాణక్యుడు బోధిస్తాడు. బ్రాహ్మణుల ప్రత్యేకతను రక్షించ వలసిన బాధ్యత రాజ్యంపై ఉండడంవల్ల సహజంగానే బ్రాహ్మణులు, క్షత్రియులమధ్య సత్సంబంధాలు కొనసాగేవి. వీరిద్దరిమధ్య స్నేహసంబంధాలు నెలకొనడానికి చారిత్రకులు మరొకకారణంగూడా పేర్కొంటారు. ఉత్పాదక వర్గాలనుండి వచ్చే

---

1. ఋగ్వేదం, X _ 90

2. "Not only is the tenth mandala believed to be a late addition, but the evidence of the hymn itself suggests that it is an interpolation."
Romila Thaper: "Social mobility in Ancient India" in Indian Society: Historical probings.

మిగులును ఈ రెండు వర్ణాలు పంచుకోవడం.[1] ఈ రెండు వర్ణాలు విభిన్నమైన పనులు చేయడంవల్ల, వృత్తిలో పోటీలేదు. పరస్పర అవసరాలు ఉండడమేగాక బ్రాహ్మణులు, క్షత్రియుల ఆధిపత్యాన్ని శాశ్వతంగా నిలబెట్టడానికి కృషిచేశారు. క్షత్రియేతరులు రాజ్యాధికారంలోకి వచ్చినప్పటికీ వారికి రాజబిరుదులను ప్రసాదించి, ప్రముఖవంశాలతో సంబంధం కలపడం ద్వారా వారిపాలనను ప్రజలచేత ఆమోదయోగ్యం చేసేవారు. దీనివల్ల, రాజులకు బ్రాహ్మణుల అవసరం నిరంతరం ఉండేది. బ్రాహ్మణ, క్షత్రియుల మధ్యగల సంబంధాలను పదకొండవ శతాబ్దంలో రచనచేసిన నన్నయ్యకూడా ప్రత్యేకంగా ప్రస్తావించాడు. మహాభారతంలోని ఆదిపర్వంలో దీర్ఘతముడనే బ్రాహ్మణుడు 'బలి' అనే రాజుకు సంతానప్రాప్తిని కలిగించి వెళ్ళిపోయిన సందర్భంలో నన్నయ్య ''ఉత్తమ క్షత్రియక్షేత్రంబులందు ధర్మమార్గంబున బ్రాహ్మణుల వలనంబుట్టి వంశకరు లయిన క్షత్రియులనేకులు గలర''ంటాడు.[2] నన్నయ్యకాలంనాటికి ఈ సంబంధాలు కొనసాగకపోయినా బ్రాహ్మణ, క్షత్రియులమధ్య గల పటిష్టమైన సంబంధాలను ఊహించవచ్చు. క్షత్రియులకున్న సామాజికగుర్తింపు వివిధ సందర్భాలలో మారుతూ వచ్చింది. బౌద్ధ సాహిత్యంలో 'ఖత్తియ'లుగా పేర్కొనబడిన క్షత్రియులకు బుద్ధునికాలంలో ఉండిన గుర్తింపుకు, కాలక్రమంలో వారిని పరిగణించిన తీరుకు మధ్య తేడాఉంది. అలాగే శెట్టుల విషయంగూడా.

శెట్టులను ప్రత్యేకంగా విభాగించడం కొంతకష్టమైన అంశంగా చారిత్రకులు భావిస్తున్నారు. ఎందుకంటే వివిధవృత్తులు నిర్వహించే ప్రజలను శెట్టులుగా

---

1. Suvira Jaiswal: Presidential address, Ancient Indian Section, Indian History Congress, 38th session 1977, P.18.

2. మహాభారతం - ఆదిపర్వం, పే. 241.

పెంగొంచడంవల్ల, వైశ్యులకు సంబంధించిన గుర్తింపులో స్పష్టతలేదు. ధర్మశాస్త్రాలు పేర్కొంటున్న అభిప్రాయం ప్రకారం వైశ్యులంటే పశువులు, వ్యవసాయాది వృత్తి, నిర్వహించడంతోపాటు వాణిజ్యాలు చేసేవారు.[1] మరొక అభిప్రాయంలో వైశ్యులంటే రాజ్యనిర్వహణకు అవసరమయ్యే పన్ను సమకూర్చేవారనే అభిప్రాయం ఉంది. బుద్ధునికాలంలో వైశ్యులు గహపతులు (గృహపతులు)గా గౌరవింపబడేవారు. కొన్ని సందర్భాలలో వారిని శ్రేష్ఠి-గహపతి అని పిలిచేవారు. సంపన్నులైన వైశ్యులు శ్రేణుల జ్యేష్ఠులను తమలో కలుపుకునేవారు. గహపతులు, శ్రేణుల జ్యేష్ఠులతో శ్రేష్ఠుల కూటమి ఏర్పడేది. ఈకూటమికి సామాజికస్థాయి, అధికారం నగరాలనుండి వచ్చే ఆదాయాన్నిబట్టి నిర్ణయమయ్యేది. నగరాలు వృద్ధిచెందుతూ వచ్చినకొలదీ వ్యాపారసంబంధాలవల్ల, నగరాలలో గహపతులకు ప్రత్యేకత ఉండేది. బౌద్ధమతం ప్రచారమవుతున్నకాలంలో ఆమతానికి క్షత్రియ, గహపతులనుండే ఆదరణ లభించేది.[2] వైశ్యుల ప్రత్యేక ప్రయత్నం ద్వారానే ఉన్నత సామాజికస్థాయి నిర్ణయమయ్యేది. సామాజికంగా వైశ్యులతో దగ్గరిసంబంధాలు కలిగినవర్ణం - శూద్రవర్ణం. సమాజంలో అతి ప్రధానవర్ణంగా ఉన్న బ్రాహ్మణులు, క్షత్రియులు రాజ్యనిర్వహణాభారాన్ని వహించగా వైశ్యులు, శూద్రులు ఉత్పత్తి విధానానికి పరిమితమయ్యేవారు. ఇది సాధారణ విభజనకు మాత్రమే పరిమితంగాక, శూద్రులకు అధ్యయనంలో ఉండవలసిన సంబంధాలను నియతం చేశారు. శూద్రులు ఇతరవర్ణాలకు సేవకులుగా మాత్రమే ఉండాలిగాని,

---

1. మనుధర్మశాస్త్రం - IX, Nos . 326 - 33.

2. Romila Thaper: "Social Mobility in Ancient India" P. 118.

వైదిక కార్యక్రమాలు నిర్వహించడానికి వెళ్ళరంటూ నియమం విధించడమేగాక శూద్రులవద్ద వేదాలను పఠించగూడదని తెలిపారు. ఎందుకంటే శూద్రుడు సంచారశ్మశానంతో సమానం. అందువల్ల అతనికి సమీపంలో వేదాధ్యయనం చేయకూడదని పేర్కొన్నారు.[1] ధర్మశాస్త్రాలు శూద్రులకు నియతం చేసిన అంశాలు.

1. వేదాలను చదవగూడదు (బ్రాహ్మణపౌరాణికుడివద్ద పురాణాలు, ఇతిహాసాలు వినవచ్చు.)
2. యజ్ఞయాగాదులను నిర్వహించడానికి వీలులేదు.
3. వివిధసంస్కారాలు (గర్భాదాన, పుంసవన, సీమంతోన్నయన, జాతకర్మ, నామకరణ, అన్నప్రాశన, చౌల, కర్ణవేధ, వివాహాది కార్యాలు) నిర్వహించగూడదు.
4. శూద్రులుచేసే నేరాలకు తీవ్రమైన శిక్ష విధించాలి.
5. జనన మరణాల సందర్భాలలో నెలరోజుల వరకు శుద్ధిపాటించాలి. (బ్రాహ్మణులకు పదిరోజులు సరిపోతుంది).
6. శూద్రుడిని న్యాయమూర్తిగా నియమించగూడదు.
7. శూద్రులనుండి బ్రాహ్మణులు కానుకలు స్వీకరించగూడదు. బ్రాహ్మణుల కానుకలు స్వీకరించడానికి శూద్రులు అర్హులుకారు.
8. శూద్రులనుండి భోజనం స్వీకరించగూడదు.
9. బ్రాహ్మణులను ముట్టుకోగూడదు.

---

1. P.V. Kane: History of Dharmasastras, Vol. II, Part-I, P.34.

10. ఆశ్రమ ధర్మాలలో శూద్రులు గృహస్థాశ్రమమొక్కటే అనుసరించాలి.

11. శూద్రుడి జీవనం హీనమైనది.

శూద్రులు అనుసరించగూడని పనులను ధర్మశాస్త్రకారులు వివిధంగా నియతంజేశారు.[1]

శూద్రులతోపాటు హీనంగా పరిగణింపబడే మరొక ప్రత్యేక తెగ - ఛండాలురు. అంటరాని ప్రజలను పూర్వకాలంలో 'అంత్యజులు'గా పేర్కొనేవారు. మధ్య యుగాలలోని సాహిత్యంగూడా అలాగే పేర్కొంటుంది. పూర్వకాలంలో అన్ని హీన కులాలను 'అంత్యజ' అనేపేరుతో పిలిచారు. అనేక అంశాలలో హీనంగా పరిగణింపబడిన అంత్యజులు నగరానికి దూరంలో జీవించాలని, వారికి శునకాలు, గార్దభాలు మాత్రమే సంపదగా ఉండాలని పేర్కొన్నారు.[2] ఇట్లా, అనేక అంశాలలో కులవిధానాన్ని నియమబద్ధం చేసి ఆయాకులాలవారు నిర్వహించవలసిన పనులను అతిక్రమించ కూడదని తెల్పడం ద్వారా రెండుప్రయోజనాలు సాధించారు. మొదటిది, వస్తూత్పత్తి నిరాటంకంగా జరిగేట్లు చూడడం, రెండు: వైశ్య, శూద్రులు ఉన్నత కులాల స్థాయిని సాధించకుండా నిరోధించడం.[3] కులవిధానం ప్రాథమిక దశలో తమకు అవసరమైన వస్తువులను

---

1. See. Ibid. PP 154-164.
2. G.C. Haughton: Manava Dharma Sastras, X-51.
3. "....When we take an overall view of the caste system, there is no doubt that its essential function has been to ensure the supply of handicrafts and agricultural labour, a non-specialized task, to upper castes by making upward mobility practically impossible for the menial castes"

   Nirmal Kumar Bose: Culture and Society in India, Cf. Suvira Jaiswal: "Studies in Early Indian Social History", P.7.

ఉత్పత్తి చేసుకోవడానికి ఉపకరించింది. ఆ దశలో వంశపారంపర్యంగా ఒకేవృత్తిని నిర్వహించాలన్న నియమంలేదు. అంతేగాక తమకిష్టమైన వృత్తిని చేపట్టే అవకాశం ఉండేది. కాని, కాలక్రమంలో వృత్తులు వంశపారంపర్యమై తమవృత్తిని మార్చుకోవడం అసాధ్యమయ్యింది.[1] యాజ్ఞాదిక్రతువులు నిర్వహించే బ్రాహ్మణులు, యుద్ధవీరులు ప్రత్యక్ష శ్రమనుండి విడివడి ప్రత్యేక వర్గంగా గుర్తింపుపొందారు. శారీరక శ్రమ నిర్వహించే వైశ్య, శూద్రులు సామాజిక జీవితంలో హీనులుగా పరిగణింపబడ్డారు.

## బ్రాహ్మణ భావజాలం

కులవిధానంలో ఆధిపత్యభావాలకు ప్రతినిధులు బ్రాహ్మణులు. రాజ్యవ్యవహారాలు మొత్తం బ్రాహ్మణుల భావాలకనుగుణంగా నిర్వర్తింపబడతాయి. రాజ్యం అనుసరించాల్సిన విధానాలను రాజులకు బోధించడం, వాటిని అమలు జరిగేలా చూడడం వీటితోపాటు మతకర్మకాండలాంటి అంశాలలో బ్రాహ్మణులకున్న ప్రాధాన్యంవల్ల, బ్రాహ్మణ భావజాలాన్ని ఆధిపత్య భావజాలమని వ్యవహరిస్తున్నారు. రాజ్యతంత్రంలోని అంశాలే గాక పూర్వవిజ్ఞానానికి వారసులుగా వేద, ఉపనిషత్తుల భావాలను కొనసాగించి తరాత వారికి అందించడంలో వారిపాత్రముఖ్యం. బ్రాహ్మణ సంప్రదాయాన్ని వైదికమతమని, బ్రాహ్మణమతమని, సామాజిక శాస్త్రవేత్తలు పిలుస్తున్నారు.[2] అందువల్ల ఈ పరిశోధనలో 'ఆధిపత్య భావజాలం', 'వైదికమతం' అనే అభిప్రాయాలు బ్రాహ్మణ భావజాలాన్ని సూచించడానికి ఉపయుక్తమవుతాయి.

---

1. R.S. Sharma: Survey of Research in Economic and Social change, P.13
2. G.R. Madan: Western Sociologists on Indian Society, P.105.

బ్రాహ్మణేతరులు తరతమస్థాయిల్లో హీనులనే భావం ఉండడం వల్ల, ఈ వర్గాలవారు తమపట్లగల హీనత్వాన్ని అధిగమించడానికి అనేక సందర్భాలలో ప్రయత్నించారు. బ్రాహ్మణులు నిర్వహించే యజ్ఞయాగాది క్రతువులు, కావ్యనిర్మాణం బ్రాహ్మణేతరులు చేసి బ్రాహ్మణ విధానంలో తమపూర్వపు స్థితికంటె ఉన్నత గౌరవాన్ని పొందగలిగారు.[1] మరికొన్ని సందర్భాలలో ఉన్నతస్థానం కోసం ప్రయత్నం జరిపినా వారిని సంహరించడం ద్వారా, వారి శక్తికిగల మూలాన్ని ఛేదించడంద్వారా ఇతరులనుండి వచ్చే సవాలును బ్రాహ్మణులు నివారించగలిగారు. అయితే ప్రజల ఆర్థికజీవనంలో అధికస్థాయిలో మార్పువచ్చే క్రమంలో వారి భావాలకు ఒక ఉద్యమరూపం వస్తుంది. ఫలితంగా, తాము ఆర్థికంగా వృద్ధి చెందడానికి, సామాజికస్థాయిని పెంపొందించుకోవడానికి ఈ ఉద్యమం ఉపకరిస్తుంది. అట్లా క్రీ.పూ. దశలోనే బ్రాహ్మణ విధానానికి వ్యతిరేకంగా వివిధ కులాలు ఏకమైన సందర్భాన్ని బౌద్ధమతంలో చూడగలం. ఆతరాతి కాలంలో శక్తివంతమైన ఉద్యమంగా వీరశైవం రూపొందింది. వీరశైవంలా వైష్ణవం బలీయమైన ఉద్యమం కాకపోయినప్పటికీ బ్రాహ్మణేతర వర్గాల భావోద్వేగాలను ప్రతిబింబించింది. అందుకే వీరశైవ, వైష్ణవ మతాలకు మధ్యయుగాలలో ప్రత్యేకత ఉంది.

---

1. పాల్కురికి సోమనాథుడు తన 'చతుర్వేదసారం'లో హీనకులజులైన వశిష్ఠుడు, వాల్మీకి, వ్యాసుడు, మాతంగుడు మొ॥నవారు శివభక్తులవడం ద్వారా తమ హీనత్వాన్ని అధిగమించగలిగారని, ''..యధమయోనులన్పుట్టి మహిమనెగడి
పూర్వములు విడిచి జగముల పూజ్యులైరి
శ్రీమహాదేవు కరుణచే శ్రేష్ఠులగుచు
బ్రాహ్మణోత్తములైరిట బసవలింగ'' ॥పద్యం 109॥
అని వివరిస్తాడు.

## వీరశైవ, వైష్ణవ సాహిత్యాల అధ్యయనం

తెలుగు సాహిత్యంలోని వీరశైవ, వైష్ణవ సాహిత్యాలను పరిశీలిస్తూ, అనేక పరిశోధనా గ్రంథాలు వెలువడ్డాయి. వీరశైవ సాహిత్యాన్ని గురించి వేటూరి ప్రభాకరశాస్త్రి, చిలుకూరి నారాయణరావు, బండారు తమ్మయ్య, శిష్ట్లా రామకృష్ణశాస్త్రి గార్ల పరిశోధనలు ఆమతానికి చెందిన పలు అంశాలను తెలియజేస్తాయి. అలాగే వైష్ణవమతంపై ప్రభాకరశాస్త్రి, వేటూరి ఆనందమూర్తి, ఇంకా ఇతరులు జరిపిన పరిశోధనలు వైష్ణవసాహిత్యానికి సంబంధించిన అంశాలను విశదపరుస్తాయి. తెలుగు సాహిత్యంలోని భక్తిఉద్యమాన్ని అధ్యయనం చేయబోయే సందర్భంలో ఆసాహిత్యాన్ని నూతన దిశలో పరిశీలించిన కృషిని మొదటగా ప్రస్తావించాలి. తెలుగు సాహిత్యంలోని భక్తిభావన, దాని సామాజిక స్వరూపాన్ని చర్చించడానికి తొలిసారిగా 'తెలుగులో తొలిసమాజ కవులు' అన్న పుస్తకంలో ప్రయత్నం జరిగింది. ఈ పుస్తకానికి సంపాదకత్వం వహించి, విపులపీఠికను కూర్చిన కె.కె. రంగనాథాచార్యులుగారు భారతీయ భక్తిఉద్యమ నేపథ్యంలో తెలుగులోని భక్తి సంప్రదాయాన్ని పరిశీలిస్తూ, వైష్ణవమతానుయాయులైన కృష్ణమాచార్యులు, అన్నమాచార్యులను భక్తకవులుగా పరిగణించారు. (పే. XXVII) వైష్ణవమతానికి చెందిన ఈ ఇరువురు కవులను భక్తకవులుగా గ్రహించినపుడు వీరివురికీ పూర్వులు, కన్నడదేశంలో ప్రచారమైన వీరశైవ మతోద్యమంచే స్ఫూర్తిపొంది రచన చేసిన పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథుల రచనలను సహితం పరిశీలనకు స్వీకరించవలసి ఉంటుంది. తద్వారా ఆంధ్రదేశంలోని వీరశైవ, వైష్ణవమతాలను ప్రచారం చేసిన కవుల భావాలను చర్చించడానికి

వీలవుతుంది. అందుకే ప్రస్తుత పరిశోధనలో వైష్ణవమతీయుల రచనలతోపాటు వీరశైవ మతానుయాయులైన పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథుల రచనలను పరిశీలనకు స్వీకరించడమైంది. తద్వారా తెలుగు భక్తికవిత్వాన్ని కొంత సమగ్రంగా వివరించడానికి ప్రస్తుత పరిశోధనలో ప్రయత్నం జరిగింది.

## మతం - భక్తి

వీరశైవ, వైష్ణవ రచయితలు తమరచనల్లో భక్తిని ప్రచారం చేసినప్పటికీ వాటిని మతోద్యమాలుగానే విమర్శకులు గుర్తిస్తున్నారు. భక్తికి, మతానికి కొన్ని పోలికలున్నా మతానికున్న విస్తృతస్వరూపం భక్తికి లేదు. 'భక్తి'లో భగవంతుడు ప్రధాన భావంకాగా మతంలో మాత్రం కాకపోవచ్చు.[1] దైవిక భావనకు అతీతంగా మతం ఉండేవీలుంది. కాని, అధికభాగం భక్తి, మతాలలో దైవానికి సంబంధించిన అంశాలుంటాయి. మతానికి ఒక సామూహిక స్వరూపం ఉంటుంది. ఒక నియమావళి ఉంటుంది. భక్తిలో అందరూ నియతంగా పాటించవలసిన ఆచారాలుండవు. భక్తి వ్యక్తిగత స్థాయిలో ఉండిపోవచ్చు. అయితే ఒక ప్రత్యేక భక్తిభావం విస్తృత ప్రచారాన్ని పొంది కొన్ని ఆచారాలను, పద్ధతులను ఏర్పర్చినపుడు అది మతంగా గుర్తింపు పొందుతుంది. ఇలా, భక్తిద్వారా మతంగా పరిణామం చెందినవే వీరశైవ, వైష్ణవ మతాలు. భక్తినే ప్రచారం చేసినప్పటికీ అది వ్యక్తిగత స్థాయిలోనే మిగిలిపోయిన

---

1. "Buddhism has no gods and many religious laws do not refer to gods - they are the products of the human imagination. Religion tends to embrace a smaller and smaller portion of social life in the advance of history".

   W.S.F. Pickering: Durkheim on Religion , P.324.

స్థితిని క్షేత్రయ్య, రామదాసు, త్యాగరాజులలో చూస్తాం. వీరశైవ, వైష్ణవ మతాలతోపాటు ఆంధ్రదేశంలో ప్రచారమైన భక్తిస్వరూపాన్ని పరిశీలించడం కోసమే ఈ సాహిత్యాన్ని మొత్తంగా భక్తికవిత్వం పేరుతో వ్యవహరిస్తున్నాను.

భక్తిని ప్రధాన అంశంగా భావించి ఆధునిక కాలంలో అనేక పరిశోధనలు చేయడానికి కారణం - భారతీయ సమాజంలో అతిప్రధాన అంశమైన కులవిధానం పట్ల భక్తకవులకున్న అభిప్రాయాన్ని చర్చించడానికి. 'కులం' ఉత్పాదక రంగానికి మాత్రమే పరిమితంకాక భావజాలంలో ఒక బలమైన అంశంగా ఉండి వ్యక్తి, సామాజిక సంబంధాలను, సమాజంలో నిర్వహించవలసిన కార్యాన్ని నిర్దేశించడం వల్ల పలు సందర్భాలలో కులాన్ని గురించి పరిశోధకులు ఆలోచనలు చేశారు. భక్తకవులు కుల విధానాన్ని పరిపూర్ణంగా పరిహరించుకోవాలని సూచించకపోయినా సాంప్రదాయకంగా ఉన్న భావజాలంతో సంఘర్షించి నూతన భావవికాసానికి దోహదపడడం వల్ల వారి భావాలను, వాటి ప్రాధాన్యతను చర్చించవలసిన అవసరం ఏర్పడుతుంది. అదే సందర్భంలో భక్తకవులకు రాచరిక విధానంతో ఉన్న సంబంధాలను పరిశీలించవలసి ఉంది. వ్యక్తి, గతస్థాయిలోనే అయినా అనేకమంది భక్తులు రాజులతో సంఘర్షించి వ్యక్తిగత బాధలను అనుభవించడానికి సిద్ధపడడంవల్ల, వారి స్వతంత్రవ్యక్తిత్వమూ పరిశీలనార్హమయ్యింది. ఇట్లా, రాజ్యంలోని ఆధిపత్య విధానాలను నిరసించి ప్రజలను సమీకృతం చేయడానికి జరిపిన ప్రయత్నం, అందుకు వారుపయోగించిన మాధ్యమం, సమాజంలో కలుగజేసిన ప్రభావం గుర్తించడానికి ప్రయత్నం జరుగుతుంది.

## భక్తిమార్గం - లౌకిక జీవితం

భక్తిని అనుసరించే వ్యక్తులు లౌకిక జీవితంలోనే ఉన్నా కొన్ని ప్రత్యేక లక్షణాలు కలిగి ఉంటారు. భక్తుల మానసిక చిత్తవృత్తి, ఇహలోక సౌఖ్యాలకు అతీతంగా ఉండడంవల్ల, లౌకిక జీవితానికి భిన్నంగా ప్రవర్తిస్తారు. లౌకిక జీవితాన్ని త్యజించి సన్యాస జీవితాన్ని గడపడం భారతదేశంలో చాలా ప్రాథమిక దశనుండి కనిపించే లక్షణం.[1] సాధారణ జీవితంలో ఎదురయ్యే బాధలనుండి ముక్తిని సాధించి శాశ్వతానంద సిద్ధికోసం పరితపించడం ప్రాథమిక దశనుండి ఉంది. సంసారంలో ఎదురయ్యే సమస్యలు, ఆత్మీయుల మరణం, ప్రకృతిలోని అనేక శక్తులు తన అధీనంలో లేకపోవడంతో వాటిపై ఆధిపత్యం సంపాదించాలన్న కాంక్ష లౌకిక జీవితాన్ని వదిలిపెట్టడానికి కారణం కావచ్చు. అనేక శక్తులను సంపాదించాలంటే భగవంతుని ధ్యానించి ఆతనిని ప్రత్యక్షం చేసుకోవడం ద్వారా సాధించగలమని భావించారు. అందుకు కొన్ని మంత్రాలను పఠించి భావావేశం పొంది లౌకిక జీవితానికి అధిష్ఠానంలో ఉన్నట్లు, లౌకిక జీవితం కంటె ప్రత్యేక జీవితం గడుపుతున్నట్లు తలచారు. లౌకిక జీవితాన్ని పరిగణించవలసిన తీరును మల్లికార్జున పండితుడు ఇట్లు వివరించాడు.

''లోకము విడువని వానిని
లోకము విడువదని విశ్వలోకేశ్వర నీ
లోకము గోరెడు మనుజుడు
లోకము వాసిడుము నీవ - లోకముగ శివా !''

(శివతత్త్వసారం, పద్యం 143.)

1. Haripada Chakraborty: Asceticism in Ancient India, P.5.

ఈశ్వరుడినే లోకంగా భావించి లోకవ్యవహారాలపట్ల ఉపేక్ష వహించక పోతే ఈలోకం గూడా తనను వదిలిపెట్టదని అంటాడు. అందువల్ల భక్తిని సాధించాలంటే త్యాగజీవితం అవసరమని బోధించాడు. పాల్కురికి సోమనాథుడు గూడా భక్తులు లోకధర్మాలకు అతీతంగా ప్రవర్తిస్తారంటాడు.

''లోకమునందు బద్ధియును లోకవిరుద్ధులనంత జీవన
వ్యాకుల చిత్తులయ్యు నధనార్తులనారత ధర్మసత్క్రియా
నేక సమేతులయ్యు ఫలనిస్పృహులంగ విధేయులయ్యు దూ
రీకృత దుర్మదేంద్రియ చరిత్రులు జాణలు భక్తులల్పులే?''

(అనుభవసారం, పద్యం 204.)

భక్తులు సాధారణ ప్రజలాగే లోకంలో జన్మించినప్పటికీ సాధారణ జీవితానికి అతీతంగా, జీవితంలో పలుకష్టాలు ఎదుర్కొన్నప్పటికీ ధనంపట్ల అపేక్షలేక, ధర్మబద్ధంగా జీవితాన్ని కొనసాగించినప్పటికీ ఫలితమాశించక, శరీరాన్ని కాపాడుకున్నప్పటికీ ఇంద్రియలంపటత్వం లేక జీవితం గడుపుతారు.

వీరశైవులలాగే వైష్ణవమతీయుడైన అన్నమాచార్యులుగూడా వైరాగ్య జీవితం గడపవలసిన అవసరాన్ని బోధించాడు. ఆయన ఒక గేయంలో వస్తుసంచయంపట్ల, ఇంద్రియ అంశాలపట్ల కోర్కెలను త్యజించి జీవించాల్సిన అవసరాన్ని వివరించాడు.

''వలనను వారిది వైష్ణవము యిది
వలపు దేనివో వైష్ణవము ॥వలనను॥

సుడిగొను దేహపు సుఖదుఃఖములో
వడి జారనిదివో వైష్ణవము
ముడివడి యింద్రియముల కింకరుడై
వడబడనిదె వో వైష్ణవము ''    ॥వలనను॥

(అధ్యాత్మ సంకీర్తనలు, ప్రథమసంపుటం, కీర్తన 405.)

జీవితంలో ఎదురయ్యే అస్థిరకాల కష్టాలను భరించడానికి భక్తుడు సిద్ధంగా ఉంటాడు. ఇతర భక్తులవల్ల తనకు బాధలు సంప్రాప్తమైనా వాటిని అంగీకరిస్తాడు. ఈ క్రమంలో ఇహలోక సౌఖ్యాలను వదులుకుని నిరంతరం భగవంతుడిని ధ్యానించడానికి కొన్ని నియమ నిష్ఠలను పాటిస్తూ, ఒక ప్రత్యేక తరహా జీవన విధానాన్ని అనుసరిస్తాడు. ఇక్కడే భక్తుడికి, సన్యాసికి మధ్య భిన్న లక్షణాలు కనిపిస్తాయి. భక్తుడు ప్రత్యక్ష జీవితానికి సంబంధించిన వివిధ మత కర్మకాండలను పాటిస్తే, సన్యాసి వాటిని త్యజిస్తాడు. లౌకిక జీవితంలోని ప్రధాన సౌఖ్యాలను వదులుకుంటాడు. అంతేగాక లౌకిక జీవితంలోని బాధలను తొలగించుకోవడానికి సమాజంలో అన్ని సంబంధాలు వదిలివేస్తాడు. భక్తి భావనను ప్రచారం చేసిన వ్యక్తులు ఇందుకు భిన్నం.

వీరశైవులు, వైష్ణవులు మోక్షసాధనను ప్రధాన ధ్యేయంగా భావించినప్పటికీ సమాజంలో భాగస్వాములయ్యారు. వీరు గృహస్థ ధర్మాలను అనుసరించారు. అందుకే వీరు ప్రచారం చేసిన భావాల్లో కులాలు, ఆర్థిక విషయాలు భాగమయ్యాయి.

## భక్తి

మానవాతీత అత్యున్నతరూపంగా భావింపబడే భగవంతుడిని పూజించడం చాలా ప్రాథమిక దశనుండి ఉన్నప్పటికీ భగవత్కీర్తనకు 'భక్తి' అని వ్యవహరించడం తమిళదేశంలోని ఆళ్వారు, నయనార్ల వల్ల ప్రాముఖ్యం వహించింది. కొందరు పరిశోధకులు వేదాలలోనూ[1], మరికొందరు బౌద్ధమతంలోనూ[2], 'భక్తి' భావనను పరిశీలించినప్పటికీ వివిధ సామాజిక శాస్త్రవేత్తలు పరిగణించే 'భక్తి'కి ఆళ్వారు, నయనార్ల రచనలే మూలం. క్రీ.శ. 6 - 9 శతాబ్దుల మధ్య తమిళదేశంలో వైష్ణవ, శైవ సంప్రదాయాలను ప్రచారం చేసిన ఆళ్వారు, నయనార్లవల్ల భక్తి మార్గానికి నిర్దిష్టమైన రూపం ఏర్పడింది. వీరికవిత్వంలోనే భగవంతుడిని పలురూపాలలో అర్చించి అతనితో బంధుత్వాన్ని ఆపాదించుకోవడం కనిపిస్తుంది. తండ్రిగా, తనయుడిగా, ప్రియుడిగా భగవంతుడిని ఊహించి అతడితో తమ భావాలను పంచుకోవడానికి భక్తకవులు ప్రయత్నించారు. భగవంతుడిని పలురకాలైన సంబంధాలతో అర్చించినప్పటికీ అతడిని ప్రియుడిగా పరికల్పించుకోవడం ఆళ్వార్లలో అత్యధికంగా కనిపిస్తుంది. 'భక్తి' అంటే భగవంతుడిని అర్చించడమనే పరిమితమైన అర్థంగాక ప్రేమస్వరూపమైన భగవంతునిలో సంలీనమవడమనే అర్థం స్థిరపడింది.

---

1. Susmita Pande: The Origin of Bhakti in Ancient Religion and Art, P. 7511.

2. Balkrishna Govind Gokhale: "Bhakti in Early Budhism' in Journal of Asian and African Studies (JAAS) Vol. XV, 1980, PP. 16-28.

భక్తి మౌలికంగా భగవంతుని అర్చించడమనే అంశంతో ముడిపడినప్పటికీ అది నిర్వహించే పాత్ర వైవిధ్యపూరితమైంది. ప్రాథమిక దశలో భగవంతుని పూజించడం ద్వారా ఆతడిని ప్రసన్నం చేసుకోవాలనే భావమున్నప్పటికీ కాలక్రమంలో భగవంతుడితో ఆత్మీయసంబంధాన్ని ఊహించడానికి, ఆతని గుణకీర్తనం ద్వారా వ్యక్తిగత ఆనందం ఆశించడానికి, సామాజిక సమస్యలను చర్చించడానికి 'భక్తి' ముఖ్యవాహిక అయ్యింది. భక్తి నిర్వహించిన పాత్రనుబట్టి అది పలురకాలుగా విశ్లేషింపబడుతూ వస్తుంది. 'భక్తిని ప్రముఖమైన అంశంగా గుర్తించినకాలంనుండి సిద్ధాంతవేత్తలు భక్తిని అనేక రకాలుగా సూత్రీకరించారు. ఆలంకారికులు రసంగా నిరూపించారు. అలాగే ఆధునికకాలంలోని సామాజిక శాస్త్రవేత్తలు భక్తి ఉపయోగితాగుణాన్ని పరిగణనలోకి తీసుకుని దాని వర్గప్రయోజనాన్ని చర్చించారు. ఇట్టి విభిన్న అభిప్రాయాల ప్రకటనకు కారణభూతమైన భక్తి స్వభావాన్ని, అది చర్చించిన అంశాలను పరిశీలించవలసిన అవసరం ఉంది.

భక్తిభావనకు సైద్ధాంతిక రూపమిచ్చిన నారద భక్తిసూత్రాలలో భగవంతుని యందు పరమప్రేమ కలిగి ఉండడం, శుద్ధ ఆత్మస్వరూపంతో అవిచ్ఛిన్నమైన ఆత్మరతిని ఊహించడమే 'భక్తి' అన్న వివరణ ఉంది.[1] శాండిల్య భక్తిసూత్రాలలోనూ భగవంతుని యందు అత్యంత అనురక్తి కలిగి ఉండడమే 'భక్తి' గా పేర్కొనబడింది.[2]

---

1. ''సాత్వస్మిన్ పరమప్రేమరూపా'', నారదభక్తిసూత్రములు, సూత్రం 2.
2. 'सा परानुरक्तिरीश्वरे'
मंजुला चौबे : भक्ति का स्वरूप और महत्व, पृष्ठ-४०.

విశిష్టమతప్రచారకుడైన రామానుజుడు 'ప్రేమపూర్వకంగా నిరంతరం భగవంతుడిని ధ్యానించడమే భక్తి'[1] అని, వేదాంతదేశికులు 'అత్యున్నతప్రేమ స్వరూపమే పరమ భక్తి'[2] గానూ భక్తినిగూర్చి వివరించారు. భక్తి స్వరూపాన్ని వివరించిన ఈ సిద్ధాంతవేత్తలు 'భక్తి'ని భగవంతునిపట్ల అత్యంతప్రేమపూర్వకమైన అంశంగా భావించినట్లు ఈ అంశాలు విశదం చేస్తున్నాయి. పరమప్రేమనే భక్తిగా భావించడంవల్ల, ప్రేమకు అత్యున్నతరూపమైన శృంగారం భక్తిభావనలో ప్రవేశించింది. అందువల్ల, 'భక్తి' ని గూర్చి వివరణ ఇవ్వవలసిన సమయంలో రతితో పోల్చడం చాలా ప్రాథమిక దశనుండి కనిపిస్తుంది. భగవంతుని అర్చించే భావాన్ని రతితో పోలుస్తూ, బృహదారణ్యకోపనిషత్తు ఇట్లా పేర్కొంటుంది.

> ''యథాప్రియయా స్త్రియా సంపరిష్వక్తో, నబాహ్యం కిం చ నవేద
> న అంతరం ఏవ అయంపురుషః ప్రాజ్ఞేన ఆత్మనా సంపరిష్వక్తో,
> న బాహ్యమ్ కిం చ నవేద, న అంతరం ఏవ అయం పురుషః
> ప్రాజ్ఞేన ఆత్మనా సంపరిష్వక్తో, న బాహ్యమ్ కిం చ నవేద, న
> అంతరం, తద్వా అస్య ఏతదాప్తకామం ఆత్మకామ మకామం రూపం
> శోకాంతరమ్'' (బృ. ఉపనిషత్తు - IV, 3, 21)

---

1. స్నేహపూర్వం అనుధ్యానమ్'
2. మహనీయ విషయే ప్రీతిరేవ స్నేహపూర్వం అనుధ్యాన ఇతి
   ప్రీతిరూపాపన్న ధ్యానం సా ఏవ భక్తియోగః
   పరమ భక్తి, రతిశయిత ప్రీతిః ''

   Cf. C. Varadachari: Aspects of Bhakti, P.1

'ప్రియురాలి పరిష్వంగంలో ప్రియునికి బాహ్యజ్ఞానం, అంతరజ్ఞానం నశించిపోయినట్లు, భగవత్ పరిష్వంగంలో జీవుడికి బాహ్యాంతర జ్ఞానం ఉండదు. దానివలన అతడు ఆప్తకాముడు - కోరిన కోరిక గలవాడు అవుతాడు. పరమాత్మ అతని కామం. ఆ దశలో అతనికి ఏ కామం ఉండదు. ఏ శోకం ఉండదు.'[1]

భగవంతుడిని నిరంతరం ధ్యానిస్తూ, అతనితో మమేకం కావడం కోసం ప్రయత్నించడం 'భక్తి' అని సాధారణ అర్థంలో నిర్వచించినప్పటికీ భక్తిమార్గాన్ని అనుసరించిన పలువురు కవులు శృంగారాన్ని పోషించడం, అన్నమయ్యలాంటి భక్తులు భగవద్రతిని కీర్తిస్తూ, వేల సంకీర్తనలు రచించడం భగవంతునిపట్ల ఉండే భక్తికి, శృంగారానికి అభేదాన్ని ప్రతిపాదిస్తున్నారా అనిపించకపోదు. సోమనాథుడుకూడా 'అనుభవసారం' లో భక్తుడైన వ్యక్తి చిత్తవృత్తిని గూర్చి ఇలా వివరించాడు.

''కామంబు భక్తిరతియెడఁ
దామసి క్రోధంబు దేవధర్మముల యెడన్
వ్యామోహము భక్తులయెడ
శ్రీమహిలోభంబు వలయు శివపూజయెడన్'' (పద్యం. 59)

స్త్రీకి పురుషుడిపట్ల ఎలా బలమైన వాంఛ ఉంటుందో భగవంతునిపట్ల అలాగే వాంఛ ఉండాలని సాదృశ్యం చేయడంగూడా భక్తి, రక్తిలమధ్య సమాన భావాన్ని

---

1. Cf. సునీతికుమార్ ఛటర్జీ : జయదేవుడు, పే. 69 - 70.

ఊహిస్తున్నాడని చెప్పడానికి అవకాశం ఉంది.[1] అయితే అన్నమయ్య రచనల్లో అనేక శృంగార భావనలుండగా, సోమనాథుని రచనల్లో చాలా పరిమితంగా కనబడతాయి. అందుకు ఆయామతాలకున్న దృక్పథమే కారణం. ( ఆవిషయం తర్వాతి ప్రకరణంలో చర్చింపబడుతుంది.)

భక్తునికి భగవంతునిపట్ల అనురక్తి, ఆత్మరతి ఉండడంతో నిరంతరం ధ్యానించి దేవుడి దయకు పాత్రులవ్వాలని ఆశిస్తాడు. భక్తుడైన వ్యక్తి, తన ప్రత్యేకతను, అస్తిత్వాన్ని మరచి తనను భగవంతునికి సమర్పించుకోవాలని కోరుకోవడమే 'భక్తి'. నారదుడు, శాండిల్యుడు భగవంతుని నిరంతరం ధ్యానించే ప్రేమస్వరూపాన్ని 'భక్తి' అని నిర్వచించారు. భగవంతుని తదేకంగా ధ్యానించే సందర్భంలో భక్తునిలో కలిగే వివిధ మానసిక చిత్తస్థితులను గుర్తించిన ఆలంకారికులు 'భక్తి'ని రసంగా నిరూపించారు.

## ఆలంకారికుల దృష్టిలో భక్తి

భక్తిని రసంగా నిరూపించిన తొలి ఆలంకారికుడు రూపగోస్వామి. ఈతడు చైతన్యుడి వైష్ణవోద్యమ ప్రభావంతో భక్తిని ప్రత్యేకంగా అధ్యయనం చేసి భక్తిరసామృత సింధువు, ఉజ్జ్వలనీలమణి రచించారు. ఈతడు 'భక్తి'ని వివరిస్తూ,

---

1. "Sex is so much the strongest of the instincts that overflows into, and colours the rest. It is so fundamental for life and character that one can hardly think of the whole urge of instinctive power apart from it, and the way in which it is understood and used is vital for personality"

   Fearon W. Halliday: Psychology and Religious Experience, P.62.

మానవజీవితంలో అత్యంత బలీయ అంశమైన శృంగారం అనేక ఆలోచనల్లో ప్రేరకంగా ఉంటుందని మనస్తత్వవేత్తలు అంగీకరిస్తారు.

''వక్ష్యమాణైర్విభావాద్యైః స్వాద్యతాం మధురారతిః
నీతా భక్తిరసః ప్రోక్తో, మధురాఖ్యో మనీషిభిః''

భక్తి రసానికి స్థాయీభావం మధురరతి. భక్తి అత్యున్నత దశయే మధుర రతి గనక శ్రీకృష్ణుడు తన భక్తులకందించిన శృంగారానుభూతిని దోషంగా పరిగణించడానికి వీల్లేదని అంటాడు. పలువురితో శారీరక సంబంధం సాధారణ వ్యక్తుల విషయంలోనే దోషం. కాని, శ్రీకృష్ణుని అవతారమే భక్తులకు ఆనందాన్ని పంచడమని రూపగోస్వామి వివరించాడు.[1] ఫలితంగా కృష్ణుడి సకలకార్యాలు ఆతని లీలావిలసనంలో భాగంగా గుర్తించాలని తెలుపుతాడు.

రూపగోస్వామి తర్వాతి ఆలంకారికుడు మధుసూదన సరస్వతి తన 'భక్తి రసాయనం'లో

''ద్రుతస్య భగవద్ధర్మాద్ధారావాహిక తాంగతా
సర్వేశే మనసోవృత్తిర్భక్తిరిత్యభిధీయతే''[2]

భగవద్గుణశ్రవణం ద్వారా మనోవృత్తులు ఉద్దీపితమైనపుడు భగవదాకారతతో సంలీనం అయ్యే చిత్తవృత్తిని 'భక్తి' అని పిలిచాడు. భక్తుడు రసస్థితిని పొందడమంటే తాను దర్శిస్తున్న భగవంతుడి రూపంలో తాదాత్మ్యం చెంది దానికనుగుణమైన చిత్తస్థితిలో రసోన్మీలనం చెందడం. నవరసాల్లో ఏదైనా ఒక స్థితిలో తాదాత్మ్యం చెందవచ్చు.

భగవద్గీతలో అర్జునుడికి కృష్ణుడు యుద్ధం ఒనర్చవలసిన కర్తవ్యాన్ని తెలియ

---

1. P.V. Kane: History of Sanskrit Poetics, P.312.
2. మధుసూదన సరస్వతి: భక్తిరసాయనం, ప్రథమోల్లాసం - 3.

జేస్తూ, శత్రువీరులను తానే సంహరిస్తానని, అర్జునుడు నిమిత్తమాత్రుడని తెలిపి తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తాడు. ఆసందర్భంలో భయకంపితుడైన అర్జునుడు

'' రూపం మహత్తే బహువక్త్రనేత్రం
మహాబాహో బహుబాహూరుపాదమ్
బహూదరం బహుదంష్ట్రాకరాలం
దృష్ట్వాలోకాః ప్రవ్యథితాస్తథా౽హమ్ '' (భగవద్గీత XI- 23)

కృష్ణుడి విశ్వరూపాన్ని సందర్శించడంవల్ల తాను భయకంపితుడౌతున్నట్లు తెల్పాడు. ఇట్లా అర్జునుడు తనకు ప్రీతిపాత్రుడైన కృష్ణుడి విశ్వరూపాన్ని సందర్శించడం ద్వారా కలిగిన భయానకస్థితిని ప్రీతిభయానక రసమని మధుసూదనుడు నిర్వచించాడు. భక్తిలో నవరసాలు సంపాదింపజేయవచ్చుని మధుసూదన సరస్వతి తన 'భక్తిరసాయనం'లో విపులంగా చర్చించాడు.

తెలుగుసాహిత్యానికి సంబంధించినంతవరకు 'భక్తి'ని కావ్యరచనలో ఉపయోగించిన పండితారాధ్యుడు భక్తిని రసంగా నిరూపించలేదు. కాని, అతని అనుయాయి అయిన పాల్కురికి సోమనాథుడు భక్తిని రసంగా నిరూపించే ప్రయత్నం తన లౌకికావ్యమైన 'అనుభవసారం'లో చేశాడు.

భక్తిని శృంగార రసానికి అన్వయింపజేస్తూ, 'దేహధర్మాలపట్ల, ఇంద్రియ వాంఛలపట్ల వైరాగ్యం ప్రకటించి 'భక్తి' అనెడి రతిపట్ల తీవ్రవాంఛ కలిగి ఉండాలని, స్త్రీ, పురుషుడిని ఆశించినట్లు భక్తుడు భగవంతుని వాంఛించాల'ని వివరించాడు.

సోమనాథుడు 'భక్తి' కి ఇచ్చిన తనిర్వచనం బెంగాల్‌లోని వైష్ణవుల్లో ప్రచారమున్న భక్తి భావనకు సమానంగా ఉంది. భక్తిని గూర్చి బెంగాల్ వైష్ణవసాంప్రదాయకుల్లోని అభిప్రాయం.

''యువతీనాం యథాయూని, యూనాంచ యువతే యథా
మనోऽభిరమతే నిత్యం, మనోభిరమతాం త్వయి''

'యువకులమీద యువతులకూ, యువతులమీద యువకులకు నిరంతరం మనస్సు ఎలా లగ్నమై ఉంటుందో, అదేవిధంగా నామనస్సు నీయందు రమించుగాక ![1]'

భగవంతునిపట్ల బలమైన ఆకాంక్ష కలిగి ఉండాలన్న భావనవల్ల వీరి భావాల్లో తుల్య ఉపమానాలు వచ్చాయి. సోమనాథుడుగూడా భక్తిని వివిధ రసాలతో సమన్వయింపవచ్చని భావించాడు.

'' లింగార్చన క్రియాసంగతి శృంగార
రసమును నద్భుత రసముఁదోప
ననయంబు జంగమార్చన సేయుచో శాంత
రసము భయానక రసముఁదోప
సంసార సంపదల్ చర్చించుచో హాస్య
రసమును బీభత్సరసముఁదోప
దుష్టేంద్రియములఁదూలించుచో రౌద్ర
రసమును వీర రసముఁదోప

---

1. సునీతికుమార్ ఛటర్జీ : జయదేవుడు, పే. 69.

నెల్ల జీవరాశియెడలను గారుణ్య
రసముదోప భక్తిరమణ బరగు
నవరసైక రసికుడవివేక దూరుండు
భక్తుడొక్క రుండె ప్రస్తుతింప''  (అనుభవసారం, పద్యం 61)

భగవంతుని నిరంతరం మననంచేస్తూ, ఆతనితో ఆత్మరతిని పరికల్పించుకోవలసిన అవసరాన్ని సోమనాథుడు ముందే చర్చించి ఉన్నాడుగనుక శివస్వరూపమైన లింగాన్ని పూజించే సమయంలో శృంగార ప్రస్తావన తెచ్చాడు. శివుడిని పూజించే సమయంలో ఆతనితో సంపూర్ణ ఐక్యతాభావాన్ని ప్రదర్శించడంతోపాటు శివుని మాహాత్మ్యానికి ఆశ్చర్య పడడమూ ఒకలక్షణం. శివభక్తులైన జంగములను సాదరపూర్వకంగా శాంతితో అర్చించడం, ఆతనికి ఏమైనా లోపంచేస్తున్నామా అని భయపడటం, సంసారాన్ని త్యజించి సుఖసంపదలకు దూరమవడంవల్ల, వాటిపట్ల హాస్యభావాన్ని ప్రదర్శించి అవి తిరిగి చేరుతా యేమోనని భీతి చెందడంలాంటి పలురకాలైన భావనలు భక్తుడి మనస్సులోనే కల్పించ బడతాయని సోమనాథుడు ఊహించాడు. భక్తుడు సంపూర్ణ భక్తిని సాధించడానికి సంసారాన్ని, వివిధ దుర్లక్షణాలను తొలగించుకుని జీవరాశిపట్ల, భగవంతునిపట్ల అమితమైన ప్రేమను సాధించడానికి తన మనస్సులో కలిగే వివిధ భావోద్వేగాలను భక్త హృదయ సంజనితమైన నవరసాలుగా అభివర్ణించాడు. ఆలంకారిక సిద్ధాంత కర్తలకంటె ముందుగా భక్తిని రసంగా నిరూపించి నవరసాలు అందులో సముద్భూతమవుతాయని సోమనాథుడు పేర్కొన్నాడు.

భక్తుడు భగవంతుని అంకితభావంతో ధ్యానించే సమయంలో ఆతని చిత్తస్థితిలో

కలిగే వివిధ అవస్థలను గ్రహించి ఆలంకారికులు రసంగా నిరూపించారు. పాల్కురికి సోమనాథుడుగూడా ఈక్రమంలోనే ప్రథమదశలో భావించినప్పటికీ ఆయనకు అలంకార సిద్ధాంత రచన ప్రధానధ్యేయం కాకపోవడంవల్ల, వ్యక్తినిష్ఠమైన భక్తిని సామాజికులందరూ అనుష్ఠించే పద్ధతిగా ప్రచారం చేశాడు. ఇది కన్నడ వీరశైవ సంప్రదాయంనుండి స్వీకరించిన పద్ధతి.

కన్నడదేశంలో వీరశైవభక్తిని ప్రచారం చేసిన కవులు భక్తిని సాహిత్య అంశంగా గాని, ఇతర ఆలంకారిక సిద్ధాంతాలను అధ్యయనంచేసి భక్తిని రసంగాగాని నిరూపించలేదు. వారికి కావ్య సంప్రదాయాల పరిచయంగూడా లేదు. ప్రత్యక్ష జీవితంలోని సంఘటనలకు వచనరూపమిచ్చి తమభావాలను ప్రచారంచేశారు. కాని, సోమనాథుడు వేదాలను, ఉపనిషత్తులను, సంస్కృతకావ్యాలను, ఇతర అంశాలను కూలంకషంగా అధ్యయనం చేసినట్లు అతని రచనలు విశదం చేస్తున్నాయి. దీనినిబట్టి సోమనాథుడు సాహిత్యరచన ప్రధానధ్యేయంగా కలిగినవాడని గుర్తించవచ్చు. అయితే భక్తిద్వారా తమవిశ్వాసాలను ప్రచారం చేయవచ్చని భావించినప్పటికీ భక్తి, ఇవ్వగల రసానందస్థితిని సోమనాథుడు వదలేదు.[1]

---

1. "వ్రాలున్ వ్రాలు శివార్చనా పరవశవ్యాప్తిన్ బ్రమోదంబునన్
గ్రాలున్గ్రాలు నహర్నిశంబు శివలింగధ్యాన సంపన్నుడై
సోలున్సోలు నపారసార వివిధస్తోత్ర ప్రలాపంబులన్
దేలున్దేలు మహానుభావసుఖవార్ధిం భక్తుడుద్యద్ఘృణా" (అనుభవసారం, పద్యం 166)
భగవంతుని అర్చనలో పొందే ఆనందస్థితికి ఈ పద్యం ప్రబలమైన ఉదాహరణ.

సోమనాథుని తర్వాత వైష్ణవభక్తిని ప్రచారం చేసిన అన్నమయ్య 'భక్తి' ని రసంగా నిరూపించాలని సంకల్పించలేదు. అన్నమయ్య దృష్టిలో ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందడం, మధురభక్తిని ప్రచారం చేయడం సామాజిక అంశాలను భగవంతునికి నివేదించు కోవడమే భక్తి.

భగవంతుని నిరంతరం ధ్యానించాలని, ఆతనికి భృత్యప్రాయంగా ఉండాలని తెలిపిన సందర్భాలు సోమనాథుడు, అన్నమయ్యల రచనల్లో పలుమార్లు అవుతమయ్యాయి. 'భక్తి' ని ప్రచారంచేసిన కవులనేకులాగే తెలుగు భక్తకవులు సామాజిక సమస్యలను చర్చించడంవల్ల వీరు రసానంద స్థితిని పొందడం కోసమే 'భక్తి' ఉపయోగించలేదని, సామాజిక సమస్యలను తెలుపడానికి వారికి 'భక్తి' వాహిక అయ్యిందని గుర్తించగలం.

## సామాజిక శాస్త్రవేత్తల దృష్టిలో భక్తి

భక్తిని సామాజిక అంశంగా పరిగణించి అధ్యయనం చేసిన తొలి చారిత్రకుడు డి.డి. కోశాంబి. ఆయన భగవద్గీతలోని సాంఘిక, ఆర్థిక అంశాలను పరిశీలిస్తూ, 'భక్తి' మధ్యయుగాలలో భూస్వాములకు అత్యంత విశ్వాసంగా, అణకువగా ఉండడానికి ఉపయోగితమైన సిద్ధాంతంగా పరిగణించాడు[1] భగవంతుడు ఎటువంటి వ్యక్తిత్వం కలిగి ఉన్నా ఆతనిని ప్రశ్నించకూడని రీతిలో భూస్వాములు ఎటువంటి వారైనా వారి వ్యక్తిత్వాన్ని సంపూర్ణంగా అంగీకరించడానికి 'భక్తి' ఉపయుక్తమయ్యిందని భావించాడు. కోశాంబి అభిప్రాయాన్ని సమర్థిస్తూ ఆర్.ఎస్. శర్మ "Bhakti reflected the complete

1. D.D. Kosambi: The culture and civilization of the Ancient India, P.208.

dependence of the tenants or semi-serfs on the land owners in medieval times"[1] అని వ్యాఖ్యానించాడు. భక్తుడు సంపూర్ణంగా భగవంతునిపై ఆధారపడినట్లుగానే కౌలుదారు భూస్వామిపై ఆధారపడడానికి 'భక్తి' ఉపకరించిందని అంటాడు. వీరిరువురి అభిప్రాయాన్నే కొనసాగిస్తూ, ఆర్.ఎన్. నంది, 'మఠాలు, దేవాలయాలు భక్తిని ప్రచారం చేయడమంటే ప్రభువులకు, భూస్వాములకు సేవాదృక్పథంతో ఉండి వారి వ్యవసాయక ఉత్పత్తులను పెంపొందించుకోవడానికేన'ని భావించాడు.[2] మరికొందరి అభిప్రాయంలో 'భక్తి' ఆచరణాత్మకంగా నిర్వహించిన పాత్రకంటె అది కలిగించిన భ్రాంతి అధికం. "The intoxication of Bhakti could enable the high to forget their pride and the low their misery. This provided an illusion of equality while retaining the stubborn walls of inequality in the feudal system of production and distribution".[3]

పై అభిప్రాయాలకు భిన్నంగా భక్తి ఉద్యమ చారిత్రకతను తెలియజేస్తూ, ప్రముఖ చరిత్రకారుడు ఇర్ఫాన్ హబీబ్, 'వ్యవసాయరంగంలోనూ, పట్టణజీవితంలోనూ వచ్చిన ఆర్థికాభివృద్ధి ఫలితంగా ఉత్పాదక వర్గాలు తమ సామాజిక స్థాయికోసం జరిపిన

---

1. R.S. Sharma: "Problems of Transition from Ancient to Medieval in Indian History", Indian Historical Review, Vol.I,No.I,P.9.
2. R.N. Nandi: Social Roots of Religion in Ancient India, P.96.
3. M.G.S. Narayanan & Veluthat Keshavan: "Bhakti Movement in South India" in D.N. Jha (ed.) Feudal Social Formation in Early India, P.360.

ప్రయత్నమని విశ్లేషించాడు.[1]

వివిధ చారిత్రకుల అభిప్రాయాల్లోని సామంజస్యాన్ని పరిశీలించడానికి భారతీయ భక్తి ఉద్యమం నిర్వహించిన పాత్రను, ఆ ఉద్యమ నేపథ్యంలో తెలుగు భక్తికవిత్వాన్ని అధ్యయనం చేయడంద్వారా సమాధానాలను పొందగలం.

---

1. (a) Irfan Habib: "Historical Background of the popular Monotheistic Movements of 16th, 17th Centuries" (unpublished article).

   (b) – : "Evidence of the Agrarian conditions in the Gurugranth Sahib"

# భారతీయ భక్తి ఉద్యమం:
# మౌలిక లక్షణాలు

భారతీయ మతజీవనంలో మధ్యయుగాలలో ప్రారంభమైన భక్తిఉద్యమం కొన్ని విశిష్టలక్షణాల సమ్మిశ్రణం. తమిళప్రాంతంలో ప్రారంభమై కన్నడ, మహారాష్ట్ర ప్రాంతాల్లో ఉద్యమరూపాన్ని సంతరించుకుని, క్రమంగా ఉత్తరభారతంలోని అనేక ప్రాంతాలకు వ్యాపించి సామాజిక జీవనంలోని పలు అంశాలపై గాఢమైన ప్రభావాన్ని వేయగలిగింది. ఆధిపత్య సంప్రదాయాలకు భిన్నరీతిలో ప్రత్యామ్నాయ సంస్కృతికి కృషిచేయడం భక్తిఉద్యమ ప్రత్యేకత. సాంప్రదాయకంగా ఉన్న కులవిధానాన్ని, స్మృతులు, శృతుల ఆధారంగా ఏర్పడిన విశ్వాసాలను అనుభవజ్ఞానంతో వివేచించడం, బ్రాహ్మణులకు పరిమితమైన భగవద్విషయాలను ప్రజలందరికీ బోధించడం, తమభావాల పరివ్యాప్తికి ప్రజల వాడుక భాషలో గేయాలు పాడడం - మొదలైన అంశాలద్వారా సాహిత్యంలో నూతన భావధోరణిని ఆవిష్కరించగలిగింది.

భక్తిఉద్యమం ఒకప్రాంతంలో ప్రారంభమైనప్పటికీ కాలక్రమంలో ఈ భావాలను పలువురు భక్తకవులు ప్రచారం చేయడంవల్ల, ఆభావాలను విశ్వసించే అనుయాయులు నేటికీ కొనసాగుతున్నారు. బసవన స్థాపించిన వీరశైవం కన్నడప్రాంతంలోనూ, కబీరుపంథ్ మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లోనూ, నానక్ బోధనలతో ప్రారంభమైన సిక్కు మతం పంజాబ్‌లోనూ సజీవంగా ఉన్నాయి. వివిధప్రాంతాల్లో భక్తిఉద్యమం ప్రచారం చేసిన భావాలు, వాటి సామాజిక ఆచరణను నేపథ్యంగా స్వీకరించడం ద్వారానే తెలుగు భక్తి సంప్రదాయంలోని భావాలకు వివిధ ఉద్యమాలతోగల సామ్యభేదాలను పరిశీలించడానికి వీలవుతుంది.

భారతదేశంలోని భక్తి ఉద్యమానికి, యూరప్‌లో క్రీ.శ. 16వ శతాబ్దంలో ప్రారంభమైన ప్రొటెస్టెంట్ ఉద్యమానికి అనేకపోలికలున్నట్లు చరిత్రకారులు పలువురు గుర్తించిన అంశమే.[1] ప్రొటెస్టెంట్ ఉద్యమం క్రైస్తవ మతవిశ్వాసంలోనూ ప్రజల ఆర్థిక జీవనంలోనూ గుణాత్మకమైన మార్పులను తీసుకువచ్చింది. సాంప్రదాయకంగా పోపకున్న ఆధిపత్యాన్ని నిరాకరించి ప్రజలందరూ పాల్గొనడానికి అవకాశమివ్వడం, క్రైస్తవమత పవిత్రగ్రంథమైన బైబిలును హిబ్రూభాషనుండి స్థానికభాషల్లోకి అనువదించి ప్రజలకు చేరువచేయడం, నాడు విస్తృతంగా సాగిన శాస్త్రపరిశోధనల ఫలితంగా మూఢ విశ్వాసాలను ఖండించడం ద్వారా నూతన భావవికాసానికి బీజాలు పడ్డాయి. ఈ మతోద్యమం వివిధరంగాల్లో వేసిన ప్రభావాన్ని పరిశోధకులు ఇలా పేర్కొంటున్నారు.

"The rediscovery of man and the world; a renewed sense of joy in life; asceticism and symbolism giving way to sensousness and naturalism; realism replacing idealism; and experimentalism in the pursuit of knowledge displacing traditionalism and obscurantism".[2]

ప్రొటెస్టెంట్ ఉద్యమం వివిధ అంశాలపై ప్రభావం వేయడంవల్ల, ప్రజల జీవితాన్ని ఆర్థికంగా ప్రభావితం చేసి సామాజిక మార్పుకు దోహదపడిందని పరిశోధకులు

---

1. See, Zahner: Hinduism, P.138.

2. John F.H. New: The Renaissance and Reformation A short history , P.58.

విశ్లేషిస్తారు.[1] ప్రొటెస్టెంట్‌మతం యూరప్ సమాజంలో ముఖ్యమైన మార్పుకు కారణమవగా, భారతీయ భక్తిఉద్యమం నిర్వహించిన సామాజికపాత్రను విశ్లేషించవలసి ఉంది.

భారతీయ భక్తిఉద్యమమనగానే ఉత్తరభారతంలో కబీరు, నానక్‌లాంటి భక్తులు ప్రచారంచేసిన ఉద్యమమే స్ఫురణకు వస్తుంది. అందుకు భక్తిభావన ద్వారా అనేక సామాజిక అంశాలను చర్చించడం కబీరుతో ఉన్నతదశకు చేరుకోవడం ఒకకారణంకాగా, ఆసాహిత్యంపై జరిగిన విస్తారమైన పరిశోధనలు మరొకకారణం. మధ్యయుగాలలో భావజాలపరంగా, సామాజికపరంగా ఆధిపత్యవర్గాలను శక్తిమంతంగా ప్రశ్నించిన ఉద్యమాలు కావడంవల్ల, సహజంగానే ఆ సాహిత్యంపై అనేక పరిశోధనలు వెలువడ్డాయి. భక్తకవులు చర్చించిన అంశాలు అతిప్రధానమైనవేగాక వారిభావాలను అనుసరించే మతానుయాయులు నేటికీ కొనసాగుతుండడంవల్ల, సామాజిక జీవనంపై అత్యధిక ప్రభావాన్ని వేయగలిగిన కవులుగా వీరికి గుర్తింపు ఉంది. భక్తిఉద్యమం దక్షిణభారతంలోనూ, హిందీ భాషాప్రాంతాల్లోనేగాక మరాఠీ, పంజాబీ, బెంగాలీలాంటి ప్రాంతాల్లోనూ ప్రచారమైన స్థితిని, వివిధ భాషాసాహిత్యాల్లో భక్తిఉద్యమం ప్రచారం చేసిన పలుసామాజిక అంశాలను స్థూలంగా విశదీకరించడం జరుగుతుంది.

వివిధభాషాప్రాంతాల్లోని భక్తకవులను రెండుప్రధాన వర్గాలుగా విభజించవచ్చు. మొదటి వర్గానికి చెందినవారు - పైన పేర్కొన్న రీతిలో ప్రత్యామ్నాయ సంస్కృతికి

---

1. ప్రొటెస్టెంట్ ఉద్యమం ఏర్పర్చిన నైతిక నియమాలు పెట్టుబడిదారీ ఆర్థిక విధానానికి స్ఫూర్తిదాయకమైనట్లు, పేర్కొంటూ మాక్స్‌వెబర్ The Protestant Ethic and the Spirit of Capitalism అనే గ్రంథాన్ని రచించాడు.

ప్రయత్నించిన నిర్గుణ భక్తిమార్గానికి చెందినవారు కాగా, రెండవవర్గంవారు స్మృతేతిహాసాలపై ఆధారపడి సగుణభక్తిని ప్రచారం చేసినవారు. వీరు వర్ణాధిపత్యాన్ని స్థిరపర్చడానికి కృషిచేసినవారేగాక శూద్రవర్ణాలు చదువుకోవడంవల్ల సమాజం పాడవు తుందని బాధపడిన సగుణభక్తిమార్గానికి చెందినవారు.[1] అయితే సగుణ, నిర్గుణ భక్తిమార్గాల ఆధారంగానే ఈ కవుల విశ్వాసాలను విభజించలేం. స్థూలంగా సగుణ భక్తిమార్గానికి చెందినవారు సాంప్రదాయక విశ్వాసాలను అనుసరించినవారేగాక శూద్రుల పట్ల వ్యతిరేక అభిప్రాయాలున్నవారు. నిర్గుణ భక్తిమార్గానికి చెందినకవులు ఆధిపత్య సంస్కృతిని నిరసించినవారిగా పేర్కొనవచ్చు. కాని, మహారాష్ట్రలోని వర్కరీ సంప్రదాయాన్ని అనుసరించినవారంతా సగుణ మార్గకవులే. వీరు కులవిధానాన్ని నిరసించడమేగాక ప్రభువుల ఆధిపత్యాన్ని వ్యతిరేకించారు.

ప్రస్తుత పరిశోధనలో ఆధిపత్యవిధానాలను వ్యతిరేకించిన కవులభావాలను మాత్రమే పరిశీలనకు స్వీకరించడమైంది. అయితే తెలుగు భక్తకవులను అమితంగా ప్రభావితంచేసిన కారణాన జయదేవుని గీతాలను ప్రస్తావించడం జరుగుతుంది.

---

1. సగుణభక్తిని ప్రచారం చేసిన తులసీదాస్ వేదాధ్యయన అధికారం బ్రాహ్మణులకు మాత్రమే ఉందని వివరించడమేగాక శూద్రులు బ్రాహ్మణులై, వేదాధ్యయన పరులుగా భావించుకుంటున్నారని జప, తప, వ్రతాదులు నిరసించి స్మృతులను చర్చిస్తున్నారని ఫలితంగా సమాజం హీనదశకు చేరుకుంటుందని విచారిస్తాడు.

## జయదేవుని మధురభక్తి సంప్రదాయం

ఉత్తరభారతంలో మధురభక్తిభావనకు విస్తృతవ్యాప్తినిచ్చి తెలుగు భక్తకవులను అమితంగా ప్రభావితం చేసినవారిలో జయదేవుడు ప్రథమ గణ్యుడు. క్రీ.శ. 12వ శతాబ్దంలో బెంగాల్‌లో జీవించిన ఈకవి గీతగోవింద కావ్యం రచించాడు. ఈకావ్యం ద్వారా భాగవతంలోని మధురభక్తిభావనకు విశేషప్రాశస్త్యం తెచ్చాడు. రాధాకృష్ణుల భౌతికమైన శృంగారానికి ఉదాత్తమైన ఆధ్యాత్మిక స్థాయిని సమకూర్చగలిగాడు. తద్వారా శృంగారంపట్ల సామాజికంగా ఉండే అవగాహనను పవిత్రీకరించాడు.

జయదేవుని గీతగోవింద వైశిష్ట్యం రెండంశాలమీద ఆధారపడి ఉంది. 1. మధురభక్తి భావన 2. శబ్దలాలిత్యం. ఈ కావ్య విశిష్టతకు కారణమైన ఈ రెండంశాలపట్ల సాహితీలోకంలో ఆక్షేపణ ఉంది. గీతగోవిందంలో పరిపోషితమైన శృంగారాన్నిగూర్చి బంకించంద్ర ఛటర్జీ, 'సుకుమారంగా మధురమైన సంవేదనలను కలిగిస్తూ, ఇంద్రియానందానికి ప్రాధాన్యమిచ్చిన ఈగేయాలు నపుంసకత్వాన్ని సూచిస్తున్నాయ' ని అభిప్రాయపడ్డాడు.[1] అయితే ఆధునిక విమర్శకులకు ఈకావ్యంలోని రూపంపట్లగూడా నిరాదరణ ఉంది. ''ఇంతగా రూపంమీదా, బాహ్యశబ్దసౌందర్యంమీదా ఆధారపడి ఉండడం ఏ సాహిత్యరూపంలో అయినా ఒకవిధంగా లోపమే' ని సునీతికుమార్ ఛటర్జీ భావించాడు.[2]

---

1. చూ. సునీతికుమార్ ఛటర్జీ : జయదేవుడు, పే. 57.

2. - ibid , పే. 64.

జయదేవుడు తన గీతాల్లో ప్రతిపాదించిన లయద్వారా సంస్కృత సాహిత్యానికి పునర్జన్మనిచ్చాడని వంగసాహిత్య చరిత్ర రచయిత డా. సుకుమార్ సేన్ అభిప్రాయ పడ్డాడు. "The songs of Gitagovinda are written in Sanskrit, but their diction as well as rhythm and rhyme belong to Laukika poetry. By imparting tenderness and mellifluence of the popular musical lyric into the compactness of Sanskrit poetry Jayadeva made the last attempt at the latters resurrection".[1]

గీతగోవిందంలోని కావ్యవస్తువు ఒకప్రత్యేక సామాజిక పరిస్థితిని విశదం చేసేదిగాని, సామాజిక అసమానతను ఖండించేదిగాని కాకపోయినా శృంగార భావనకు ఉండే బలీయమైన ఆకర్షణనే ఆకావ్యానికి ఆదరాన్ని తీసుకువచ్చింది. గేయాల్లోని అమోఘమైన లయ కావ్యప్రాశస్త్యానికి ఉపకరించింది. జయదేవుని అనుసరించిన తెలుగు భక్తకవులలో అన్నమయ్య, క్షేత్రయ్యలు ముఖ్యులు.

## భక్తి - సామాజిక ఉద్యమం

ఉత్తరభారతంలో క్రీ.శ. 13వ శతాబ్దినుండి 17వ శతాబ్దివరకూ భక్తి ఉద్యమం కొనసాగిన కాలంలో అనేక రాజకీయ, ఆర్థికపరిణామాలు సంభవించాయి. అవి దక్షిణభారతప్రాంతానికి భిన్నమైనవి కావడంవల్ల ఆకవుల భావాలు దక్షిణభారతంలోని భక్తకవుల భావాలకంటె వైవిధ్యాన్ని కలిగిఉన్నాయి.

---

1. Dr. Sukumar Sen: History of Bengali Literature, P.15.

క్రీ.శ. 13వ శతాబ్దినుండి 17వ శతాబ్దివరకు భక్తి సంప్రదాయాన్ని ప్రచారం చేసిన సంతకవులు సామాజికంగా వర్ణవ్యవస్థలోని కుల అసమానతలకు, రాజకీయంగా మహమ్మదీయుల ఆధిపత్యానికి తీవ్రంగా స్పందించినట్లు వారి రచనలు తెలుపుతున్నాయి. సామాజికంగా బ్రాహ్మణుల ఆధిపత్యం వివిధకులాల్లో అసమానతలను పెంపొందించగా, మహమ్మదీయుల రాజకీయ ఆధిపత్యం ప్రజల ఆర్థిక జీవనాన్ని, మతవిశ్వాసాలను కల్లోలపరచిన సమయంలో బోధనలు చేయడమేగాక తమభావాలకు కార్యాచరణ రూపమివ్వడానికి, ప్రజలను సమీకరించడం ఉత్తరభారతంలో అధికంగా కనిపిస్తుంది. కన్నడప్రాంతంలోనూ బసవన కులవిధానానికి ప్రత్యామ్నాయంగా వీర శైవులను రూపొందించినప్పటికీ రాజ్యవిధానంపట్ల ప్రజలమైన వ్యతిరేకత ఉన్నవాడుకాదు. కులవిధానాన్ని నిరసించడమేగాని, రాచరిక విధానాన్ని వ్యతిరేకించడం ఆయన లక్ష్యంకాదు. ఇందుకు భిన్నంగా ఉత్తరభారతంలోని సంతకవులు రాజులను ముఖ్యంగా, నాడు అధికారంలో ఉన్న మహమ్మదీయులను, సామాజికంగా బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని ఆక్షేపించారు.

ఉత్తరభారతంపై క్రీ.శ. 11వశతాబ్దినుండి పరదేశీయులు పలుమార్లు దాడులు జరపడంవల్ల, ఆర్థికంగా అస్తవ్యస్తస్థితికి గురికావడమేగాక రాజ్యం ప్రశాంత స్థితిని కోల్పోయింది. దీనికి పరాకాష్ఠగా క్రీ.శ. 1192లో పృథ్వీరాజ్ రాసోతో జరిగిన యుద్ధంలో రాసో ఓడిపోవడంతో ఉత్తరభారతంపై మహమ్మదీయుల రాజకీయ ఆధిపత్యం స్థిరపడింది. క్రీ.శ. 1206నుండి ఢిల్లీరాజధానిగా కుతుబుద్దీన్ ఐబక్ పరిపాలన చేశాడు. వివిధప్రాంతాల్లో మిగిలిపోయిన హిందూరాజులు ముస్లింపాలకులకు

కష్టం చెల్లించడంద్వారా తమప్రాంతాలను పరిపాలించుకోగలిగినా సువిశాల భూభాగం ఏ హిందూరాజు చేతిలో లేకపోయింది. క్రీ.శ. 13వ శతాబ్దంనుండి 18వ శతాబ్దం వరకూ ఉత్తరభారతంపై మహమ్మదీయుల ఆధిపత్యం కొనసాగింది. ఈకాలంనుండి తమకు అవసరమైన వస్తువులను సమకూర్చుకోవడానికి ప్రజలను బానిసలుగా రప్పించి ప్రభువులు పనులు చేయించుకునేవారు. అల్లావుద్దీన్ ఖిల్జీకాలంలో వివిధపనుల నిర్వహణకుగాను యాభైవేలమంది బానిసలుండేవారని, ఫిరోజ్‌తుగ్లక్ (క్రీ.శ.1351-88) ఆధీనంలో లక్షా ఎనభైవేలమంది బానిసలు ఉండేవారని, వారిలో పన్నెండువేలమంది వృత్తికారులేనని ఇర్ఫాన్‌హబీబ్ రాశాడు.[1]

ప్రభువులకు, వారిపాలనలోని ఉద్యోగుల అవసరాలకి ప్రజలను బానిసలుగా ఉపయోగించుకోవడంతోపాటు గ్రామీణరైతాంగంనుండి భూమిశిస్తును వసూలుచేయడానికి రైతులను తీవ్రపీడనకు గురిచేసేవారు.[2] ప్రభువులు గ్రామీణ రైతాంగాన్ని, వృత్తికారులను పీడనకు గురిచేయడం సహజంగానే వారిపట్ల వ్యతిరేకతను పెంచి ఉద్యమరూపాలను ఏర్పర్చింది.

ఉత్తరభారతంలో శతాబ్దాలపాటు కొనసాగిన 'సంత్‌పరంపర' ను ప్రస్తావించాలంటే ప్రథమంగా మహారాష్ట్రలోని వర్కరీ సంప్రదాయాన్ని చర్చించాల్సి ఉంటుంది. క్రీ.శ.13వ శతాబ్దంలో ప్రారంభమైన వర్కరీ ఉద్యమం మరాఠ్వాడా ప్రాంతంలో బలీయమైన ప్రభావాన్ని

---

1. Irfan Habib: "Historical Background of popular Monotheistic Movement of 15-17th Centuries."

2. - : "Medieval popular monotheism and its Humanism : The Historical Setting" in Social Scientist, Vol.21, P.82.

వేయగలిగింది. వర్కరీ ఉద్యమంతో ప్రారంభమైన మరొకశాఖ మహానుభావ సంప్రదాయం. ప్రజలలో సమానత్వం, సౌభ్రాతృత్వం ఆశయంగా ఈ ఉద్యమం ప్రారంభమయ్యింది. వీటిలో మహానుభావ సంస్కృతి త్వరితంగా అంతరించిపోగా వర్కరీ సంప్రదాయం శక్తివంతమైన ఉద్యమంగా రూపొందింది.

## మహానుభావ సంప్రదాయం

మహానుభావ సంప్రదాయాన్ని క్రీ.శ. 13వ శతాబ్దిలో చక్రధర్ స్థాపించాడు. కృష్ణుడిని ఆరాధ్యదైవంగా తలచే ఈ సాంప్రదాయకులు బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని, వేదాలప్రామాణ్యాన్ని తిరస్కరించారు. బ్రాహ్మణులతో ఏర్పడిన సంఘర్షణవల్ల చక్రధర్ హతమార్చబడ్డాడు. చక్రధర్ మరణం తర్వాత ఈ మతానుయాయులు ప్రజలలో స్థిరంగా తమభావాలను ప్రచారం చేయలేకపోయారు. లిఖితసాహిత్యపద్ధతులపై అధికంగా ఆధారపడడంవల్ల, సాధారణ ప్రజలకు చేరువ కాలేకపోయారు. వీరుపయోగించిన దుస్తులు, (నల్లని వస్త్రాలు) రహస్యమయ పరిభాష వీరిని ప్రజలకు దూరం చేశాయి. వీటికితోడు ఈ ఉద్యమనాయకత్వం బ్రాహ్మణవర్గంనుండి రావడంవల్ల, ప్రజలలో మమేకం కాలేకపోవడంతో ఈ సంప్రదాయం త్వరలోనే అంతరించిందని పరిశోధకులు విశ్వసిస్తున్నారు.[1]

## వర్కరీ సంప్రదాయం

క్రీ.శ. 13వ శతాబ్దిలో జ్ఞానదేవుడు వర్కరీ (తీర్థయాత్రికులు) విఠల

---

1. Bhalchandra Nemade: "The Revolt of Underprivileged" Journal of Asian and African Studies (JAAS), Vol. XV, 1980, P.114.

సంప్రదాయాన్ని ప్రారంభించాడు. ఈ సంప్రదాయంలోని ఇతర ప్రముఖులు నామదేవ్, చొక్కమేలా, తుకారాంలు. ఈ వర్కరీ సాంప్రదాయకులు దైనందిన జీవితంలో ప్రత్యేక పద్ధతులు పాటించేవారు. ప్రతిరోజు స్నానం, శుభ్రమైన బట్టలు, నుదుటిపై తిలకం, మెడలో తులసిమాల ధరించడం.[1] ఈ నియమాలు వైష్ణవమతానికి సామీప్యాన్ని సూచిస్తున్నప్పటికీ రామానుజుడి విశిష్టాద్వైత సిద్ధాంతంతోగాని, వైష్ణవమతంతోగాని సంబంధాన్ని కలిగినవారు కాదు. వీరు ఆరాధించే పండరిపురంలోని విఠలుడు శైవ వైష్ణవ సంప్రదాయాల సమ్మిశ్రణం. విఠలుని ఆరాధించిన భక్తులు సహితం శివ, విష్ణురూపాలను అభేదంగానే తలచారు.[2]

వర్కరీ ఉద్యమాన్ని ప్రారంభించిన జ్ఞానదేవుడు భగవద్గీతకు మరాఠీభాషలో వ్యాఖ్యానం రచించాడు. భగవద్గీత సాంప్రదాయికంగా పవిత్రగ్రంథంగా ఆరాధింపబడుతూ అనువాదానికి అవకాశం లేదని భావించే[3] కాలంలో తొలిసారిగా స్థానికభాషలో వ్యాఖ్యానం రచించడంద్వారా సాంప్రదాయక విశ్వాసాన్ని తొలగించాడు. సాధారణ

---

1. ibid, P.115.
2. "In fact all these saints of Pandharpur knew no distinction between Saivism and Vaisnavism. As Dr. P.R. Bhandarkar has cleverly pointed out, the epithet, Panduranga, 'the white limbed' God which is really the name of Siva, is here transferred to Vithala, just to show that there is ultimately no difference between Saivism and Vaisnavism ".

   R.D. Ranade: Mysticism in Maharashtra, P.183.

3. చూ. పింగళి లక్ష్మీకాంతం :''తిక్కన, కొత్తచూపు'' - ప్రాచీనకవితావైజయంతి, పే 36.

ప్రజలకు అర్థమవడానికి, సంస్కృత సంప్రదాయాన్ని సులభీకృతంచేసి 'భావార్థదీపిక' ను రాశాడు. అందువల్ల, సాధారణ జీవితంలోని అనేకపదాలు ఇందులో ఉపయోగింపగలిగాడని 'జ్ఞానేశ్వరి' ని ఆంగ్లంలోకి అనువదించిన భగవతి అభిప్రాయపడ్డాడు.[1] జ్ఞానదేవుడు వేదప్రామాణ్యాన్ని అంగీకరించినప్పటికీ సాధారణ ప్రజలకు అనుకూలమైన పద్ధతిని అవలంబించాడు. సాంప్రదాయకంగా అనుసరింపబడే సన్యాస జీవితాన్ని వ్యతిరేకించి శారీరక శ్రమను ప్రోత్సహించాడు. శరీరనిర్మాణం శ్రమించడానికేనని, దానిని శ్రమరహితమైన సన్యాస జీవితానికి సమర్పించడం అవివేకమని తలచాడు. సన్యాస జీవితం గడుపుతూ శ్రమకు దూరమవడమంటే నిద్రపోతూ శ్వాసను పరిహరించాలని ప్రయత్నించడమేనంటాడు. జ్ఞానదేవుడు శ్రమకుదూరమయ్యే పండితవర్గాన్ని నిరసించి శ్రమ ప్రాధాన్యాన్ని వివరించడానికి శ్రామికవర్గాలపై ఆధారపడి తన భావాలను ప్రచారం చేయాలని సంకల్పించడమే కారణం.[2] ఈతడు సాంప్రదాయక విశ్వాసాలను అంగీకరించక సన్యాసజీవితాన్ని వ్యతిరేకించి శ్రామిక వర్గాలపై ఆధారపడడంవల్ల, బ్రాహ్మణుల తిరస్కరణకు గురయ్యాడు.

జ్ఞానదేవుడు సన్యాసజీవితాన్ని నిరాకరిస్తూనే శారీరకశ్రమకు దూరమయ్యే యోగవిధానం ద్వారా శాశ్వత అమృతత్వాన్ని, ఆధ్యాత్మిక పరిపూర్ణతను పొందగోరి విఫలుడై ఆత్మహత్యకు పాల్పడడం ఆతనిలోని వైరుధ్యానికి పరాకాష్ఠ. సామాజిక జీవనంలోని వైరుధ్యాలను పరిష్కరించడానికి సంకల్పించి భగవద్గీతకు వ్యాఖ్యానం రచించిన

---

1. R.K. Bhagavati (Tr): Jnaneswari, P. XXVI.

2. See, Jayant Lele: "Community, Discourse and Critique in Jnaneswari", in JAAS , P.107.

జ్ఞానదేవుడు గీతలోనే ఉన్న అనేక వైరుధ్యాలను గుర్తించలేకపోవడంతోపాటు అతని ఆలోచనల్లోనేగల వైరుధ్యాలను పరిహరించుకోలేకపోయాడని కోశాంబీ అభిప్రాయపడ్డాడు. జ్ఞానదేవుడి గీతావ్యాఖ్యను, అతని జీవితాన్ని కోశాంబీ ఇలా విశ్లేషించాడు.

"His (Gnaneswar) rejection by contemporary brahmins, which must surely have been a main reason for the decision to render the Gita into Marathi, never prevented him from striving after the brahmin Vedic lore officially denied to all but initiates. That is, he embodied the inner contradictions which he discerned in contemporary society but failed to discover in the Gita. Therefore, he could launch no movement towards their solution. Though an adept in Yoga as a path towards physical immortality and mystical perfection, there was nothing left for him except suicide[1]".

జ్ఞానదేవుడు సజీవసమాధిగతుడయిన పిమ్మట నామదేవ్ వర్కరీ సంప్రదాయానికి నూతన దృక్పథమిచ్చాడు. లౌకిక జీవితంలోని అసమానతలపై జ్ఞానదేవుడిలో అస్పష్టంగా ఉన్న అభిప్రాయాలకు నామదేవ్ స్పష్టమైన రూపమిచ్చాడు. ఈతడు కుల అసమానతలను

---

1. D.D. Kosambi: Myth and Reality, P.36.

నిరసించడమేగాక రాజ్యపాలనను సహితం ఎదిరించాడు. నామదేవ్ తనసమకాలంలో రాజ్యాధిపత్యం వహిస్తున్న మహమ్మదీయులను, ప్రజల సాంస్కృతిక జీవితంపై ఆధిపత్యంగల బ్రాహ్మణులను తీవ్రంగా నిరసిస్తాడు. ఆలయాలలోనే దేవుడున్నాడనే భావనను ఖండించి విగ్రహారాధన నిరుపయోగమని భావించాడు.[1]

నామదేవ్ సామాజిక ఆధిపత్యాన్ని నిరసించినప్పటికీ స్త్రీలపట్ల హీనభావనను కలిగివున్నాడు. భగవత్సాన్నిధ్యం పొందగోరే భక్తుడికి గృహస్థాశ్రమం ఆటంకమని, అందమైన స్త్రీ పురుషుడికి దుఃఖ హేతువని తెలుస్తాడు. బంగారానికి సువాసన, వజ్రానికి మెత్తదనం, ధనవంతుడికి జాలి, వెద్యపురికి దయ, అగ్నికి చల్లదనం, అందమైన స్త్రీకి పవిత్రత - పరస్పర వ్యతిరేక అంశాలని భావించాడు.[2] ఈ కారణాన స్త్రీలనే వ్యతిరేకించినవాడు కాదు. ఈతడి బోధనలతో జానాబాయి అనే భక్తురాలు వర్కరీ పంథను అనుసరించింది.

నామదేవ్ బోధనలతో స్ఫూర్తిచెందిన వ్యక్తుల్లో, అంత్యజుడైన చొక్క మేలా (క్రీ.శ. 14వ శతాబ్ది) ఒకడు. చొక్క మేలా అంటరానితనాన్ని తీవ్రంగా నిరసించాడు. అంత్యజుల బాహ్యరూపంపట్ల ఉండే అవగాహనను ప్రశ్నించడం ఈతని కీర్తనల్లో చూస్తాం.

---

1. "The Hindu is blind and the Muslim is cross-eyed,
A Saint is certainly better than both of them
The Hindu worships his temple, the Muslim worships his mosque,
Namdev will worship neither the temple nor the mosque"

Cf. B. Nemade: "The Revolt of the Underprivileged", in JAAS, P.117.

2. R.D. Ranade: Mysticism in Maharashtra, P.197.

వ్యక్తులు అనుసరించే వృత్తినిబట్టి కులం ఏర్పడిందని స్థూలంగా భావించినా, కులాన్ని బట్టి బాహ్యరూపాన్ని ఊహించడం, బాహ్యరూపాన్ని పరిశీలించి కులాన్ని గుర్తించడం కులవిధానంలో కనిపించే ఒక లక్షణం. పాల్కురికి సోమనాథుడు 'పండితారాధ్య చరిత్ర'లో అంత్యజుని పేర్కొనాల్సి వస్తే, ఒక వికృత స్వరూపాన్ని వర్ణిస్తాడు.[1] చొక్కమేళా అంత్యజుల బాహ్యరూపంపట్ల ఉండే హీనభావనను ఖండిస్తూ, బాహ్యరూపం ఎటువంటిదైనా ఆంతరిక స్వభావంలోని ఔన్నత్యాన్ని గుర్తించమంటాడు. చెరుకు, ధనుస్సు, నదులలో వంకరలున్నా తీపిలో, బాణంలో, నీటిలో వక్రతలేదని అలాగే తన బాహ్యరూపంలో వక్రత ఉన్నా అనుభూతుల్లో లేదని వివరిస్తాడు.[2] మానవుడి అవయవాలు ఏరీతిలోనైనా అతని హృదయంలో పవిత్రత ఉండటానికి బాహ్యరూపం ఆటంకం కాదని తెలుపుతాడు.

వర్కరీ సంప్రదాయంలోని మరొక ముఖ్యమైన రచయిత - తుకారాం. (క్రీ.శ. 17వ శతాబ్ది). ఆయన తన సమకాలంనాటి రాజ్యాధిపత్యాన్ని, బ్రాహ్మణాధిపత్యాన్ని నిరసించిన చైతన్యవంతమైన రచయిత. భావాభివ్యక్తికి సాహిత్యాన్ని పదునైన అంశంగా తలచాడు. తన గేయాలద్వారా సమాజంలో కార్యాచరణను ఆశించాడు. ఆస్తికంటె పదసంపదను ఉన్నతంగా గుర్తించి రాజ్యాధిపత్యాన్ని సమాజంలోని కాపట్యాన్ని ఖండించడానికి సాహిత్యాన్ని వాహికగా ఉపయోగించాడు.

---

1. చూ. పాల్కురికి సోమనాథుడు : పండితారాధ్య చరిత్ర - సూరసానమ్మ కథ. పే. 29.

2. Cane is crooked, but its juice is not crooked,
Why be fooled by outward appearance?
The bow is crooked, but the arrow is not crooked,
Why be fooled by outward appearance?
The river is twisting, but its water is not twisted,
Why be fooled by outward appearance?
Chokha is ugly, but his feelings are not ugly,
Why be fooled by outward appearance?

Cf. Eleanor Zelliot: "Chokhamela and Eknath : Two Bhakti modes of legitimacy for Modern Change" JAAS, P. 139.

## కబీర్‌పంథ్

మరాఠ్వాడా ప్రాంతంలో నామదేవ్, చొక్కమేళాలాంటి భక్తులు వర్కరీ సంప్రదాయం ద్వారా కులవిధానాన్ని, పళ్ళువుల ఆధిపత్యాన్ని నిరాకరిస్తూ, తమ భావాలను ప్రచారం చేస్తున్న కాలంలో ఉత్తరభారతంలోని మధ్యభాగాల్లో, కబీరు, రాయ్‌దాస్, నానక్‌లాంటి భక్తకవులు మహమ్మదీయ మతాచారాలను, బ్రాహ్మణ భావ జాలాన్ని ఖండిస్తూ, తమ భావాలను అనుసరించే శిష్యవర్గాన్ని ఏర్పరుచుకున్నారు.

క్రీ.శ. 1398 - 1518 మధ్య జీవించిన కబీరు రెండు సంస్కృతులతో సంబంధాన్ని కలిగి ఉన్నాడు.[1] కబీరు ముస్లిం కుటుంబంలో పెరగడంవల్ల, ఇస్లాంమత ఆచారాలు, విశ్వాసాలతో పరిచయం ఏర్పడగా[2] బ్రాహ్మణులకు ప్రధాన కేంద్రమైన కాశీలో జీవించడంవల్ల బ్రాహ్మణులకు సంబంధించిన జీవనవిధానం, పద్ధతులు తెలిశాయి.

కబీరు సామాజిక అవగాహన తన అనుభవఫలితమేగాని, వివిధ అంశాల అధ్యయనం ద్వారా సంతరించుకుందికాదు. ఆయన బ్రాహ్మణుల, ముల్లాల (ఇస్లాంమత అర్చకులు) ఆధిపత్యాన్ని, వారు అనుసరించే సంప్రదాయాల్లోని మూఢత్వాన్ని తన వివేకంతో ప్రశ్నించినవే. చివరకు తాను అర్చించే నిర్గుణ, నిరాకార రూపమైన

---

1. కబీరు జననంపట్ల అనేక భిన్నాభిప్రాయాలున్నాయి. కాని, అతడు నేత కుటుంబంలో జీవించాడనడంలో వివాదంలేదు.
2. हजारि प्रसाद द्विवेदि : कबीर, पृष्ठ - 17.

ద్వైవం తన స్వోపజ్ఞకమే.

"जाति सरूप बरण नहीं जाके, घटि घटि रहयौ समाई
वाको नाम कहि कहि लीजै, जाके बरन न रूपा"

తాను ఊహించిన శక్తిస్వరూపానికి 'రామ' అనేపేరు పెట్టాడు. కాని, అతడు అయోధ్యపురి వాసుడైన రాముడుకాదు. నిర్గుణ, నిరాకార రూపాన్ని భావించినా అది ఇస్లాంమతంలోని 'అల్లాహ్'ను పోలినదికాదు. ఈ రెండుమతాల దేవతలకు చెందిన అంశాలను కొంత స్వీకరించినా రెండింటికి భిన్నమైన రూపనిరూపణంలో ఇరుమతాలపట్ల తనకుగల వ్యతిరేకత తెలుస్తుంది. ఇస్లాం, వైదికమతాలకు చెందిన ఖురాన్, వేదాల ప్రామాణికతాన్ని ప్రశ్నించాడు. మానవులందరిదీ ఒకే జన్మ అయినపుడు వివిధకులాలమధ్య హెచ్చుతగ్గులకు, మతభేదాలకు విలువలేదని పేర్కొన్నాడు.

కబీరు తనకాలంనాటికి వివిధప్రాంతాల్లో ప్రచారమైన అనేక విశ్వాసాలతో ప్రభావితుడైనాడు. ఆయనను ఇస్లాంమతం, ఉపనిషత్తుల అద్వైతభావన, వైష్ణవ భక్తిలోని వేదాంతతత్త్వం ప్రభావితంచేశాయి. ఆయన సామాజిక అవగాహనను

---

1. "Such an illusion in this vast creation -
Ved and Koran, Heaven and Hell,
Who is man, who is Woman?

The vessel made of clay,
the nad and bindu is the same,
Once the pitcher is broken, by what name will it be called?

O fool, search you are lost,
The same bones and skin and urine and excrete
and blood and ass-hole, one stamp,
The entire creation is by the same drop.

Who is Brahmin and who is Shudra?

... ... ...

నాథసంప్రదాయం ప్రభావం చేసిందని కబీరుపై విపుల పరిశోధన చేసిన హజారీప్రసాద్ ద్వివేది పేర్కొన్నాడు.[1] అయితే నాథపంథీయులు అనుసరించే హఠయోగపద్ధతినిగూడా కబీరు వ్యతిరేకిస్తాడు. సాంప్రదాయికంగా కొనసాగుతున్న వివిధ తాత్విక, ఆధ్యాత్మిక అంశాలను అనుసరించినప్పటికీ వాటికి నూతనమార్గాన్ని రూపొందించాడు.

కబీరు అనేకమార్లు 'మాయ' అనేపదాన్ని ఉపయోగిస్తాడు. ఈపదానికి సాధారణ అర్థం - లోకాన్ని మాయగా, శూన్యంగా భావించడమే అయినా ఆతడిచ్చే అర్థంవేరు. మాయను సామాజిక జీవనానికి వర్తింపజేశాడు. వేదజ్ఞానం, విష్ణు దశావతారాలు మాయావిలసితాలని, సమాజంలోని మతభేదాలు, బ్రాహ్మణ, బ్రాహ్మణేతర అసమానతలు 'మాయ' అని పేర్కొన్నాడు.[2]

అద్వైతమతస్థాపకుడైన శంకరుడు సృష్టిని 'మాయ' గా పరిగణిస్తాడు. జగత్తును మాయగా భావిస్తూనే సమాజంలోని కులవిధానాన్ని సమర్థించడం, బ్రాహ్మణుడిగా జన్మించడం అతిదుర్లభమైన అంశంగా భావించడం ఆతనిలోని ద్వైధీభావాన్ని సూచించగా కబీరు సమాజంలోని అసమానతలను పరిహరించుకోవడానికి 'మాయ'ను ఉపయోగించాడు. తద్వారా సాంప్రదాయికమైన 'మాయ' పదానికి నూతన భావాన్ని కల్పించాడు.

---

Kabir says, Ram is playing in every heart,
What of a Hindu or a Turk ! "

Cf. Prabhaker Machwe: Kabir, P.43.

1. Hazari Prasad Dwivedi, (Foreword) Kabir, P.6.

2. Kumkum Sanghari: 'Mirabai and the Spiritual Economy of Bhakti' in Economic and Political Weekly, July 14th, 1990, P.154'.

కబీరు బ్రాహ్మణ, ముస్లిం ఆధిపత్యాన్ని నిరాకరించి కుల, మత రాహిత్యవిధానాన్ని ప్రబోధించడంవల్ల, ఆయన భావాలు ఉత్తరభారతంలోని అనేక ప్రాంతాలకు వ్యాపించాయి. కబీరు మరణం తర్వాత ఆయన బోధనలను అనుసరిస్తూ శిష్యులు వివిధప్రాంతాల్లో, శాఖలను ఏర్పరచారు. సూరత్‌గోపాల్ (శృతిగోపాల్) కబీరు చౌరశాఖను, ధర్మదాస్ ఛత్తీస్‌ఘర్‌శాఖను, భగుదాస్ - భగతి (భక్త) శాఖను, జగుదాస్ కబీర్‌పంథ్‌ను స్థాపించారు.

కబీరు ప్రబోధించిన అంశాలకు వ్యవస్థీకృతరూపం ఏర్పడడం వల్ల, కుల, మత విశ్వాసాలకు ప్రత్యామ్నాయ సంప్రదాయం రూపొందింది.

## సిక్కుపంథ్

కబీరు భావాలతో ప్రభావితుడై, సామాజిక సమానత్వంకోసం ప్రయత్నించిన వ్యక్తుల్లో, గురునానక్ (క్రీ.శ. 1469 - 1539) ముఖ్యుడు. ఈతడు సామాజిక అసమానత్వాన్ని, ప్రభువుల దుశ్చర్యల్ని, వ్యవస్థీకృతంగా ఉద్యమించాడు. ఆయన భావాలతో ప్రభావితులై, శిష్యులుగా ఏర్పడిన వ్యక్తులను సిక్కులని, ఆయన స్థాపించిన మార్గానికి 'సిక్కుపంథ్' అని పేర్లు స్థిరపడ్డాయి.

నానక్ భావాలను ప్రజలు అనుసరించడానికి ముఖ్యంగా నాటి రాజకీయ పరిస్థితిని కారణంగా చెప్పాలి. క్రీ.శ. 1526లో బాబర్‌సైన్యం భారతదేశాన్ని దండెత్తుతూ పంజాబ్‌లోని అనేక ప్రాంతాలను అశాంతపరచి, స్త్రీలను పలు అవమానాలకు

గురిచేస్తున్న సమయంలో ప్రజలను సమీకరించడానికి కృషిచేశాడు.[1] ఆక్రమంలో ప్రజలమధ్య అనైక్యతకు కారణమైన కులవిభేదాలను, సాంప్రదాయకంగా కొనసాగుతున్న బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని ఖండించారు.

ప్రజలను సంహరించే వ్యక్తులు భగవంతునికోసం నమాజ్ చేస్తున్నారని, కసాయికత్తిని పట్టినవారు యజ్ఞోపవీతం ధరించి దైవపూజలు నిర్వహిస్తూ, పలు దుష్కర్మలకు పాల్పడుతున్నారని ఆవేదన చెందారు.[2]

నానక్ తన బోధనలతో శిష్యవర్గాన్ని రూపొందించడమేగాక ఆ సంప్రదాయాన్ని కొనసాగించడానికి శక్తివంతమైన వ్యక్తిని తనవారసుడిగా ప్రకటించారు. తన మతాన్ని అనుసరించేవారిలో పుత్రులు సహితం ఉన్నప్పటికీ శక్తివంతుడైన వ్యక్తిని వారసుడిగా ప్రకటించడం ద్వారా ఆయన భావాలను కొనసాగించడం సుగమమైందని పరిశోధకులు విశ్లేషిస్తున్నారు.[3]

---

1. Gurubachan Singh Talib : Guru Nanak, P.33.
2. "Those who slaughter human beings perform namaz
   Those wielding the butcher's knife wear the sacred thread
   Brahmins blow the conch-shell in their homes -
   These are as much given over to hungers as their employers.
   .... ....
   They put the paste mark on their foreheads, and wear the ritual dhoti,
   Yet in their hands they hold the knife and slaughter all they lay hands on".
   - ibid - P, 58.
3. - ibid - P, 16.

నానక్ తనసమకాలీన జీవనంలోని రాజ్య పరిస్థితులను, సమాజంలోని కులవిధానాన్ని నిరసించి ప్రజలమధ్య సమానత్వాన్ని ఆకాంక్షించారు. తన భావాలకు విశిష్టమైన రూపమిచ్చి వ్యవస్థీకృతంగా ఉద్యమించాడు.

## ఉ ప సం హా రం

క్రీ.శ. 13వ శతాబ్దంనుండి 17వ శతాబ్దంవరకూ కొనసాగిన భక్తిఉద్యమకవులు నాలుగు శతాబ్దాలపాటు రాజ్యపాలకులుగా ఉండిన ప్రభువులను, అలాగే సమాజంలోని కులవిధానాన్ని తీవ్రంగా ఖండించారు. వారి రాజకీయ పరిస్థితులు ప్రజలను ప్రత్యక్షంగా అనేక బాధలకు గురిచేస్తుండడంవల్ల, తమభావాలను తెలపడమేగాక వాటికి వ్యవస్థీకృత రూపమిచ్చి సమాజంలోని ఆధిపత్యవిధానాన్ని ఎదిరించడానికి ప్రయత్నించారు. బ్రాహ్మణులవేదాలను, ఇస్లాం మతీయుల ఖురాన్‌లకున్న ప్రామాణికతను ప్రశ్నించారు. వీరు కార్యాచరణకు ప్రాధాన్యమివ్వడంవల్ల, తమభావాలు ప్రజలను ఆకట్టుకోవడానికి సులభమైన రీతిలో గేయాలను రచించారు. (ఈ కవులు అనుసరించిన గేయఛందస్సు ఆరవ ప్రకరణంలో చర్చింపబడుతుంది). తద్వారా ఆధిపత్య సంస్కృతికి భిన్నరీతిలో ఒకప్రజాస్వామ్య భావజాలాన్ని, సంస్కృతిని రూపొందించిన వారయ్యారు.

ఉత్తరభారతంలో ప్రచారమైన భక్తిఉద్యమం సమకాలంలోని రాజకీయాధిపత్యాన్ని, కులాధిపత్యాన్ని నిరసించి, ప్రజాస్వామ్య భావజాలానికి కృషిచేసినట్లు, పై అంశాలు తెలుపుతున్నాయి. ఆంధ్రదేశంలోని వీరశైవ, వైష్ణవమతాలు ప్రచారంచేసిన భావాల

ఆధారంగా వారి సామాజిక అవగాహనను, ఆమతాలు  ఉద్దేశించిన వర్గాలు, ఆకాలం నాటి సామాజిక అంశాలను పరిశీలించడం ద్వారా ఉత్తరభారతంలోని భక్తిఉద్యమానికి, వీరశైవ, వైష్ణవమతాలకు గల సామ్యభేదాలను పరిశీలించగల్గుతాం.

# వీరశైవ, వైష్ణవ మతోద్యమాలు

ఆంధ్రదేశంలో క్రీ.శ. 12వ శతాబ్దం నుండి వైదికమతం భిన్నమైన వీరశైవ, వైష్ణవ మత విశ్వాసాలు ప్రచారమయ్యాయి. వైష్ణవం తమిళ ఆళ్వారులచే ప్రభావితం కాగా, వీరశైవం కన్నడ ప్రాంతంలోని బసవనచే ప్రభావితమయ్యింది. ఈ మతాలను రెండు భిన్నప్రాంతాల సాంప్రదాయాలు ప్రభావితం చేయడం వల్ల, వాటి సామాజిక అవగాహనలో స్పష్టమైన అంతరం ఉంది. వీరశైవమతం బ్రాహ్మణ సంప్రదాయాలను తీవ్రంగా నిరసించగా, వైష్ణవం విమర్శనాత్మకంగా వ్యవహరించింది. వైష్ణవం బ్రాహ్మణులను తీవ్రంగా వ్యతిరేకించక పోయినప్పటికీ కుల విధానం ద్వారా సంక్రమించే ఆధిపత్యాన్ని యథాతథంగా అంగీకరించలేదు. అయితే వీరశైవులైన పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథుడికి, వైష్ణవుడైన అన్నమయ్యకు సామాజికాంశాల పట్ల గల అవగాహన వారు ప్రాతినిధ్యం వహించే కన్నడ వీరశైవ, తమిళ వైష్ణవ మతాలకు ఆపాదించడానికి వీలుకాదు. వీరు స్థూలంగా కన్నడ వీరశైవ, తమిళ వైష్ణవ మతాలను అనుసరించినప్పటికీ ఆయా మతాలలో లేని అనేక అంశాలు పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథుడు, అన్నమయ్యలు చర్చించారు. సోమనాథుడి రచనలో ప్రస్తావితమయ్యే తాత్త్విక చర్చలు కన్నడ వీరశైవులలో కనిపించవు. అలాగే అన్నమయ్య కుల విధానాన్ని పరిశీలించిన తీరు, నైతిక నియమాల ప్రస్తావన, మతాన్ని హేతుబద్ధంగా పరిశీలించడం లాంటి అంశాలు అతనికి గల స్వతంత్ర దృక్పథాన్ని తెలుపుతాయి. అందుకే వీరశైవ మతాన్నేగాక వైష్ణవ మతాన్ని గూడ బ్రాహ్మణేతర సంప్రదాయాలను ప్రచారం చేసిన మతంగా గుర్తించవలసి ఉంటుంది. వీరు ఈ భావాలను ప్రచారం చేయడానికి పూర్వమే నన్నయ్య (క్రీ.శ. 11వ శతాబ్ది) బ్రాహ్మణ ఆధిక్యాన్ని స్థాపించడానికి కృషి చేశాడని, నన్నయ్య సంస్కృత మహాభారతానికి అనువాదమే చేసినప్పటికీ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న బ్రాహ్మణ విధానాలను సమర్థించడానికి పలు సందర్భాలలో ప్రయత్నించాడని కె.కె. రంగనాథాచార్యులు నిరూపించి ఉన్నారు.[1]

క్రీ. శ. 11వ శతాబ్దినుండి ఆంధ్రదేశంలో రెండు ప్రయోగాలు జరుగుతూ వచ్చాయి. ఒకవైపు బ్రాహ్మణ ఆధిపత్యాన్ని స్థాపించడానికి ప్రయత్నం జరుగుతూ ఉండగా, దానిని

---

1. చూ. కె.కె. రంగనాథాచార్యులు, "నన్నయ్య చారిత్రక భూమిక" - <u>తెలుగుసాహిత్యం - మరోచూపు</u>.

వ్యతిరేకించి నూతన భావాలను, సిద్ధాంతాలను ప్రచారం చేసే మతాలు ప్రారంభమయ్యాయి. దీని వల్ల, ఆధిపత్య వర్గాలను వ్యతిరేకించే సంప్రదాయం ఆంధ్రదేశంలో మధ్యయుగాలనుండి కొనసాగు తుండినట్లు గుర్తించగలం. వీరశైవులు, వైష్ణవులు కులవిధానాన్ని స్పష్టంగా ఖండించారు. బ్రాహ్మణాధిపత్యాన్ని నిరాకరించి తమ మతానుయాయులను కులాతీతులుగా పరిగణించారు. అన్న మయ్య రాజులనూ నిరసించాడు. ఈ లక్షణాలన్నీ ఉత్తర భారతంలోని భక్తకవుల భావాలకు తుల్యమైనవే. కాని, ఉత్తరభారతంలోని భక్త కవులలో లేని అనేక తాత్త్వికాంశాల చర్చ ఆంధ్రదేశంలోని వీరశైవ, వైష్ణవ మతాల్లో కనిపిస్తుంది.

ఆంధ్రదేశంలోని వీరశైవ, వైష్ణవ కవులు చర్చించిన భావాలను రెండు స్థాయిల్లో పరి శీలించవలసి ఉంటుంది. ఒకటి, సామాజిక జీవనం పట్ల అవగాహన, రెండు, తాత్త్విక అంశాల చర్చ. ఈ రెండింటి ఆధారంగా వారి లక్ష్యాన్ని పరిశీలించవలసి ఉంటుంది.

ఆంధ్రదేశంలోని భక్తకవులు భక్తిని పరిగణించిన తీరుగూడ భిన్నమైనదే. వీరశైవ మతభావాలకు విస్తృత సాహిత్యరూపమిచ్చిన పాల్కురికి సోమనాథుడు 'భక్తి' ని రసంగా నిరూపించే ప్రయత్నం చేశాడు.[1] భక్తిని ప్రేమకు ఉత్కృష్టరూపమైన శృంగారంతో పోల్చాడు. అన్నమయ్య మధురభక్తి సంప్రదాయంలో వేలకొలది శృంగార సంకీర్తనలు చెప్పాడు. వీరిరువురూ భక్తి ద్వారా సామాజిక అంశాలను చర్చించడమే గాక మానసిక ఆనందాన్ని ఆశించారని భావించవలసి ఉంటుంది. అయితే పాల్కురికి సోమనాథుడికి, అన్నమయ్యకు ఒక ముఖ్యమైన భేదం ఉంది. కన్నడదేశంలోని వీరశైవ సంప్రదాయాన్ని అనుసరించిన పాల్కురికి సోమనాథుడు ఒక సమయంలో

---

1. చూ. ప్రథమాధ్యాయం

రెండు కార్యాలను నిర్వహించాడు. తాత్వికుడిగా కన్నడ వీరశైవ మత భావాలను వ్యాఖ్యానించి వాటికి ప్రామాణికత్వం తీసుకురావడానికి జరిపిన ప్రయత్నం మొదటిది కాగా మతప్రచారకుడిగా చేసిన కృషి రెండవది. సోమనాథుడు వీరశైవ మత ప్రామాణికత్వం కోసం జరిపిన ప్రయత్నం వల్ల, అతడి భావాలు ప్రజల్లో సులభంగా ప్రచారమయ్యే స్థితి కోల్పోయాయి. సోమనాథుడి రచనల క్రమాన్ని పరిశీలించినా ఈ విషయం స్పష్టమవుతుంది. సోమనాథుడి తొలికృతియైన 'అనుభవసారం' లో వీరశైవానికి సంబంధించిన మౌలిక నియమాలు సులభశైలిలో చర్చించగా ఉత్తరోత్తరా రాస్తూ వచ్చిన కృతులు అత్యంత పాండిత్య ప్రేరకంగా కొనసాగాయి. అంతేగాక తన భావాల ప్రచారానికి బసవపురాణం, పండితారాధ్య చరిత్రల్లో దేశీయమైన ద్విపద ఛందస్సును ఉపయోగిస్తున్నట్టు, వేర్వేరు తరాత్తి దశలో సంస్కృతంలో 'సోమనాథ భాష్యం' రచించడంలో ఆ మతానికి పండితామోదం లభింపజేయడానికి జరిపిన ప్రయత్నం విశదమవుతుంది. ఇక్కడే అన్నమయ్య సోమనాథుడికి భిన్నంగా కనిపిస్తాడు.

అన్నమయ్య వైష్ణవమతాన్ని అనుసరించేనాటికి ఆ మతానికి రామానుజాచార్యులు పండిత లోకంలో ప్రామాణికతాన్ని చేకూర్చాడు. రామానుజుడు ప్రతిపాదించిన విశిష్టాద్వైత సిద్ధాంతం వల్ల, ఆళ్వారుల మధురభక్తి, సంప్రదాయానికి శాస్త్రసమ్మతి ఏర్పడింది. అందువల్ల, వైష్ణవ మత భావాలను పండితలోకంలో ఆమోదింపజేయవలసిన అవసరం అన్నమయ్యకు ఏర్పడలేదు. తద్భిన్నంగా వైష్ణవమత భావాలను సరళీకరించాడు. ఆయన సామాజిక దుర్విషయాలను హేతు బద్ధంగా పరిశీలించడంలోనూ, వైష్ణవులు అనుసరించవలసిన ఆచారాలను ప్రస్తావించడంలోనూ ఈ విషయం స్పష్టమవుతుంది.

వీరశైవ, వైష్ణవ మతాలకు అనేక అంశాలలో వైవిధ్యమున్నా రెండూ కులాధిపత్యాన్ని

నిరసించడం వల్ల, వివిధ బ్రాహ్మణేతరవర్ణాలు ఆమతాలను అనుసరించాయి. (ఈ విషయాలు తర్వాతి ప్రకరణంలో చర్చించాను). వీరశైవ,వైష్ణవ మతాలు సామాజిక అంశాలలో ఉత్పాదక వర్ణాల ఆర్థిక ప్రగతిపట్ల, నైతికనియమాలపట్ల ప్రత్యేక శ్రద్ధను ప్రదర్శించాయి. తద్వారా మతజీవనాన్ని హేతుబద్ధం చేయడానికి ప్రయత్నించాయి. అట్లా, మతాన్ని హేతుబద్ధం చేయడంలో భాగంగానే శంకరాచార్యుల అద్వైతసిద్ధాంతాన్ని ఇరుమతాలకు చెందినవారు ఖండించారు.

## వీ ర శై వం

దక్షిణ భారతంలో శక్తివంతమైన మతోద్యమంగా గుర్తింపుగల వీరశైవమతం కన్నడ దేశంలో క్రీ.శ. 12వ శతాబ్దిలో ఆవిర్భవించింది. ఈ మతం కన్నడదేశంలో కుల, లింగ సమానత్వం కోసం కృషి సలిపిందని పరిశోధకులు వివరిస్తున్నారు. " . . . his (Basavanna's) society made no distinction on the basis of caste, class or sex. The act of wearing the Linga on the body made everyone equal. ... The new Lingayat religion rejected outright any hierarchical evolutions of occupations."[1] వీరశైవం సామాజిక రంగంలో సంస్కరణలు చేపట్టిన మతమేగాక గుణాత్మకమైన మార్పులను తీసుకువచ్చిన మతమని ఆసాహిత్యంపై కృషిసల్పిన ఎ.కె. రామానుజన్ అభిప్రాయపడ్డారు.[2] వీరశైవం జైన, బౌద్ధ మతాలను ప్రతిఘటించుటకేర్పడిన మతమని శిష్ట్లా రామకృష్ణశాస్త్రి భావించారు.[3] వీరశైవం బలమైన సామాజికోద్యమంగా రూపొందడంలో ఆమతం ప్రతిపాదించిన

---

1. K. Iswaran : Religion and Society among the Virasaivites. P.43.
2. A.K. Ramanujan : Speaking of Siva P.21.
3. శిష్ట్లా రామకృష్ణశాస్త్రి : వీరశైవాంధ్ర వాఙ్మయము. P.19.

భావాలు, వాటిని ప్రచారం చేయడంలో బసవనకు పూర్వులు, అతని సమకాలికులు జరిపిన కృషి వీరశైవమత భావాల ప్రచారానికి ఏర్పడిన జంగమ వ్యవస్థ, ఆ మతానుసరణ లోని నియమబద్ధ జీవితం, భావ ప్రసారానికి ఉపయోగించిన మాధ్యమం వీరశైవం సామాజిక రంగంలో బలీయమైన ప్రభావాన్ని వేయడానికి కారణమైన అంశాలు. వీటికితోడు బసవన వ్యక్తిత్వమూ ముఖ్యకారణమే. ఆయనకు గల రాజకీయ ఆధిపత్యం, వీరశైవుల భావాలను సామాజికులు సులభంగా అనుసరించడానికి, జంగములకు ఆర్థికసహాయం చేయడానికి ప్రోత్సహించింది.[1] ఈమతం తత్కాలంలో బలమైన ప్రభావాన్ని వేయడానికి నాటి పరిస్థితులు గూడా బలంగా తోడ్పడ్డాయి.

కన్నడదేశంలో వీరశైవం బలమైన మతోద్యమంగా రూపొందడానికి ప్రబలమైన కారణాలున్నాయి. క్రీ.శ. 12వ శతాబ్ది నాటి కన్నడదేశం రాజకీయంగా పలువురు ప్రభువుల ఆధిపత్యంలో కొనసాగుతుండేది. వీరిలో కాలచుర్య రాజవంశీకుడైన రెండవ బిజ్జలుడు [క్రీ.శ. 1100-67] పరిపాలించే ప్రాంతంలో అధికసంఖ్యలో నగరాలు వృద్ధిచెందాయి. బిజ్జలుని రాజ్యంలోనే పట్టణాలు వృద్ధిచెంది వ్యాపారానికి బాగా అవకాశం ఏర్పడడంవల్ల, నాటి వ్యాపారవర్గం మధ్య అంతస్సంఘర్షణ ప్రారంభమయ్యింది. పట్టణ ప్రాంతాల్లో, వ్యాపారం నిర్వహిస్తుండిన పరప్రాంతీయులైన నానాదేశి, ఉభయనానాదేశి వ్యాపారవర్గంపై జైన, బౌద్ధ మతాల ప్రభావం మిక్కుటంగా ఉండేది.

---

1. (a) " ... his charismatic personality which was certainly responsible in a large measure for the success of the movement. Certainly, therefore Basava's secular position, power and influence had their impact on the growing faith ".

   - C. Parvathamma : "Virasaivism - A Saivite sectarian movement of protest and reform " in <u>Dissent, Protest and Reform in Indian civil'zation</u>.

   (b) See : R.G. Bhandarkar : Vaisnavism and Saivism, P.189.

   (c) చూ. నిడుదవోలు వెంకటరావు :''వీరశైవాంధ్రవాఙ్మయము'' సారస్వతవ్యాసములు పే. 114.

స్థానికంగా వృద్ధి చెందుతున్న వ్యాపారవర్గం నానాదేశి, ఉభయనానాదేశి వ్యాపారులను వ్యతిరేకించేవారు. దీనిలో భాగంగా వారి మతం పట్ల వ్యతిరేకత ఏర్పడింది. ఈ కాలంలోని వ్యాపారాభివృద్ధి వల్ల ఉత్పత్తులకు గిరాకీ పెరగడంతో వృత్తికారులపై ప్రభుత్వం అధిక పన్నులు విధించేది. అందువల్ల వృత్తికారులకు ప్రభువుపట్ల అసంతృప్తి ఉండేది.[1] వృత్తికారులకు ప్రభువుపట్ల, స్థానిక వ్యాపార వర్గానికి పరదేశి వ్యాపారవర్గం పట్ల ఉన్న వ్యతిరేకతను వీరశైవులు బలంగా వ్యక్తీకరించ గలిగారు. అందువల్ల వీరశైవ మతాన్ని అనుసరించిన వారిలో వృత్తికారులు, వ్యాపార వర్గాలు ప్రబలంగా కనబడతాయి.[2]

## వీరశైవ శరణులు - బసవన

వీరశైవ మతానికి నిర్దిష్టమైన రూపమిచ్చిన వ్యక్తి, బసవన[3] అయినప్పటికీ అతడికి పూర్వమే పంచాచార్యులైన రేవణసిద్ధ, మరుళసిద్ధ, ఏకోరామ, పండితారాధ్య, విశ్వారాధ్యులు వీరశైవ మతాన్ని స్థాపించినట్టుగా వాడుకలో ఉంది.[4] కాని వారికి సంబంధించిన ఎలాంటి చారిత్రక ఆధారాలు లభించడం లేదు. వీరశైవ మత విశ్వాసాలను బసవనకు పూర్వమే ప్రచారం చేసిన ముఖ్యుడు జేదర దాసిమయ్య.

---

1. R.N. Nandi : "The origin of Virasaiva Movement" P-44.

2. "The role of big business in the formation of the sect is evident from the fact that traders came next only to the 'Jangamas' in the hierarchy of the sect and that the movement originated in a region where there was the greatest connection of trading communities."

   - ibid. P-38.

3. Basavana was no mere ideologue or Philosopher, he was a great institutional innovator. His efforts to build an ideal community, with the help of his devoted colleagues the Saranas, in the twelfth century, remains the first monumental effort in Karnataka to establish a communal based on a modernistic ideology.
   - K. Iswaran : Religion and Society among the Virasaivites. P-80.

4. M. Umadevi : Palkuriki Somanatha - PP. 78-79.

జేడర దాసిమయ్య శారీరక శ్రమ ప్రాధాన్యాన్ని ప్రబోధిస్తూ, 'కాయకవే కైలాసః' అని ప్రతిపాదించాడు. శారీరక శ్రమ చేయడం ఆరోగ్యానికి అవసరమని పేర్కొంటాడు. అడవుల్లో సంచరిస్తూ, జంతుహింస చేసే ఆటవికులను నాగరిక సమాజంలోకి తెచ్చి నూనెగానుగపని అనుసరించేట్టుచేశాడు.[1] ఈయన రామనాథ మకుటంతో రచించిన వచనాల్లో శ్రమపట్ల గౌరవ భావాన్ని కలిగించడంతో పాటు మూఢనమ్మకాలను ఖండించి స్త్రీ - పురుషుల మధ్య అంతరాలు లేవని ప్రబోధించాడు.

బసవనితోపాటు వీరశైవాన్ని ప్రచారం చేసిన వారిలో ఇద్దరి పేర్లను ప్రస్తావించాలి. ఒకరు అక్కమహాదేవి. రెండవవారు చెన్నబసవన. అక్కమహాదేవి కన్నడదేశంలోని 'ఉడుతడి' ప్రాంతానికి చెందిన వ్యాపారి కూతురు. ఈమె సౌందర్యానికి సమ్మోహితుడైన ఆ ప్రాంత ప్రభువు మహాదేవిని పెళ్ళాడాడు. అయితే ఆమె దైహికవాంఛలను నిరాకరిస్తుంది. భర్త, దైహిక వాంఛలకు ప్రయత్నించగా అతనిని వదిలి వైరాగ్య జీవితాన్ని స్వీకరిస్తుంది. నాటినుండి శివుడిని కీర్తిస్తూ, వీరశైవ మత భావాలను ప్రచారం చేసింది. చాలాకాలంపాటు కళ్యాణదుర్గంలో జీవించి పిమ్మట శ్రీశైలం చేరుకుంటుంది. అందరూ ఆమెను అక్కగా గౌరవించడం వల్ల, అక్కమహాదేవిగా పేరుగాంచింది. రెండవ వాడైన చెన్నబసవన్న బసవన్నకు మేనల్లుడు. ఆయన వీరశైవ శరణులు అనుసరించాల్సిన నియమాలను ప్రబోధించాడు. వీరశైవులు ఏర్పర్చుకున్న అనుభవ మంటపానికి అధ్యక్షుడు. శ్రమ, జ్ఞానాల మధ్య అభేదాన్ని ప్రచారం చేశాడు.

---

1. A.K. Ramanujan : Speaking of Siva, P-90.

## ఆంధ్రదేశంలో వీరశైవం

కన్నడదేశంలో వీరశైవం ప్రచారమవుతున్న కాలంలో ఆప్రాంతంతో భౌగోళికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా ఆంధ్రదేశం కలిసి ఉండటం మూలాన వారి భావాలు అతిత్వరితంగా ఆంధ్రదేశంలో వ్యాపించాయి. వీరశైవ మతాన్ని అనుసరించిన తొలికవి మల్లికార్జున పండితారాధ్యుడు. నేటి తూర్పుగోదావరి జిల్లా, ద్రాక్షారామవాసియైన ఈకవి క్రీ.శ. 1105-1185ల మధ్య జీవించాడని చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి.[1]

ఆంధ్రదేశంలో వీరశైవ మతాన్ని అనుసరించి, ఆమత భావాలకు విస్తృత సాహిత్యరూపమిచ్చిన రెండవకవి పాల్కురికి సోమనాథుడు. క్రీ.శ. 13వ శతాబ్దిలో జీవించిన[2] సోమనాథుడు కాకతీయుల సామ్రాజ్యంలోని పాలకురికి ప్రాంతానికి చెందినవాడు. బసవన, పండితారాధ్యులకు శతాబ్దం తరువాత వాడైన పాల్కురికి సోమనాథుడు వారిరువురి భావాలతో ప్రభావితుడై వీరశైవ మతాన్ని అనుసరించాడు.

---

1. (a) నిడుదవోలు వెంకటరావు : శివతత్త్వసారం (ఉపోద్ఘాతం) పే. 43.

   (b) మహబూబ్‌నగర్ జిల్లా, అలంపూర్ తాలూకా కూడవెల్లి దగ్గరగల సంగమేశ్వరాలయంలో కన్నాట గోకర్ణ దేవమహారాజు శా.శ. 1107 (క్రీ.శ. 1185)లో తండ్రి జ్ఞాపకార్థం వేయించిన శాసనంలో పండితారాధ్యుడి ప్రస్తావన ఉంది. పండితారాధ్యుడు తన అంత్యదశలో బసవనను కలవడానికి పయనిస్తూ, కూడవెల్లికి రెండుమైళ్ళదూరంలోని 'వెల్టూరు' లో నిలిచి పోయినట్లు 'పండితారాధ్యచరిత్ర' లో ఉంది. పండితారాధ్యుడు క్రీ.శ. 1185 వరకూ జీవించి ఉంటాడని పరిశోధకుల ఊహ.
   చూ. తెలంగాణ శాసనములు - సంపుటి-2, పే. 192.

2. సోమనాథుడు క్రీ.శ.1280 - 1340ల మధ్యకాలానికి చెందినవాడని వేటూరి వెంకటరమణయ్య (పాలకురికి సోమనాథుడెప్పటివాడు? పే. 107), మల్లంపల్లి సోమశేఖర శర్మ (భారతి, ఫిబ్రవరి 1945, పే 102-8)లు భావించగా, చిలుకూరి నారాయణరావు సోమనాథుడు మొదటి ప్రతాపరుద్రుని కాలంనాటివాడని క్రీ.శ. 1240 ప్రాంతంలో జన్మించి క్రీ.శ. 1267 మధ్యలో బసవపురాణం రచించి ఉంటాడని తలచాడు. (పండితారాధ్య చరిత్ర - పే. 10). సోమనాథుని రచనలపై పరిశోధన జరిపిన వి. నరసింహారెడ్డి సోమనాథుడి కాలాన్ని క్రీ.శ. 1160 - 1240గా నిర్ణయించారు. (పాల్కురికి సోమనాథుని కృతులు - పరిశీలన)

   సోమనాథుడి కాలం గురించి సాహితీలోకంలో పలువాదాలున్నప్పటికీ క్రీ.శ. 13వ శతాబ్దంలో జీవించాడనే అభిప్రాయంలో ఏకభావం ఉంది. See V. Narayana Rao: Sivas Warriors, p-23.

పండితారాధ్య, పాల్కురికి సోమనాథుల కాలం నాటికి ఆంధ్రదేశంలో వివిధ శైవ శాఖలుండేవని సోమనాథుడి రచన సాక్ష్యమిస్తుంది.[1] శైవంలోని పాశుపతశాఖకు, నాథ యోగులు ప్రచారం చేసిన 'యౌగిక శైవా'నికి అనుయాయులుండేవారని చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి.[2]

ఆంధ్రదేశంలోని వీరశైవమతాన్ని కన్నడ వీరశైవం ప్రత్యక్షంగా ప్రభావితం చేసింది. కన్నడ, ఆంధ్ర, శైవ సంప్రదాయాలపై తమిళ నయనార్ల ప్రభావముందని వారి సాహిత్య అంశాలు నిరూపిస్తున్నాయి. తమిళ దేశంలో శైవాన్ని ప్రచారం చేసిన వాగీశనయనారు జీవితం 'పండితారాధ్య చరిత్ర' లో వర్ణితమైంది. సోమనాథుడి బసవపురాణంపై నయనార్ల జీవితాలను వివరించే 'శేక్కిలార్' కావ్యమైన 'పెరియపురాణం' ప్రభావముందని పరిశోధకులు భావిస్తున్నారు.[3]

క్రీ.శ. 6 - 9 శతాబ్దుల మధ్య కాలంలో తమిళదేశంలో శైవాన్ని ప్రచారం చేసిన అరవైముగ్గురు (అరువత్తు మువ్వరు) నయనార్లలో తిరుజ్ఞాన సంబంధర్, వాగీశ నయనారు (అప్పర్), సుందరమూర్తి, మాణిక్య వాచకర్ ప్రసిద్ధులు. వీరు రచించిన గేయాలను 'తేవారం' అని పిలుస్తారు. ఈ నయనార్లు నాటి ప్రధానమతాలైన జైన, బౌద్ధ మతాలను వ్యతిరేకించారు. వాగీశ నయనారు జైనమతాన్ని వ్యతిరేకించినందులకు ఆతనిని జైనులు పలుబాధలకు గురిచేసినట్లు సోమనాథుడు పండితారాధ్య చరిత్ర లో వర్ణించాడు.

---

1. 'జగమున కొందరు శైవుల మంచును
   బల్కుచుందురు మరిపాటిగాను
   వివరంబుగా సప్తవిధ శైవభేదంబు
   లెరుగ నేరరు గురుతరముగాను'

   - (చతుర్వేదసారం : పద్యం - 67)

2. M. Somasekhara Sarma : The History of Reddi Kingdoms, P.307.
3. V. Narayana Rao : Siva's Warriors, - P.13.

''జైని జనులుఁ దొల్లి వాగీశనయ

వారిని భంగించి ఘోరాగ్ని ద్రోవ

ఘన సరోవరమయ్యెఁ గాక తద్వహ్ని

గనలెనే యొక వెండ్రుకైన ...'' అంటూ పలు బాధలకు గురి చేసినప్పటికీ శివుని మహిమ వల్ల రక్షింపబడినట్లు సోమనాథుడు పండితారాధ్య చరిత్ర (పే. 95)లో వర్ణించాడు. నయనార్లు జైనమతానికి వ్యతిరేకంగా ఉద్యమించిన ఫలితంగా సుందరపాండ్య, మహేంద్ర పల్లవులనే రాజులు జైనమతాన్ని వదలి శైవాన్ని స్వీకరించడంతో నయనార్ల ఉద్యమానికి మరింత బలం చేకూరింది. జైనులు ఆశ్రయం కోల్పోవడంతో కన్నడదేశంలోని శ్రావణబెళగొళ ప్రాంతానికి తరలిపోయారు.[1]

వర్ణవిధానానికి, జైనమతానికి వ్యతిరేకంగా ఉద్యమించిన నయనార్లలో వాగీశ నయనారు, తిరుజ్ఞాన సంబంధార్‌లు ముఖ్యులు. బ్రాహ్మణేతరుడైన వాగీశనయనారు భక్తికి కులగోత్రాదుల అవసరం లేదని పేర్కొంటాడు.[2] బ్రాహ్మణుడైన తిరుజ్ఞాన సంబంధార్ కులాంతరాలను ఖండించాడు. బ్రాహ్మణులకు అంత్యజులపట్ల గల అభిప్రాయాలను తొలగించడానికి కృషిసల్పాడు. యజ్ఞయాగాది ప్రాంతాలకు అంత్యజులు వెళ్ళినపుడు హోమాగ్ని చల్లారుతుందని, హోమానికి విఘ్నం వాటిల్లుతుందనే బ్రాహ్మణుల భావాలు నిరాధారమని నిరూపిస్తూ, తాను వివిధ ప్రాంతాల్లో పాడే పాటలకు వాద్యాన్ని వాయించడానికి అంత్యజుడైన 'తిరునీల కంఠర్'కు అవకాశమిచ్చాడు.[3] నయనార్ల జైనమత వ్యతిరేకత, వర్ణవిధాన ఖండన కన్నడదేశంలోని వీరశైవ మతాన్ని ప్రభావితం చేశాయి.

---

1. R.N. Nandi : "Origin and Nature of Saivite Monasticism" in <u>Indian Society : Historical Probings</u>, P.197.

2. "Oh! You fools who speak of several sastras ! What will you do with your jotra and kula? If you deem Siva alone as the most worthy, worship Him."
   - V. Raghavan : The Great Integrators, P. 36.

3. చూ. ము. వరదరాజన్ : తమిళవాఙ్మయ చరిత్రము. పే. 121.

<u>వీరశైవం</u>: పలు శైవ సంప్రదాయాలు గల ప్రాంతంలో మరొక నూతన శైవ సంప్రదాయాన్ని ఆవిష్కరించి ప్రత్యేక సిద్ధాంతాలను ఏర్పర్చుకోవడంలో ఇతర మతాంతరాలగల భిన్నత్వం విదితమవుతుంది. కన్నడదేశంలో వీరశైవమతం ప్రారంభమయ్యే కాలంనాటికి కాలాముఖం బలమైన శైవమతంగా ప్రచారంలో ఉంది.[1] వీరశైవానికి పూర్వదశనుండి కొనసాగుతున్న కాలాముఖుల ఆచారాలు, విశ్వాసాలు చాలా ప్రాథమిక దశను సూచిస్తాయి. మానవ కపాలంలో భోజనం చేయడం, కపాలాన్ని దండగా అలంకరించుకోవడం, స్మశాన బూడిదను శరీరానికి రాపించడం, స్మశానంలో నివసించడం వీరి నిత్యకృత్యాలు.[2] వీటిని నిర్వహించడం ద్వారా అత్యున్నత శక్తిని సాధించగలమని విశ్వసించేవారు. కాలాముఖుల ప్రభావంలోనే కన్నడదేశంలోని శివారాధకులుండడంవల్ల, వారికి అనేక మఠాలుండేవి.

కాలాముఖ సంప్రదాయాలను వ్యతిరేకించి నూతన వీరశైవమత విశ్వాసాలను ప్రచారం చేసిన దశనుండే కాపాలిక మఠాలు వీరశైవ మఠాలుగా పరివర్తనం చెందాయి.[3]

పలుశైవశాఖలకు భిన్నమైన ఆచరణ, విశ్వాసాలుగల వీరశైవాన్ని రేవణాచార్యుడు నిర్వచిస్తూ, 'వి' అంటే బ్రహ్మాత్మకజ్ఞానం, 'ర' అంటే బ్రహ్మాత్మకజ్ఞానంలో రమించడం, ఆనందం పొందడమని, 'వీరశైవమం'టే శివరూపమైన విద్యలో రమించడమని అర్థంచెప్పాడు.[4] అయితే బ్రహ్మాత్మకజ్ఞానంలో రమించడం అనేభావాన్ని సూచించడానికి 'విర' కావాలికాని, 'వీర' అవడానికి అవకాశం లేదని, తమభావాల ప్రచారంలో వీరశైవులు అనుసరించిన హింసాయుత పద్ధతుల మూలంగానే 'వీరశైవ' అనే పదం స్థిరపడిందని భారతీయ తాత్త్విక సిద్ధాంతాలను అధ్యయనం చేసిన సురేంద్రనాథ్ దాస్‌గుప్త అభిప్రాయపడ్డారు.[5]

---

1. R.N. Nandi :"Origin and Nature of Saivite Monasticism," P.196.
2. David N. Lorenzen : The Kapalikas and Kalamukhas, P.4.
3. See, Nandimath : A Handbook of Virasaivism, P.6.
4. See, M. Umadevi : Palkuriki Somanatha, PP. 59-60.
5. S.N. Dasgupta : A History of Indian Philosophy, Vol.V, P.44-45.

శైవేతరులు శివపూజాసమయంలో ఆటంకం కలిగించినా, దోషానికి పాల్పడినా వీరశైవులు తమ ప్రాణాలను అర్పించడానికి సిద్ధపడి ఆటంకాలను తొలగించుకోవాలని బసవన బోధించినట్లు, రేవణుడు 'సిద్ధాంతశిఖామణి' లో పేర్కొన్నాడు.[1] వీరశైవులు తమభావాలను ప్రచారం చేయడంలో అనుసరించిన వీరోచిత ప్రవృత్తివల్లనే 'వీరశైవ'మనే పేరు స్థిరపడింది.

వీరశైవమతాన్ని తాత్త్విక అంశాలతో సమన్వయించిన శ్రీపతిపండితుడు విశేషాద్వైత సిద్ధాంతంగా ప్రతిపాదించాడు. శివుడిని పూజించడంద్వారా ఆతనిలో ఐక్యం చెందడానికి, వీరశైవ భక్తులు ప్రయత్నిస్తారని, అది రామానుజుడి విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని పోలివుండటంవల్ల, విశేషాద్వైత సిద్ధాంతమని పేర్కొన్నాడు.[2] తమ ఆచారాలను, పద్ధతులను అనుసరించడానికి వీరశైవులు ప్రత్యేక నియమాలను ఏర్పర్చారు.

వీరశైవుల ఆచార, నియమాలలో స్థల, అంగ, లింగ, పంచాచారాలు, అష్టావరణాలు ముఖ్యమైనవి. వీరిభావనలో స్థలమనగా పరబ్రహ్మం. 'స్థ' ఉండుట, 'ల' లయమగుట. ఈ చరాచర ప్రపంచం సృష్టికి పూర్వం ఎక్కడవుందో మరల అక్కడే లయమవుతుంది. దానినే 'స్థల'మని, బ్రహ్మమని అంటారు. 'అంగ'మంటే, 'అం' పరబ్రహ్మం, 'గం' తదభిముఖంగా పయనించు జీవుడని అర్థం. శివాభిముఖంగా పయనించే జీవునకు అంగుడని పేరు.

---

1. ''శివనిందాకరమ్ దృష్ట్వా ఘాతయేద్ అథవా శపేత్
స్థానంవా తత్పరిత్యజ్య గచ్ఛేద్యద్యక్షమో భవేత్''
నను ప్రాణాత్యాగే దుర్ధరణం కిమ్ నస్యాత్
శివార్థముక్త జీవస్తస్య సాయుజ్యం అప్నుయాత్''
Cf. S.N. Dasgupta : A History of Indian Philosophy, Vol.V, P.45.
2. K.C. Pandey : An outline History of Saiva Philosophy, P.238.

<u>పంచాచారాలు</u>:- లింగాచార, సదాచార, శివాచార, భృత్యాచార, గణాచారాలు. నిత్య లింగార్చనమే లింగార్చనం. ధార్మిక ప్రవృత్తితో జీవించి, జంగములను పోషించడం సదాచారం. వర్ణవివక్ష పాటించక సహపంక్తి, భోజనం, వర్ణాంతర వివాహాలు జరుపుకోవడం శివాచారం. శివునియందు, శైవులయందు గౌరవంతో భృత్యునిలా వ్యవహరించడం భృత్యాచారం. సంఘనిందా ద్వేషముల సహింపకుండటం గణాచారం.

<u>అష్టావరణాలు</u>:- గురు, లింగ, జంగమ, పాదోదక, ప్రసాద, భస్మ, రుద్రాక్ష, మంత్రాలకు అష్టావరణాలని పేరు. ఇవి అల్పత్వంనుండి మోక్షం పొందడానికి ఉపకరిస్తాయని, శైవేతరులనుండి వీరశైవులను వేరుపరిచే అంశాలు ఇవేనని భావిస్తారు.[1]

<u>గురువు</u>:- గురుసంప్రదాయం శైవానికి చెందిన కాలాముఖ, పాశుపత శాఖలనుండి స్వీకరింపబడింది. శివైక్యాన్ని సాధించాలంటే దీక్షను ప్రసాదించేది గురువుగనక శైవులు గురువును తల్లిదండ్రులకంటే అధికంగా గౌరవిస్తారు. శైవదీక్షను ప్రసాదించే గురువును దీక్షాగురువు, వివిధ శిక్షలను నెరిపే గురువును శిక్షాగురువు, ఆధ్యాత్మిక చింతనలో అత్యున్నతస్థితిలోకి తీసుకెళ్ళే గురువును మోక్షగురువుగా పిలుస్తారు. ఈ మూడుకార్యాలను ఒకే గురువు నిర్వహించవచ్చు. లేదా, వేర్వేరు గురువులు శిక్షణనివ్వవచ్చు. సాధారణంగా ఒకేగురువు ఈ కార్యాలన్నీ నిర్వహిస్తాడు.

గురువులకు విధేయంగా ఉండే సంప్రదాయం, శైవంలో ఉన్నంతబలంగా మరే మతంలోనూ లేదు. శైవంలో గురు ప్రాధాన్యాన్ని పేర్కొంటూ మాక్స్‌వెబర్ "Obedience to the gurus was strong in the Lingayat, stronger than in any other Indian sect, namely, in ritual and ethics, including sexual ethics".[2]

---

1. అనుభవానందస్వామి : సర్వసిద్ధాంత సారథం, PP. 280-85.
2. Max Weber : The Religion of India, P.305.

గురువు పలు అంశాలలో శిక్షణనివ్వడం వల్ల, అతనికి చాలా గౌరవం ఉండేది. పాల్కురికి సోమనాథుడు తన 'అనుభవసారం' లో ''గురునతియుంతు సంతతము'' (పద్యం. 27) అని గురుప్రాముఖ్యాన్ని నొక్కి చెప్పాడు.

లింగం:- శివుడికి అత్యున్నతమైన ప్రతిరూపంగా లింగాన్ని పూజిస్తారు. శివుడిని లింగాకారంలోనే అర్చించడం సంప్రదాయం. భక్తుడికి ఇచ్చిన లింగాన్ని శివాకారంగా భావించి ప్రార్థిస్తారు. జంగములు శివలింగాన్ని మెడలో ధరిస్తారు. 'లింగం' పడిపోవడం చాలా దురదృష్టకరమైన అంశంగా పరిగణిస్తారు.

జంగమ:- జంగముడంటే కుటుంబాన్ని, లౌకిక జీవితాన్ని త్యజించి మతప్రచారమే ధ్యేయంగా సంచరించేవ్యక్తి. అందుకే జంగముడిని శివరూపంగా భావిస్తారు. కులానికి అతీతంగా మత ప్రచారానికి జీవితమంతా వెచ్చించే పరశైవులే జంగములు. వీరిమధ్య కులతారతమ్యాలు లేవు. అందువల్ల అనేక వర్ణాలనుండి ఈ జంగమదీక్ష స్వీకరించేవారు. జంగములో చేరడంద్వారా సామాజికంగా పరిగణించే అధమస్థాయిని అధిగమించడానికి ప్రయత్నించేవారు.[1] జంగముడు అతినియమబద్ధ జీవితాన్ని గడపాల్సి ఉంటుంది. పరులపై ఆధారపడడం, లంపటత్వం లాంటి గుణాలు త్యజించాలి. జంగముడు ప్రతిభద్వారా ఆధ్యాత్మిక శక్తుల ద్వారా జ్ఞానం సంపాదించడమేగాక ఆలోచన, ఆచరణల ద్వారా జ్ఞానపూర్ణుడవుతాడు.

---

1. "Some who joined renunciatory orders were attempting to overcome the inequalities of caste status by joining non-caste groups".

   Romila Thaper : "Dissent and Protest in Early Indian Tradition, P. 179.

వీరశైవంలో 'జంగమ' తోపాటు 'స్థావర' గూడా ముఖ్యమైంది. 'స్థావర' స్థిరంగా ఉండే దేవాలయానికి, లింగానికి చిహ్నం. ఈ రెండు పదాలు రెండు భావాలకు సంకేతాలు. జంగమసంప్రదాయం భగవంతుడిని తమ శరీరంలో భాగంగా భావిస్తే, స్థావర దేవాలయంలోని దైవానికి చిహ్నంగా భావిస్తారు. భగవంతుడు దేవాలయంలో నివసించడం లేదని, శివుడు జంగముడి రూపంలోనే ఉన్నాడని వీరశైవులు భావిస్తారు. దేవాలయంలో స్థిరంగా ఉన్న దేవుడికంటే నిరంతరం సంచరించే జంగముడే ఉన్నతుడని అతని గొప్పతనాన్ని పేర్కొంటూ పండితారాధ్యుడు ,

''జంగమ లింగంబగు భ
క్తుంగని పూజింపడేని, గొని విధములన్
లింగార్చన చేసిన వృథ
జంగమముత్తమముగాగ - స్థావరమునకున్''

{శివతత్త్వసారం, పద్యం. 153.}

అని వివరించాడు. ఇదే భావనను సోమనాథుడు 'అనుభవసారం' లో

''...శివుని యపరావతారంబు
జంగమంబుగాన జంగమంబు
లింగమనగ వలయు లింగసంగతగాత్ర !'' {పద్యం.179.}

అంటూ లింగానికి, జంగముడికి అభేదాన్ని తెలుపుతాడు. వీరశైవం విస్తృతంగా వ్యాప్తి చెందాలంటే శివుడిని అర్చించడంతోపాటు శైవభక్తిని ప్రచారంచేసే వ్యక్తులనుగూడా అత్యున్నత గౌరవభావంతో ఆదరించాలని వీరి ఉద్దేశ్యం.

ఆచారాలలో ప్రసాదం, పాదోదకం పవిత్రమైన పదార్థాలుగా పరిగణిస్తారు. గురువు భోజనం చేయగా మిగిలిన ఆహారాన్ని ప్రసాదంగా స్వీకరిస్తే, ఆయన పాదాలను కడిగిన నీరును తీర్థంగా స్వీకరిస్తారు. విభూది, రుద్రాక్షలు ధరించడం శైవుల విధి. పంచాక్షరీ మంత్రాన్ని కొందరు జపిస్తే, మరికొందరు గాయత్రీ మంత్రానికి ''తన్నః శివః ప్రచోదయాత్'' చేర్చి పఠిస్తారు.

వీరశైవులు శివునిలో ఐక్యంగావాలని ఆకాంక్షిస్తూ, 'షట్‌స్థల' సిద్ధాంతాన్ని ప్రచారం చేశారు. వీటిలో భక్త, మాహేశ్వర, ప్రసాద, ప్రాణలింగ, శరణ, ఐక్య స్థలాలని ఆరు. 'భక్త' స్థలమున భగవంతునిగూర్చి తెలిసికోవాలనే అభిప్రాయం కలుగుతుంది. 'మహేశ్వరస్థలం' లో వ్రతనియమాలను ఆచరించడం వల్ల ఆత్మ పరిశుద్ధత పొందుతుంది. 'భక్త' స్థలం కంటె ఇందులో భక్తిభావన ఉన్నతమవుతుంది. ప్రసాద స్థలంలో ప్రతివస్తువు శివప్రసాదంగా గోచరిస్తుంది. ఈ మూడింటిని క్రియాత్మకాలని వ్యవహరిస్తారు. భగవంతునిచే సృష్టింపబడినవన్నియు అతని స్వరూపాలేననే భావన ఏర్పడుతుంది. 'ప్రాణలింగ' స్థలంలో ఆత్మయే లింగంగా గోచరిస్తుంది. శరణస్థలంలో భక్తుడు తన అస్తిత్వం కోల్పోయి భగవంతునిపై ఆధారపడతాడు. 'ఐక్య' స్థలంలో శివునితో భక్తుడు సంపూర్ణంగా ఏకభావం పొంది శివాద్వైత సిద్ధిని పొందినట్లు భావిస్తాడు.[1]

తాము నిర్వహించాల్సిన కార్యాన్నిగూర్చి చర్చించుకోవడానికి వీరశైవులు ప్రత్యేకంగా 'అనుభవమంటపం' అనే సమావేశ మందిరాన్ని ఏర్పరచారు. దాని అధ్యక్షస్థానానికి 'శూన్య సింహాసనం' అని పేరు.

---

1. చూ. బి. ఆదిలక్ష్మి ''సోమన నిరసించిన మతం'' - పరిశోధన, No: 8,9. 1956

వీరశైవులు శివార్చనలో సహితం తమ ప్రత్యేకతను స్థాపించుకోవడానికి అనేక నియమాలను అనుసరించారు. తద్వారా సమకాలంలోని శైవ శాఖలకు భిన్నలక్షణాలు గల మతంగా వీరశైవాన్ని వృద్ధి చేశారు.

## వైష్ణవం

ఆంధ్రదేశంలో వైష్ణవమతం క్రీ.శ. 12వ శతాబ్దినుండి అనుసరింపబడుతుండినట్లు పల్నాటి హైహయ వంశీయుల మంత్రియైన బ్రహ్మనాయుడి ఇతివృత్తం ద్వారా తెలుస్తుంది.[1] క్రీ.శ. 13వ శతాబ్దికి చెందిన పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో వైష్ణవ మతీయులను గూర్చి ప్రస్తావించాడు.[2] ఈ కాలానికే రామానుజాచార్యులు తిరుపతి దేవాలయాన్ని వైష్ణవ మత కేంద్రంగా వృద్ధి చేసినట్లు చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి.[3] అయితే క్రీ.శ. 14వ శతాబ్ది నాటికి ఆంధ్రదేశంలో ముఖ్యమైన మతంగా రూపొందిన వైష్ణవమతం తమిళదేశంలో ఆళ్వార్లు ప్రచారం చేసిన వివిధ సామాజిక అంశాలు, మధురభక్తి, సంప్రదాయం, రామానుజుడు ప్రతిపాదించిన తాత్త్విక దృక్పథాల సమ్మిశ్రణంగా ప్రారంభమయ్యింది.

వైష్ణవమతాన్ని తొలిదశలో అనుసరించిన బ్రహ్మనాయుడు సామాజిక రంగంలో సంస్కరణా విధానాన్ని చేపట్టాడు. బ్రహ్మనాయుడు వివిధ వర్ణాల వారితో ఏర్పాటు చేసిన

---

1. బ్రహ్మనాయుడు తన ఆరాధ్యదైవమైన చెన్నకేశవుని పూజించిన పిమ్మట పన్నిద్దరాళ్వార్లను స్మరించినట్లు 'పల్నాటి వీరచరిత్ర' (పేజీ. 48) లో ప్రస్తావితమైంది.

2. ''.... శంఖ చక్రాంకితులైన
   కుటిలాత్ములను జూడగూడని''
   (పండితారాధ్య చరిత్ర పే. 10)

3. Sadhu Subrahmanya Sas'ry : Tirupati Sri Venkateswara, PP. 160-1 .

సహపంక్తి భోజనం ఆరోజుకి పూర్వం ఎక్కడా కనిపించని విశిష్ట సంప్రదాయం.[1] వైష్ణవ మత ప్రచారం కోసమే ఈ కార్యాన్ని నిర్వహించాడా? లేక రాజ్యంపై ఆధిపత్యాన్ని స్థిరపరచు దానికి సహపంక్తి భోజనం ఏర్పరిచాడా అనే విషయం అసందిగ్ధంగానే ఉంది. అయితే వైష్ణవమతానుయాయి అయిన బ్రహ్మనాయుడు ఈ కార్యాన్ని చేపట్టడం వల్ల ఆమతానికి గూడా సంస్కరణ గౌరవం లభించింది. బ్రహ్మనాయుడి తర్వాత సామాజిక రంగంలో వైష్ణవ మత ఆచారాలను పాటించిన వ్యక్తులు కనిపించరు. తర్వాతి కాలంలో కావ్యరచనలో మాత్రమే వైష్ణవమత భావాలు కనిపిస్తాయి.

వైష్ణవ మత సిద్ధాంతాలను, సామాజిక ఆశయాలను ప్రస్తావించిన తొలికవి కృష్ణమాచార్యులు (14వ శతాబ్ది). సింహగిరి వచనాల రచయితగా ప్రసిద్ధుడైన ఈ రచయిత సామాజిక జీవనం పట్ల వైష్ణవమత దృక్పథాన్ని విశదం చేస్తూ, చూర్ణికలు రచించాడు.

---

1. "In medieval India as a whole, there is no parallel to such a socio-religious radicalism. (Brahmanna encouraged inter-dining (Capakudu) and inter caste marriages.) But there was much opposition to the attempt of Brahmanna at the overthrow of the long cherished social fabric and at the establishment of a society of Bhaktas or Dasas".

   B.S.L. Hanumantha Rao : Religion in Andhra, P.258.

   బ్రహ్మనాయుడు నిర్వహించిన చాపకూడు పలనాటి సంగ్రామం జరగడానికి ఒక కారణమని క్రీడాభిరామకర్త పేర్కొన్నాడు.

   ''అరువేల్వ నాయురాలి దుర్మంత్రంబు
   కోడిపోరు, చాపకూటి కుడుపు
   ప్రథమ కారణములు పల్నాటి యేకాంగ
   వీరపురుష సంప్రహారమునకు''

   (క్రీడాభిరామం, పద్యం. 119.)

ఆయన పిమ్మట వైష్ణవమత ప్రేరణతో అన్నమాచార్యులు రచించిన వేల సంకీర్తనలు వైష్ణవమత దృక్పథాన్ని వివరిస్తాయి. ఈ ఇరువురి రచయితలపై తమిళదేశంలోని వైష్ణవమతం గాఢమైన ప్రభావాన్ని వేయడం వల్ల, తమిళ ప్రాంతంలోని వైష్ణవమత స్వరూపాన్ని స్థూలంగా పరిచయం చేయడం జరుగుతుంది.

<u>ఆళ్వార్లు:</u>- క్రీ.శ. ఆరవ శతాబ్దంనుండి తొమ్మిదవ శతాబ్ది వరకూ తమిళదేశంలో విష్ణుభక్తులైన ఆళ్వార్లు విష్ణువును కీర్తిస్తూ, వైష్ణవమత భావాలను ప్రచారం చేశారు. ఈ ఆళ్వార్ల నుండే భగవంతుని ప్రార్థించడంలో ఒక తీవ్రత ఏర్పడింది. నిరంతరం భగవంతుని ధ్యానించడంవల్ల, సాధకుడి మనస్సు భగవంతునిలో ఐక్యం కావాలని ఆకాంక్షిస్తుంది. విష్ణుభక్తులైన ఆళ్వార్లు భక్తిలో సంపూర్ణంగా నిమగ్నమవడం వల్ల 'ఆళ్వారు' అనగా లోతుకు పోయినవాడు ; లోతు నెరిగినవాడు; భగవద్భక్తి, ఫలితాన పరమానంద సముద్రం . యొక్క లోతును చూసినవాడనే అర్థం ఏర్పడింది.[1] ఈ ఆళ్వార్లు పన్నెండు మంది కావడం వల్ల 'పన్నిద్దరాళ్వార్లు' అని వ్యవహారంలో ఉంది. ఆళ్వార్లు భగవంతుడిని కీర్తిస్తూ, పాడిన గేయాలను 'పాశురాల' ని పిలుస్తారు. ఈ పన్నిద్దరాళ్వార్లు రచించిన గీతాల సమాహారానికి 'నాలాయిర దివ్యప్రబంధం' అని, 'ద క్షిణవేదమ' ని ప్రఖ్యాతి.

పన్నిద్దరాళ్వార్లలో అత్యంత ముఖ్యమైన వారు ఆండాళ్, నమ్మాళ్వారులు. విష్ణు భక్తురాలైన ఆండాళ్ భగవంతుడిని ప్రియుడిగా భావించి ప్రేయసీ, ప్రియుల సంబంధంతో విష్ణువును కీర్తించింది. భగవంతుడిని నిరంతరం ధ్యానిస్తూ, ఆతనినే జీవితంగా గడపడం భక్తిసంప్రదాయంలోని ముఖ్య లక్షణంగా ముందే ప్రస్తావితమైంది.[2] భగవంతుని నిరంతరం

---

1. తిరువాయిపాటి రాఘవయ్య : ఆళ్వారుల దివ్యవైభవం, పే. 3.
2. చూ. ప్రథమాధ్యాయం.

స్మరించడమంటే ఆతనితో నిత్య సాన్నిహిత్యాన్ని ఆకాంక్షించడం. ఇద్దరు వ్యక్తులు మానసికంగా ఏకమవడాన్ని స్పష్టంగా భావిస్తే మానసిక, శారీరక ఐక్యతను శృంగారంగా పిలుస్తారు. భగవంతునిపై జీవితంగా గడిపే భక్తుడు మానసికంగా, శారీరకంగా భగవంతునిలో సంలీనమవాలని ఆకాంక్షిస్తాడు. భక్తిలో ఇటువంటి స్థితిని 'మధురభక్తి' గా పేర్కొంటారు. ఈ మధురభక్తి సంప్రదాయం వైష్ణవమతంలో ఒక ముఖ్యమైన అంశం. భగవంతునితో నిత్య సాన్నిహిత్యాన్ని అపేక్షించి, ఆతనితో సంయోగమవాలని పాడే విరహ, సంయోగ గీతాలకు మధురభక్తి గేయాలని పేరు. ఇది ఆండాళ్ నుండే ప్రారంభమయ్యింది.[1] భగవంతుడినే భర్తగా తలచి విరహగీతాలు రచించిన ఆండాళ్‌ను భగవంతుడికే ఇచ్చి పెండ్లిచేసినట్లు, ఆమె శ్రీరంగధామంలో అంతర్థానమైనట్లు ఐతిహ్యం ప్రచారంలో ఉంది. ఆండాళ్ లోని మధుర భక్తితో పాటు వివిధ సామాజిక అంశాల చర్చ నమ్మాళ్వారుతో నిర్దిష్టరూపాన్ని సంతరించుకుంది.

ఆళ్వార్లలో అత్యంత ప్రసిద్ధుడైన నమ్మాళ్వారు జీవితగాథ విచిత్రమైంది. ఈయన పుట్టినప్పటినుండి నోటిమాట, కంటిచూపు లేకపోవడం వల్ల వ్యథతో తల్లిదండ్రులు ఈతనిని ఒక చెట్టువద్ద వదలిపోగా 16 సంవత్సరాలు నమ్మాళ్వారు అక్కడే ఉండినట్లు, మధురకవి అనేటి ఆళ్వారు నమ్మాళ్వారులో విశేషాంశ ఉందని గ్రహించి నమ్మాళ్వారును కొన్ని ప్రశ్నలడగగా వాటికి సమాధానం చెప్పడంతో సంతృప్తుడై నమ్మాళ్వారుకు భక్తుడిగా మారినట్లు , మధురకవితో పరిచయం ఏర్పడిన పిమ్మటనే నమ్మాళ్వారు విష్ణువును కీర్తిస్తూ గీతాలు రచించినట్లు వైష్ణవులు విశ్వసిస్తారు. నమ్మాళ్వారు జీవితగాథలోని సామంజస్యం ఏమైనా వైష్ణవమత సాంప్రదాయకులు నమ్మాళ్వారును అతిగౌరవంతో కీర్తిస్తారు.

---

1. ము. వరదరాజన్ : తమిళ సాహిత్య చరిత్రము పే. 130.

నమ్మాళ్వారు రచించిన గేయాలు నాలుగు భాగాలుగా విభక్తమైనాయి. అవి తిరువిరుత్తం, తిరువాశిరియం, తిరువాయిమొళి, తిరువందాది. వీటిలో 'తిరువాయిమొళి' ని వైష్ణవులు అత్యంతంగా గౌరవిస్తారు. నమ్మాళ్వారునుండే వైష్ణవమతానికి రెండు లక్షణాలు ఏర్పడ్డాయి. మొదటిది, మధురభక్తి భావనతో విష్ణువును కీర్తించడం. రెండు, లౌకిక జీవితానికి సంబంధించిన అనేక అంశాలను వర్ణించడం. నమ్మాళ్వారు వర్ణవిధానాన్ని ఖండిస్తాడు. రాజులను, రాజాశ్రయాన్ని పొంది జీవించే కవులను నిరసిస్తూ, 'నా జిహ్వాగ్రం నుండి వెలువడు మధురమైన కవితను సంపన్నుల యశస్సును కీర్తించుటకు ఉపయోగించలేను. తిరువేంగడంలో 'ఎంబెరుమాన్' ఉండగా అతని ఔన్నత్యాన్ని కీర్తించక వేరొకరికి నా కవితాశక్తి నుపయోగించజాలనొ' ని పేర్కొంటాడు.[1] అశాశ్వతమైన వ్యక్తులను పొగిడి జీవిక సంపాదించేకంటే శ్రమించి జీవించడం మేలని బోధిస్తాడు.[2]

నమ్మాళ్వారు లౌకిక జీవితానికి సంబంధించిన అంశాలతోపాటు భగవంతుడిని ప్రియుడిగా సంభావించి మధురభక్తిగేయాలను రచించాడు. ఆండాళ్, నమ్మాళ్వారులు భగవంతుని భర్తగా తలచి అతని స్పర్శకోసమై పరితపించారు. వీరు రచించిన గేయాలు ప్రేయసీ, ప్రియుల సంబంధంగల విరహగీతాలే కాని సంయోగగీతాలు కావు.[3]

---

1. ము. వరదరాజన్ : తమిళ సాహిత్య చరిత్ర, పే. 148.
2. See. Srinivasa Raghavan; Nammalwar, P. 74.
3. "The love poems express a range of feelings but most of them are pre-occupied with absence, not presence, not the bliss of union but the pain of separation. They convey what is called 'Viraha' in Sanskrit, 'Mullai' and 'neytal' in Tamil poetics".

   A.K. Ramanujan, The Hymns for the Drowning, P.19.

భగవంతుడిలో భక్తుడు సంలీనమవాలన్న ఆకాంక్షను తెలియచెయ్యడమే రామానుజాచార్యుల విశిష్టాద్వైత సిద్ధాంత ప్రతిపాదనకు హేతువయ్యింది.

<u>ఆళ్వార్ల గీతాలు : విశిష్టాద్వైత సిద్ధాంతం</u>

ఆళ్వార్ల గీతాల ఆధారంగా రామానుజాచార్యులు విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించి ఆ గీతాలకు ప్రామాణికత్వం సమకూర్చాడు. భక్తుడు తన అస్తిత్వాన్ని గుర్తిస్తూ, పరమపురుషుడైన భగవంతునిలో సంలీనమవడానికి సాధన చేసి సాయుజ్యం పొందడమే విశిష్టాద్వైతం. రామానుజుడు ఈ సిద్ధాంతం ప్రతిపాదించడానికి నమ్మాళ్వార్ గీతాలలోని మధురభక్తి భావననే గ్రహించాడు.[1]

రామానుజుడికి పూర్వం ఆళ్వార్ల గీతాలను భజనకూటాల్లో పాడుకుంటుండగా వాటిని నాథముని (క్రీ.శ. 823 - 924) సేకరించి రాగాలను కూర్చి వాటికి నిర్దిష్టమైన రూపమిచ్చాడు. తర్వాతి కాలంలో రామానుజుడు (జననం. క్రీ.శ. 1017) ఆ గీతాలకు తాత్త్విక దృక్పథమిచ్చి శృంగారగేయాలన్న భావనను తొలగించాడు.

రామానుజుడు వర్ణవిధానం పట్ల ఉదారభావాలు కల్గిన వ్యక్తి. గురువునుండి నేర్చుకొన్న అష్టాక్షరీ మంత్రాన్ని ప్రజలందరికీ తెలియచెప్పడంలోనూ, బ్రాహ్మణేతరుడైన

---

1. "Nammalvar's compositions played a significant role in enabling Ramanuja to build the religious system of Vaisnavism. They sing the greatness of innumerable auspicious qualities of Vishnu. Ramanuja therefore bowed to the feet of this Alvar and lived a gloriou, life through his dependence on this Alvar".

   N. Subbu Reddiar : Religion and Philosophy of Nalayiram, P.729.

మహాపూర్ణుడిని గురువుగా అంగీకరించడంలోనూ, శూద్ర వర్ణానికి చెందిన నమ్మాళ్వారును కీర్తించడంలోనూ, వర్ణవ్యవస్థపట్ల అతనికి గల ఉదారభావాలు విదితమవుతాయి[1]. రామానుజుడు విష్ణ్వర్చనలో పాల్గొనడానికి బ్రాహ్మణేతరులకు అవకాశం కలిగించాడు. వైష్ణవ మతంలోని బ్రాహ్మణ అర్చకులను 'సాత్తినవన్' అని, బ్రాహ్మణేతరులను 'సాత్తాదవన్' అని పిలిచాడు. ఈ 'సాత్తాదవన్' లకే 'సాతానులు' అని వ్యవహారం ఉంది. వీరిని గూర్చి 'దక్షిణభారతంలోని కులాలు,తెగలు' కు సంబంధించిన చరిత్రలో ఇలా వ్రాసి ఉంది. "... a mixed religious sect, recruited from time to time from other castes, excepting Paraiyans, leather-workers and Mohemmadans. All the Satanis are Vaishnavites, but principally revere Bashyakar (another name for Ramanuja), whom they assert to have been an incarnation of Vishnu. The Satanis are almost entirely confined to the large towns .... They are the priests of some Sudra castes, and in this character correspond to the Saivite Pandarams.[2]

వైష్ణవ సంప్రదాయాలను అనుసరించే ఈ సాతానులు ఆళ్వారుల పాశురాలను పారాయణం చేస్తూ, జీవిస్తారు. వీరు వ్యవసాయదారులకు, వివిధ వృత్తులవారికి అర్చకులుగా వ్యవహరిస్తారు.

---

1. మా. నరసింహాచార్యులు : తిరునామములు, పే. 102.

2. Edgar Thurston & K. Rangachari : Castes and Tribes of southern India, Vol. VI, P. 299.

రామానుజుడు వైష్ణవమతానికి ఒక ప్రత్యేక తాత్త్విక దృక్పథాన్నిచ్చి పలుకులాలు భగవదర్చనలో పాల్గొనడానికి అవకాశం ఇవ్వడంవల్ల, ఆతడిని లోకానికి మార్గం చూపించిన వ్యక్తిగా అన్నమయ్య కీర్తించాడు.[1]

## <u>వడగళ, తెన్కల శాఖలు</u>

రామానుజుడు మరణించిన పిమ్మట వైష్ణవమతం వడగళ, తెన్కల అనే రెండు శాఖలుగా విడిపోయింది. వైష్ణవంలో రెండు శాఖలు ఏర్పడడానికి మర్కట, మార్జాల కిశోర న్యాయాలు కారణమని స్థూలంగా భావించినా[2] వర్ణవిధానం పట్ల గల అభిప్రాయాల కారణంగానే విభేదాలు ఏర్పడ్డాయి. రామానుజుడి తర్వాత ఆళ్వార్ల గీతాలను అర్చా కార్యక్రమాల్లో పఠించడాన్ని వ్యతిరేకించే వర్గం వడగళలుగా, రామానుజుడి మార్గంలోనే ఆళ్వార్ల గీతాలను దైవిక కార్యక్రమాల్లో పాడేవారు తెన్కలగా విడిపోయారు.[3]

---

1. ''గతులన్నీ ఖిలమైన కలియుగమందున
   గతి యీతడే చూపె ఘన గురుదైవము ||గతు||
   యీతని కరుణనే కాయిల వైష్ణవుల మైకి
   వీతని వల్లనే కంటి మీ తిరుమణి
   యీతడే కా ఉపదేశమిచ్చె నష్టాక్షరి మంత్ర
   వీతడే రామానుజులు యిహ పరదైవము'' ||గతు||

   అధ్యాత్మ సంకీర్తనలు, Vol.7. కీర్తన. 138.
2. R.G. Bhandarkar, Vaisnavism and Saivism, PP.78-79.
3. See. Dr. N. Subbu Reddiar : The Religion and Philosophy of Nalayiram, P. 690.

భగవదర్చనా సమయంలో అమరభాషయైన సంస్కృతం మినహా మరొకటి ఉపయోగించడానికి అర్హమైనది కాదని వడగళ శాఖీయులు భావించారు. అందుకు కారణాలను పేర్కొంటూ వేదాధ్యయనానికి శూద్రులు, స్త్రీలు అనర్హులని ధర్మశాస్త్రాలు నియమం విధించగా వైష్ణవులు శూద్రులైన నమ్మాళ్వారు గీతాలను, స్త్రీ యైన ఆండాళ్ గీతాలను పఠించడం అపచారమని, అంతేగాక తమిళభాషలో ఉన్న 'నాలాయిర దివ్యప్రబంధా'న్ని తమిళ ప్రాంతీయులు తప్ప అన్యులు అర్థంచేసుకోలేరని తలచారు. వీటితోపాటు మరొక ఆక్షేపణ చేస్తూ, శ్రుతి, స్మృతులు భక్తునకు వైరాగ్యాన్ని బోధిస్తుండగా ఆళ్వార్ల గీతాలు కామాన్ని ప్రేరేపిస్తున్నాయని వీటి కారణంగా ఆళ్వార్ల పాశురాలు వైదిక కార్యాల్లో పారాయణం చేయడానికి అర్హమైనవి కావని వడగళతెగవారు వాదించారు.

వడగళ శాఖీయుల గురువైన వేదాంత దేశికులు కులవిధానం పట్ల, ఆళ్వార్లు, రామానుజుడు ప్రచారం చేసిన ఉదారభావాలస్థానే బ్రాహ్మణాధిపత్యాన్ని స్థిరపర్చాడు. తెన్నల శాఖీయులు వైదిక, అవైదిక అంశాలను సమ్మిళితంగా అనుసరించారు. వీరు కులాన్ని అప్రధానంగా తలచి విష్ణుభక్తిని ప్రచారం చేశారు. ఆంధ్రదేశంలోని వైష్ణవ మతీయులైన కృష్ణమాచార్యులు, అన్నమయ్య రామానుజుడు స్థాపించిన మార్గాన్ని అనుసరించాడు. అందుకే అన్నమయ్య వైష్ణవులలోని ఒక శాఖను తీవ్రంగా ఖండిస్తాడు. వారు వైష్ణవులు పాటించవలసిన నియమాలను ఉల్లంఘించి యజ్ఞయాగాదులు నిర్వహిస్తూ, వేదాలను పఠిస్తున్నట్లు ఆక్షేపిస్తాడు.

''అయ్యో వికల్ప వాదులంతటా సిగ్గుపడరు
యియ్యెడ నెట్టుగలిగె నీ యపరమతము ||పల్లవి||

నీ మూర్తులూ వొల్లరు నీ దాసోహము వొల్లరు

కామించి నీమీది భక్తి కడువొల్లరు

నామ మంత్రము వొల్ల రహమయుండ వనెదరు

తాము వైష్ణవుల మంటాఁ దర్పింతురు ||అయ్యో||

....

వరుస రావణాదుల వలెనెల్లాను సేతురు

పరుసనట్టే వేదమూఁ జదువుదురు

నిరతి శ్రీ వెంకటేశ నీ మహిమ లెరగక

అరిది వైష్ణవులమేయని యాడుకొందురు ||అయ్యో|| "

(అధ్యాత్మ సంకీర్తనలు, ప్రథమ సంపుటం, కీర్తన 52)

ఇది రామానుజాచార్యుల సంప్రదాయాలను అనుసరించని వైష్ణవులపై అన్నమయ్య విమర్శ.

## పోతన - వైష్ణవేతర సంప్రదాయం

ఆంధ్రదేశంలో వైష్ణవ మతాన్ని ప్రచారం చేసిన కృష్ణమాచార్యులు, అన్నమయ్యల రచనలను గూర్చి చర్చించేముందు సంస్కృత భాగవత గ్రంథాన్ని తెనిగించిన పోతనను గూర్చి ప్రస్తావించాలి. భాగవత గ్రంథం విష్ణు పారమ్యాన్ని, విష్ణుభక్తుల పారశస్త్యాన్ని వర్ణించడం వల్ల ఆంధ్రమహాభాగవతం వర్ణనీయాంశమయ్యింది.

పోతన భాగవతం విష్ణు పారమ్యాన్ని ప్రబోధించే కావ్యమే అయినా వైష్ణవ మత దృక్పథంతో రచించిన కావ్యం కాదు. పోతన ఆళ్వార్లను, రామానుజుడి సిద్ధాంతాలను ఏ సందర్భంలోనూ ప్రస్తావించలేదు. ఆయన సామాజిక అవగాహన వర్ణవిధానాన్ని వ్యతిరేకించేది అని చెప్పడానికి ఎలాంటి సాహిత్యాధారాలు లేవు. ఆయన కవితాసంప్రదాయం గూడా సంస్కృత సాహిత్య మార్గాన్ని అనుసరించినదే. సామాజిక అవగాహనలోనూ, కవితా మార్గం లోనూ వైదిక మార్గాన్ని అనుసరించిన పోతన్నకు వైష్ణవ మతకవుల దృక్పథానికి ఉన్న వైవిధ్యం వల్లనే పోతన భాగవతాన్ని ఈ పరిశోధనలో భాగం చేయడం లేదు. అయితే పోతన ఒక సందర్భంలో భగవద్భక్తుడిని కులాతీతుడిగా పరిగణించాలని, భక్తుడైన వ్యక్తి, బ్రాహ్మణుడి కంటె ఉన్నతుడని పేర్కొంటాడు.[1] పోతన తన భాగవత రచనను సామాజిక అంశాలను తెలపడానికి ఉద్దేశించినందువల్ల, అతని కవితా దృక్పథానికి, అన్నమయ్య సాహిత్య దృక్పథానికి స్పష్టమైన అంతరం కనిపిస్తుంది.

పోతన్న, అన్నమయ్యలు మధురభక్తిని అనుసరించడంలో సామ్యముంది. పోతన శృంగారగేయాలకు సంస్కృత భాగవతంలోని గోపికల గీతాలు, అన్నమయ్య శృంగార గీతాలకు ఆళ్వార్లగేయాలు ప్రేరణనిచ్చాయి. అన్నమయ్య వేంకటేశ్వర, అలమేల్మంగల శృంగార కేళీలాన్ని వర్ణించినట్లు, పోతన్న భాగవతంలో గోపికాకృష్ణుల రాసకేళిని వర్ణించాడు.

---

1. "నీ నామస్మృతి శ్రవణం
డైనను జిహ్వాగ్రమందు ననుసంధింపన్
వానికి సరి భూసురుడున్
గానేరడు వినుమది జగంబులు నయన్"
(భాగవతం - III - 1028)

భాగవత దశమస్కంధంలోని గోపికల విరహగీతాలు (భాగవతం - X, 1035-97) కృష్ణుడిలో లీనమవ్వాలన్న తీవ్ర ఆకాంక్షను వ్యక్తం చేస్తాయి. కృష్ణుడిని ప్రార్థిస్తూ గోపికలు, 'తనక్రీగంటి చూపులు ప్రసరించమని, తమ తలను నిమురుమని, స్తనాలను మర్దించుమని, ముద్దులతో ముంచెత్తమని, మధుర వాక్కులతో మన్నించుమని వేడుకుంటారు. గోపికలు కృష్ణుడితో

''నీ నగవులు నీ చూడ్కులు
నీ నానా విహరణములు నీ ధ్యానంబుల్
నీ నర్మాలాపంబులు
మానసంబుల నాటి నేడు మగుడవు కృష్ణా''

(భాగవతం - X, 1044)

అంటూ తమ విరహాన్ని తెలుపుకుంటారు. సంస్కృత భాగవతం లోని గోపికా, కృష్ణుల గీతాలకు వల్లభాచార్యుడు రచించిన వ్యాఖ్యలో 'రసస్వరూపుడైన భగవంతుడిని ఏ భక్త్యా వేశంతో తలిచినా, ఆ భావంతోనే భగవంతునిలో సంలీనమవగలరో' ని తెలిపాడు.[1]

దైవం పట్ల ఉండే ఆరాధనా భావం వల్ల, అతని వివిధ కార్యాలు పవిత్రంగా భావింపబడినట్లే, శృంగార జీవితం సహితం పవిత్రతను సంతరించుకుంటుంది.[2]

---

1. "Those who direct constantly to Hari either their passionate desire or their anger, their fear or their love, their striving to become one with Him or their friendship, come to Have Him as their very self".

   Redington, Vallabhacharya on love games of Krsna, P.65.

2. "This attitude is a kind of erotic mysticism which seeks to express religious longings in the intimate language of earthly passion, for it concieves divine love as a reflex of the human emotion.

   S.K. De, Sanskritic poetics
   Cf. A. Ramakrishna Rao; Annamacharya, P.51.

భగవంతుడిని ప్రేమతో ఆరాధించే భక్తులు అతనిలో సంలీనమవ్వాలని తలచినట్లే, అతనిపట్ల శత్రుత్వం కలిగినవారు సహితం అదే భావాన్ని కలిగి ఉంటారని భాగవతం తెలుపుతుంది. భగవంతుని శత్రువులు గూడా ఆయనను వ్యతిరేకించడం ద్వారా భగవంతునిచే సంహరింపబడి చివరకు భగవంతునిలో సంలీనమవుతారు.[1]

భాగవతంలో పోతన పలువురు భక్తుల జీవితాలను వర్ణించాడు. కాని వర్ణవ్యవస్థ పట్ల, సమకాలీన తాత్విక అంశాల పట్ల, సామాజిక జీవనంలోని మార్పుల పట్ల ప్రత్యేకమైన అభిప్రాయాలను ప్రకటించినవాడు కాదు. అందువల్ల సామాజిక జీవనం పట్ల అతడి అవగాహనను ప్రత్యేకంగా చర్చించవలసిన అవసరం ఏర్పడలేదు.

## వీరశైవ, వైష్ణవమతాలు : అద్వైతమత ఖండన

వీరశైవ, వైష్ణవమతానుయాయులైన పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథుడు, అన్నమయ్యలు శంకరాచార్యుల అద్వైతసిద్ధాంతంతో అనేక సందర్భాలలో విభేదించారు. అద్వైతంలోని నిరాకార, నిర్గుణభావాలను, 'జగన్మిథ్య' వాదాన్ని ఖండించారు. శంకరుని మిథ్యావాదానికి, దానిని అనుసరించే వ్యక్తుల ఆచారాలకు మధ్య అనేక వైరుధ్యాలున్నట్లు విమర్శించారు.

---

1. ''కామోత్కంఠత గోపికల్ భయమునం గంసుండు వైరక్రియా
సామగ్రిన్ శిశుపాల ముఖ్యనృపతుల్ సంబంధులై వృష్ణులున్
ప్రేమన్ మీరలు భక్తినేము నిదె చక్కింగంటి మెవ్వైన ను
ద్దామ ధ్యాన గరిష్ఠుడైన హరిఁ జెందన్వచ్చు ధాత్రీశ్వరా!''
(భాగవతం - VII-18)

వీరశైవ, వైష్ణవ మతానుయాయులు శంకరాచార్యుల అద్వైత సిద్ధాంతాన్ని ఖండించడానికి గల కారణాలను రెండు స్థాయిల్లో పరిశీలించవలసి ఉంటుంది. శంకరాచార్యుడు అద్వైతమాయావాద సిద్ధాంతస్థాపకుడేగాక సామాజిక అంశాలలో బ్రాహ్మణ విధానాన్ని పటిష్టమొనర్చిన తార్కికుడు. శంకరుని అద్వైతసిద్ధాంతం దృగ్గోచరమైన అంశాలను గణించక తార్కిక అంశాలపై ఆధారపడి దృశ్యమానమైన ప్రపంచాన్ని మాయగా పరిగణిస్తుంది. అనేక మేధావర్గాల ఆధారంగా రూపొందిన ఈ సిద్ధాంతం ఆధిపత్య వర్గాల భావజాలానికి ప్రాతినిధ్యం వహిస్తుందని సామాజిక శాస్త్రవేత్తలు భావిస్తారు.[1]

శంకరాచార్యుడు జన్మలో నరజన్మ దుర్లభమైనదిగా, అందులోనూ బ్రాహ్మణుడై జన్మించడం కోటిజన్మల పుణ్యఫలితంగా పేర్కొంటాడు.[2] తాను ఊహించే బ్రహ్మను జాతి, ప్రాంత, కులగోత్రాలకు అతీతుడిగా భావించాడు.

---

1. (a) "The narrow upper layer of society on the other hand depended on intellectual exercises and were therefore moved by ideas in the mental horizon rather than phenomena of nature, they developed themselves into idealists, those who assert the supremacy of ideas over nature. The most sophisticated expression of this idealistic outlook was Shankara's Advaita Vedanta which asserted everything other than the Brahman (the absolute idea) as 'avidya' - non-existent".

   E.M.S. Namboodiripad : "AdiShankara and his philosophy - A Marxist View" - in Social Scientist, No. 188-189, January-February, 1989, PP.7-8.

   (b) S.G. Sardesai : "The Social Role of Vedanta" in Marxism on Vedanta, P.121-122.

2. జంతూనాం నరజన్మదుర్లభమతః పుంస్త్వం తతో విప్రతా
   తస్మాద్వైదిక ధర్మమార్గ పరతా విద్వత్త్వమ స్మాత్పరమ్
   ఆత్మానాత్మ వివేచనం స్వనుభవో బ్రహ్మాత్మనా సంస్థితి
   ర్ముక్తిర్నో శతకోటి జన్మసుకృతైః పుణ్యైర్వినా లభ్యతే''

   (శంకరాచార్య - వివేకచూడామణి - శ్లోకం - 3.)

''జాతినీతి కులగోత్ర దూరగం
నామరూపగుణదోషవర్జితమ్
దేశకాల విషయాతివర్తియత్
బ్రహ్మతత్త్వమసి భావయాత్మని[1]''

జాతి, నీతి, కులగోత్రాలకు దూరమైనది, నామరూపగుణ దోషాలకు అతీతంగా దేశకాల విషయాలను దాటి బ్రహ్మమున్నదే, సాధకుడు సహితం వీటికి అతీతుడని శంకరుడి భావన. నిరాకారుడు, నిర్గుణుడు అయిన బ్రహ్మ మానవులు ఏర్పర్చుకున్న నియమాలు, విలువలు, ప్రాంతకాలాలకు అతీతుడైనవాడు. సాధకుడు సహితం వీటన్నింటికి అతీతంగా భావించు కోవాలని శంకరుడు చేసిన ఉద్బోధ.

శంకరుడు వివిధవర్ణాలకు అతీతంగా సాధకుడిని సంభావించుకొమ్మని చెప్పినప్పటికీ తన 'బ్రహ్మసూత్ర భాష్యం' లో శూద్రులకు బ్రహ్మవిద్యాధికారం లేదంటాడు. ఉపనయన కర్మకు అవకాశంలేని శూద్రులకు వేదాధ్యయనాధికారం లేదని ప్రకటించాడు.[2]

---

1. వివేకచూడామణి - శ్లోకం 255.
2. 'न शूद्रस्याधिकारः वेदाध्ययनाभावात्। अधीतवेदो हि विदितवेदार्थो वेदार्थेष्वधिक्रियते। न च शूद्रस्य वेदाध्ययनमस्ति; उपनयनपूर्वकत्वाद्वेदाध्ययनस्य उपनयनस्य च वर्णत्रयविषयत्वात्। यत्तु अर्थित्वम्, न तदसति सामर्थ्येऽधिकारकारणं भवति।'
ब्रह्मसूत्र भाष्यम्, श्री शंकर ग्रन्थावलि, पृष्ठ 209-10

శంకరుడు శూద్రవర్ణంపై ప్రకటించిన అభిప్రాయాలు శైవ, వైష్ణవ విశ్వాసాలకు భిన్నమైనవి. శంకరాచార్యుడు సామాజిక అంశాలను వివరించడంలో వైదిక ధర్మాలను అనుసరిస్తే, వీరశైవులు, వైష్ణవులు నూతన సామాజిక విలువలను ఏర్పరచుకున్నారు. భక్తులను కులాతీత వ్యక్తులుగా పరిగణించారు. వైష్ణవంలో అతి ప్రముఖుడైన నమ్మాళ్వారు శూద్రుడు కాగా, తిరుప్పాణాళ్వారు అంత్యజుడు. అలాగే వీరశైవ భక్తు లనేకులు (జేడర దాసమయ్య, మడివాలు మాచయ్య, కక్కి దేవయ్య మొ॥న వారు) శూద్రులు, అంత్యజులు. శంకరుని అభిప్రాయం ప్రకారం ఈ భక్తులందరూ హీనమైన వ్యక్తులుగానే గుర్తింపబడాలి. వీరికి వేదాది అంశాలను చర్చించడానికి అవకాశం లేదు. కాని వీరశైవ, వైష్ణవ భక్తుల దృష్టిలో వీరు ఉత్తమ భక్తులు. వేదాది అంశాలను చర్చించడానికి అర్హత ఉన్నవారు. తమ మతాలను అనుసరించిన అంత్యజులైనా మోక్షాన్ని పొందడానికి అర్హులని పరుసవేది ద్వారా ఏ లోహమైనా బంగారంగా మార్పుచెందినట్లు ఏ కులానికి చెందిన వ్యక్తినైనా ఉన్నతుడిగా రూపొందించవచ్చునని వీరు విశ్వసిస్తారు.[1]

---

1. ఎ) ''విను పరుసవేది సోకిన
యినుము క్రియన్నిన్నుగొలిచి - యెవ్వండైనన్
ధనయున ! యుత్తముడనబడు
ఘనరగ శివభక్తుడగ్గ - పూజ్యుండగుటన్''
(శివతత్త్వసారం, పద్యం.120.)

బి) '' పరుసమొక్కటి కాదా పయుండిగా జేసేది
అరయలోహమెట్లున్నా నందుకేమి !
శ్రీకాంతునామము జిహ్వదగిలితె చాలు
యేకులజుండైనను హీనమేమి
సాకారుడైన హరి శరణుజొచ్చిన( జాలు
చేకొని పాపము లెన్ని చేసిననేమి?''
(అధ్యాత్మ సంకీర్తనలు, Vol. II, కీర్తన - 399.)

ఈ కారణాలవల్ల శైవ, వైష్ణవ మతానుయాయులు శంకరుని అభిప్రాయాలతో విభేదించారు.

వీరశైవులు, అన్నమయ్య శంకరుని భావాలతో విభేదించడానికి గల మరొక హేతువు, తాత్త్వికాభిప్రాయాల్లోని వైరుధ్యం. శంకరుడు తన అద్వైత సిద్ధాంతంలో దృగ్గోచరమైన ప్రపంచాన్ని అసత్యమైనదిగా నిరాకార, నిర్గుణమైన బ్రహ్మమాత్రమే సత్యమైనదిగా వివరిస్తాడు.[1] బ్రహ్మ సత్యమైనది, జగత్తు అసత్యమైనది. ఈ విధమైన నిశ్చయమే నిత్యానిత్య వస్తువివేకమని చెప్పబడింది. కనిపించే లోకమంతా అసత్యమైనదిగా, అవాఙ్మానసగోచరుడైన బ్రహ్మ ఒక్కటే సత్యమని తెలిపాడు. జనన మరణాది దుఃఖాలకు హేతువైన శరీరాన్ని సత్యమైనదని విశ్వసించి విషయ వాంఛలతో దేహాన్ని రక్షిస్తూ, వివిధ బంధుత్వాలు ఏర్పరచుకోవడం వల్ల నిజమైన జ్ఞాన ప్రాప్తి లభించదు.[2] అందువల్ల ఈ సంబంధాలను అధిగమించి నిరపేక్షమైన కాంక్షతో నిత్యమైన బ్రహ్మను పొందడం కోసం ప్రయత్నించాలి. అందుకు విషయ వాంఛలకు హేతువైన లోకంలోని సమస్త వస్తు జాలాన్ని, బంధువులను, ప్రజలను మిథ్యగా భావించి భగవంతుని పొందడం కోసం ప్రయత్నించాలి. కాని, ప్రజలు అనిత్యమైన ప్రపంచాన్ని నిత్యంగా భావించి ఇదే వాస్తవమని భ్రమిస్తున్నారు. అంధకారంలో రజ్జువును జూసి పాముగా భ్రాంతి చెందినట్లు ఈ సమస్తలోకాన్ని, వస్తు సముదాయాన్ని వాస్తవమని, నిత్యమని తలుస్తున్నారు. వివేకం కలుగగానే భ్రాంతినుండి విముక్తులై నిజమైన వస్తుజ్ఞానం పొందినట్లు లోకంలోని అనిశ్చితతాన్ని గుర్తించి వాస్తవమైన బ్రహ్మను తెలుసుకుంటారు.[3]

---

1. ''బ్రహ్మసత్యం జగన్మిథ్యేత్యేవం రూపో వినిశ్చయః
   నిత్యానిత్య వస్తువివేకః సముదాహృతః ''
   (వివేకచూడామణి - శ్లోకం -20.)
2. Ibid. - P.210 .
3. Ibid . - P.443.

బ్రహ్మమే సత్యమని గుర్తించగలిగినప్పుడు

''స్వయం బ్రహ్మ స్వయం విష్ణుః
స్వయ మిన్ద్రః స్వయం శివః
స్వయం విశ్వమిదం సర్వం
స్వస్మాదన్యన్న కించన''  (వివేకచూడామణి - శ్లోకం 389.)

సత్యమైన బ్రహ్మను గుర్తించగలిగిన సాధకుడు తానే బ్రహ్మ, తానే విష్ణువు, తానే ఇంద్రుడు, తానే శివుడు, తానే ఈ సమస్తమైన ప్రపంచం. తనకంటే భిన్నమైనది ఏదీలేదనే వివేకాన్ని పొందుతాడని శంకరుడు వివరించాడు.

సాధకుడినే భగవంతుడిగా భావించుకోవడాన్ని భక్తులు అంగీకరించరు. అత్యంత శక్తిమంతుడూ, అనంత వైవిధ్య సంభూతుడూ అయిన భగవంతుని ముందు మానవుడు అత్యల్పప్రాణి అని భక్తుల విశ్వాసం. అందుకే పండితారాధ్యుడు 'శివతత్త్వసారం' లో

'' జీవుడు శివుడను వాక్యము
భావింపగ నైక్యమునకు ప్రతిపాదకమే
జీవుడు నే పశుభూయుడు
గావున నే వాడవేలు - గాదనుట శివా ।'' (శివతత్త్వసారం-పద్యం 40)

పశుభూయుడైన మానవుడు శివునితో సమానమని పలకడం అవివేకమైన పని. పశుభూయుడైన మానవుడిని ఈశ్వరుడితో పోల్చడం యుక్తి సహం కాదు. శివుడు మానవాతీతుడు. మనిషికి, భగవంతుడికి మధ్య పలు అంశాల్లో తేడాలున్నాయి. అవి

''జీవునకు బంధమోక్ష ద
శావస్థలు గలవు నీకు - నవి లేవగుటన్
జీవునకు నీకు నైక్యము
భావింపట ముఖ్యమూర్తి - బాధకము శివా!

పరమేశ్వర నీకును మఱి
పరమ క్లేశాత్ములైన పశుజీవుల కం
తరము మహోధాత్రీధర
పరమాణుల యంతరంబు - భావింపశివా'' (శివతత్త్వసారం, 41, 42.)

మానవునకు స్వతంత్రంగా జీవించగలిగిన శక్తిలేదు. అనేకమందితో బంధుత్వం ఏర్పడుతుంది. తల్లి, తండ్రి, సోదరులు, మామలు - ఇట్లా పలువురు లేకుండా జన్మించడమే సాధ్యంకాదు. అనేకులతో ఏర్పడే బంధుత్వం వల్ల వారి కష్టనష్టాలలో, సుఖాలలో, పాలుపంచుకోవడం అవసరమవుతుంది. లోకంలోని పలు అంశాలు అతనితో ముడిపడి ఉంటాయి. అందుకే మనిషి అస్వతంత్రుడిగా జీవించాల్సి ఉంటుంది. వీటన్నింటి నుండి మోక్షం పొందడానికి ఎంతో కృషిసల్పాలి. అయితే భగవంతుడు 'అభవుడు' గనక ఎవరితోనూ బంధుత్వాలు ఏర్పడవు. ఆ కారణంగా బంధమోక్షం అవసరం లేదు. అందువల్ల భక్తునకు, భగవంతునికి మధ్య స్పష్టమైన తేడాఉందని భక్తులు విశ్వసిస్తారు.

శంకరాచార్యుని ప్రకారం జ్ఞానాన్ని పొందిన మానవుడు తానే బ్రహ్మ స్వరూపునిగా భావించుకుంటాడు. ఈశ్వరుడితో తాను పోల్చుకోవడం సకల చరాచర వస్తువులకు

మూలభూతమైన భగవంతుడిని, ఆతని శక్తిస్వరూపాన్ని అర్థంచేసుకోలేక పోవడమని పండితారాధ్యుడు శంకరునితో విభేదిస్తూ,

''ఓన పరమేశ్వరుడ న
జ్ఞానంబున నిన్నునెఱుఁగఁజాలనయను వి
జ్ఞాన విహీనాత్ముల వెడ
పాపలు వోపెడిచి నిన్ను భజియింతు శివా''

{శివతత్త్వసారం, పద్యం. 46.}

శంకరాచార్యుని అజ్ఞాన వాదనలు వదలి, నిరతం నిన్నే భజియిస్తానంటూ శివుడి అస్తిత్వాన్ని గుర్తిస్తాడు.

పండితారాధ్యునిలాగే పాల్కురికి సోమనాథుడుగూడ పండితారాధ్య చరిత్రలో వేదాంతమతాన్ని నిరసిస్తూ, దీర్ఘమైన చర్చచేశాడు. అందులో పండితారాధ్యుడి అభిప్రాయాలతో ఏకీభవిస్తూ, జీవరాశులన్నింటికి శివుడు అధిపతి కావడం వల్ల, భవబంధాల కతీతుడు; కాని, మానవుడు లోకంలోని అనేక బంధాలతో పాశకరింపబడినవాడు. అందుకే

''మానిసి దైవంబు గానెట్లు నేర్చు?
దానెట్లు దైవంబు మానిసి యగును?
దన్నెఱింగిన యాతు దాసినన్గాక
తన్నెఱింగినఁ దాన దైవంబయగును'' {పండితారాధ్యచరిత్ర - పే.128}

అని ప్రశ్నించాడు.

పరిమిత శక్తి కలిగిన నరుడు భగవంతుడితో పోల్చుకోవడాన్ని విమర్శిస్తూ, ప్రత్యక్ష బాధ్యమైన అద్వైతం పోస్తూపోతువు ; అజ్ఞానంతో కూడివున్నది. దీనికి ఎలాంటి ప్రమాణమూ లేనందువల్ల, శివాచార పరాయణులెవ్వరూ దరిచేరనివ్వరని సోమనాథుడు పేర్కొంటాడు.[1]

వీరశైవులు అద్వైత మతంతో విభేదించినట్లుగానే వైష్ణవులు శంకరుని భావాలతో విభేదించారు. కృష్ణమాచార్యులు ''దేవా ... మీ భక్తుండైయుండి శూద్రభక్తుల దూషించుట దోషంబని తెలిసి యుండుకు

''మద్భక్తశ్శంకరద్వేషీ, మద్ద్వేషీ శంకరప్రియః
తావుభౌ నరకం యాతః యావచ్చంద్ర దివాకరౌ''

అనియెడు వాక్యములు తెలిసి యుండుకుబ్రాహ్మణ తారకవేషములకు శూద్రుండైనను జాలునని...''[2] పేర్కొనడంలో శంకరాచార్యుని భావాలపట్లగల విముఖత విదితమవుతుంది.

కృష్ణమాచార్యులు లాగే అన్నమయ్య శంకరాచార్యుని సామాజిక భావాలను, అతడి సిద్ధాంతాన్ని అనుసరించే అద్వైతుల ఆచారాలను ప్రశ్నించాడు. శంకరుని అద్వైత సిద్ధాంతం ప్రకారం యావత్సృష్టిని మాయగా భావించాలి. కాని అద్వైతుల కార్యాచరణ భిన్నంగా ఉందంటూ అన్నమయ్య

---

1. చతుర్వేదసారం, పద్యం. 127.
2. సింహగిరి వచనాలు, వే. 18.

''ఇట్టి నాస్తికుల మాట లేమని నమ్మెదరింక
వెట్టిసముల మంటానే భక్తుల దూషింతురు ॥ఇట్టి॥

వేదములు చదువుతా విశ్వమెల్లాఁ గల్లనేరు
ఆదెస తాము పుట్టుండి అదియును మాయనేరు
పొదగు విష్ణుడుండగా బయలు తత్త్వమనేరు
లేదు జీవతత్త్వమంటా లేమలఁ బొందుదురు'' ॥ఇట్టి॥

(అధ్యాత్మ సంకీర్తనలు, Vol.VIII కీర్తన 33.)

అద్వైతులు తాత్త్వికంగా మాయావాదాన్ని అనుసరించినప్పటికీ వేదాలను అధ్యయనం చేయడం, తమ భావాలకు భిన్నమైన వారిని దూషించడం, సమాజంలోని సౌఖ్యాలను ఉపయోగించుకోవడం అసంబద్ధమైన అంశంగా పేర్కొంటాడు.

అద్వైతులు ఋగ్వేదం లోని ''బ్రాహ్మణోఽస్య ముఖమాసీత్'' అనే శ్లోక భావాన్ని విశదీకరించడం మరీ అసంబద్ధమైన అంశంగా ఆక్షేపిస్తాడు.

''పురుషుండని శ్రుతి పొగడేనట ఆ పురుషుడు నిరాకారమట
విరస వాక్యములిందరికి నివివింటే నసంబద్ధములు ॥పురు॥

మొగమున బ్రాహ్మలు మొలచిరట ఆ మూరితి అవయవ రహితుడట
తగు బాహువులను రాజులట ఆతత్త్వమే యెంచగ శూన్యమట
నగటున తొడలను వైశ్యులట ఆ బ్రహ్మము దేహము బయలట
అగపడి పాదాల శూద్రులట అతనికి రూపము లేదట ॥పురు॥ ''

(అధ్యాత్మ సంకీర్తనలు, Vol. VII-పే. 13.)

నిరాకారుడైన బ్రహ్మ వివిధ అవయవాల నుండి నాలుగు వర్ణాలు ఎలా ఆవిర్భవిస్తాయని ప్రశ్నిస్తాడు. నిరాకార, నిర్గుణుడైన బ్రహ్మ అవయవ రహితుడు గనక అతనికి విన్నపం వినిపించరు; నైవేద్యం స్వీకరించలేడు; ధూపాన్ని ఆఘ్రాణించలేడు. అటువంటి బ్రహ్మకు అద్వైతులు ఎలా పూజ సలుపుతున్నారని ప్రశ్నిస్తాడు. కనుల యెదుట ఉన్న లోకాన్ని మాయగా తలచడం నిర్హేతుకమంటాడు.

''కాదనగా నెట్లువచ్చు కన్నులెదిటిలోకము
లేదనగా నెట్లువచ్చు లోలకర్మము
నీదాసుడనను నేమరుగు చొచ్చుకంటే
యే దెసనైనాఁ జెలి యాదరింపుగాక ||ఎక్కడి మతము||

ఎక్కడి మతములింక నేము సాధించేము నేము
తక్కిన శ్రీపతి నీవే దయజూతుగాక

(అధ్యాత్మ సంకీర్తనలు, ఉ. శ్రీనివాసాచార్యులు (ed.) కీర్తన 52.)

అసంబద్ధమైన శంకరాచార్యుని సిద్ధాంతాలను గాక వేంకటేశ్వరుని సాకార రూపాన్ని అన్నమయ్య కీర్తించాడు[1].

---

1. సకలోపాసకులకు నందున సగుణంబే ప్రమాణము
సకలమునందులు పూజించే యీ సాకారమే ప్రమాణము ||సకల||

సగుణంబని నిమ్మెగొందరు నెరినిర్గుణమని కొందరు
పొగల చెక్కు గతిఁ జదివిన కొలదుల వారికి వారే వాదింతురు ||సకల||

(అధ్యాత్మ సంకీర్తనలు, Vol. VII, కీర్తన 178.)

అద్వైత సిద్ధాంతాన్ని ఖండించడంలో వీరశైవులు, వైష్ణవులు ఒకే పద్ధతిని అనుసరించారు. పశుభృత్యుడైన మానవుడు భగవంతునితో ఎలా సమానమవుతాడని వారు వేసిన మొదటి ప్రశ్న. వీరు వేర్వేరు తాత్త్విక దృక్పథాలకు చెందినవారయినప్పటికీ ఒకే అవగాహనతో అద్వైతాన్ని ఖండించడం యాదృచ్ఛికం కాదు. వీరు అనుసరించిన సంప్రదాయాలు దైవం యొక్క సర్వ వ్యాపిత్వాన్ని, సర్వశక్తిత్వాన్ని అంగీకరించాయి. అందుకే మానవులంతా భగవంతుని శక్తిని గుర్తించి ఆతనికి సేవకులుగా భావించుకోవాలని తెలిపారు. పలు అంశాలలో మనిషికీ, భగవంతుడికీ సామ్యలక్షణాలున్నప్పటికీ జగత్కర్తృత్వం జగద్వ్యాపకత్వం, లక్ష్మీ, పార్వతీపతిత్వం - కేవలం విష్ణువు, శివుడికి మాత్రమే పరిమిత మైన అంశాలు. అద్వైత సిద్ధాంతం ప్రకారమైతే ఈ మూడు లక్షణాలు ప్రతి మానవుడికి వర్తిస్తాయి. ఆ కారణంగా మనిషి జగత్కర్తృత్వానికి, జగద్వ్యాపకత్వానికి మాత్రమే పరిమితం గాక జగన్మాతలైన లక్ష్మికి, పార్వతికి పతి అవుతాడు. ఇది దైవభావనకు అత్యంత అపచారం. అందువల్ల మానవుడికి ఈ మూడు లక్షణాలు లేవు. అందుకే దేవుడి ఆధిపత్యాన్ని అంగీకరించవలసి ఉంటుంది. ఈ కారణంగా శైవంలో మనిషి పశుప్రాయుడు , భగవంతుడు పశుపతి. వైష్ణవంలో మనిషి పరమాణువు, దేవుడు పర్వతం.

## వీరశైవ, వైష్ణవమతాలు : ఆచారాలపట్ల భిన్నభావాలు

ఆంధ్రదేశంలో ప్రచారమైన వీరశైవ, వైష్ణవ మతోద్యమాలలో కొన్ని సామ్యాలు, అనేక వైరుధ్యాలు కనిపిస్తాయి. అందుకు కన్నడ వీరశైవ సంప్రదాయానుయాయులైన

వీరశైవులకు, తమిళ వైష్ణవ సంప్రదాయ ప్రభావంగల వైష్ణవులకు మధ్య వైవిధ్యానికి అవకాశమున్నా వారు విధించిన నియమాలలోనూ స్పష్టమైన అంతరం ఉంది. వీరశైవులు ఆచారాలను పాటించడానికి అత్యంత విలువనిచ్చారు. ఆచార నియమాతిక్రమణాన్ని అత్యంత దోషంగానూ, వాటిని అనుసరించడం ఉత్తమగతులకు మార్గంగాను పేర్కొన్నారు. అయితే వైష్ణవులు మనసును నిర్మలంగా నిలుపుకోలేని ఆచారాలు వ్యర్థమని భావించారు.

పండితారాధ్యుడు తన ''శివతత్త్వసారం'' లో శివభక్తుడు తప్పకుండా పూజ నిర్వహిస్తాడని చెప్పడానికి

" భూతలము తల్లడిల్లినఁ
బాతాళము బయలువడ్డ - బ్రహ్మప్రళయం
వొరించిన నీ భక్తుడు
చేతులు దీసుకయ పూజ సేయును రుద్రా ! '' (పద్యం 164)

శివపూజ నిర్వహించక ఆహారం స్వీకరించకూడదనే నియమాన్ని పేర్కొనడానికి,

''వేయేటికిఁ బ్రాణంబులు
పోయిన దమ తలలు తెగిన - భువిభక్తులు ని
న్నాయత మతి నభ్యర్చన
సేయక కుడువరుఁ త్రిలోక - సేవిత చరణా ! (పద్యం 165)

అంటూ నియమ ప్రాధాన్యాన్ని పేర్కొనడమేగాక భక్తుడైన వ్యక్తి, మూఢుడు, అతి దుర్జనుడు

అయినప్పటికీ భక్తిని స్వీకరించడం వల్ల ఆతనిని పండితుడిగా, పవిత్రుడిగా పరిగణించా లంటాడు. [పద్యం 117] సోమనాథుడు తన 'సోమనాథ భాష్యం' లో భస్మ, రుద్రాక్ష, లింగాలను ధరించిన వ్యక్తి, 'కుక్క మాంసం భుజించినా, మద్యం సేవించినా, అధమస్త్రీతో సంగమించినా దోషముండదని, రుద్రాక్షలు ధరించిన వ్యక్తికి శివుడి స్పర్శ, దర్శనం లభించునని వివరిస్తాడు.[1]

ఆచారాలను గూర్చి వైష్ణవుల దృక్పథం భిన్నంగా ఉంది. తమలోని దోషాలను అధిగమించక ఆచారాలను నిర్వహించడం వ్యర్థమని తెలుస్తారు. కృష్ణమాచార్యులు,

''దేవా,... వ్రతోపవాసములు సేసిననేమి? షోడశ
మహాదానంబులు సేసిననేమి? దేహత్రయ గుణంబులు
వదలక, కులాభిమాన విద్యాగర్వంబులు కుదురు
కొనక యింద్రియ మోహాంధకారంబు నివారించక
యున్న దేహ దుర్మతి'' [సింహగిరి వచనాలు, వచనం 13]

అంటూ చిత్తశుద్ధిలేని ఆచారాలు వ్యర్థమని పేర్కొంటాడు. కేవల ఆచారాలను పాటించే వ్యక్తులను గూర్చి, ''దేవా, శ్రీ పర్వతంబునకు బోయి శైవులగుదురు. తిరుపతుల జూచి వైష్ణవులగుదురు. శుక్తిమతంబును జూచి కుశాలులగుదురు. ఇటువంటి మనస్సుండవల మున గదా రౌరవాది నరకగతియ్యి యిహ పరములు లేకుండుట !'' [వచనం 47] అంటూ ఆచారాలను పాటించడం కంటె వాటిని అనుసరించడం ద్వారా పొందగోరే మనశ్శుద్ధికి

1. See, M. Umadevi; Palkuriki Somanatha, PP. 202-203.

పిలువనిచ్చాడు. అన్నమయ్యకూడా బాహ్యాచారాల కారణంగా ఏర్పడే అనేక భావాలను ఖండించి, ఆచారాల కారణంగా ఏర్పడిన పిలువల సామంజస్యాన్ని ప్రశ్నించాడు. గుహలలో కేవించడం వల్ల ఋషిత్వం, అడవుల్లో కేవించడం వల్ల సర్వసంగపరిత్యాగం, మాటలాడ నందున మౌనవ్రతం, వస్త్రాలు ధరించనందున దిగంబరత్వం సమకూరవని వివరించాడు.[1]

''త్రికరణ శుద్ధిగ జేసిన పనులకు దేవుడు మెచ్చును లోకము మెచ్చును

వొకటి కోటి గుణితంబగు మార్గములుండగా బయాసపడనేలా ॥త్రికరణ॥

తనమనసే పరిపూర్ణమైన గోదావరి గంగా కావేరి

కనకబిందు యమునా గయాది క్షేత్రంబుల సంతతమున్

దినకర సోమగ్రహణ కాలముల తీర్థాచరణలు సేసిన ఫలములు

తను దానె సిద్ధించును పూరకె దవ్వులు దిరగగా మరియేలా ॥త్రికరణ॥''

(అధ్యాత్మ సంకీర్తనలు, Vol.VII- కీర్తన. 2)

మనస్సు పవిత్రంగా ఉంటే సకల తీర్థయాత్రల ఫలం చేకూరుతుందని, మనశ్శుద్ధి లేక చేసే పనులు వ్యర్థమని వివరిస్తాడు. బాహ్యాచారాలలోని లోపాలను వెలువరించిన అన్నమయ్య వైష్ణవమతాన్ని అనుసరించడానికి అనేక నియమాలను సరళీకరించాడు.

---

1. అధ్యాత్మ సంకీర్తనలు, Vol. II - కీర్తన 62.)

## వైష్ణవం - మతసరళీకరణ

సమాజంలోని వివిధ వర్గాలు మతాన్ని అనుసరించేట్లు ప్రోత్సహించడానికి మతజీవనాన్ని సరళతమం చేయడం ఒక అవసరం. సామాజికులు తమ జీవనం కొనసాగిస్తూ, సులభంగా పాటించగలిగిన నియమాలు ఏర్పర్చడం, పాండిత్య అవసరం లేకుండానే భగవదర్చనలో పాల్గొనే అవకాశం కల్పించడం మతాన్ని సరళీకరించడంలో భాగాలుగా పేర్కొనవచ్చు. వైష్ణవులు ఏర్పర్చిన నియమాలు ప్రజలు సులభంగా అనుసరించడానికి వీలు కలిగిస్తాయి.

వైష్ణవ సాంప్రదాయకులు పాటించవలసిన అయిదు నియమాలు
1. చక్రాంకితాలు - భుజస్కంధాలపై శంఖుచక్ర ముద్రాధారణం, 2. నుదుటిపై నామాలు ధరించడం, 3. విష్ణుదాసుడిగా పేరును మార్చుకోవడం, 4. అష్టాక్షరీ మంత్రాన్ని పఠించడం, 5. ప్రపత్తిమార్గం అనుసరించడం. వీటినే పంచసంస్కారాలు అంటారు. వీటిని అనుసరించడమే నిజమైన బ్రాహ్మణ్యమని అన్నమయ్య పేర్కొన్నాడు.[1]

వైష్ణవ మతాన్ని సరళీకరించడంలో అన్నమయ్య ప్రయత్నం ఉంది. ఆయన

---

1. ''హరిదాస్య పుండ్ర దేహాలదే బ్రాహ్మణ్యము
తిరుమంత్ర విధులదే తేకువ బ్రాహ్మణ్యము
.......
సతమై చక్రాంకితుల చరితమే బ్రాహ్మణ్యము
పతి శరణాగతియే బ్రాహ్మణ్యము'' (అధ్యాత్మ సంకీర్తనలు, Vol.VII కీర్తన 252)

వేంకటేశ్వరుడిని ప్రజలకు అత్యంత అనుకూలుడని, తమకు మేలు చేకూర్చేవాడని వర్ణిస్తాడు.

''ఉపకారి దేవుడు అపకారిగాడు ||ఉప||

దేహంబొసగెను దేవుడు తన దెలియగ శాస్త్రము గడియించె
దేహాంతరాత్ముడు మరి దేహ క్షేత్రజ్ఞుడా దాను
దేహి యేలోకంబున కేగిన దేవుడు దావెంటనే యేగును
దేహి కోరినట్లే కమ్మర దేవుడనుమతి యిచ్చుగాన ||ఉప||

(అధ్యాత్మ సంకీర్తనలు, Vol. VII, కీర్తన 150)

ప్రజలకు అత్యంత ఉపకారి అయిన భగవంతుడు వారి బాధలను తొలగించే నాయకుడని ప్రజల జీవితంలో ఒక భాగస్వామి అని వర్ణిస్తాడు.

''వాడవ్వెన శేషగిరి బోయనాయడు
పిడువ కిందరి గాను వెడబోయ నాయడు || వాడ ||
.......
వాలము రాచ్చి తిరిగే బోయనాయడు
వెలయ మోటున నుండే వేట బోయనాయడు ||వాడ||

(అధ్యాత్మ సంకీర్తనలు, (ed.) వేటూరి ప్రభాకరశాస్త్రి, కీర్తన 285)

సాంప్రదాయక పద్ధతిలోనైతే వేంకటేశ్వరుడిని సాధారణప్రజల ఏ అతీతుడిగా

వర్ణించాలి. కాని, వేంకటేశ్వరుడిని ఒక తెగకు చెందిన మూర్తిగా తమ శ్రమలో భాగమయ్యేవాడిగా వర్ణించాడు. వేంకటేశ్వరుడి నివాసమైన వైకుంఠం, అతడు నెలకొనిన తిరుమల దేవాలయం ప్రజలకు అతి చేరువైనవని వివరిస్తాడు.[1]

భగవంతుడిని ప్రార్థించడానికి వేదమంత్రాల అవసరం లేదని[2] అష్టాక్షరిని పఠించడం ద్వారానే ముక్తిని సాధించవచ్చని పేర్కొని వైష్ణవమతాన్ని అతిసులభంగా ప్రజలు అనుసరించడానికి మార్గం ఏర్పర్చాడు. వేంకటేశ్వరుడు వైష్ణవభక్తులకు అతిసులభంగా ప్రసన్నుడవుతాడని వివరించాడు.

---

1. ''నీవున్నచోటే వైకుంఠము నెరసులు మరిచోరరాదు
పావనమని చెప్పెడి వేదము పాలించంగ వలెను ।।నీవున్న।।
దేవుడా నా దేహమనేకు తిరుమలగిరి పట్టణము
భావింప హృదయ కమలమే బంగారపుమేడ ।।నీవున్న।। ''
(అధ్యాత్మ సంకీర్తనలు, Vol. II, కీర్తన 355.)

2. '' వేదమంత్ర మింకనేల వేరు వెల్లంకులు నేల
పుడమి ధరుడు మాకు భువనౌషధము ।।వేద।।
గోవిందాయని యంటే గూడును సంపదలు
యీవల మాధవ యంటే నిహము బరము జేరు
దేవనారాయణ యంటే దేహము సుఖియై యుండు
శ్రీ వేంకటేశుడే మాకు సిద్ధౌషధము ''
(అధ్యాత్మ సంకీర్తనలు, వి. శాస్త్రి (ed.) కీర్తన 286.)

'' సకల కర్మము చేత సాధ్యము గాని నీవు
వొక యించుకంత భక్తి, కొగిలోనైతి
ప్రకటించి బహువేద పఠనఁ జిక్కని నీవు
మొకరించి తిరుమంత్రమునకుఁ జిక్కితివి

కోటి దానముల చేత కోరి లోనుగాని నీవు
పాటించి శరణంటేనే పట్టిలోనైతి
మేటి వుగ్రతపముల మెచ్చికైకొనని నీవు
గాటపు దాసులైతేనే కైకొని మన్నించితి ''

అన్నమయ్య చెప్పిన మతాన్ని సంఘీకరించి వివిధ వర్ణాలకు చెందిన వ్యక్తులు తమ మతాన్ని అనుసరించడానికి ప్రోత్సహించాడు. ఆక్రమంలో కులం పట్ల ఉండే సాంప్రదాయక భావాలను ఖండించాడు. వర్ణవిధానం ద్వారా సంక్రమించే లక్షణాలను స్పష్టంగా ఖండించాడు.

'' కులమెంత గలిగెనది కూడించు గర్వంబు
ధనమెంత గలిగెనది దట్టమౌ లోభంబు
ఘనవిద్య గలిగినను కప్పుఁ జెప్పెమదము
సిరులెన్ని గలిగినను చింతలె పెరుగు ''

[ఆధ్యాత్మ సంకీర్తనలు, Vol. IX - కీర్తన 33.]

ధనం, విద్యలు మానవుడిలో అహాన్ని పెంచుతున్నాయని గుర్తించిన అన్నమయ్య వ్యక్తి ఔన్నత్యానికి కులం, విద్యలు గీటురాళ్ళు కావని విశదీకరిస్తాడు.

''యెక్కువ కులజుండైన హీనకులజుండైన
నిక్క మెరింగిన మహానిత్యుండె ఘనుండు ॥యెక్కువ॥

వేదములు చదివియును విముఖుండై హరిభక్తి,
యాదరించని సోమయాజి కంటె
యేదియును లేని కులహీనుండైనను విష్ణు
పాదములుసేవించు భక్తుండె ఘనుడు ॥యెక్కువ॥''

[అధ్యాత్మ సంకీర్తనలు, Vol. II, కీర్తన 303.]

వేంకటేశ్వరుడిని భజించడానికి బ్రాహ్మణుడు కానవసరం లేదని,

''తలమేల కులమేల తపమే కారణము
యిలపై హరిదాసులు యేజాతి యైననేమి? ॥తల॥

చిడిపిరాళ్ళం బుట్టవా పిలుసైన వజ్రములు
పుడమిసింగల వల్మం బుట్టదా తేనె
వెడగుట్టిల్లీ మేనను వెళ్ళదాయెనా జవాది
పుడివాని పుణ్యులెందు నుదయించిరేమి? ॥తల॥ ''

[అధ్యాత్మ సంకీర్తనలు, Vol. II, కీర్తన 293.]

అత్యంత విలువైన వజ్రాలకు, మధురమైన తేనెకు, సువాసనాభరితమైన జవ్వాదికి జన్మనిచ్చే వస్తువులు ఏవి? వజ్రాలకు చిడిపిరాళ్ళు, తేనెకు తేనెటీగల గూడు, జవ్వాదికి వెడగు పిల్లి కావా? హరిదాసులు ఏకులంలో జన్మించిన వారైనా వారి గొప్పతనానికి లోపమేమిటని ప్రశ్నిస్తాడు. కులాన్ని అప్రధానంగా తలచిన అన్నమయ్య బ్రాహ్మణత్వానికి నూతనార్థం ఇస్తూ, హరిభక్తులందే నిజమైన బ్రాహ్మణత్వమంటాడు.

''కొంచెమును ఘనముం గనుగొనేల హరిందలంచు
పంచమహాపాతకుండె బ్రాహ్మణోత్తముండు
పరమ మగు వేదాంత పఠన దొరికియు
సదా హరిందలంచలేని సన్యాసికంటె
మరిగి పసరముఁ దినెడి మాలయైనను వాడె
పరమాత్మఁ గొలిచినను బ్రాహ్మణోత్తముండు ||కొంచెమును||''

(అధ్యాత్మ సంకీర్తనలు, Vol. II, కీర్తన 314.)

వేదాలను నిరంతరం పఠిస్తూ, భక్తసులభుడైన వెంకటేశ్వరుడిని కీర్తించని బ్రాహ్మణ పండితుని కంటె ప్రపత్తిని అనుసరించే అంత్యజుడు నిజమైన బ్రాహ్మణత్వం పొందిన వాడని వివరిస్తూ, మతజీవనాన్ని సరళతరం చేశాడు.

## సామాజికోద్యమంగా వీరశైవం

కన్నడదేశంలో వీరశైవం బలమైన సామాజిక ఉద్యమమైనప్పటికీ ఆంధ్రదేశంలో ముఖ్యమైన మతంగా రూపొందలేక పోయిందని పరిశోధకులు అంగీకరించే అంశమే. అందుకు గల కారణాలను పరిశీలిస్తూ, ఆంధ్రదేశంలో వీరశైవ మతభావాలను ప్రచారం చేసిన పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథుల కృషిని పరిశోధకులు ఇలా విశ్లేషించారు. ''బసవేశ్వరుడు కర్ణాట దేశీయుడు గావున నాతని యుద్బోధనము లాతని మాతృభాషయగు కన్నడమునందే వ్యాప్తమగుటం జేసి యాతనిచేనుద్ధరింపబడిన వీరశైవమతము కర్ణాట దేశమునందువలె నాంధ్రదేశమున వ్యాపించునవకాశమంతగా లభింపదయ్యెను. మల్లికార్జున పండితారాధ్యుని పరిశ్రమమువలన కొంతవరకీయది యాంధ్రదేశమున నెలకొనసాగెను. మల్లికార్జున పండితుడు మతపాండిత్యము విశేషముగా గలిగిన యుద్దండ పండితుడయ్యు బసవేశ్వరునివలె ... జనసామాన్యమును గ్రివసమొనర్చుకుని వారిలో వీరశైవ మతమును విస్తరింపజేయుట యందాతడెక్కుడుగ కృతకృత్యుడు కాజాలడయ్యెన''[1] ని పండితారాధ్యుని గురించి భావించగా, పాల్కురికి సోమనాథుని రచనల స్వరూపాన్ని వివరీకరిస్తూ, ''సోమనాథుడు శైవమతాన్ని సర్వసామాన్యం చేయడంగాని, సామాన్య జనులలో వ్యాపింప జేయడానికిగాని తన రచనలను ఉద్దేశించడంగాని జరగలేదని''[2] వ్రాశారు.

కన్నడదేశంలో వీరశైవమతం ప్రబోధించిన సామాజిక అంశాలను ఆంధ్రదేశంలోని

---

1. బండారు తమ్మయ్య : పాల్కురికి సోమనాథ కవి, పే. 143-144.

2. కోరాడ రామకృష్ణయ్య : ''పాల్కురికి సోమనాథుని భాష'', పరిశోధన - 1956.

వీరశైవ కవులైన పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథుడు అనుసరించారు. బ్రాహ్మణాధిపత్య నిరసన, జంగములను కులాతీతులుగా పరిగణించడం, స్త్రీలనుగూర్చి సాంప్రదాయక భిన్నభావాలు వెలువరించడం వీరి రచనల్లో కన్పిస్తాయి. అయితే తాత్త్విక అంశాల చర్చ, ఆచారాల ప్రాధాన్యం కన్నడ వీరశైవుల్లో లేని అంశాలు. వీరి రచనాలక్ష్యం, భక్తిని దర్శించిన పద్ధతి కన్నడ వీరశైవులకు భిన్నమైన అంశాలే. అంతే గాక కన్నడ వీరశైవులు సామాజిక రంగంలో నిర్వహించిన కృషికి, ఆంధ్రదేశంలోని సామాజిక ఆచరణకు స్పష్టమైన అంతరం ఉంది

తెలుగు, కన్నడ వీరశైవుల సామ్య, భేదాలు క్రమానుగతంగా పరిశీలించడం జరుగుతుంది.

## ఆంధ్రదేశ వీరశైవులు - మత ప్రామాణీకరణ

ఆంధ్రదేశంలో వీరశైవాన్ని అనుసరించిన పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథుడు వీరశైవ మత భావాలకు వేదోపనిషత్తుల ప్రమాణముందని నిరూపించడానికి ప్రయత్నించారని పరిశోధకులు గుర్తించిన అంశమే. భక్తి, ప్రధానమగు వీరశైవాన్ని వైదికకర్మానుసారంగా పండితారాధ్యుడు సంస్కరించినట్లు నిడుదవోలు వెంకటరావు భావించడంలోనూ[1], పాల్కురికి సోమనాథుడు వీరశైవమతాన్ని స్థాపించడానికి వేదాలనే ప్రధానప్రమాణాలుగా అంగీకరించాడని చిలుకూరి నారాయణరావు వివరించడంలోనూ[2]

---

1. నిడుదవోలు వెంకటరావు : ''వీరశైవాంధ్ర వాఙ్మయము'' - సారస్వత వ్యాసములు ప్రథమ సంపుటం, పే. 114.
2. చిలుకూరి నారాయణరావు : పండితారాధ్య చరిత్ర (ఉపోద్ఘాతం) పే. 177.

ఆంధ్రదేశంలో వీరశైవ మతం పొందిన మార్పును గుర్తించారని విదితమవుతుంది. కన్నడ వీరశైవ మతాన్ని ప్రామాణీకరించే ప్రయత్నంలో వేదోపనిషత్ వాక్యాలను విస్తారంగా ఉదహరించడం ద్వారా ఆ మతభావాలు ప్రజలకు చేరువయ్యే స్థితికి పరిమితులేర్పరచారు. ఇది ఆంధ్రదేశంలో వీరశైవ మత భావాలు ప్రాచుర్యం పొందడానికి ప్రధానమైన అవరోధంగా మారింది.

కన్నడదేశంలో వీరశైవ మతాన్ని ప్రచారం చేసిన బసవన వేదోపనిషత్తుల పట్ల తన అయిష్టతను వ్యక్తపరుస్తాడు.

''గడగడ వణికె వేదము : జారుకొనుచుండె శాస్త్రము
తర్కింపలేక తర్కము మూగయ్యె పోయె
దరిచేరి దూరమగుచుండె ఆగమము''

(బసవేశ్వర వచనాలు, వచనం 748.)

''శాస్త్రము ఘనమందునా? కర్మను భజించు
వేదము ఘనమందునా? ప్రాణవధ పోషించు
స్మృతి ఘనమందునా? ''       (వచనం 208.)

బసవనకు వేదోపనిషత్తులతో విశేష పరిచయంగాని, తనవాదాన్ని సమర్థించుకోవడానికి వాటిని ఉదహరించాలనే అభిప్రాయంగాని లేదు. బసవ వీరశైవ మతానికి అతి ముఖ్యమైనప్పటికీ తాత్త్వికాంశాలలో అతని యోగదానం (Contribution) ఏమీలేదని సురేంద్రనాథ్ దాస్‌గుప్త అభిప్రాయ పడ్డారు.[1]

---

1. S.N. Dasgupta : A History of Indian Philosophy, Vol. V, PP. 45-6.

వీరశైవ మతాన్ని వ్యాప్తికి తెచ్చిన బసవన ఆ మతానికి వేదోపనిషత్తులలో ప్రమాణాన్ని తీసుకురావాలని భావించలేదు. అయితే ఆంధ్రదేశంలో వీరశైవాన్ని ప్రచారం చేసిన పండితారాధ్యుడు నిర్వహించిన ప్రయత్నమంతా ఆ మతానికి ప్రామాణికత్వం కల్పించడమేనని అతని జీవిత చరిత్రను పరిశీలిస్తే తెలుస్తుంది. అంతేగాక కన్నడదేశంలో వీరశైవం జైన, వైదిక మతాలను వ్యతిరేకించడానికి ఆర్థిక, సామాజిక కారణాలున్నట్లు నిరూపితమైంది. కాని, పండితారాధ్యుడు వివిధ మతాలను వ్యతిరేకించడానికి ఆర్థిక, సామాజిక కారణాలను ప్రస్తావించలేదు. పలుమతానుయాయులను గూర్చి

'' ఒక వైష్ణవుడొక మాహం
సకుడొక బౌద్ధుండు నొక్క జైనుడు త్రిపురాం
తకు భక్తునట్లు విజనా
క్షిక దృష్టాంత ప్రసిద్ధి - గీర్వనః గవిరే

(శివతత్త్వసారం, పద్యం-242)

అని ప్రశ్నిస్తాడు. ఏ మతీయుడైనా శివభక్తునిలా దైవస్వరూపం గ్రహించలేడని వివరిస్తాడు. జైన, బౌద్ధ, వైదిక మతీయుల చర్యలను సామాజికరంగంలో వారు నిర్వహించే కార్యాలపై తన అభిప్రాయాలను తెలుపకపోయినా బసవపురాణం, పండితారాధ్య చరిత్ర కావ్యాలు పరిశీలిస్తే బసవన, పండితారాధ్యుల జీవితాలలోని భిన్నత్వం విశదమవుతుంది. బసవపురాణం లోని భక్తుల ఇతివృత్తాలకు తాత్త్వికాంశాలతో సంబంధం లేదు. వివిధ భక్తులు సామాజిక రంగంలో నిర్వహించిన కృషి స్పష్టంగా వ్యక్తమైంది కాని

పండితారాధ్య చరిత్రలో వేద, కర్మ, వేదాంత, సాంఖ్య, యోగ, చార్వాక, బౌద్ధ, జైన వాదాలను పూర్వపక్షంచేసి వీరశైవమతాన్ని స్థాపించినట్లు వర్ణితమైంది. పండితారాధ్యుడి శివతత్త్వసారంలో తాత్త్వికాంశాలను గూర్చిన సుదీర్ఘమైన చర్చలేకపోయినప్పటికీ పండితుడే ఈ పనిని నిర్వహించినట్లు పాల్కురికి సోమనాథుడు వర్ణించాడు. పండితారాధ్యుడి మార్గాన్ని అనుసరించిన పాల్కురికి సోమనాథుడు వేదోపనిషత్తులు, ఆగమశాస్త్రాల సహాయంతో వీరశైవమతాన్ని ప్రామాణీకరించి పండితులచే ఆమోదింపచేయడానికి కృషి చేశాడు. సోమ నాథుడు తనకావ్యాల్లో అత్యంత పాండిత్యాన్ని ప్రదర్శించాడుగనక ''చతుర్వేద పారగుడనైన మత్కృతి వినవర్తుడవలయు'' (పండితారాధ్యచరిత్ర, పే. 4) అని చెప్పుకున్నాడు. వేటూరి ప్రభాకరశాస్త్రి భావించినట్లు "మంచి శిష్టాచార సంపన్నగల బ్రాహ్మణునకే యెఱుక పడదగిన విషయములెన్నో పలు గ్రంథములందు (పండితారాధ్య చరిత్ర, చతుర్వేదసారం, సోమనాథ భాష్యం మొ||వి.) గలవు. వానిలో వేదమంత్రములుదాహృతములైనవి. వేదభాష్యములుద్ధృతములైనవి. శైశవదేవాది శ్రౌతకర్మల రహస్యములెన్నో విమర్శింప బడినవి.''[1]

పండితారాధ్య చరిత్రలోని వాదప్రకరణం (పే. 116 - 162) లో వీరశైవమతాన్ని స్థాపించడానికి సోమనాథుడు అనేక తాత్త్విక సిద్ధాంతాలను పూర్వ పక్షం చేశాడు. అలాగే భక్తుల వైవిధ్యపూరిత లక్షణాలన్నింటిని ఉత్తమ అంశాలుగా ప్రతిపాదించాడు. బసవపురాణంలో మడివాలు మాచయ్య అనేభక్తుడి విషయంలో హింసాప్రవృత్తిని సమర్థిస్తూ ''భక్తుదూరకుండుని చంపకేరుటోయినను'' (పే.138)

---

1. వేటూరి ప్రభాకరశాస్త్రి : ''బసవపురాణం (పీఠిక)'', వేటూరివారి పీఠికలు, పే. 142

అని పేర్కొంటే 'పండితారాధ్య చరిత్ర' లో దసరయ్య అనే అహింసాపరుణ్ని పేర్కొనాల్సి వచ్చినపుడు ''అహింసాపరమోధర్మ'' [పే.74] మని శివశాస్త్రాలు చెబుతున్నాయంటాడు. గురుభక్తుండారి అనే భక్తుడు ఒక వేశ్యతో గడిపే సుఖాన్ని ''యత్సుఖం తత్సమర్పితమ్ము'' [పే. 79] ని శివునకు తనసుఖాన్ని సమర్పించినట్లయితే దుర్గతుడు కాజాలడని 'సూతసంహిత' తెలుపుతుందంటాడు. అంత్యజుడైన భక్తుడు ఉన్నతుడని తెలుపడానికి ఆగమ, ఆర్ష, శివశాస్త్రాల ప్రమాణాన్ని తీసుకువచ్చాడు.

''సురుచిరంబుగ గతం శూద్రునన్న శూద్రత్వ
మనుమ రహస్యంబులందుమోయ
చతురతంబుగను సచండాలవంశజో
యనుమ నాగమములు నెట్టిమోయ
చోద్యంబుగా నంత్యజోపాధమోపి వా
యని శివశాస్త్రంబులందు మోయ
రూపితంబుగ శ్వపచో ౽ పి మునిశ్రేష్ఠ
యని యారుషేయంబులందు మోయ
గాన భక్తుడగ్రగణ్యుడంత్యజుడైన
శ్రుతులునమ్మరేని జాడుడనుమ
దొసి నాగమయ్యఁ దనువున నమ్మితంబు
బిరగ వెడలెలేదె బసవలింగ'' [చతుర్వేదసారం, పద్యం. 70]

సోమనాథుడు వీరశైవ మతంలోని బ్రాహ్మణేతర భావాలను ప్రామాణీకరించి బ్రాహ్మణ

పండితులచే ఆమోదింప చేయడానికి ప్రయత్నించాడు. అదే బ్రాహ్మణులను ''వేదాలను మోయు గాడ్దెలారా'' అని దూషించాడు. సకల వేదశాస్త్ర పారీణులైన కోటిమంది విప్రులు ఒక్క భక్తునికి సరిరారని వేదశాస్త్రాలే చెబుతున్నాయంటాడు. (బసవపురాణం - కల్కి దేవయ్యగారి కథ). వర్ణవిధానం పట్ల విముఖత్వాన్ని ప్రదర్శిస్తూనే వివిధ వర్ణాలవారు దాల్చే విభూది ఆకారంలో తేడాలున్నాయని బ్రాహ్మణులు త్రిపుండ్రాకారంలో క్షత్రియ, వైశ్యులు వర్తులాకారంలో, శూద్రులు అర్ధచంద్రాకారంలో, ఇతర జాతులు ఊర్ధ్వ పుండ్రాకారంలో విభూది దాలుస్తున్నట్లు వర్ణించాడు. (పండితారాధ్య చరిత్ర, పే.9)

కన్నడదేశంలో ప్రచారమైన వీరశైవమతానికి ప్రామాణికత్వం కల్పించడం కోసమే పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథుడు ప్రయత్నించడం వల్ల, బసవనాదులు ప్రచారం చేసిన మత స్వరూపానికి వీరు నిరూపించిన కృషికి మధ్య స్పష్టమైన అంతరం ఏర్పడింది. వీరు మతభావాలను నియమబద్ధం మొనరించడంవల్ల, సాధారణ అనుసరణ దుస్సహమై ఆచారాలకు మాత్రమే పరిమితమైన మతంగా మారడానికి అవకాశం ఏర్పడింది.

## కులం - వీరశైవమతావగాహన

కన్నడదేశంలో వివిధ వర్గాలమధ్య కొనసాగుతున్న సంఘర్షణలో నాటి జైన మతీయులైన వ్యాపారవర్గాన్ని, బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ, వీరశైవులు కుల రహిత భావాలను ప్రచారం చేశారు. కులవిధానంపై బసవన స్పష్టమైన అభిప్రాయాన్ని వెలువరించాడు.

''కాచి కుమ్మరి యయ్యె - ఉతికి చాకలి యయ్యె
చెపినుండి యూడిపడినవారు - కులరేఖా మిప్పు?''

(బసవేశ్వర వచనాలు, వ. 149)

ప్రజలు అనుసరించే వృత్తుల కారణంగా కుల విధానం ఏర్పడిందని, అయితే బ్రాహ్మణుల ఆధిపత్యం వల్ల పలువురు నష్టపోయినట్లు, ఒక వచనంలో,

''బ్రాహ్మణుని దేవుడని నమ్మి కారణమున
గౌతమ మునికి గోహత్య కలిగె
బ్రాహ్మణుని దేవుడని నమ్మిన కారణమున
బలికి బంధనము ప్రాప్తించె
బ్రాహ్మణుని దేవుడని నమ్మిన కారణమున
కర్ణునికి కవచము పోయె
బ్రాహ్మణుని దేవుడని నమ్మిన కారణమున
దక్షునకు మేకతల వచ్చె ..

(వచనం. 570)

అంటూ బ్రాహ్మణులపై తీవ్ర వ్యతిరేకతను వ్యక్తీకరిస్తాడు. బ్రాహ్మణాధిపత్యంలోని కులవిధానానికి ప్రత్యామ్నాయంగా వీరశైవులు కులరహిత జంగమ వ్యవస్థను రూపొందించారు. వివిధ వర్ణాలమధ్యగల అంతరాలను పరిహరిస్తూ, బసవన,

''విప్రుని మొదలంత్యజుని దాక
శివభక్తులగు వారినెల్ల ఒకటేయంటి
పాఱుని మొదలు శ్వపచుని వఱకు
భవియగు వానిని ఒకటే యంటి నా మనసొట్టని నమ్మనయ్య
నే బల్కు యీ పల్కులందు
నూగు మొనయంత సందేహముండెనా
పలుదోప ముక్కు కోయుదు, సంగమదేవా !

(బసవేశ్వర వచనాలు, వచనం 709)

కుల విధానాన్ని నిరాకరిస్తూ, బసవన తెలిపిన భావాలను ఆంధ్రదేశంలో వీరశైవాన్ని అనుసరించిన పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథుడు వ్యక్తీకరించారు. భక్తి విషయంలో కుల చర్చకు అవకాశం లేదని భావిస్తూ, పండితారాధ్యుడు,

''ఒండేమి భక్తి సంగతిఁ
బండాలుండైన భూతి - శాసనధరుడై
యుండినఁ బాఱుఁడె యతనిన్
ఒండనగా జనదు భక్తి యోగమున శివా !''

(శివతత్త్వసారం, పద్యం 119)

అంటూ భక్తుడిని కులాతీతుడిగా పరిగణించాడు. బసవన, పండితారాధ్యుడు భావించినట్లే సోమనాథుడు గూడా వీరశైవ భక్తుల కుల చర్చను వ్యతిరేకిస్తాడు.

''ఈ కులమాకుల మనక ని
రాకులమతి వారికొరతలరయక భక్తా,
నేకము శివుడని గొలిచినఁ
జేకొనడే వాంఛితార్థసిద్ధి మహాత్మా !''

(అనుభవసారం, పద్యం 180)

శివభక్తులైన జంగములను కులాతీతులుగా వర్ణిస్తాడు.

బసవన బ్రాహ్మణులను దైవంగా గుర్తించడం వల్ల, గౌతమముని, బలి, కర్ణుడు బాధలు పడ్డారని వర్ణించినట్లు పాల్కురికి సోమనాథుడు అదే అభిప్రాయాన్ని వ్యక్తీకరించాడు.

''మహినెల్ల యెరుగ బ్రాహ్మణుల నారాధించి
పరశురాముండు దాశరథి జొచ్చె
ధరయెల్ల నెరుగంగ ధరణీసుల కిడి
గౌతము గోహత్య కట్టుబడియె
నేలెలంబు నెరుగంగ నగ్రజన్మునకు దా
నము జేసి బలి బంధనమున బడియె
త్రిజగంబులెరుగంగ ద్విజుల కోరికనిచ్చి
జలజాప్త సుతుడు శిత్రాలున బడియె
విప్రుతండ్రి జంపి వెయ్యేల చంద్రుండు
ధాత్రి శివప్రసాద పాత్రుడయ్యె
మేలెగాక మన్నిమిత్యం కృతంబను
బలుకు దప్పునయ్య బసవలింగ (చతుర్వేదసారం, పద్యం 176)

బ్రాహ్మణుల కారణంగా పలువురు నష్టపోయినందువల్ల, వారిని విశ్వసించగూడదని, వారు శైవభక్తుల ఇంటికుక్కలతో పోల్చడానికిగూడా అనర్హులని సోమనాథుడు ఆక్షేపించాడు.

బ్రాహ్మణుల ఆధిపత్యంలోని వర్ణవిధానాన్ని బసవనలాగే పండితారాధ్యుడు, సోమనాథుడు వ్యతిరేకించినప్పటికీ ఆంధ్రదేశంలోని వీరశైవాన్ని బ్రాహ్మణ్యానికనుకూలంగా ప్రచారం చేశారని పండితలోకంలో అభిప్రాయం ఉంది. పండితారాధ్యుడు బసవనుద్దేశించి 'భవునిమీద వలపు బ్రాహ్మణంబుతో పొత్తుఁ బాయలేను నేను బసవలింగ !' అంటూ బసవన భావాలకు భిన్నంగా తెలుగుప్రాంతంలో ఆరాధ్యశాఖకు అంకురార్పణ చేశాడని వేటూరి ప్రభాకరశాస్త్రి తెలిపాడు.[1] పండితారాధ్యుడి వల్ల ఆంధ్రదేశంలోని వీరశైవులలో, బ్రాహ్మణులు, బ్రాహ్మణేతరులు అనుసరించే శాఖలు ఏర్పడ్డాయని ఇతర పరిశోధకులు కూడా అంగీకరించారు.[2] అయితే పండితారాధ్యుడు బ్రాహ్మణులపట్ల ప్రత్యేకమైన అభిమానాన్ని ప్రకటించలేదని శైవభక్తిని స్వీకరించిన బ్రాహ్మణులను, ఇతర కులాలకు చెందిన భక్తులను సమానంగా పరిగణించినట్లు వెల్చేరు నారాయణరావు భావించాడు.[3] ప్రభాకరశాస్త్రి పేర్కొన్న పద్యపాదం పండితారాధ్యుడి 'శివతత్త్వసారం' లో లేకపోవడం వల్ల, వారి అభిప్రాయాన్ని పూర్వపక్షం చేయడం సులభమే. కాని, పండితుడి రచనల్లోనే బ్రాహ్మణులైన భక్తులను అధికంగా గౌరవించినట్లు ఆధారాలున్నాయి. శైవభక్తిని అనుసరించే వివిధ కులాల వ్యక్తుల మధ్య భేదాలు లేవంటూ ,

---

1. వేటూరి ప్రభాకరశాస్త్రి : ''బసవపురాణం (పీఠిక)'', వేటూరివారి పీఠికలు , పు- 218 .
2. (a) నిడుదవోలు వెంకటరావు : ''వీరశైవ వాఙ్మయము'', సారస్వత వ్యాసములు (ప్ర. సంపుటం, పే. 114)
   (b) K.A. Nilakanta Sastry : A History of South India, P. 436.
3. V. Narayana Rao : Siva's Warriors, PP. 15-16 .

''కులజ కులహీనులిద్దరు
నెలకొని భవదమల భక్తి - నిష్ఠామతిన్
తెలిసిన మీద సమానుల
కులజులుఁ గులహీనులనగ గూడదు వారిన్'' (శి.సారం, పద్యం 134)

శివభక్తులను సమానులుగా పరిగణించినప్పటికీ బ్రాహ్మణులే శివభక్తిని స్వీకరించడం అత్యుత్తమమైన అంశంగా వివరిస్తాడు.

''కుల విద్యాచారాదులు
గలవాడే శివునిభక్తి - గలవాడైనన్
వెలగలదె పసిడి గమ్మగ
వలచిన విధమున సమస్త వరదా శివా !'' (శి.సారం, పద్యం 133)

భక్తులు ఉన్నత కులానికి చెందినవారు కానప్పటికీ వారిని హీనంగా పరిగణించగూడదని తెలియ తూనే బ్రాహ్మణులు వీరశైవంలో చేరడంవల్ల మరింత పవిత్రత చేకూరుతుందని పండితారాధ్యుడు వివరించాడు. తద్వారా భక్తులమధ్య ఒక అంతరాన్ని ఏర్పరచాడు.

## వీరశైవమతం - బ్రాహ్మణ సంప్రదాయాలు

భారతీయ సమాజంలో బ్రాహ్మణ సంప్రదాయానికి వ్యతిరేకంగా కొనసాగిన అనేక ఉద్యమాలు కాలక్రమంలో బ్రాహ్మణ సంప్రదాయాలను అనుసరించాయి. లేదా, బ్రాహ్మణ సంప్రదాయంలో సంలీనమయ్యాయి. వర్ణవిధానాన్ని బలంగా వ్యతిరేకించిన

వీరశైవం ఆ విధానానికి ప్రత్యామ్నాయం ఏర్పరిచే క్రమంలో వర్ణసమాజాన్ని పోలిన ఆంతరిక విధానాన్ని రూపొందించింది. వర్ణవిధానంలో ఆయా వ్యక్తులు అనుసరించే వృత్తిని బట్టి ఉచ్చ, నీచ గౌరవ భావాలున్నట్లే, వీరశైవులు గూడా తమ ఆచారాలను అనుసరించే వ్యక్తులు ఉత్తమ కులజులని, మిగతావారంతా అధములని ప్రచారం చేశారు. ఈ అంశాన్ని ' బసవపురాణం ' లోని కల్కి దేవయ్యగారి కథలో చూడవచ్చు.

' కల్కి దేవయ్య ' అనే శివభక్తుడి సేవకురాలు నీళ్ళుతెచ్చే సమయంలో బ్రాహ్మణుడి చేయి తగులుతుంది. ఆమె అపవిత్రురాలైనట్లు భావించి చేతిలోని భాండాన్ని అక్కడేపడేసి వేరొక కుండలో నీళ్ళు తెచ్చుకున్నందులకు బ్రాహ్మణులకు మనస్తాపం, తీవ్రకోపం కలిగి కల్కి దేవయ్య వద్దకు వచ్చి,

''వినుము శూద్రులు ముట్టినను బ్రాహ్మణులకు
మును సచేల స్నానములు చేయవలయు
నని చెప్పగాక యీ యధమవంశజుల
కును ద్విజులను ముట్టఁ జనదని కలదె
యనేటి యధర్మ మెప్పురాణోక్తి
యనాది భక్తి సహింపదగునె''

(బసవపురాణం, (సం.) బండారు తమ్మయ్య, పే. 498)

అని ప్రశ్నిస్తారు. అందుకు కల్కిదేవయ్య సమాధానమిస్తూ, పవిత్రులైన శివభక్తులను బ్రాహ్మణులు ముట్టుకోవడం అపచారమని, కోటిమంది విప్రులు గూడా ఒక్క శివభక్తుడికి సరిరారని తెలుపుతాడు. బ్రాహ్మణులు నిర్వహించే పనులను శివభక్తుల ఇంటికుక్కలు

నిర్వహించగలవని పేర్కొంటూ తన యింటికుక్క చేత వేదాలను పారాయణం చేయిస్తాడు. అందుచేత శివభక్తులను బ్రాహ్మణులు ముట్టుకోగూడదని నియమం పెడతాడు.

కల్లిదేవయ్యతో బ్రాహ్మణులు చెప్పుకున్నట్లు, ఇతర కులాలకు భిన్నంగా పవిత్రతను కాపాడుకోవడానికి పరులను ముట్టుకోవడం అపచారంగా బ్రాహ్మణులు భావిస్తారు. అయితే నూతన మతాన్ని స్థాపించిన వీరశైవులుగూడా శైవేతరులకంటే ప్రత్యేకతను నిల్పుకోవడానికి బ్రాహ్మణుల పద్ధతులనే అనుసరించారు. ఇటువంటి లక్షణమే పాల్కురికి సోమనాథుడు కలిగియున్నాడు. ఆయన భవులను అంటరాదని, భవులు చూసిన ఆహారాన్ని విసర్జించాలని నియమం ఏర్పర్చుకున్నాడు. పిడుపర్తి సోమనాథుడు రచించిన 'బసవపురాణం' ప్రకారం సోమనాథుడు భవులను చూడడు ; వారితో వివాదంలో పాల్గొనడు. వీరశైవులు వర్ణ విధానంలోని ఉచ్చ, నీచ భేదాలను వ్యతిరేకించినా, సోమనాథుడు పరమతీయులను స్పృశించనని, దర్శించనని ఏర్పర్చుకున్న నియమం బ్రాహ్మణులు అంత్యజుల యెడల అనుసరించే నియమం వంటిదే. ఈ అభిప్రాయం సంపూర్ణంగా బ్రాహ్మణ ధర్మాలను వీరశైవంలో ప్రవేశపెట్టడమే. వీరశైవులు జంగములను బ్రాహ్మణులకు ప్రత్యామ్నాయంగా ప్రచారం చేశారు.

వర్ణవ్యవస్థలో ఉత్పత్తితో సంబంధంలేని బ్రాహ్మణులకు అత్యున్నతస్థానం ఆపాదితమైంది. బ్రాహ్మణులకు ఉన్నతస్థాయి కొనసాగడానికి మత కర్మకాండలోని అతీత శక్తుల పట్ల గౌరవం, భయం కారణాలు. వీరశైవులుగూడా జంగములపట్ల ఇటువంటి గౌరవభావాన్నే కలిగిఉన్నారు. జంగములు నిర్వహించేది మతకర్మకాండలే. జంగములను ప్రత్యక్ష దైవంగా తలచాలని బసవన ఎన్నోమార్లు ప్రబోధించాడు. దేవాలయంలోని శివుడికి, జంగముడికి తేడా లేదని తెలిపాడు. ఇది బ్రాహ్మణులకు సమాంతరంగా నూతన బ్రాహ్మణ

ధర్మాన్ని ప్రచారం చేయడమే. అయితే జంగములు ఒక్క కులానికి సంబంధించినవారు గాక పలు వృత్తులనుండి వచ్చినవారున్నారు. అందువల్ల, వీరి పూర్వకులాన్ని చర్చింపగూడదని వీరశైవులు తెలుసుకోవలసి వచ్చింది. జంగములు వివిధ వృత్తుల వారినుండి వచ్చినప్పటికీ మౌలికంగా బ్రాహ్మణులు నిర్వహించే పనులనే నిర్వహించారు. జంగములకుండినంత గౌరవం తమ వృత్తులు నిర్వహించుకుంటూ ఉత్పత్తిలో భాగమయ్యేవారికి లేదు. ఫలితంగా బ్రాహ్మణ ధర్మానికి సమాంతరంగా మరొక అంతర వ్యవస్థను రూపొందించినట్లయింది.

వీరశైవులు కులవిధానానికి వ్యతిరేకంగా ఉద్యమించినప్పటికీ వ్యాపారులు, వృత్తి కారులు నూతన వృత్తులు చేపట్టడానికి అవకాశం లేకపోయింది. అంతేగాక బ్రాహ్మణులాంటి జంగములను రూపొందించారు. చివరకు పాల్కురికి సోమనాథుడు పేర్కొన్నట్లు, పండితారాధ్య చరిత్రలో ఒక్కొక్క కులం ఒక్కొక్క ఆకారంలో విభూది దాల్చే స్థితికి వీరశైవం చేరుకుంది.

బసవన తనవచనాల్లో, శివమతీయులంతా ఒక కుల సంజాతులని చెప్పినప్పటికీ కాలక్రమంలో జంగములు, వ్యాపారులు ఉన్నతస్థానాన్ని, పంచమశాలీలు, వృత్తికారులు ద్వితీయస్థానాన్ని, పంచములు తృతీయస్థానాన్ని పొందారు. వీరిలో జంగములు, వ్యాపారులు వీరశైవంలోని ఆచారాలను సంపూర్ణంగా పాటించగా వృత్తికారులు అష్టావరణాలు అనుసరించే వారు. పంచములు కేవలం శివనామంతో వీరశైవాన్ని అనుసరించేవారు.[1] ఇట్లా వీరశైవులు అనుసరించిన కులవిధానాన్నిగూర్చి మాక్స్ వెబర్, "The upper caste called itself Vira-Saiva Brahmana. The priests and traders (out of the Baniya caste) constituted the first stratum, hand workers and oil pressers followed, finally

---

1. See, R.N. Nandi: "Origin of Vira-Saiva Movement " P. 33.

the impure caste. Inter-marriage between the castes no longer occured rather the lower castes had become endogamous".[1] తొలిదశలో కులవిధానాన్ని వ్యతిరేకించిన వీరశైవంలో క్రమంగా అంతరాలు ఏర్పడ్డాయి.

## బసవ - పండితారాధ్య, పాల్కురికి సోమనాథుల వ్యక్తిత్వం

ఆంధ్రదేశంలో వీరశైవాన్ని ప్రచారం చేయడంలో పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథుడికి, కన్నడ వీరశైవులకు మధ్య అనేక అంశాలలో భిన్నత్వం ఉన్నట్టే వ్యక్తిత్వంలోనూ వీరికి బసవనకు తారతమ్యాలు కనిపిస్తాయి. బసవనకున్న రాజకీయాధిపత్యం ఎక్కువ మందిని ఆకర్షించడానికి ఉపయోగపడింది. బసవపురాణం తృతీయాశ్వాసంలోని ఒక ఇతివృత్తంలో బసవన రాజ్యకోశాగారాన్ని జంగములకు వినియోగిస్తున్నాడనే అపవాదురాగా బిజ్జలుడు బసవనను పరీక్షించినట్టు, తాను జంగములకి ధనాన్ని వినియోగించలేదని బసవన నిరూపించుకున్నట్టు వర్ణితమైంది. బసవన స్వయంగా కోశాగారం నుండి జంగములకు ఆర్థిక సహాయం చేయకపోయినప్పటికీ ఆయనకుగల రాజకీయాధికారం సామాజికులు జంగములకు దానం చేయడానికి ప్రోత్సహించే అవకాశం ఉంది.

ఆంధ్రదేశంలో వీరశైవాన్ని అనుసరించిన ఇరువురిలో పండితారాధ్యుడు సామాజిక రంగంలో నిర్వహించిన కార్యక్రమాల ప్రస్తావన శివతత్త్వసారంలో లేకపోవడమేగాక ఈతని

---

1. Max Weber : Religion of India, P. 383

జీవితచరిత్ర అయిన పండితారాధ్యచరిత్రలో గూడా ప్రత్యక్ష కార్యాచరణకు సంబంధించిన వివరాలు లేవు. పండితారాధ్యుడి జీవితంలో అతిముఖ్యమైన ఘట్టం బౌద్ధులతో వివిధ తాత్త్వికాంశాలపై వాదించి శివమాహాత్మ్యాన్ని నిరూపించడమేనని పండితారాధ్యచరిత్ర తెలుపుతుంది.

పండితారాధ్యుడు బసవన భావాలకు ఆకర్షితుడై, శివభక్తిని ప్రచారం చేసినప్పటికీ సమాజంలోని నూతన సాంఘిక, ఆర్థిక పరిణామాలను పరిశీలించలేదు. వీరశైవ మతావగాహనను, ఆచారాలను గౌరవించి ఆమతం పట్ల ఉన్నతభావం ఏర్పడాలని తలచాడే గాని వీరశైవమతం ప్రబోధించిన ఆధిపత్య వ్యతిరేక భావాలను బలంగా వ్యక్తీకరించలేదు. పండితారాధ్యుడు వీరశైవమతానికి చేసిన ప్రధాన యోగదానమేమిటంటే బసవన భావాలను తెలుగు సాహిత్యానికి పరిచయం చేయడం, కులాన్నిగూర్చిన అంశాలను సాహిత్యంలో తొలిసారిగా చర్చించడం. ఈ రెండు ప్రయోజనాలు సాధించినప్పటికీ వీరశైవమతాన్ని తాత్త్విక సిద్ధాంతాల ఆధారంగా ఉన్నతమైనదని నిరూపించడానికి జరిపిన ప్రయత్నంవల్ల వీరశైవమతం బ్రాహ్మణేతర వర్గాలలో ప్రచారమవడానికి భిన్నంగా పండితవర్గ చర్చలకు పరిమితమవడానికి ప్రాతిపదిక ఏర్పడింది.

పండితారాధ్యుడికి పాల్కురికి సోమనాథుడు అనుయాయి అయినప్పటికీ వీరశైవ మతంలో సోమనాథుడు అగ్రగామిగా నిలుస్తాడు. సోమనాథుడికి వర్ణవిధాన అవగాహనలో మార్పురావాలన్న నిబద్ధత ఉంది ముఖ్యంగా బ్రాహ్మణాధిపత్యంపట్ల వ్యతిరేకత ఉంది. కాని, వీరశైవమతం సమాజంలో తీసుకురావలసిన మార్పుపట్ల బసవనకున్న విశాలదృక్పథం సోమనాథునకు లేదు. బసవన కులవ్యవస్థను సంపూర్ణంగా వ్యతిరేకించడమేగాక ఆయన

అంత్యజుడికి, బ్రాహ్మణ అమ్మాయికి వివాహం జరిపించినట్లు బసవన జీవితచరిత్ర తెలుపుతుంది.[1] బసవనగూడా తాను అధిపత్య కులానికి చెందినవాడిననే భావాన్ని వ్యతిరేకించాడు. బ్రాహ్మణుడినని చెప్పుకున్నట్లయితే కూడల సంగమదేవుడు నవ్వుతాడని బసవన భావించగా (బసవేశ్వర వచనాలు, వచనం 344), సోమనాథుడు కులవిధానాన్ని నిరసించినప్పటికీ శూద్రులందరూ బ్రాహ్మణత్వం పొందడం కోసం ప్రయత్నించాలని బోధించాడు. శివుడిని పూజిస్తూ, శైవాచారాలను పాటించేది శూద్రజన్మనుండి నిర్ముక్తి పొంది వేదవిదుడై బ్రాహ్మణుడిగా రూపొందడానికేనని వివరిస్తాడు.[2] నాటికాలంలో బ్రాహ్మణవిధానానికి ప్రత్యామ్నాయ మార్గాలను ప్రతిపాదించడంలో ఉన్న పరిమితులవల్లనే సోమనాథుడు ఈ అవగాహనకు వచ్చినప్పటికీ బసవనలాగా సంప్రదాయ భావాలను సంపూర్ణంగా వ్యతిరేకించలేక పోయాడు.

సోమనాథుడు బసవన వ్యక్తిత్వానికి, ఆయన అభిప్రాయాలకు ఆకర్షితుడై బసవన భావాలను ప్రచారం చేయడానికి సంకల్పించినా బసవన భావాలను జనంలో ప్రచారంచేసే ఉద్యమ వ్యక్తిత్వం సోమనాథుడికి లేదు. ఆయనది ప్రధానంగా సాహిత్య వ్యక్తిత్వం. అందువల్ల వీరశైవమత ప్రాశస్త్యాన్ని నిరూపిస్తూ, బసవపురాణం, పండితారాధ్య చరిత్ర, చతుర్వేదసారం, వృషాధిపశతకం, అనుభవసారం, సోమనాథభాష్యం లాంటి కావ్యాలు రచించాడు. సోమనాథుడు వీరశైవాన్నిగురించి విస్తృతంగా కావ్యాలు రచించడం

---

1. శిష్ఠిరుద్రస్వామి : బసవేశ్వరుడు, పే. 13 - 15.

2. " ... ... శూద్ర
జన్మ నిర్ముక్తి పొంది ద్విజన్మమంది
వేద విదుడౌట బ్రహ్మసిద్ధిఁ జరించె
బ్రాహ్మణుండౌటకేగదా బసవలింగ"
(చతుర్వేదసారం, పద్యం 112)

వల్ల, శిష్ట్లా రామకృష్ణశాస్త్రి ''ఈతనికి పూర్వముగల వీరశైవాంధ్ర వాఙ్మయమంతయు ఈతని రచనలపైననే ఆధారపడి యున్నది. ఈతనికి పూర్వముగల వీరశైవాంధ్ర కావ్యములైన శివతత్త్వసారాదులీతని కృతులముందు మాటు పడిపోయినవి. ఈతని తర్వాతి కృతులన్నియు రూప, భావ, భాషలందీతని రచనలమీదనే యాధారపడియున్నవి. పాల్కురికి సోమనాథుడు లేకపోయిన వీరశైవాంధ్ర వాఙ్మయము లేదనియే చెప్పవచ్చును''ని అభిప్రాయపడ్డారు.[1] వీరశైవమతాన్ని సవైదికమని నిరూపించడానికి సోమనాథుడు సాధించిన పాండిత్యం వైరిపక్షాలను పూర్వపక్షం చేయడానికి ఉపకరించి ఉంటుంది. అందువల్ల, వీరశైవమత రచయితలు బసవన చరిత్రను రచించడానికి సోమనాథుడికావ్యం పైనే ఆధారపడ్డారు.

సోమనాథుడి రచనలు ఆతర్వాతి వీరశైవులందరికీ అనుసరణీయాలయ్యాయి. వీరశైవమత ఉద్ధృతి తగ్గిన తరువాత అమతానుయాయులకు పండితలోకంనుండి వచ్చే సవాళ్ళను సమర్థంగా ఎదుర్కోవడానికి సోమనాథుడి రచనలమీదనే ఆధారపడ్డారు. తమ అభిప్రాయాలను బలపర్చుకోవడానికి శ్రుతి, స్మృతులనుండి సోమనాథుడిచ్చిన వివిధ ఉదాహరణలు వాదంలో నిలబడడానికి ఉపకరించి ఉంటాయి. అందుకే సోమనాథుడి బసవపురాణాన్ని 'భీమకవి' కన్నడంలోకి అనువదించాడు. భీమకవి కావ్యాన్ని ఆధారం చేసుకుని బసవపురాణాన్ని 'శివజ్ఞానపాలయస్వామి' తమిళంలోకి పరివర్తనం చేశాడు.

తమిళ బసవపురాణంలో పాల్కురికి సోమనాథుని, భీమకవిని స్మరిస్తూ, .

---

1. శిష్ట్లా రామకృష్ణశాస్త్రి : వీరశైవాంధ్ర వాఙ్మయం, పే. 16.

''కులవు పాలక్కు రిక్కి సోమేశుర
నులగిన్ మున్నముద్దిత్త తెలుంగినై
యిలగు భీమకవి కన్నడన్నరు
నలపురాణన్నమి నేవిట్టువామ్'

తెలుగులో సోమనాథుడి రచనను భీమకవి కన్నడీకరించగా, దానిని తాను తమిళంలోకి తెచ్చినట్లుగా శివజ్ఞానపాలయస్వామి చెప్పుకున్నాడు.[1] ఈ బసవపురాణాన్నే 'మహాదేవకవి' సంస్కృతంలోకి అనువదించాడు.

సోమనాథుడు కావ్యరచనను ప్రధానంగా తలచడంవల్ల, సామాజికంగా నిర్వర్తించ వలసిన కార్యక్రమాలను వదులుకున్నాడు. కావ్యరచనే ప్రధానమవడంవల్ల, జంగములను రూపొందించడానికి తీవ్రంగా ప్రయత్నించలేదు. తాత్త్వికంగా కులవిధానాన్ని నిరసించినప్పటికీ బ్రాహ్మణధర్మాలకు భిన్నమార్గాన్ని ప్రచారం చేయడానికి వ్యవస్థాగతంగా కృషిచేయలేదు. ఇట్లా బలమైన శక్తిగా రూపొందలేకపోవడంవల్ల, ఉత్పాదకవర్గాలను సమీకరించలేకపోయారు. ఆధిపత్యవర్గాలపట్ల వ్యతిరేకత ఉన్నప్పటికీ వాటికి సంబంధించిన భావాలు ప్రచారం కాకపోవటం వల్ల, ఉద్యమస్వరూపం ఏర్పడలేదు. ఆధిపత్యవర్గాలను వ్యతిరేకించి ఉత్పత్తిశక్తులకు రాజకీయ సహకారాన్ని ఇవ్వగలిగిన పరిస్థితి లేకపోవడం, వీరశైవమత భావాలను ప్రచారం చేయగలిగిన పలువురు ఉద్యమవేత్తలుగూడాలేకపోవడం ఆంధ్రదేశంలో వీరశైవం ఉద్యమ స్వరూపాన్ని సంతరించుకోకపోవడానికికారణం. వీరశైవం బలమైన ఉద్యమ స్వరూపం సంతరించుకోలేక పోవడం మూలంగా కన్నడదేశంలోలాగ సామాజిక రంగంలో హింసా పూరితంగా సంఘర్షించాల్సిన అవసరంగూడా ఏర్పడలేదు.

1. శి. ఆదిలక్ష్మి : ''బసవపురాణం - తమిళ పరివర్తనం''

తమిళ, కన్నడ ప్రాంతాలలో ఆవిర్భవించిన వీరశైవ, వైష్ణవ మతభావాలతో స్ఫూర్తిపొందిన ఆంధ్రదేశంలోని వీరశైవ, వైష్ణవ మతానుయాయులు తమ ప్రత్యేక అవగాహనతో ప్రచారాన్ని సంకల్పించారు. కన్నడ వీరశైవంలోని బ్రాహ్మణేతర సంప్రదాయాలను వైదిక భావాలకు తుల్యమైనవని నిరూపించడానికి వేదోపనిషత్తులనుండి విస్తారమైన ఉదాహరణలిచ్చారు. వీరశైవులకు మతౌన్నత్యాన్ని నిరూపించడం ప్రధాన ధ్యేయంకాగా, వైష్ణవులు మతజీవనాన్ని సులభతరం చేశారు. ఆళ్వార్లు సామాజిక ఉద్యమంగా ప్రచారంచేసిన వైష్ణవమత భావాలకు రామానుజుడు తాత్త్విక దృక్పథమిచ్చి పటిష్ఠించినట్లే కన్నడదేశంలోని వీరశైవఉద్యమానికి పాల్కురికి సోమనాథుడు తాత్త్విక, సాహిత్యరూపమిచ్చి ప్రామాణీకరించడానికి కృషిసల్పాడు. వీరశైవ, వైష్ణవ మతానుయాయులు మౌలికంగా వర్ణాధిపత్యాన్ని వ్యతిరేకించి, తామనుసరించే తాత్త్విక సిద్ధాంతాలద్వారా అద్వైతమతభావాలను ఖండించి వీరశైవ, వైష్ణవ మతాల ప్రాశస్త్యాన్ని స్థాపించారు. ఆంధ్రదేశంలోని వీరశైవ, వైష్ణవమతాలు ఉద్యమరూపం సంతరించుకోవడానికి మతాల ప్రామాణీకరణం, తాత్త్విక చర్చలు పరిమితులను ఏర్పర్చాయి.

# ఆంధ్రదేశ రాజకీయ, ఆర్థిక పరిణామాలు - సామాజిక చలనం

మధ్యయుగాలనాటి సామాజిక జీవనంలో వృద్ధిపొందిన భక్తిఉద్యమం తెలుగులో ఆవిర్భవించడానికి సమాజంలో చోటుచేసుకున్న నూతన సామాజిక సంబంధాలే కారణమని పలువురు చారిత్రకులు అంగీకరిస్తున్న విషయం. ఆంధ్రదేశంలో భక్తికవితా సంప్రదాయం మొదలవడానికి గల సాంస్కృతిక అంశాలను వివిధ వర్గాలలోని చలనాన్ని సామాజిక పరిణామాలకతీతంగా పరిశీలించడానికి వీలుకాదు. అదే సందర్భంలో ఆంధ్రదేశ మత జీవనాన్ని ప్రభావితం చేసిన ఇతర ప్రాంతాలలోని సామాజిక పరిణామాలను సహితం పరిగణన లోకి తీసుకోవలసి ఉంటుంది. ఆంధ్రదేశంలో వీరశైవ, వైష్ణవ మతోద్యమాలు సువ్యవస్థిత రాజకీయపాలనగల కాలంలో ప్రచారమయ్యాయి. కాకతీయుల కాలంలో వీరశైవం, విజయనగరరాజుల పాలనలో వైష్ణవం. ఇది యాదృచ్ఛిక సంఘటనగా కనిపించినా రాజకీయ స్థిరత్వం, ఆర్థికప్రగతి లేకుండా ఈ రెండుమతాలు ప్రచారం చేసిన భావాలకు అనుసరణ సాధ్యమయ్యేదికాదు. క్రీ.శ. 12వ శతాబ్దంనుండి ఆర్థికంగా వృద్ధిపొందుతున్నవర్గాలను ఆకర్షించి తమ మతాలను అనుసరింపచేయడానికి వీరశైవ, వైష్ణవ మతాలు జరిపిన ప్రయత్నం కనిపిస్తుంది. అందువల్లే, సామాజిక అంశాలలో వీరు సంఘర్షించిన అంశాలు అతిపరిమితంగా కనపడతాయి. వర్ణవిధానం, ప్రభువుల ఆధిపత్యంలాంటి అంశాలపట్ల, వీరికి పరిమితమైన సంఘర్షణ ఉండడంవల్లనే సాహిత్యరచనకూడా భిన్నంగా కొనసాగింది. పాల్కురికి సోమనాథుడు వీరశైవ మతానికి ప్రామాణికత్వం తీసుకురావడానికి జరిపిన విస్తృత సాహిత్యరచన, అన్నమయ్య మధురభక్తితో వేల సంకీర్తనలు రచించడం జీవితంలో ప్రశాంతతను పొందకుండా రాయడానికి వీలయ్యేవి కావు. అన్నమయ్య రాజులతో విభేదించినా, అది రాచరిక విధానాన్ని వ్యతిరేకించడం

కాదు. రాజుల వ్యక్తిత్వాన్ని అంగీకరించకపోవడమే. అన్నమయ్య రాజాస్థానాల్లో జీవించకపోయినా, రాజులనుండి విస్తృతమైన దానాలనుపొందిన తిరుపతి దేవాలయాన్ని కేంద్రంగా చేసుకుని తన మతభావాలను వెలువరించాడు.[1] అందువల్ల, వీరశైవ, వైష్ణవ మతాలు ప్రచారం చేసిన భావాలను పరిశీలించడానికి, ఆర్థికరంగంలోని పరిణామాలను తద్వారా ఉత్పాదకవర్గాల సామాజిక చలనాన్ని పరిశీలించవలసి ఉంటుంది.

క్రీ.శ. 11, 12 శతాబ్దాల మధ్యకాలంలో ఆంధ్రదేశం వివిధ మండలాధీశుల మధ్య అంతః కలహాలతో విడివడి ఉండటంవల్ల, ఆర్థికాభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలు కన్పించడంలేదని పరిశోధకులు భావిస్తున్నారు.[2] క్రీ.శ. 11, 12 శతాబ్దాల కాలంలో వేంగిని పాలించిన తూర్పు చాళుక్యులు వ్యాపారాభివృద్ధికోసమై తీసుకున్న చర్యలు అత్యల్పమని నేలటూరు వెంకటరమణయ్య రాశారు.[3] ఈ రాజ్యపాలకుడైన కులోత్తుంగ చోళుడు (క్రీ.శ 1070) వస్త్రపరిశ్రమను ప్రోత్సహించడానికి, వస్త్ర తయారీపై సుంకాన్ని తొలగించడంవల్ల, ''సుంగం తవిర్త చోళన్'' (సుంకాన్ని తొలగించినవాడు) అనే బిరుదు పొందినట్లు, తమిళ శాసనాలు తెలుపుతున్నప్పటికీ[4] నిరంతరం యుద్ధాలు కొనసాగాయని చారిత్రకాంశాలు వివరిస్తున్నాయి.

---

1. "He (Annamayya), his wife, and his sons and grandsons, were all poets who not only lived a comfortable life in undisturbed literary and devotional pursuits, but made expensive gifts to the diety of the temple".

   V. Narayana Rao: "Kings, Gods and Poets: Ideologies of patronage in medieval Andhra in Powers of Art, P.155.
2. K. Sundaram: Studies in Economic and Social Condition of Medieval Andhra, P.49.
3. N. Venkataramanayya: Eastern Chalukyas of Vengi.
4. Vijaya Ramaswamy: Textiles and Weavers in South India, P.27.

క్రీ.శ. 11వ శతాబ్దిలో వేంగిని రాజధానిగా పాలించిన తూర్పు చాళుక్య రాజులైన శక్తివర్మ (క్రీ.శ. 1000 - 1011), విమలాదిత్యుడు (క్రీ.శ. 1011 - 1018), రాజరాజ నరేంద్రుడు (క్రీ.శ. 1022 - 1061) చోళుల సహాయంతో ఆంధ్రదేశాన్ని పాలించగలిగారు. అయితే రాజరాజ నరేంద్రుడి సవతి తమ్ముడైన విజయాదిత్యుడు పశ్చిమ చాళుక్యులతో మైత్రి నెరపి రాజరాజును పదవీభ్రష్టుడిని చేయడానికి ప్రయత్నించాడు. రాజరాజు తన రాజ్యకాలంలో శత్రు రాజులతో మూడుసార్లు యుద్ధంచేయవలసి వచ్చింది. కలిదిండి (క్రీ.శ. 1042), ధరణికోట (క్రీ.శ. 1044), కొప్పం (క్రీ.శ. 1053 - 54)లలో యుద్ధాలు చేసి చోళుల సహాయంతో గెలిచి అధికారం నిర్వహించగలిగాడు. క్రీ.శ. 1062లో రాజరాజు మరణించడంతో రాజ్యం విజయాదిత్యుడి హస్తగతమైంది.

విజయాదిత్యుడికాలంనుండి వేంగిపై పశ్చిమ చాళుక్యుల ఆధిపత్యం ప్రారంభ మయ్యింది. వేంగిపై ఆధిపత్యం కోసం చోళులు, పశ్చిమ చాళుక్యులు జరిపిన ప్రయ త్నంలో చోళులు విజయం సాధించి విజయాదిత్యుడిని తమకు సామంతుడిగా వేంగిని పాలించుకునే అవకాశం ఇచ్చారు. విజయాదిత్యుడు కొంతకాలంపాటు పరిపాలన సాగించగానే చోళరాజైన రాజేంద్రుడు అధికారం హస్తగతం చేసుకుంటాడు.

రాజేంద్రుడు చాళుక్య - చోళ కులోత్తుంగునిగా పేరుపెట్టుకొని పరిపాలన ప్రారంభిస్తాడు. కులోత్తుంగునికి శత్రువైన పశ్చిమ చాళుక్యరాజు ఆరవ విక్రమాదిత్యుడు (క్రీ. శ. 1076 - 1126) కులోత్తుంగుని ఓడించడానికి పూనుకుంటాడు. ఈ

సమయంలోనే కళింగప్రాంతంనుండి గంగ వంశీకులు కులోత్తుంగుని రాజ్యంపై దాడికి ప్రయత్నిస్తారు. రాజ్యానికి ఇరుప్రక్కలనుండి సంకటస్థితి ఏర్పడిన సమయంలో వివిధప్రాంతాల రక్షణకోసమని స్థానికంగా కొందరు ప్రభువులను నియమిస్తాడు. అలా అధికారం సంక్రమించినవారిలో వెలనాటి చోడులు ముఖ్యులు.

వెలనాటి చోడుల్లో ప్రథముడైన మొదటి గొంకరాజు తూర్పు చాళుక్యులకు సహాయకారిగా ఉండేవాడు. ఈతడు ధనదపురం (గుంటూరు జిల్లా, రేపల్లె ప్రాంతంలోని చందవోలు) కేంద్రంగా రాజ్యపాలన చేశాడు. (ఈ వెలనాటి చోడుల్లో చివరివాడైన రెండవ గొంకరాజు ఆస్థానంలోనే పండితారాధ్యుడు బౌద్ధ భిక్షువుతో వాదోపవాదాలు చేసి వీరశైవ మత ప్రాశస్త్యాన్ని ప్రకటించడానికి ప్రయత్నించాడు. పండితుని శిష్యులు బౌద్ధ భిక్షువును చంపివేయడంతో క్రుద్ధుడైన గొంకరాజు పండితారాధ్యుడి కళ్ళు పెరికించడం ఈ చోడుని సభలోనే జరుగుతాయి).

కులోత్తుంగుడి పాలనాకాలంలో వివిధ సామంతులు చేసిన సహాయంవల్ల ముఖ్యంగా వెలనాటి చోడుల సహాయంతో శత్రువులను ఓడించి రాజ్యాన్ని సుస్థిర పరచుకుంటాడు. కాని కులోత్తుంగుడి చివరిరోజుల్లో వివిధ మండలాధీశులు శక్తివంతులవుతారు. క్రీ.శ. 12వ శతాబ్ది మధ్య భాగంనుండి 13వ శతాబ్ది ప్రారంభంవరకూ మండలాధీశుల ఆధిపత్యంలోనే రాజ్యం కొనసాగుతుంది.

చాళుక్య చోళరాజైన కులోత్తుంగుడివల్ల వివిధ మండలాధీశులు ఏర్పడినట్లే పశ్చిమ చాళుక్యులవల్ల హైహయ రాజవంశం పల్నాటిప్రాంతంలో ఏర్పడింది. పల్నాటి

రాజుల్నైన హైహయ రాజవంశంలో దాయాదులమధ్య కారంపూడిలో జరిగిన యుద్ధంలో పలు మండలాధీశులు పాల్గొన్నారు. వారిలో వెలనాటి చోడులు సహితం ఒకరు. ఈ యుద్ధంలో నలగామరాజు గెలిచినప్పటికీ రాజ్యం బలహీనపడిపోవడంవల్ల, కాలక్రమంలో ఈ రాజ్యభాగాన్ని కాకతీయరాజైన మొదటి రుద్రదేవుడు (క్రీ.శ. 1158- 1192) తన రాజ్యంలో సంలీనపరుచుకుంటాడు. ఈ రుద్రదేవునినుండే కాకతీయరాజ్యం బలోపేతమై, గణపతిదేవచక్రవర్తి, (క్రీ.శ. 1198 - 1265) కాలంనాటికి సామ్రాజ్యంగా రూపొందింది. కాకతీయ సామ్రాజ్యం స్థిరపడిన పిమ్మట వ్యవసాయం, వివిధ వృత్తుల్ని వ్యాపారం వృద్ధిచెందడానికి అనేక అంశాలు తోడ్పడ్డాయి. ముఖ్యంగా గణపతిదేవచక్రవర్తి, చేపట్టిన చెరువుల నిర్మాణంవల్ల, వ్యవసాయాన్ని విస్తృతంగా పెంచు కోవడానికి వీలయ్యింది.[1] అలాగే వ్యాపారాభివృద్ధికి, పరప్రాంతీయులు తమ రాజ్యంలో వ్యాపారం చేసుకోవడానికి అవకాశం కల్పిస్తూ, అభయశాసనాలు వేయించాడు. వివిధ ప్రాంతాలనుండి వ్యాపారం నిర్వహించే వర్తకులకు ఎగుమతి, దిగుమతి సుంకాలు నిర్ణయించి మోటుపల్లి, మచిలీపట్నం, కృష్ణాపట్నం రేవుల ద్వారా వ్యాపారాభివృద్ధికి కృషిచేశాడు. విదేశీవ్యాపారం వల్ల, అత్యధిక లాభాలు పొందడానికి వీలయ్యింది. మోటుపల్లి రేవులోని అభయశాసనం గణపతిదేవుడు వ్యాపారానికిచ్చిన అవకాశాలను తెలుపుతుంది. "It is an Abhaya - Sasana i.e. an edict (assuring) safety; to foreign traders by sea whose vessels might be wrecked on the coast of his territories;

---

1. See, Parabrahma Sastry: The Kakatiyas, PP. 198-204.

while formerly the whole cargo of such ships became forfieted to the state, he promised that henceforth nothing but the usual custom-duties would be levied on it"[1]

దూరప్రాంతాల నుండి పలురేవులకొచ్చే వ్యాపారులు స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోవచ్చని, వాటిపై, పరిమితమైన సుంకాలనే విధించేట్లు, అభయమివ్వబడింది. ఈ శాసనంలో ఎగుమతి, దిగుమతి చేసే వస్తువులకు విధించిన సుంకాలు సవివరంగా ఉన్నాయి. ఆనాడు శ్రీగంధం, చీనికర్పూరం, ముత్యాలు, జవ్వాది, తగరం, పట్టునూలు దిగుమతి చేసుకునేవారని శాసనం తెలియజేస్తుంది.

మోటుపల్లి రేవును సందర్శించిన మార్కోపోలో ఈ ప్రాంతాన్ని అత్యంత సంపన్నమైన ప్రదేశంగా వర్ణించాడు. కాకతీయుల పరిపాలనా కాలంలో తెలంగాణా ప్రాంతంలో తయారయ్యే వస్త్రాలను ప్రశంసిస్తూ, ఈ వస్త్రాలను ధరించడానికి ఇష్టపడని రాజుగాని, రాణిగాని ప్రపంచంలో ఉండరని తెలిపాడు.[2]

13వ శతాబ్ది ప్రారంభంనుండి 14వ శతాబ్ది ప్రథమపాదం వరకూ కాకతీయరాజ్యం శక్తివంతమైన రాజ్యంగా నిలిచినప్పటికీ కాకతీయసామ్రాజ్యంపై మొదటిసారిగా అల్లావుద్దీన్ ఖిల్జీ కాలంలో క్రీ.శ. 1302 - 3మధ్య దాడి జరిగింది. రెండవసారి మాలిక్ నయాబ్ కాఫూర్ నాయకత్వంలో ఖిల్జీ సైన్యం క్రీ.శ. 1309-10లో

---

1. Motupalli Pillar Inscription of Ganapatideva, Epigraphica Indica, Vol. XII, P.196.
2. "Marcopolo in Andhradesa" in JAHRS, Vol.VI, 1932, P.130.

దాడి జరపగా కాకతీయ సామ్రాజ్యం అనేకరకాలైన నష్టాలకు గురికావడంతోపాటు ఎంతో ఆదాయాన్ని వారికి చెల్లించాల్సి వచ్చింది.[1] చివరిసారిగా క్రీ.శ.1323లో రెండవప్రతాపరుద్రుడిని ఓడించిన పిమ్మట ఆంధ్రదేశం రాజకీయంగానే కాక ఆర్థికంగా ఛిన్నాభిన్నమైంది. దక్షిణభారతంపై పలుమార్లు జరిగిన దాడులవల్ల ఈ ప్రాంతం లోని ఆర్థిక వనరులన్నీ ఢిల్లీ సుల్తానుల చేతుల్లోకి పోయాయి.[2] ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఛిన్నాభిన్నమైన వాటి సామ్రాజ్యాన్ని మళ్ళీ తమ ఆధిపత్యంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నించి విజయవంతమైనవారిలో ప్రోలయనాయకుడు ముఖ్యుడు. ఈతని పరిపాలనలోని భూభాగం చాలా చిన్నదే అయినప్పటికీ ఒక స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోవడానికి ఈతడు చాలా కృషి జరపాల్సి వచ్చిందని మల్లంపల్లి సోమశేఖర శర్మ, నేలటూరి వెంకటరమణయ్యలు రాశారు.[3] ప్రోలయ నాయకుడు వేయించిన 'విలస శాసనం' ఆంధ్రదేశానికి మహమ్మదీయులు కలుగ చేసిన విధ్వంసాన్ని వివరిస్తుంది. పంటలను, ప్రజల ధనాన్ని దోచుకోవడం,

---

1. See, M. Somasekhara Sarma: A Frogotten Chapter of Andhra History, P.6.

2. "With the successive plunder of the Deccan Kingdoms at the end of the 13th and beginning of the 14th centuries which were more prosperous in the preceding centuries than northern India, a great quality of precious metals came into the hands of the Delhi Sultan, though less of silver of gold".

   - Digby Simon: "The Currency System" in The Cambridge Economic History of India, P.96.

3. See, Vilasa grant of Prolaya Nayaka: Epigraphica Indica, Vol. XXXII

ప్రజలను హింసించడం, అనేక దేవాలయాలను కొల్లగొట్టడం,[1] బ్రాహ్మణులు తమ మత కర్మ కాండలను నిర్వహించడానికి వీలులేని పరిస్థితిని కల్పించిన స్థితిలో ప్రోలయనాయకుడు రాజ్యపాలకుడయ్యాడని ఆ శాసనం వర్ణిస్తుంది.[2] వైదిక కర్మ కాండలకు, యజ్ఞయాగాదులకు అవకాశం లేకపోవడంవల్ల, మహమ్మదీయుల దాడులను నిరసిస్తూ, నాటి పరిస్థితుల దయనీయ స్థితిని తెలిపినప్పటికీ విస్తృత భూభాగాన్ని సుదీర్ఘకాలంపాటు పాలించగలిగిన రాజవంశం నామరూపాల్లేకుండా పోవడంతో ఆనాటి బ్రాహ్మణవర్గానికి విపత్కర పరిస్థితులు ఏర్పడి ఉంటాయని గ్రహించగలం. దీనితోపాటు గ్రామీణ పరిశ్రమలు కూడ దెబ్బతిన్నాయి. ఈ కారణాలవల్లే, కాకతీయుల కాలంలో గొప్ప వ్యాపారకేంద్రంగా వృద్ధిచెందిన మోటుపల్లి రేవు చాలా బలహీనపడింది.[3] ఈ పరిస్థితులన్నింటిని అధిగమించి ఆంధ్రదేశంలో కొన్నిముఖ్యమైన రాజ్యాలు వృద్ధిచెందాయి. వాటిలో విజయనగర సామ్రాజ్యం ప్రముఖమైంది.

---

1. క్రీ.శ. 1323లో కాకతీయరాజ్యంపై దాడిచేసిన మాలిక్‌కాఫర్‌ను 'విగ్రహ విచ్ఛేదక మాలిక్' (Idol breaking Malik) అని పిలిచేవారట. అతడు అనేక దేవాలయాల్లో విగ్రహాలను ధ్వంసం చేశాడని చరిత్రకారులు రాశారు.
   R. Soma Reddy: Hindu and Muslim Religious Institutions, Andhra Desa (1300-1600), P.19.
2. కంభంపాటి సత్యనారాయణ : ఆంధ్రులసంస్కృతి - చరిత్ర -II, పే. 74.
3. "Motupalli the great emporium of trade-suffered the impact of Muslim invasion in the Andhra Country and what was once at the height of fame when Marcopolo visited the Country, was reduced to a state of anarchy creating great many disabilities for the merchants".
   K. Sundaram: Studies in Economic and Social conditions of Medieval Andhra, P.11.

క్రీ.శ. 1336లో మొదటి హరిహరరాయల నాయకత్వంలో విజయనగర సామ్రాజ్యం స్థాపితమైంది. ఈ రాజ్యపాలకులు చేపట్టిన వివిధ కార్యక్రమాలవల్ల, క్రీ.శ. 15 వ శతాబ్దం నాటికి వ్యవసాయం, వృత్తులు, వాణిజ్యం వృద్ధి చెందాయి.[1] విజయనగర సామ్రాజ్యంలో అంతర్భాగమైన తిరుపతి దేవాలయానికి విజయనగర రాజులిచ్చిన దానశాసనాలను పరిశీలిస్తే, ఆ రాజ్యానికి ఉన్న ఆర్థికవనరుల స్వరూపం విశదమవుతుంది.[2] ఇలా, బలమైన రాజ్యంగా వృద్ధిచెందిన సమయంలోనే వైష్ణవమత ప్రచారం జరిగింది.

నూతనంగా అధికారంలోకి వచ్చే ప్రభువులు రాజ్యాన్ని సుస్థిరపరచి, విస్తృతం చేసుకోవడానికి తమపట్ల ప్రజలకు గౌరవభావం కలిగింపచేసుకోవడానికి పలు కార్యక్రమాలు చేపట్టేవారు. వాటిలో భూదానాలు ఆనాటి సమాజంలో అనేక మార్పులకు కారణ మయ్యాయి. రాజ్య ఆర్థిక ప్రగతికోసమేగాక ధార్మిక కార్యక్రమాలకు భూదానాలు అవసరమని తలచేవారు. క్రీ.శ. 3, 4 శతాబ్దాలనుండి భారతదేశ వ్యాప్తంగా భూదానాలు నిరూపించడం చారిత్రక అవసరమయ్యింది.

---

1. T.V. Mahalingam: Administration and Social life under Vijayanagara, P.62.

2. క్రీ.శ. 15వ శతాబ్ది అంతానికి తిరుపతిదేవాలయ నిర్వహణకుగాను ఆ సమీప ప్రాంతంలో 50 గ్రామాలుండేవని సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి రాశాడు.
   - Sadhu Subrahmanya Sastry: Tirupati Srivenkateswara, P.184.

b) See also Burton Stein: All the kings Mana, P.69.

c) "The dramatic growth of Tirupati Temple during this period may be taken as symptomatic of the general support for existing temples of this region as well as the construction of new temples of warriors of

ప్రభుత్వ నిర్వహణకోసమో, వివిధ కార్యాల్లో, పాల్గొనేవారికి పరిమిత స్థాయిలో భూవసతిని, ఆధిపత్యం ఇచ్చినప్పటికి బ్రాహ్మణులకు చేసిన భూదానాలే సమాజంలో ప్రత్యేకతను సంతరించుకున్నాయి. రాజులు బ్రాహ్మణులకు భూదానాలు చేయడంద్వారా తమ ప్రాభవాన్ని ప్రతిష్ఠించుకోవడంతోపాటు నూతన ప్రాంతాలను ప్రభుత్వ ఆధిపత్యంలోకి తేసుకురావడానికి, తెగలను, సాధారణ ప్రజలను 'సంస్కృతీకరించడానికి'[1] (Sanskritization) ఉత్పాదక వర్గాలపై ఆధిపత్యం నెరపడానికి ప్రయత్నించేవారు.

వర్ణవిధానంలోని నాలుగు వర్ణాలలో బ్రాహ్మణ, క్షత్రియులు ఒక వర్గంగా వైశ్య, శూద్రులు మరొక ప్రధాన వర్గంగా విభజితమై ఉండటం ప్రాథమిక దశనుండి ఉంటూ వచ్చింది. బ్రాహ్మణ, క్షత్రియ వర్గాలపై రాజ్య నిర్వహణ ఆధారపడి ఉండటంవల్ల, ఇరువర్గాలు దగ్గరి సంబంధాలు కలిగి ఉన్నట్లే, ఉత్పాదక రంగంలో ఉన్న సంబంధాలవల్ల, వైశ్య, శూద్రులు మరొక వర్గంగా సంబంధాలు కలిగి ఉండేవారు. ఈ ఇరువర్గాలు బ్రాహ్మణ, క్షత్రియ ఆధిపత్యాన్ని నిరాకరించే సమయంలో ఏకమయ్యేవి. ప్రభుత్వానికి పలుసందర్భాలలో పన్ను చెల్లించాటు రావడంగూడ వీరు సంయుక్తంగా బ్రాహ్మణ, క్షత్రియ ఆధిపత్యాన్ని నిరాకరించడానికి కారణమయ్యింది.

---

this region whose fortunes rose with those of Saluva Narsimha and his successors. Resources for the support of temples with in the core territories of these warriors were drawn from a large region, including the Southern parts of Tondaimandalam".
- Burton Stein: "Introduction" to Indian Economic and Social History Review, Vol.XIV, No.I, 1977.

1. Romila Thaper: "Social mobility in Ancient India with special reference to Elite groups", Indian Society: Historical probings, P.123.

సామాజికంగా ఎదురయ్యే ఈ సంకటస్థితిని అధిగమించడానికి బ్రాహ్మణులకు ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు రాజులు భూదానాలు చేయడం ద్వారా భారతీయ సమాజంలోనే నూతన రాజ్యవిధానానికి పునాదులు వేశారని ఆర్.ఎస్. శర్మ అభిప్రాయపడ్డాడు.

" . . . the Gupta period saw a strong feudalization of the state apparatus which is not to be found in Maurya times. The process was set in motion by the practice of making grants of lands to the brahmans from the first century A.D. onwards".[1]

మౌర్యసామ్రాజ్యకాలంలో లేని ప్రభుస్వామ్యసంబంధాలు గుప్తులకాలంలో ఏర్పడడానికి ఈ భూదానాలను కారణంగా చెప్పుకోవచ్చు. కాలక్రమంలో భూదానాలను చాలా ఉన్నతమైనవిగా, సమాజానికి ఉపయుక్తమైనవిగానూ పరిగణించేవారు. భూదానం ప్రకటించిన పిమ్మట వాటిని అతిక్రమించడాన్ని పాపకృత్యంగా ప్రజలకు బోధించేవారు. రాజ్యవిధాన నిర్ణయంలో భాగంగానేగాక మత విశ్వాసాలతోగూడ భూదానాలు నిర్వహించేవారు. మరణించిన తల్లిదండ్రులకు ఉత్తమగతులు ప్రాప్తించడంకోసం భూదానాలను ఒక సాధనంగా ఎంచేవారు.[3]

1. R.S. Sharma: "Problem of transition from Ancient to Medieval in Indian History", P.2.
2. Indian Antiquiry, Vol.V, P.53.
   Cf. K. Satya Narayana : A Study of the History and Culture of the Andhras, (Part-II), P.215.
3. D.D. Kosambi: An Introduction to the study of Indian History, P.313.

భూదానాలద్వారా పొందిన భూములను ప్రకృతి వనరులద్వారా, చెరువులను నిర్మించడంద్వారా వ్యవసాయాన్ని బాగా వృద్ధిచేశారు. భూములను మొదటిసారిగా సాగులోనికి తెచ్చిన వారికి పన్ను మినహాయింపులను ప్రకటించి ప్రోత్సహించేవారు. ఇట్లా వ్యావసాయిక అభివృద్ధికి, కృషి జరపడంతో ప్రభుస్వామ్యం స్థిరపడడానికి మార్గం ఏర్పడింది. దీనిని మరింత బలోపేతం చేసుకోవడానికి ప్రజల్లో తమపట్ల ఆరాధనాభావం పెంపొందింప చేసుకోవడానికి అనేక దేవాలయాలు నిర్మించారు. దేవాలయ నిర్మాణానికి ఈ కాలంనాటి ఉత్పత్తులు బాగా ఉపకరించాయి. ఈ కాలానికి విదేశీ వర్తకం దెబ్బతిని ఉత్పత్తులను ద్రవ్యరూపం (నాణాలు) లోకి మార్చుకునే అవకాశం లేకపోవడంవల్ల, గ్రామంలోనే వివిధ కార్యక్రమాలకోసం వినియోగించేవారు.[1] సంపన్నవర్గాలకు దేవాలయ నిర్మాణం కోసం డబ్బు వెచ్చించడం ఒక ముఖ్య కార్యక్రమం అయింది.

## దేవాలయ నిర్మాణం

భూదానాలు నిర్వహించడం ద్వారా వచ్చిన ఆర్థిక ప్రగతి దేవాలయాల నిర్మాణానికి కారణమయ్యింది. ఆలయాలను రాజులు నిర్మించడమేగాక స్థానికంగా ఉండే సామంతులు కూడ నిర్మించి వాటి నిర్వహణకోసమై భూములు దానంచేసేవారు. కొన్ని సందర్భాలలో ఇతర వర్గాలు సహితం దేవాలయాలను నిర్మించడం లేదా దేవాలయాల నిర్వహణ కోసమై ఆర్థిక సహాయం చేసి ఆలయ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యేవారు. దేవాలయాలను అత్యధికస్థాయిలో నిర్మించినవారు రాజులే.

---

1. R.S. Sharma: "Indian Feudalism Retouched" in IHR Vol. I, No.I, 1974, P.324.

ఇలా, దేవాలయాన్ని ప్రత్యేక శక్తి వహించడానికి ఆయా వ్యక్తులకు ప్రత్యేక ప్రయోజనం ఉండేది. ప్రభువుకు - ప్రజలకు మధ్య రాజ్యవ్యవహారానికి చెందిన సంబంధాలేగాక ఆత్మీయ సంబంధాలు పెంపొందించుకోవలసిన అవసరం ఉండేది. యుద్ధాలు వచ్చినపుడు ప్రభువు కోసం ప్రాణాలు అర్పించగలిగే ఉద్వేగపూరిత సంబంధాలను ( Emotional relations) ఏర్పరుచుకోవడానికి ప్రజలతో సజీవ సంబంధాలు ఉండాలి. తద్వారానే ప్రజలకు రాజుపట్ల గౌరవాభిమానాలు పెరుగుతాయి. అంతేగాక ప్రజలనుండి కప్పం వసూలు చేసుకోవడానికి సంఘర్షణ ద్వారా గాక అభిమానంతో ఇవ్వడానికి ప్రజలను తయారుచేసుకోవాలి. అలా, ప్రజల్లోకి ప్రభుత్వం ప్రవేశించడానికి ఉపయోగపడే ప్రధాన సాధనం - ధార్మిక భావన. ప్రజల్లో ధార్మిక భావనను పెంపొందించి అవసరమైతే మూఢవిశ్వాసాలను ప్రోత్సహించి రాజు తన ఆధిపత్యాన్ని నిలుపుకోవాలని కౌటిల్యుడు పేర్కొంటాడు.[1] రాజ్యం స్థిరపడ్డానికి, ప్రజలనుండి కప్పం రాబట్టడానికి దేవాలయాలను విస్తృతంగా నిర్మించారు. దేవాలయ నిర్వహణకుగాను భూదానాలు చేసేవారు. దేవాలయాలకు దానం చేయడంవల్ల, సాంఘికస్థాయి, రాజకీయ ఆధిపత్యం పెరగడానికి అవకాశం కలిగేది. అందువల్ల, ప్రభువులు మాత్రమేగాక సంపన్నులైన వివిధ వ్యక్తులు కూడా దేవాలయాలకు ఆర్థిక సహాయం చేసి రాజకీయ ప్రాధాన్యాన్ని, సాధారణ ప్రజల్లో గౌరవ ప్రపత్తులను పెంచుకోవడానికి ప్రయత్నించేవారు.[2] అందువల్ల, దేవాలయాలకు విస్తారంగా దానాలు

---

1. Kautilya: Arthasastra, V- 2
   Cf. R.S. Sharma: Perspectives in Social and Economic History of Early India, P.73.

2. "Patronage of religious institutions was a crucial source of social prestige and political legitimacy for prominent individuals and was additionally a means for them to allocate surplus resources in the locating to these institutions and social groups that supposed them".
   Talbot Cynthia, "Temples, Donors and Gifts" in The Journal of Asian Studies, Vol.50, P.336.

చేసి రాజ్యంపై ఆధిపత్యాన్ని స్థిరపరుచుకోవడానికి ప్రయత్నించేవారు.

క్రీ.శ. 6వ శతాబ్దంలో రాజ్యస్థాపన చేసిన పల్లవులు ఆ తర్వాతి కాలంలో పాండ్యరాజులు తమ కాలంనాటికి నగరాల్లో ప్రధానమతాలుగా ఉన్న జైన, బౌద్ధ మతాలను విడిచి శైవ, వైష్ణవ మతాల కోసమై విరివిగా దానాలు చేసి శైవ, వైష్ణవ దేవాలయాలను నిర్మించారు. ఈ దేవాలయాలకు విస్తృతంగా దానాలు చేసి శైవ, వైష్ణవ మతాలను అంగీకరించిన రాజ్యాలే కాలక్రమంలో బలమైన కేంద్రాలుగా వృద్ధిచెందాయని తమిళప్రాంతంలోని భక్తి ఉద్యమాన్ని అధ్యయనం చేసిన చారిత్రకులు విశదీకరిస్తున్నారు.[1]

దేవాలయాలకిచ్చే దానాల ద్వారా రాజులు తమ ఆధిపత్యాన్ని స్థిరపరుచుకోవడం కోసమై ప్రయత్నించగా, వర్తకులు, తెగలవారు సామాజిక గుర్తింపు కోసమై దానాలు చేసేవారు. క్రీ.శ. 11, 12 శతాబ్దాల్లో వేంగి, కృష్ణా, గుంటూరు, తూర్పుగోదావరి ప్రాంతాలకు చెందిన వర్తకులు, వ్యాపారుల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి. వీరు దేవాలయాలకు దానాలు ప్రకటిస్తూ, అనేక శాసనాల్లో తమ ఔన్నత్యాన్ని, ధైర్యాన్ని, ధార్మిక గుణాలను ప్రస్తావించేవారు. ఈ కాలంలో వేంగి ప్రాంతంలోని పెనుగొండ వ్యాపారులు ఆ ప్రాంతానికి ప్రభువులుగా ప్రకటించుకుంటూ అనేక దానాలను ప్రకటించారు.[2]

---

1. M.G.S. Narayanan & Veluthat Kesavan: "Bhakti Movement in South India" in D.N. Jha (ed.): Feudal Social Formation in Early India, P.358.

2. Burton Stein: Peasant State and Society in Medieval South India, P.200.

కాకతీయ గణపతి దేవుడి కాలంలో (13వ శతాబ్ది) నేతగాండ్రు దేవాలయాలకు దానాలిస్తుండినట్లు, గిర్మాజీపేట శాసనం వివరిస్తుంది. నేతగాండ్రు 'ధర్మశాలీలు' అనే పేరుతో శ్రేణుల ద్వారా ఏకమై 'సాలేశ్వరుడ'నే దేవుడిని స్థాపించి ఆ దేవాలయానికి దానాలు ప్రకటించినట్లు ఈ శాసనం తెలుపుతుంది.[1]

గణపతిదేవుడు నిర్మించిన కోటకు స్వదేశి, పరదేశి బేహారులు దానాలు ప్రకటించినట్లు, క్రీ.శ. 1228నాటి శాసనం తెలియజేస్తుంది.[2]

తిరుపతి దేవాలయానికి సమీపంలోని పద్మావతీ దేవి ఆలయాన్ని పద్మశాలీలు నిర్మించినట్లు, తామ్రశాసనంలో పేర్కొని ఉంది. ఆ శాసనంలో పేర్కొనిన అంశాన్ని సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి ఇలా వివరించారు.[3] అనంతాచార్యుడి మనుమడైన తాళ్ళపాక చిన్నన్నకు పద్మశాలీలు, జాండ్రులు (నేతవారిలో ఒక తెగ) శిష్యులుగా ఉండేవారని వారి మధ్య వచ్చిన పెద్ద వివాదాన్ని పరిష్కరించినందులకు కృతజ్ఞతలలో చిన్నన్నకు పద్మావతిదేవి ఆలయం నిర్మించడానికి పద్మశాలీలు 2వేల వరహాలు దానం చేశారు.

తిరుపతి దేవాలయానికి ధర్మపురికి చెందిన వైశ్యులు మూడున్నర వేల నర్మాలను సమర్పించి తమ ప్రత్యేకతను నిలుపుకోవడానికి ప్రయత్నించారు.[4]

---

1. P.V. Parabrahma Sastry: The Kakatiyas, P.181.
2. - ibid. P, 241.

3. Sadhu Subrahmanya Sastry: Tirupati Sri Venkateswara, PP. 247-48.

4. - ibid. P.237.

వృత్తికారులు, వ్యాపారులేగాక స్థానిక తెగలు సహితం దేవాలయాలకు దానాలు ప్రకటించడం నాటి సంప్రదాయంగా ఉండిందని ద్రాక్షారామ దేవాలయానికి చెందిన శాసనాలు తెలుపుతున్నాయి. ఈ ప్రాంతంలోని బోయలు క్రీ.శ. 11వ శతాబ్దినుండి 14వ శతాబ్దిమధ్య కాలంలో దేవాలయ అర్చనకోసం రూ. 13,440లు విలువచేసే పశుసంపదను దానం చేశారు. ఈ నాలుగు శతాబ్దాల కాలంలో మొత్తం 882మంది బోయలు దేవాలయ నిర్వహణతో సంబంధం కలిగి ఉండగా 179మందికి స్థానిక నాయకత్వస్థాయి లభించింది.[1] దేవాలయాలకు, మత కర్మకాండలకు ఆర్థిక సహాయం చేయడం విగ్రహాలను ప్రతిష్ఠించడంలాంటి మతకార్యాల ద్వారా రెండు అంశాలు విశదమవుతున్నాయి. ఆర్థికంగా సాధించిన పురోగతి, సాంఘికంగా సంతరించుకుంటున్న ప్రాధాన్యం.

దేవాలయ నిర్మాణం కాలక్రమంలో నగరాలకే పరిమితంగాక గ్రామీణ ప్రాంతాలకు సహితం వ్యాపించిందని రాజ్యం శక్తివంతమవడానికి ఈ చర్య బాగా ఉపకరించిందని ఆర్.ఎస్. నంది అభిప్రాయపడ్డారు.[2] వివిధ వర్గాలనుండి దేవాలయాలకు లభించిన ఆర్థిక వనరుల కారణంగా దేవాలయాలు అనేక అంశాలలో స్వతంత్రను కలిగి సంపన్న కేంద్రాలుగా వృద్ధిచెందాయి. అందుకే దేవాలయాలను దేవుని పూజాకేంద్రాలుగానే కాక, సంపన్న భూయజమానిగా గ్రామాలను వెంపొందించడానికి

---

1. See, P.S. Kanakadurga & Y.A. Sudhakar Reddy: "Kings, Temples and Autochthonous Communities" in JESHO vol. XXXV, P.156-157.

2. R.N. Nandi, "Growth of Rural Economy in Early Feudal India," P.33.

దోహదపడిన కేంద్రాలుగా భావిస్తారు.[1]

దేవాలయాలను నిర్మించడం వల్ల, ఆలయాల్లో నిర్వహించే మత కర్మ కాండల కోసమూ, వివిధ ప్రాంతాలనుండి వచ్చే ప్రజల అవసరాల కొరకు గతంలో ఎప్పుడూ అవసరం రాని విధంగా పలు సామాగ్రి అవసరమయ్యేది. ఉత్పత్తిచేసిన వస్తువులను తమగ్రామాలనుండి తీసుకెళ్ళి అమ్ముకునేవారు. ఇలా, దేవాలయాలవల్ల, నగర సంస్కృతి వృద్ధి చెందింది.

## నగరీకరణ

భూదానాలతో వ్యవసాయరంగంలో వచ్చిన అభివృద్ధి దేవాలయ నిర్మాణానికి దోహదపడగా, దేవాలయ నిర్మాణం నగరీకరణను సాధ్యంచేసింది. నగరాలు కాలక్రమంలో వ్యాపారాభివృద్ధికి ఉపకరించాయి. ముఖ్యంగా దక్షిణ భారతానికి సముద్రతీరప్రాంతం ఎక్కువగా ఉండటంవల్ల, అనేక దూరప్రాంతాలకు వ్యాపారం సుగమమయ్యింది.

దేవాలయాలు,నగరాలు పెంపొందడం, వ్యాపారానికి వీలు కల్గడంతో వివిధ ఉత్పత్తులు పెరిగాయి. వీటికి తోడు నాటి సంపన్న వర్గాలకు, ప్రభుత్వ

---

1. " ... it (Temple) was a landlord engaged labour and cultivated lands, besides encouraging rural activities like extension of cultivation and rehabilitation of villages".

T.V. Mahalingam: Economic life in the Vijayanagara Empire, P.35.

ఉద్యోగులకు అవసరమైన వస్తువులను తయారుచేయడానికి వివిధ వృత్తులవారు కృషిచేసేవారు. అందువల్ల, పారిశ్రామికంగా ఆంధ్రదేశం బలమైన కేంద్రంగా వృద్ధిచెందింది. గుంటూరు జిల్లాలోని పలాడు, వినుకొండలో లభించే రాగి, సత్తెనపల్లిలో లభించే ఇనుమువల్ల, ఇనుప పనిముట్లు, విరివిగా తయారుచేసేవారు. గుత్తికొండ గ్రామాన్ని ఆనాడు 'కొలిమిలపాలెం' అని అక్కడి పర్వతాన్ని 'ఇనుపకొండ' అని పిలిచేవారు.[1] నెల్లూరు, రాయలసీమ, ప్రాంతాల్లో, లభించే బంగారు గనులవల్ల, స్వర్ణాభరణాలు చేయడానికి వీలుకలిగింది. అలాగే ఆంధ్ర ప్రాంతంలోని రత్నాలు, వజ్రాలు లభించడం మూలంగా స్వర్ణకారవృత్తి, ముఖ్యవృత్తిగా వృద్ధిచెందింది. వివిధ వస్తువుల తయారీకి, దూరప్రాంతాలనుండి సహితం లోహాలను తెప్పించి వస్తు తయారీకి వినియోగించేవారు. క్రీ.శ. 12వ శతాబ్దినాటికి కూడా, తూర్పుదేశాలనుండి వెండి, బంగారు, రాగి లోహాలను మక్కా నుండి సీసం మొదలైన వాటిని దిగుమతి చేసుకునేవారని మార్కోపోలో రాశాడు.[2] వివిధప్రాంతాలనుండి లోహాలను సేకరించి వస్తూత్పత్తులు విస్తారంగా పెంచారు.

దేవాలయాలు, వ్యాపార సంబంధాల కారణంగా వేంగి, బెజవాడ, గుంటూరు, ఘంటసాల, చందవోలు లాంటి ప్రాంతాలు నగరాలుగా వృద్ధిచెందాయి. ఈ ప్రాంతాల్లో, వ్యాపార నిర్వహణ కోసమై శ్రేణులుగా రూపొంది తమవృత్తులు కొన

---

1. M. Krishna Kumari: The rule of Chalukya Chola in Andhra Desa, P.161.

2. K. Sundaram: Studies in Econom.c and Social conditions of Medieval Andhra, P.18.

సాగించేవారు. ఈ శ్రేణులు ఒక్క కులానికే పరిమితం గాక ఇతర కులాల వారిని సహితం కలుపుకుని ప్రత్యేక సంస్థలుగా రూపొందేవి. వృత్తికారులు, వ్యాపారస్థులు ఈ శ్రేణుల ద్వారానే దేవాలయాలకు భూరి విరాళాలు ప్రకటించేవారు. తద్వారా తమ వ్యాపార సంబంధాలను విస్తృత పరచుకునేవారు.

## సామాజిక అభివృద్ధి : వివిధకులాల్లో చలనం

ఆర్థికంగా బలోపేతమైన వివిధ వర్గాలవారు సమాజంలో ప్రత్యేకతను సాధించడానికి రెండు మార్గాలున్నాయి. ఒకటి, కులవిధానాన్ని నిరాకరించే మతాలలో చేరడం. రెండు, బ్రాహ్మణుల ఆధిపత్యానికి కారణమైన మతజీవనం, అధ్యయనంలాంటి కార్యాలలో ప్రవేశించి బ్రాహ్మణుల స్థాయిని సంపాదించడం. మధ్యయుగాలలో బ్రాహ్మణేతరులు ముఖ్యంగా శూద్రులు వేదాది అంశాలను అధ్యయనం చేసేవారని ఎఱ్ఱన రచించిన మహాభారతంలోని అరణ్యపర్వ భాగంనుండి గ్రహించవచ్చు. ఎఱ్ఱన కలియుగం గురించి సుదీర్ఘపరుస్తూ, శూద్రులు వేదాలను అధ్యయనం చేసి బ్రాహ్మణులకు బోధిస్తుండగా తమ ఆచారాలను మరచిన బ్రాహ్మణులు శూద్రుల బోధనలు వింటారని అటువంటి 'విలోమక్రమమే' కలికాల

వని వర్ణిస్తాడు. ఇలా, సమాజంలో వర్ణధర్మాలకు విఘాతం సంభవించినపుడు కల్కి 'శంబళ' గ్రామంలో జన్మించి ఏకసంథాగ్రాహియై విష్ణుయశుండనే పేరుతో నాలుగువేదాలను అధ్యయనం చేసి బ్రాహ్మణధర్మాలను పరిరక్షిస్తాడని ఎఱ్ఱన వర్ణించాడు. అన్నమయ్య కూడా కలికాలం గురించి వర్ణించాడు. అందులో కులాలకు సంబంధించిన పేరు వచ్చినా వివిధ వర్ణాలమధ్య జరిగే వివాహాది సంబంధాల వల్ల ఉన్నతకులాల ప్రత్యేకత అంతరిస్తుందని బాధ పడతాడు.

---

1. ''జపనియమ స్వాధ్యాయ
ప్రపంచములు విడువగలరు బ్రాహ్మణులు ; జనా
ధిప ! శూద్రులు విపుల తపః
క్షపితులు గా గలరు వినవె కలికాలమునన్'' (అరణ్యపర్వం, -IV -289.)

''హేతువక్షయు వాద వి
చేతస్కులై, వేదనిందసేయుదురు, మహి
వ్రాతంబులు వ్రతములు యెడ
బాతురు దుర్మార్గకర్మ పరులై విప్రుల్'' - ibid. IV- 297.

''శుభధర్మంబులు శూద్రులు
ప్రతిష్ఠం జెప్పంగవినుదు బ్రాహ్మణులు కడున్
మతిమాలి తమవకుల్లై
యతినిందిత కర్మకారులయ్యెదరధిపా !'' - ibid . IV-304.

''కటకటా మారితివి కలికాలమా - పుణ్య
ఘటన కర్మపోయెఁ గలికాలమా ||కటకటా||

భూసురుల కామినులు బోయల నాయకుల
చేసుకుని యాండ్లు చిమ్మురికిరి
యాసునను సేవలన నెక్కువ కులములెల్ల
కాసునేయకపోయె కలికాలమా ||కటకటా||

అరుదుగుఁ బతివ్రతలు అభిమానవతులు పలు
దొరలకమ్ముడుపోయి తొత్తులైరి
.... .... '' (అధ్యాత్మ సంకీర్తనలు,
, కీర్తన 77.)

భిన్న కులాలమధ్య జరిగే వివాహాది సంబంధాలపట్ల అన్నమయ్య బాధను, బ్రాహ్మణుల ఆచార నియమాతిక్రమణం పట్ల, శూద్రుల అధ్యయనం పట్ల, వెల్లిన విముఖతను వ్యక్తపరిచే అంశాలు కులసంబంధాలలో వస్తున్న మార్పులను సూచిస్తున్నాయి. అయితే ఉన్నత సామాజిక స్థాయిని ఆపేక్షించిన వివిధకులాలు బ్రాహ్మణులకంటే క్రిందిస్థానంలో ఉన్న క్షత్రియులనుండి శూద్రులవరకూ తమ ప్రత్యేకతను చాటు కోవడానికి తమ వంశాలను గూర్చిన అనేక ఐతిహ్యాలను కల్పించుకునేవి. వేటి

ద్వారా రాజకీయ ఆధిపత్యాన్ని స్థిరపరచుకోవడానికి ప్రయత్నించేవి.[1] రాజులు తమ వంశ ప్రత్యేకతను, పవిత్రతను, సూర్య, చంద్రవంశాలతో ఆపాదించుకున్నట్లుగానే వైశ్యులు, మత్స్యకారులు ప్రసిద్ధమహర్షుల గోత్రాలతో సంబంధాలను ఆపాదించుకునేవారు. మధ్యభారతంలోని గోండులుగూడా చంద్రవంశానికి చెందినవారిగా చాటుకునేట్లు, వారి శాసనాధారాలు తెలుపుతున్నాయి.[2]

ఇలా, సామాజిక స్థాయికోసమై పలువర్గాలవారు ప్రయత్నించేవారు. తమ జన్మపట్ల ఉండే హీన భావననుండి ఉత్తమజన్మ కలిగినవారుగా పరిగణింపబడడానికి పవిత్రకులోద్భవులమని చాటుకోవడం ఒక ప్రధాన అంశంగా ఉండేది. బ్రాహ్మణులు తమ ప్రత్యేకతను నిరూపించుకోవడానికి ప్రసిద్ధ మహర్షుల గోత్రకులమని, క్షత్రియులు సూర్య - చంద్ర వంశజులమని చెప్పుకున్నట్లే, సంపన్నమైన మత్స్యకారులు వంశ ప్రాధాన్యాన్ని వివరించే పురాణకథలు కల్పించుకునేవారు.[3] కులపురాణాల్లో, అనేక

---

1. "The grateful brahmans invented fictitious family trees for the ruling chiefs of the early medieval period, tracing their descent back to the Solar or Lunar dynasties and stressing their divine power and thus provided validation for new ruling family, On the otherhand secular vassals helped their lords by governing their fiefs and supplying troops in times of war".

   R.S. Sharma, Indian Feudalism, PP. 222-23.

2. Romila Thaper: "Social Mobility in India, in Indian Society: Historical Probings, P.107.

3. The members of the guilds who were generally from the industrial and mercantile classes, adopted several social honours and held superior claims equal to the previleged classes by investing mythical origin from the celestial beings".

   M. Krishna Kumari: The Rule of Chalukya - Cholas in Andhra Desa, P.165.

అంశాలు కల్పితాలే అయినప్పటికీ వాటిలోని కొన్ని వాస్తవాలను తిరస్కరించలేమని నేలటూరి వెంకటరమణయ్యగారు అభిప్రాయపడ్డారు.[1]

క్రీ.శ. 12, 13 శతాబ్దాల కాలాల్లో, శ్రేణులద్వారా వస్తువులను ఉత్పత్తిచేస్తూ, వ్యాపారం వృద్ధిచేసుకునే సమయంలో కుల, వంశ ప్రాధాన్యాన్ని చాటుకోవడం కన్పిస్తుంది. పశ్చిమ చాళుక్యుల కాలంలో పెనుగొండ ప్రాంత వ్యక్తులు 'నకరం' అనే పేరుగల శ్రేణిద్వారా వ్యాపారాభివృద్ధికి వివిధ కార్యక్రమాలు చేపట్టారు. వీరు తమ కుల ప్రాధాన్యాన్ని తెలియచేస్తూ, విపులమైన కులపురాణం రాసుకున్నారు. ఉన్నత సామాజిక స్థాయిని అపేక్షించిన వారిలో బెజవాడ ప్రాంతంలోని తెలికవారు అతి ముఖ్యులని బర్టన్ స్టైన్ రాశాడు.[2] నాటి ముఖ్యవృత్తికారుల్లో, ఒకరైన పంబాణం వారు కల్పించిన ఐతిహ్యం,

'పంబాణం వారి పితామహుడైన విశ్వకర్మ బ్రహ్మపుత్రుడు,
ఈతడు సూర్యునికి మామ. తన అల్లుడైన సూర్యుడి
కిరణాలనుండి విష్ణువుకి చక్రాన్ని తయారుచేసినట్లు, విశ్వకర్మ
సంతానంలో కొందరు శివలింగాన్ని నిర్మించడంలో ప్రవీణులైనట్లు,
తెలుపుకున్నారు. విశ్వకర్మ సంతానంలో ప్రథముడైన 'మను'
ఇనుము పని, రెండవవాడైన 'మయ' వడ్రంగం, మూడవవ్యక్తి,
తామ్రం, కంచు, రాగి ఇతర లోహాలు. 'విశ్వజ్ఞుడు' బంగారు,

1. N. Venkataramanayya: The History of Eastern Chalukyas, P.286.

2. Burton Stein: Peasant State and Society in Medieval South India, P.200.

వెండి నగల తయారీలో నిపుణులు.[1]

ఈ ఇతివృత్తం తమ ప్రత్యేకతను, ప్రాచీనతను చాటుకోవడానికి సృష్టించినదని సులభంగానే అర్థమవుతుంది. వీరు బ్రాహ్మణులకంటె ఉన్నతులుగా గోబ్రాహ్మణులుగా, విశ్వబ్రాహ్మణులుగా ప్రకటించుకుంటారు. ఆచారి, భట్టార్ అని బ్రాహ్మణులకు తుల్యంగా తమనామానికి చివరలో ఉపయోగిస్తారు. యజ్ఞోపవీతం ధరిస్తారు. కొందరు శాకాహారులుగా ప్రకటించుకుంటారు. వారి కుటుంబాలలో జరిగే వివిధ కర్మకాండలను స్వయంగా నిర్వహించుకుంటారు.[2] ఇలా, సమాజంలో ఉన్నత వర్గాల నుండి అంత్యజుల వరకూ తమ తమ మూలాల పవిత్రతను తమకుగల ప్రత్యేకతను చాటుకునేవారు. దీనివల్ల, తమ జన్మవల్ల, వృత్తివల్ల ఉండే హీనభావనను అధిగమించడానికి ప్రయత్నించేవారు. వివిధకులాలు తమ కులానికి సంబంధించిన ఐతిహ్యాలను ప్రచారం చేసుకోవడం ద్వారా మత, రాజ్య కార్యాలలో పాల్గొనడానికి అవకాశం సంపాదించేవారు. వర్ణవిధానంలో తమ ప్రత్యేకతను చాటుకోవాలన్న ఆకాంక్షతోపాటు రాజ్యంలో ప్రాధాన్యాన్ని పెంపొందించుకోవాలని జరిపిన ప్రయత్నం సంఘర్షణకు దారితీసి ఉత్పాదక వర్గాలను రెండు వర్గాలుగా చేసింది.

<u>సామాజిక చలనం - వివిధవర్గాలమధ్య సంఘర్షణ</u>

ఉత్పాదక వర్గంలోని రెండు శాఖలను తమిళప్రాంతంలో వలంగై, ఇడంగై శాఖలుగా, కన్నడదేశంలో బలగై, ఇడగై శాఖలుగా ఆంధ్రదేశంలో కుడి, ఎడమ

---

1. Cf. A. Appadurai: Economic and Political Conditions. pp. 368-9.
2. Edgar Thurston & K. Rangachari: Castes and Tribes of Southern India, Vol. III, P.118.

కులాలుగా పిలుస్తారు. ఈ శాఖలు ఏర్పడిన స్పష్టమైన కాలాన్నిగాని, ఇదమిత్థమైన కారణాలనుగాని ఇవ్వడానికి అవకాశంలేదని పరిశోధకులు భావిస్తున్నారు.[1] కుడి, ఎడమ కులాలమధ్య సంఘర్షణకుగల కారణాలను వివరించడంలో అనేక సమస్యలున్నప్పటికీ కులాలమధ్యగల అంతస్సంఘర్షణను క్రీ.శ. 10వ శతాబ్దంనుండి గుర్తించవచ్చు. తమిళప్రాంతంలో ఈ రెండువర్గాలమధ్య సంఘర్షణ క్రీ. శ. 10వ శతాబ్దంనుండి ఉన్నట్లు, రాజేంద్రచోళుడి శాసనాలు తెలుపుతున్నాయి.[2]

కుడి, ఎడమ కులాల ఆవిర్భావానికి పరిశోధకులు ఆర్థిక, మత, రాజకీయ కారణాలను పేర్కొంటున్నారు. ఈశాఖలకు సంబంధించిన చరిత్రను పరిశీలించిన టి. డబ్ల్యు. ఎల్లిస్ పరప్రాంతీయులకు స్థానికులకు మధ్య ఏర్పడిన సంఘర్షణ రెండు వర్గాలుగా చీలడానికి కారణమని భావించారు.[3] ఈ అభిప్రాయాన్ని ఖండిస్తూ,

---

1. ఈ అంశంపై విపుల పరిశోధన జరిపిన Burton Stein అభిప్రాయం:

   "The categories of caste, sect and territory fails to help in an understanding of their dual divisions in South India because the divisions are different from each and all and because atleast in the early period under consideration, the scope of these three social categories were very highly localized whereas the dual divisions appear to be essentially supralocal in character".

   Burton Stein: Peasant state and society in Medieval South India, P.176.

2. See, C.S. Srinivasachary: "The origin of the Right and Left hand castes division" in JAHRS, Vol.IV, P.79.

3. See, Gustav Oppert: The Dravidians, P.62.

గుస్తావ్ ఒపర్ట్ [Gustav Oppert] నగరాలలో ఉండే వృత్తికారులను జైనమతీయులు, గ్రామీణప్రాంతంలోని రైతాంగాన్ని బ్రాహ్మణులు ఆకర్షించడానికి ప్రయత్నించారని, ఈ రెండు మతవిశ్వాసాల కారణంగా వృత్తికారులు, రైతులు రెండుశాఖలుగా ఏర్పడ్డారని రాశాడు.[1]

కుడి, ఎడమ శాఖాభేదాలలో ఒక వృత్తిని నిర్వహించేవారంతా ఒకే పక్షానికి చెందినవారనే స్పష్టమైన విభజన లేదు.[2] ఎందుకంటే వ్యాపారమే వృత్తిగా గలిగిన బలిజ, బనజిగా, కోమటి, వెల్లాన్ చెట్టి కుడిచేతి కులానికి చెందినవారుకాగా, బేరిచెట్టి, వనియాలు ఎడమచేతి కులానికి చెందినవారు. అలాగే నేతగాండ్లలో జాండ్ర, సాలి, సేనియాలు కుడి చేతి కులానికి చెందినవారుకాగా, దేవాంగ, కైకలోన్ ఎడమచేతి కులాలకు సంబంధించినవారు. చర్మకారుల్లో, మాదిగ, చెక్కిలియన్లను కుడిచేతికులాలుగా పేర్కొనగా, ఆ వర్గానికి చెందిన పురుషులను ఎడమచేతి కులాలుగా పరిగణించేవారు. అయితే పంచాణంవారు మాత్రం కుడిచేతి కులాల్లోలేరు. వీరంతా ఎడమచేతి కులానికి చెందినవారుగా గుర్తింపు పొందారు. అందువల్ల, కుడి, ఎడమ చేతి కులాల విభజన స్పష్టంగా లేకపోయినా కుడి చేతి

---

1. ibid.
2. (a) See, C.S. Srinivasachary: "The origin of the Right and Left hand castes division" in JAHRS, Vol. IV, P.

   (b) "There was no logical basis for the division of castes into idangai and valangai is proved by the fact that while the men of the Chakkiliyar and palli castes belonged to the left hand the women of their caste were classified as right hand".
   Vijaya Ramaswamy: Textiles and Weavers, P.108.

కులాలకు ఆధిక్యత ఉన్నట్లు తెలుస్తుంది. ఎడమచేతి కులాలు కొన్ని ప్రత్యేక సందర్భాలలో కుడిచేతి కులాల గుర్తింపు పొందడానికి ప్రయత్నించేవి.[1]

కుడి, ఎడమశాఖా భేదాలలో బ్రాహ్మణులకు సంబంధం లేకపోయినా ఎడమచేతి కులాలకు నాయకత్వం వహించే పంచాణం వారు బ్రాహ్మణులతో సంఘర్షించగా, కుడిచేతి కులాలవారు బ్రాహ్మణులతో దగ్గరి సంబంధాలు కలిగి ఉండేవారు.

సామాజిక జీవనంలో విశిష్టతను సంతరించుకోవడానికి ఉత్పాదక వర్గాలు ప్రయత్నం జరుపుతున్న తరుణంలో కులవిధానంపట్ల, ఆధిపత్యవర్గాలపట్ల, నూతన భావాలను ప్రచారంచేస్తున్న వీరశైవ, వైష్ణవ మతాలు సామాజికస్థాయికోసం ప్రయత్నిస్తున్న వర్గాలను ఆకర్షించగలిగాయి. వీరశైవ, వైష్ణవ మతాలు బ్రాహ్మణ నిరసన చేసినప్పటికీ ఈ రెండింటికి భిన్న లక్షణాలున్నాయి. వీరశైవ మతం బ్రాహ్మణ విధానాన్ని తీవ్రంగా నిరాకరించి ప్రత్యేక విశ్వాసాలను, నియమాలను ఏర్పరుచుకుంది. (వీరశైవ మత ఆచారాలు గత ప్రకరణంలో చర్చితమైనాయి). ఈ మతాలను అనుసరించినవారిలో సహితం ఈ లక్షణాలు కనిపిస్తాయి.

---

1. "The improvement in the economic status of some of these castes, especially the weavers produced rivalry for social mobility and enhanced ritual status. This is expressed in their attempts to be upgraded with in this paradigm from the left hand (lower) to the right hand (higher) status groups".

   R. Champakalakshmi: Urbanization in South India, P.76.

బ్రాహ్మణులతో తీవ్రవిరుద్ధం లేని కుడిపేరి కులాలను వైష్ణవ మతం ఆకర్షించింది. ముఖ్యంగా వ్యవసాయదారులను, నేతగాండ్రను వైష్ణవమతం ఆకర్షించినట్లు, దానిని వారు అనుసరించినట్లు, సాహిత్యాధారాలు నిరూపిస్తున్నాయి. ఈ సందర్భంలో ఆంధ్రదేశంలో వీరశైవమతాన్ని ప్రచారం చేసిన పాల్కురికి సోమనాథుడిని, వైష్ణవ మతాన్ని ప్రచారం చేసిన అన్నమయ్యను ప్రస్తావించాలి.

పాల్కురికి సోమనాథుడి రచనల్లో తీవ్రస్థాయిలో బ్రాహ్మణ నిరసన ఉంటుంది. (పలు సందర్భాలలో బ్రాహ్మణులను మాలలు, తోటిమాలలు, వేదాలను మోసే గార్దభాలు అని దూషించాడు). ఈతడి రచనల్లో పలుమార్లు పంచాణం వారి వృత్తులకు సంబంధించిన ఉపమానాలు ఉపయోగితమైనాయి. ద్విపద ఛందస్సును గూర్చి చర్చించే సందర్భంలో,

1. సొమ్మైన రత్నంబు మెట్టునం బసిడి
   గట్టిన భావన ...

2. వేళ్ళ ముద్రిక రత్నకీలన సేయు
   చోలేషమైన వచ్చును రత్నమొక్కొ
   సొమ్మైన రత్నంబు మెట్టును బసిడి
   గట్టుట యది వివేకంబు (పండితారాధ్య చరిత్ర, పే. 5.)

మరొక సందర్భంలో

'' ... అగ్ని సాన్నిధ్యత గాక

యినుము దానగనేర్చునే యుదకములు? (పండితారాధ్య చరిత్ర , పే.50.)

ఈ ఉపమానాలు సోమనాథుడికి పంచాణం వృత్తితో గల సంబంధాన్ని, ప్రావీణ్యాన్ని సూచిస్తాయి. ఈ అంశాలే పాల్కురికి సోమనాథుడిని కంసాలిగా ఊహించడానికి అవకాశమిస్తున్నాయి.[1]

సోమనాథుడు గ్రామీణ జీవితంలోని వివిధ వృత్తులకు చెందిన ఉపమానాలను ఉపయోగించాడు. కాని సోమనాథుడి కాలంనాటికి పంచాణం వృత్తికి సమాజంలో ఉన్న గౌరవం, ఆ వృత్తికారులు సామాజికంగా ఉన్నతస్థితిని పొందడానికి జరుపుతున్న ప్రయత్నం, సోమనాథుడు అనేక సందర్భాలలో పంచాణం వృత్తికి సంబంధించిన ఉపమానాలను ఉపయోగించడం వీరశైవ మతానికి విశ్వబ్రాహ్మణులకు మధ్య ఉన్న సంబంధాన్ని సూచిస్తాయి.

ఇదే సందర్భంలో వైష్ణవ మతానికి సంబంధించిన అన్నమయ్య రచనలను పరిశీలిస్తే, ఒక గేయంలో వేంకటేశ్వరుడిపై గల భక్తిని వ్యవసాయంతోనూ, మరొక గేయంలో వేంకటేశ్వరుని నేతగాడిగాను వర్ణిస్తాడు.

---

1. See, V. Narayana Rao: Sivas Warriors. Introduction, P-27

''పంటల భాగ్యులు వీరా బహువ్యవసాయులు
అంటి మొక్కి యిట్లు కాపాడుదురు ఘనులు ।।పంటల।।

పాత్కుల పాపము నేటి పాడునరికివేసి
చిత్తమనెడి చేను చేనుగా దున్ని
మత్తిలి శాంతమనే మంచివాన పదునున
విత్తుదురు హరిభక్తి వివేకులు ।।పంటల।।

(అధ్యాత్మ సంకీర్తనలు - , పే. 359.)

భక్తులను రైతులుగా, భక్తిని వ్యవసాయంతోనూ పోల్చినట్లే, వేంకటేశ్వరుడిని నేతగాడిగా, వస్త్రాలమ్మే వ్యాపారిగా వర్ణిస్తాడు.

'' పంచ భూతములనెడి పలువన్నెనూలు
చంచలపు గంజివోసి చరిసేసి
కొంచెపు కండెలనూలు గుణములనేసి
మంచి మంచి చీరలమ్మే మారు బేహారి

వాడల వాడల వెంట వాడివో వాడివో
నీడనుండి చీరలమ్మే నేత బేహారి'' (అధ్యాత్మ సంకీర్తనలు, పద్యం. 177.)

ఇంతకుముందే ప్రస్తావించినట్లు, పద్మావతీ ఆలయ నిర్మాణానికి పద్మశాలీల ఆర్థిక

సహాయం, వేంకటేశ్వరుని నేతగాడుగా పోల్చిన అంశాలను పరికిస్తే, ఈ వృత్తివారికి వైష్ణవ మతంతో ఉన్న సంబంధాలు విశదమవుతాయి.

విజయనగర కాలంలో ముఖ్యంగా 15, 16 శతాబ్దుల్లో, వృత్తికారులకు సామాజిక జీవనంలో ముఖ్యమైన పాత్ర ఉండేదని నాటి నేతవృత్తిపై పరిశోధన జరిపిన పరిశోధకులు తెలుపుతున్నారు.

"From the evidence of the various privileges conferred on weavers, especially the Kaikkolar, it becomes very clear that there was an upward movement among them, for the Social privileges accorded to them. Sangu, Tandu etc. (leather musical instrument and golden musical instrument) are more numerous in the Vijayanagara period than in the Cola period. It is essential to note that this upward mobility was not an isolated phenomenon among just one narrow section of South Indian Society but comprised several of the influential professional groups. The tanner, the oilmen and, more especially, the Kammalar or Pancalar (the groups of five smiths)

these groups aspired for social and ritual recognition and this reflected in their large scale participation in the Virasaiva or Lingayat movements and in the Tengalai - Vaishnavite movement. It is also reflected in an equal degree in the right hand,left hand ferment in society, in their acts of co-operation as well as their conflicts and schisms"[1].

వీరశైవ, వైష్ణవ మతాలు రెండూ సమాజంలో వృద్ధి చెందుతున్న ప్రధాన వృత్తికారులను ఆకర్షించాయి. ఎడమ చేతి కులాలకు నాయకత్వం వహించిన పంచాణం వారు బ్రాహ్మణులతో ఉన్న సంఘర్షణ వల్ల, బ్రాహ్మణ సంప్రదాయాలతో తీవ్రంగా విభేదించే వీరశైవ మతంలో చేరగా, బ్రాహ్మణ విధానాలతో పరిమితమైన విభేదాలు గల వైష్ణవ మతంలో వ్యవసాయదారులు, నేతగాండ్రు చేరినట్లు గుర్తించవచ్చు. ఈ ఉత్పాదక వర్గాలు సామాజిక స్థాయిని ఆపేక్షించి జరిపిన ప్రయత్నానికి వీరశైవ - వైష్ణవ మతోద్యమాలు దోహదపడ్డాయి.

వీరశైవ, వైష్ణవ మతాలు ఉత్పాదక వర్గాలతో కొంతమేరకయినా సంబంధాలు కలిగి ఉండడం వల్లనే సమాజంలో అనుసరించదగిన నైతిక నియమాల గురించి వర్ణించారు.

---

1. Vijaya Ramaswamy: Textiles and Weavers in South India, P.107.

## వీరశైవ, వైష్ణవమతాలు - నైతిక నియమాలు

జీవితంలో నైతిక నియమాలను అనుసరించవలసిన అవసరం ఎప్పుడూ ఉన్నప్పటికీ ఈ రెండుమతాలకు చెందిన కవులు ప్రత్యేకంగా ప్రస్తావించారు. పాల్కురికి సోమనాథుడు శ్రమద్వారానే జీవితం కొనసాగించాలని, జంగములు పరిమితంగా ఆర్థిక వనరులను ఉపయోగించుకోవాలని పేర్కొంటే, అన్నమయ్య పరులధనానికి ఆశపడగూడదని, ఆశలను తగ్గించుకోవాలని తెలుపుతాడు.

వీరశైవ, వైష్ణవ మతాలు ప్రస్తావించిన నైతిక అంశాలు పాశ్చాత్యదేశాల్లో క్రీ.శ. 16వ శతాబ్దినాటి ప్రొటెస్టెంట్ మతం ప్రబోధించిన నైతిక విలువలను తలపింపజేస్తాయి. భగవంతుని అనుజ్ఞ ప్రకారం ఇహలోకంలో జీవిస్తున్న మానవుడు తన దైనిక కార్యాల్లో శ్రమ ద్వారానే జీవితం కొనసాగించాలని, ధనం పట్ల నిర్మమకారంతో ఉండాలని ఇంద్రియ వాంఛలను త్యజించాలని పేర్కోవడంతో పాటు వారు పలు నియమాలు విధించారు. "Not leisure and enjoyment but only activity serves to increase the glory of God, according to the definite manifestations of His will. Waste of time is thus the first and in principle the deadliest of sins. The span of human life is infinitely short and precious to make sure of

one's own election. Loss of time through sociability, idle talk, luxury, even more sleep than is necessary for health, six to atmost eight hours is worthy of absolute moral condemnation".[1] ప్రొటెస్టెంట్లు అనవసర ఆడంబరాలను వ్యతిరేకిస్తూ, నియమబద్ధంగా జీవించాలని పేర్కొనడానికి ఆనాటి ప్రభుస్వామ్యాన్ని వ్యతిరేకించడమే కారణం.[2] ప్రొటెస్టెంట్లు, విధించిన నియమాలను వ్యతిరేకించి సౌఖ్యాలకై ఆకాంక్షించిన వారు నాటి ప్రభువుల పాలనలో ఆధిపత్యం వహిస్తున్న వర్గాలే. ప్రొటెస్టెంట్లు భావాలు ఆనాటి మధ్య తరగతి ప్రజలను బలంగా ఆకర్షించాయి. వారు సమయపాలన చేస్తూ, క్రమబద్ధమైన జీవితం కొనసాగించడం, అధికంగా శ్రమించి పరిమితంగా ఖర్చుచేయడం ద్వారా డబ్బును పోగు చేయడానికి వీలయిందని, అది నూతన ఆర్థిక విధానానికి పునాది వేసిందని మాక్స్ వెబర్ వివరించాడు.

ప్రొటెస్టెంట్ మతం సామాజిక రంగంలో నిర్వహించిన పాత్రను వీరశైవ, వైష్ణవ మతాలు నిర్వహించలేకపోయాయి. వీరశైవ, వైష్ణవ మతాలను అనుసరించిన వారి సంఖ్య అతి పరిమితంగా ఉండటమేగాక తమ భావాలను సామాజికులచే అనుసరింప చేయాలన్న ఆకాంక్ష అనుయాయులకు బలంగా ఉన్నట్లు కనిపించదు. పాల్కురికి సోమనాథుడు ఆర్థిక, నైతిక అంశాలను ఒక్క 'అనుభవసారం' కావ్యంలోనే వర్ణించాడు.

---

1. Max Weber; The Protestant Ethic and the Spirit of Capitalism, PP.157-58.

2. - ibid. , P.167.

ఇతర కావ్యాల్లో వాటిని ప్రస్తావించకపోవడానికి ఒక ఊహ చేయవచ్చు. సోమనాథుడు వీరశైవ మతానికి నిర్దుష్టమైన శాస్త్రీక రూపమిచ్చి ఆ మతానికి ప్రామాణికత్వం తీసుకు రావడానికి జరిపిన ప్రయత్నం వల్ల, అతని లక్ష్యం మారే అవకాశం ఉంది. అందువల్లే ఆర్థిక, నైతిక అంశాల చర్చను విస్మరించవచ్చు. అయితే వీరశైవ, వైష్ణవ మతాలు బ్రాహ్మణాధిపత్యాన్ని నిరసించి శ్రామికజీవనం పట్ల గౌరవభావాన్ని ప్రకటించడం వల్ల, వారు శ్రమను, నియమబద్ధ జీవితాన్ని వర్ణించారని ఊహించవచ్చు.

పాల్కురికి సోమనాథుడు శ్రమ ప్రాధాన్యాన్ని పేర్కొనడంలో కన్నడదేశంలో వీరశైవులు ప్రచారంచేసిన భావాల ప్రభావం ఉంది. ఆ మతాన్ని ప్రచారం చేసిన వారిలో ఒకరైన జేడరదాసిమయ్య 'కాయకవే కైలాసః' అనే భావాన్ని ప్రబోధించగా, బసవన్న శ్రమజీవనాన్ని గూర్చి

''వ్యవసాయము చేతునయ్యా గురుకైంకర్యమునకు
వ్యవహారము చేతునయ్యా లింగార్చనకు,
పరుల కూడిగమునేరింతు; జంగమ
దాసోహమునకు ; ఏయే కర్మల నేయేగతి
చేసినా, ఆ కర్మ ఫల భోగము విధిగా
నే విశ్వమునుము నేనెఱిగితి ....'' నని పేర్కొంటాడు

(బసవేశ్వర వచనాలు, వచనం. 707.)

సమాజంలోని ఏవృత్తిని నిర్వహించడమైనా పవిత్ర జీవనంలో భాగంగానే బసవన తెలిపాడు. గురు, లింగ, జంగమార్చనకోసమై పలువృత్తులను నిర్వహించడానికి సంసిద్ధతను తెలియజేస్తూ,

''కష్టములకు వెరచు భటుడగానయ్యా
పనిజెఱచి పరుగిడు భటుడగానయ్యా''

(బసవేశ్వర వచనాలు, వచనం 697.)

''కాయముడుగునందాక కష్టింతు'' నంటూ శ్రమజీవనం పట్ల తన

(బసవేశ్వర వచనాలు, వచనం 703.)

సంసిద్ధతను వ్యక్తీకరిస్తాడు.

వీరశైవులకు శ్రామిక జీవనంతో ఉన్న సంబంధం వల్ల, న్యాయసమ్మతంగా ధనాన్ని సంపాదించాలని బోధించడమేగాక అటువంటి ధనాన్నే జంగములు స్వీకరించాలనే నియమాన్ని బసవన విధించాడు. తన మతాన్ని ధనవంతులకు బోధించలేనని, తనకం కావలసిన పరిమితమైన ఆహారం కోసం ధనవంతులకు తన మతాన్ని ఉపదేశించి జంగములకు దూరమవలేనని స్పష్టపరుస్తాడు.

ఒడ్డుపాటి మనిషి గానయ్యా
పెద్ద కడుపు నాకు లేదయ్యా
దొడ్డ వారినిగాని నే శరణులు మన్నింపరయ్యా

వడుపుకూడు తిను వేశ్యగ

వెదకి వెదకి ధనికులకు బోధింప పొగ్డింప

నే తెలియనయ్యా ! వెద్దటికము నాకు లేదు -

(బసవేశ్వర వచనాలు, వచనం. 413.)

అక్రమ పద్ధతిలో డబ్బు సంపాదించే వ్యక్తి, ఒక దేశమిచ్చినా గ్రహించగూడదని శ్రమించడం ద్వారా వచ్చిన డబ్బును మాత్రమే స్వీకరించాలంటాడు.[1] సంపన్నవర్గంచే నిర్మితమయ్యే దేవాలయాలను సహితం ఉన్నతమైనవిగా తలచలేదు.

''కలవారు శివాలయము కట్టెదరు

నేనేమి సేయుదు బడుగునయ్యా

నాకాలే కంభము దేహమే దేవళము

తలయే మెడి కలశమయ్యా....

స్థావరము చెడుగాని జంగమము చెడదయ్యా''

(బసవేశ్వర వచనాలు, వచనం 818.)

తాను దేవాలయం నిర్మించలేనని, తన శరీరాన్ని దేవాలయంగా భావించాడు. స్థిరంగా ఉండే దేవాలయం కూలిపోతుంది. సంచరించే జంగముడే చిరకాలం ఉంటాడని బసవన తెలిపాడు. జంగముడు దైవానికి మరో రూపమని తలచాడు.

---

1. బసవేశ్వర వచనాలు, వచనం. 358.

కన్నడ వీరశైవ సంప్రదాయాన్ని అనుసరించిన సోమనాథుడు శ్రమజీవనాన్ని నైతిక విలువలను ప్రశంసిస్తూ,

“ అలయకపోవి దున్నియును సంకవమిఁ జొప్పియు...ముక్తిమై
గొలిచియుఁ జోరుచ్చు, చేసియుఁ గూలి యొనర్చియు విద్య చూపియున్
వలి వ్యవహార మాడియున్ వారకవన్నులఁ బడ్డగాని తా
గలుగదు భుక్తి, ముక్తియుఁగలుగని సోమరి వట్టి మాటలన్”

(అనుభవసారం, పద్యం 100.)

అని పేర్కొన్నాడు. వివిధ వృత్తుల్లో దక్షత ప్రదర్శించడం వల్లనే ఆహార సంపాదనకు వీలవుతుంది. సోమరిగా జీవించడం వల్ల భక్తిగాని, ముక్తిగాని లభించవంటాడు.

సోమనాథుడే సామాజికులు వ్యవసాయం నిర్వహించవలసిన అవసరాన్ని

“అర్థార్థమువు వ్యవసాయం
ధర్మము జంగమహితార్థ మదియును సద్ధ
క్షర్థము, సద్భక్తియు ము
క్త్యర్థం, బటుగానవలయు వ్యవసాయ మిలన్” అంటూ

(అనుభవసారం, పద్యం. 138.)

వ్యవసాయమే గాక భక్తులక్కి ధనాన్ని సంపాదించడానికి వాణిజ్యం, విద్య లాంటి మార్గాలను సూచిస్తాడు.

'' వెలయుం గృషి వాణిజ్యకు
శల విద్యావర్తనములు సలుపగ సద్భ
క్తుల కర్థం బార్జింపగ
నిల భక్తార్థంబె కానయిలమి మహాత్మా ! ''

(అనుభవసారం, పద్యం. 143.)

సామాజికులు శ్రమద్వారా సంపాదించిన డబ్బును జంగమములకు దానం చెయ్యడమే భక్తియని అదే ముక్తికి హేతువుగా మారుతుందని వివరిస్తాడు. ఇలా, సామాజికుల శ్రమ ఫలితంగా పొందిన డబ్బును జంగములు వృథాపరమగూడదనే నియమాన్ని పేర్కొంటాడు.

'' ఎన్ని ముఖంబుల నర్థము
బన్నుగ బడసియును వారుఁ బడసితి మనర
త్సన్నతి గుడువరు ముడువరు
చెన్నజీవనములకు వ్యయంబు సేయరు భక్తుల్ ''

(అనుభవసారం, పద్యం. 145.)

సామాజికులు అనుసరించవలసిన నియమాలను గూర్చి సోమనాథుడు పేర్కొనినట్లు, అన్నమయ్య పలు నైతిక నియమాలను ప్రబోధించాడు.

అన్నమయ్య నైతిక విలువలను ప్రశంసించడంలో నాటి ప్రజల జీవన

విధానం పట్ల సున్నితమైన వ్యతిరేకత కనిపిస్తుంది. రాచరిక విధానంలో ప్రభువులు ప్రజలనుండి బలవంతంగా పన్నులు వసూలు చేయడం, ధనాన్ని ఆడంబరాలకు, ఇంద్రియ సౌఖ్యాలకు ఉపయోగించడం అతి సహజంగా కనిపించే అంశాలు. వీటిని అన్నమయ్య గర్హించాడు.

" వెట్టి లంపటాల బడి వెడ బొరలుట కంటె
పుట్టిన విరతి నూరకుండుటే సుఖము .... ॥వెట్టి॥

...

పరులఁ బీడించితేని పసిడొక్కటే సుఖము
గరిమె నిజముతోడి గల మాటలే సుఖము"

(అధ్యాత్మ సంకీర్తనలు, కీర్తన, 159, (సం. యు. శ్రీనివాసాచార్యులు)

పరులను పీడించి సౌఖ్యాలను అనుభవించడం పాలకులకు, పాలనలో భాగస్వాములకు మాత్రమే పరిమితం. వారి విలాసాలకోసమై రైతులను, వృత్తికారులను పలు బాధలకు గురిచేసిన సంఘటనలు చరిత్రలో అమితంగా కనబడతాయి.[1] అన్నమయ్య రాచరిక విధానాన్ని నిరసించడానికి వారి జీవన విధానం ఒక కారణం.

రాజులు పరుల సంపదకు ఆశపడడం అవివేకమని తలచాడు.

---

1. See, Chapter-II.

''పరధనముల యాస పాసినగాక
అరిది సిందలు లేని యప్పుడు గాక
విరసవర్తనము విడిచిన గాక
పరమేల కలుగు నాపద లేలమాను

ఎంత నదివిన నేమి వినిన తన
చింతయేల మాను సిరులేల కలుగు ॥ఎంత॥

(అధ్యాత్మ సంకీర్తనలు, కీర్తన, 62. (సం.) వేటూరి ప్రభాకరశాస్త్రి)

అంటూ ధనాన్ని వ్యతిరేకించిన అన్నమయ్య నాళ్యాలపట్ల విరక్తిని ప్రకటిస్తాడు. ధనం పట్ల నిర్మమకారాన్ని గలిగిన అన్నమయ్య వేంకటేశ్వరునిపట్ల భక్తి గలిగి ఉండడమే నిజమైన ధనమని వివరిస్తూ,

'' విరతి నా ధనము విజ్ఞానమే ధనము
మరిగిన తత్త్వమే నా ధనము
పరము నా ధనము భక్తి నాధనము నా
కరి రాజవరదుడే కైవల్య ధనము''

(అధ్యాత్మ సంకీర్తనలు, Vol.VII కీర్తన 223.)

అని వైరాగ్యంలో గల ఆనందాన్ని వేర్కొంటాడు. అన్నమయ్య వైరాగ్యాన్ని ప్రబోధించి నప్పటికీ అది సంసారాన్ని త్యజించే సన్యాసస్థితి కాదు. ప్రభువుల విలాసజీవితాలన్నై

విముఖత ప్రదర్శించిన అన్నమయ్య సాధారణ జీవితాన్ని వాంఛించాడు. ఆయన దృష్టిలో జీవితం అంటే అప్పులేకపోవడం, దోషరహితంగా డబ్బు సంపాదించగలగడం, నివాసయోగ్యమైన ఇల్లు కలిగి ఉండడం.

'' అప్పులేని సంసారమైన పాటే చాలు
తప్పులేని జీతమొక్క తారమైనంజాలు
కంతలేని గుడిశొక్క గంపంతైనం జాలు
చింతలేని యంబలొక్క చేరడేచాలు
జతగాని తరుణి యే జాతైన నదేచాలు
వెతలేని సంపదొక్క వీసమే చాలు'' ॥అప్పు॥

(అధ్యాత్మ సంకీర్తనలు, Vol. II, కీర్తన, 114).

అన్నమయ్య సాధారణ జీవితాన్నే ఆశించినప్పటికీ జీవితాన్ని ప్రయత్నపూర్వకంగా సుఖవంతం చేసుకోవాల్సిన అవసరాన్ని పేర్కొంటాడు. ఉత్పాదక రంగంలో కృషి జరపవలసిన అవసరాన్ని నేరుగా ప్రబోధించలేదు గాని, ప్రయత్నం వల్ల కలిగే ఫలితాన్ని వివరిస్తాడు. కాలాన్ని వ్యర్థపరిచే సోమరితనాన్ని ఖండిస్తాడు.

'' మహినుద్యోగి గావలె మనుజుడైన వాడు
సహజివలె నుండేమీ సాధించలేడు
వేడుకతోఁ జదివితే వేదశాస్త్ర సంపన్నుడౌ
జాడతో నూరకుండితే జడుడౌను

వాడక తపసియైతే పున్నెలోకమునఁదా

కూడక సోమరియైతే గుణహీనుఁడౌను ||మహి||

వెదకి తలఁచుకొంటే విష్ణుఁడు గానవచ్చు

చెదరి మఱచితే సృష్టి చీకటౌ

పొదలి నడచితేను భూమెల్లా మెచ్చవచ్చు

నిదురించితే కాలము నిమిషమై తోఁచు'' ||మహి||

(ఆధ్యాత్మ సంకీర్తనలు, కీర్తన, 212. (సం.
యు. శ్రీనివాసాచార్యులు)

కృషి అవసరాన్ని, జీవితంలో అనుసరించవలసిన నియమాలను పేర్కొనడం ద్వారా నాటి విశ్రాంతివర్గంపట్ల తన అభిప్రాయాలను వివరించగలిగాడు.

## రాజాస్థానానికి ప్రత్యామ్నాయంగా-దేవస్థానం

అన్నమయ్య జీవితంలోని ముఖ్యమైన అంశాల్లో రాజనిరసన ఒకటి. రాజులనే గాక రాజకీర్తనను సహితం ఆక్షేపిస్తూ తెలిపిన అభిప్రాయాలు అనేక గేయాలలో ఉన్నాయి. అయితే ఆయనను రాచరిక విధానాన్ని నిరాకరించిన వ్యక్తిగా పరిగణించలేము. తొలిరోజుల్లో సాళ్వ నరసింగరాయుడితో స్నేహం చేసి ఉన్నాడు. అన్నమయ్యకు రాజుతో సంబంధం ఉండినప్పటికీ రాజాస్థానంలోనే జీవించినవ్యక్తి కాదు. ఆయన తొలినుండే తిరుపతి దేవాలయం కేంద్రంగా జీవితం కొనసాగించాడు. అన్నమయ్య రచనా ప్రాశస్త్యాన్ని విని సాళ్వ నరసింగరాయుడు ఆహ్వానించగా,

'' సహజ వైష్ణవ భక్తి సరివెడు వాని
సహవాసమ్మున దోసము లేదటంచు
నతడు పట్టించిన యందలంబెక్కి
యతడు భుజంపాయిడ్చి కొల్వంగ ....''

(శ్రీ తాళ్ళపాక అన్నమయ్య జీవిత చరిత్ర, పే. 31.)

నరసింగరాయుడి ఆస్థానానికి వెళ్ళాడు. అతడు కోరిన రీతిలో వేంకటేశ్వరుణ్ణి కీర్తనలు పాడాడు. రాజు ఆనందించి నాటినుండి అన్నమయ్యతో మిత్రత్వం నెరిపాడు. మరొకమారు తన ఆస్థానానికి ఆహ్వానించి వేంకటేశ్వరుణ్ణి కీర్తన పాడుమని కోరగా అన్నమయ్య ఒక శృంగారగేయం పాడి వినిపించినపుడు దానిని మెచ్చి తనమీగూడా అటువంటి గేయమే ఒకటి చెప్పుమని కోరగా రాజుకోరికను అంగీకరించక వేంకటేశ్వర, అలమేల్మంగల జీవితాన్ని వర్ణించే తాను రాజును కీర్తించలేనని తెలుపగా రాజు కోపోద్రిక్తుడై అన్నమయ్యకు సంకెళ్ళు వేయించి జైల్లో పెట్టిస్తాడు. కాని వేంకటేశ్వరుని కీర్తించగానే ఆ సంకెళ్ళు వెంటనే ఊడిపోయినట్లు, ఆ మాహాత్మ్యానికి రాజు ఆశ్చర్యచకితుడై అన్నమయ్య పాదాలకు నమస్కరించి సగౌరవంగా పంపించినట్లు చిన్నన్న వర్ణించాడు. ఈ సంఘటనతోనే అన్నమయ్యకు రాజులపట్ల విముఖత ఏర్పడింది.

అన్నమయ్యకు రాజులపట్ల వ్యతిరేకత ఏర్పడడానికి మరొక కారణంగూడా ఉంది. రాజకుటుంబంలో వారసత్వం కోసం జరిగిన అంతర్గత సంఘర్షణ వారిపట్ల

అసహనాన్ని తీవ్రతరం చేసింది. అన్నమయ్యకాలంలో విజయనగర రాజ్యాన్ని మల్లికార్జున రాయలు (క్రీ.శ. 1446 - 1465) పరిపాలిస్తుండేవాడు. ఈతడు సమర్థవంతమైన రాజు కాకపోవడంవల్ల, పినతండ్రి కుమారుడు విరూపాక్ష రాయలు మల్లికార్జునుడిని సంహరించి రాజ్యాభిషిక్తుడయ్యాడు. విరూపాక్షుడు క్రీ. శ. 1465 - 1485 వరకు రాజ్యపాలన చేశాడు. ఈ విరూపాక్ష రాయలు దుశ్చరిత్రుడని, పాపకర్ముడని 'న్యూనిజ్' అనే విదేశీయాత్రికుడు పేర్కొనట్లు, నేలటూరి వెంకటరమణయ్య గారు రాశారు. అంతేగాక ''మల్లికార్జున రాయలను హత్యచేసి ఆక్రమించుకున్న విశాల విజయనగర సామ్రాజ్యమంతయూ యేలుబడిక్రింద విచ్ఛిన్నమై పోగడగినది. అతని దుష్కృత్యముల కోర్చుకొనజాలక జ్యేష్ఠ కుమారుడతనిని వధించెను''[1]. అయితే రాజ్యపాలన తాను చేయకుండా తన తమ్ముడైన ప్రౌఢదేవరాయలకు అధికారం అప్పగిస్తాడు. తండ్రిని చంపిన వ్యక్తి, తనను చంపడానికి సహితం వెనుదీయడని భావించి ప్రౌఢదేవరాయలు అన్నను సంహరిస్తాడు. ఈతడు గూడా తండ్రివలెనే దుశ్చరిత్రుడు. హీనసత్త్వుడు. దీనిని అవకాశంగా తీసుకుని సాళువ నరసనాయకుడు ప్రౌఢదేవరాయలను సంహరించి రాజ్యం వశం చేసుకుంటాడు. ఇట్లా విరూపాక్ష రాయలను తన తనయులే సంహరించడం, ప్రౌఢదేవరాయలు సోదరుణ్ణి చంపివేయడం అన్నమయ్యను కలచివేశాయి. రాజులకు అధికారం విషయంలో బంధుత్వాలు, అనురాగాలు ఉండవని నిజజీవితంలో అనుభవపూర్వకంగా చూశాడు. అందుకే

---

1. నేలటూరు వెంకటరమణయ్య : విజయనగర చరిత్ర (మొదటి భాగము) pp. 78-9.

''దేహమిచ్చిన వాని దివిరి చంపెడువాడు

ద్రోహిగాక నేడు దొరయటా ||దేహమిచ్చిన||

తోడబుట్టిన వాని దొడరి చంపెడువాడు

చూడ దుష్టుడుగాక సుకృతియట ...

కొడుకు నున్నతమతింగోరి చంపెడువాడు

కడుఁ బాతకుడు గాక ఘనుడటా....

తల్లిఁ జంపెడువాడు తలపదుష్టుడు గాక

యిల్లువారలకెల్ల నెక్కుడటా'' (అన్నమాచార్య చరిత్ర పీఠిక, పే.45)

అంటూ రాజులపట్ల, రాచరికంపట్ల తీవ్రవైమనస్యం ప్రకటించాడు. ఇటువంటి వ్యక్తులను పొగిడి వారివద్ద కానుకలను స్వీకరించడం హీనకృత్యంగా తలచాడు. అందువల్లే, రాజకీర్తనను ఖండించాడు.

అన్నమయ్య రాజుల చర్యలను తీవ్రంగా నిరసించడంతోపాటు రాజాస్థానాలను చేరి రాజుల గుణకీర్తనం చేసే విధానాన్ని గర్హించాడు. రాజకుటుంబాలలో ఉండే సంబంధాలను వారి నిరంకుశ విధానాలను పరిశీలించిన పిమ్మట వారిపట్ల తీవ్ర వైమనస్యం ఏర్పడింది. అనేక దుర్లక్షణాలతో కూడిన రాజుల ఆశ్రయం పొంది వారిని కీర్తించలేనని, జీవితంలో అనేక కష్టాలు ఎదురైనా నిరంతరం దైవాన్ని స్మరించడమే తనకు ఆనందమని పేర్కొన్నాడు.

''వసురమ్మ వెదలేని పాటు పడవమ్మగాక
కసివోనరులఁ బొగడగా వమ్మునా
ప్రసురుమాన్పె పుద్ధి వుండెన్నైనా వమ్మగాక
విసువక వారివారి వేసరించవమ్ము నా''

(ఆధ్యాత్మ సంకీర్తనలు, కీర్తన. 222, (సం.)
వేటూరి ప్రభాకరశాస్త్రి)

వ్యక్తిగత జీవితంలో బాధలను అనుభవించినప్పటికీ రాజులను కీర్తించడానికి వైముఖ్యం ప్రదర్శించాడు.

'' నరహరి కీర్తన నానిన జిహ్వ
వొరులనుతింపగా నోపదు జిహ్వ
మురహరు పదముల మొక్కిన శిరము
పరుల వందనకు బరగదు శిరము''

(ఆధ్యాత్మ సంకీర్తనలు, కీర్తన 144 (సం.)
యు. శ్రీనివాసాచార్యులు)

అంటూ భగవత్ సంకీర్తనం తప్ప అన్యులను కీర్తించలేనని పేర్కొంటాడు.

మధ్యయుగాలనాటి రాజులు రాజ్యాధిపత్యాన్ని సుస్థిరం చేసుకునే క్రమంలో తమ పరిపాలనార్హతను చాటుకోవడానికి రాజ్యం సౌఖ్యవంతంగా ఉందని చెప్పుకోవడానికి కవులను పోషించడం ఒక అవసరంగా రాజులు గుర్తించారు. కవులు రాజపోషణకు

ప్రతిఫలంగా తమ కావ్యాలను అంకితంచేసి రాజులకు శాశ్వతకీర్తిని సంపాదించి పెట్టేవారు. అందుకు ప్రతిగా కవులకు ఆర్థికసహాయం లభించేది. ఇలా, కవులవల్ల, రాజులకు, రాజులవల్ల, కవులకు కలిగే ప్రయోజనాన్ని లక్షణకారుడైన రాజశేఖరుడు తన 'కావ్య మీమాంస' లో ఇలా పేర్కొంటాడు.

''ఖ్యాతా నరాధిపతయః కవిసంశ్రయేణ ।
రాజాశ్రయేణ చగతాః కవయః ప్రసిద్ధిమ్
రాజ్ఞా సమోఽస్తి నకవేః పరమోపకారీ
రాజ్ఞే న చాస్తి కవినా సదృశః సహాయః ''

(కావ్యమీమాంస, VI - 31)

కవుల సహవాసం వల్ల, రాజులు, రాజాశ్రయం వల్ల, కవులు ప్రసిద్ధి పొందారు. కవికి రాజుతో సమానమైన పరమోపకారి లేడు. రాజుకు కవితో సమానమైన సహాయకారి లేడు.

రాజుకు, కవులవల్ల, చేకూరే ప్రయోజనం వారి పరాక్రమాన్ని లోక విదితం చేయడమని అన్నమయ్యకు కించిత్ పూర్వుడైన మడికి సింగన సంకలనం చేసిన 'సకలనీతిసమ్మతం' లో పేర్కొని ఉంది.[1] పరాక్రమోపేతుడైన రాముడి శరాగ్రంవల్ల,

---

1. ''ఆకులమతి, రాఘవుశరాగ్రము నందుఁ దృణాగ్రలగ్న నీ
రాకృతి వార్ధియింకుట దశాస్యునిఁ జంపుట విఖ్యగాదె వా
ల్మీకులు చెప్పకున్న కృతిలేని నరేశ్వరు వర్ణనంబు ర
త్నాకర వేష్టితావని వినంబడ దాతడు మేరు వెత్తినన్''

అమల మగు సప్తసంతా
నములం దనిశంబు యశమునకుఁ గుదుర్చి, నా
శము లేక నెగడు సత్కా
వ్యము ధారుణిలోన నాథులార్జని కందా (సకలనీతిసమ్మతం - I - 22, 23)

సముద్రంలోని నీరంతా ఇంకిపోవడం, రావణుని సంహరించడంలాంటి వీర కృత్యాలను వాల్మీకి వర్ణించి ఉండకపోతే రాముని ప్రత్యేకత లోకానికి తెలిసి ఉండేది కాదు. రాజు ఔన్నత్యాన్ని తెలియజేసే కవి లేనట్లయితే అతడు మేరు పర్వతాన్ని మోయగలిగి సృష్టికి సమాజానికి అతడి శక్తి తెలిసే అవకాశం లేదు. అందుకే సప్తసంతానాలలో కావ్యాన్ని ప్రశస్తమైనదిగా పరిగణిస్తారు. కావ్యానికి ఉన్న ప్రత్యేకత వల్లనే కవికి అధిక గౌరవం లభించింది. అందువల్లే సాళువ నరసింహనాయకుడు అన్నమయ్యతో తనను గూర్చి పొగడమని కోరాడు.

రాజాశ్రయాన్ని నిరాకరించిన అన్నమయ్య తిరుపతి వేంకటేశ్వరుడిని రాజుకు ప్రత్యామ్నాయంగా తలచాడు. "The temple poets looked upon their dieties as their Lords, whom they served, whose greatness they song, and who in their view were the only power to whom they owed allegiance. Since their 'kings' were gods, the king who sat in the palace was only a human being. The position of temple poets gave them the strength necessary to reject invitations from Kings".[1] ఆస్థానకవులు రాజు శౌర్యాన్ని, శృంగార జీవితాన్ని పొగిడినట్లే అన్నమయ్య వేంకటేశ్వరుని కీర్తించాడు. అతని గుణగణాలను వర్ణించడంతోపాటు వేంకటేశ్వర అలమేలుమంగల శృంగార జీవితాన్ని కూడా అదే పద్ధతిలో వర్ణించాడు. రాజు ఆనందం కోసమే

---

1. V. Narayana Rao: "Kings, Gods and Poets": Ideologies of Patronage in Medieval Andhra", in Powers of Art.

ఆస్థానకవులు ఆయనకు శృంగారంలో ఉన్న ప్రావీణ్యతను, శౌర్యాన్ని పొగిడినట్లే, అన్నమయ్య వేంకటేశ్వరుణ్ని వేలకొలది శృంగార సంకీర్తనలు చెప్పాడు.

అన్నమయ్య రాజులను నిరసించినా రాజులను పొగడడానికి విముఖత చూపినా అతని సంతతియైన చినతిరుమలాచార్య, చిన తిరువేంగళనాథుడు విజయనగర రాజ్యాన్ని పరిపాలించిన సదాశివరాయలనుండి దానాలు పొందినట్లు శాసనాధారాలు తెలుపుతున్నాయి.[1]

సాంప్రదాయికంగా అనుష్ఠింపబడే ఆచారాలను అన్నమయ్య ప్రశ్నించడం, కులాధిపత్యాన్ని నిరాకరించడం, ఆధ్యాత్మిక జీవితాన్ని సులభీకరించడం, సామాజిక దృగ్విషయాలపట్ల, అద్వైతుల మాయావాదాన్ని ఖండించడంలాంటి అంశాలు అతడికి ఒక ప్రత్యేక వ్యక్తిత్వాన్ని కూర్చిపెట్టేవే. అన్నమయ్య ఒక స్థాయిలో వీటన్నింటిపట్ల తన అభిప్రాయాలను వ్యక్తీకరించినప్పటికీ వీటిని తొలగించుకోవడానికి స్పృహతో కృషి సల్పినట్లు అతని జీవితం తెలియజేయడంలేదు. ఆయన తనభావాలను వివరిస్తూ, రచన చేసినప్పటికీ వాటిని ప్రజలలో చైతన్యవంతంగా ప్రచారం చేయకపోవడంతో ఆయన భావాలకు అనుసరణలేదు. అన్నమయ్య బ్రాహ్మణాధిపత్యాన్ని నిరాకరించినప్పటికీ కులవిధానానికి ప్రత్యామ్నాయాన్ని ప్రవేశపెట్టినవాడుకాదు. కేవలం బ్రాహ్మణేతర కులాలు సామాజిక స్థాయికోసం జరుపుతున్న ప్రయత్నానికి వైష్ణవమతం సామాజిక గుర్తింపు నివ్వడంతో (See, III-Chapter) వారి ఆశయం నెరవేరినట్లయింది.

1. విజయనగర పాలకుడైన సదాశివరాయలు క్రీ.శ. 1545లో తాళ్ళపాక తిరుమలయ్యకు, తిరువేంగళనాథునికి దానాలు ప్రకటించాడు.
See, Rev. Henry Heras: The Aravidu dynasty of Vijayanagara, P.514.

ఉత్తర భారతంలోని భక్తకవులైన కబీరు, నానక్‌లకు అన్నమయ్యకు తేడా ఇక్కడే కనిపిస్తుంది. ఉత్తరభారతంలోని రాజకీయ పరిస్థితులు, బ్రాహ్మణాధిపత్యం ప్రత్యామ్నాయ వర్గాలు (కబీర్ పంథ్, సిక్కుపంథ్) ఏర్పడడానికి కారణమవగా ఆంధ్రదేశంలోని వీరశైవ, వైష్ణవ మతోద్యమాలు వివిధ వృత్తులవారికి కులవిధానంలో గుర్తింపునివ్వడం వల్ల ప్రత్యామ్నాయ వర్గాలు ఏర్పడలేకపోయాయి.

## ఉపసంహారం

సుస్థిరరాజ్యపాలన కలిగిన కాకతీయుల పాలనలోనూ, విజయనగరసామ్రాజ్యం ఉచ్ఛదశలో కొనసాగిన కాలంలోనూ రాజులు తమరాజ్యాలను సంపన్నవంతం చేసుకోవడానికి చేపట్టిన వ్యవసాయ, వ్యాపారాభివృద్ధి ఉత్పాదక వర్గాల ఆర్థిక జీవనాన్ని వృద్ధిపరిచింది. అందువల్ల ఈ వర్గాలు ఆధ్యాత్మిక జీవితంలో, రాజ్యవ్యవహారాల్లో ప్రాధాన్యం సంతరించుకోవడానికి దేవాలయాలకు భూరివిరాళాలు ప్రకటించి తమ ప్రత్యేకతను స్థాపించుకోవడానికి ప్రయత్నించేవారు. సామాజిక జీవితంలో ప్రత్యేకతను సంపాదించుకోవడానికి ఈ వర్గాలు జరుపుతున్న ప్రయత్నానికి వీరశైవ, వైష్ణవ మతాలు దోహదపడ్డాయి. ఈ రెండు మతాలు వర్ణభావజాలాన్ని వ్యతిరేకించి ఆధ్యాత్మిక జీవితంలో ప్రవేశించే అవకాశం కల్పించాయి. అయితే వీరశైవ, వైష్ణవమతాలను అనుసరించిన కవులు తమ మతభావాలను ప్రజల్లో శక్తివంతంగా ప్రచారం చేయలేకపోవడంవల్ల, ఆ రెండు మతాలు ఆంధ్రదేశంలో బలమైన సామాజిక ఉద్యమాలు రూపొందించలేకపోయాయి. అందువల్లే కులరాహిత్యస్థితిని వాంఛించే సామాజిక ఉద్యమం ఆంధ్రదేశంలో కనిపించదు.

# భక్తి యోగ మార్గాలు:
# ఆధిపత్య నిరసన భావాలు

ఆంధ్రదేశంలో ప్రచారమైన వీరశైవ, వైష్ణవ మతాలు సామాజికంగా, తాత్త్వికంగా సామాజిక ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ, బలమైన ఉద్యమాన్ని నిర్మించలేక పోయాయని గత ప్రకరణంలో వివరీకరించడమైంది. తొలిదశలో లౌకిక జీవితానికి సంబంధించిన అంశాలను చర్చించినట్లు, కాలక్రమంలో ఆ సామాజిక అవగాహనను కొనసాగించక పోవడంతోపాటు ప్రజలకు స్ఫూర్తినివ్వగలిగిన స్థాయిలో లేకపోవడం వల్ల, ఆ మతాల్లో, ప్రత్యేకంగా చేరే వర్గం లేకపోయింది. 17వ శతాబ్దినాటి వేమన, వీరబ్రహ్మం లాంటి కవులు, 18వ శతాబ్ది మధ్యభాగం నుండి 19వ శతాబ్ది ప్రథమ పాదం వరకూ జీవించిన ఫ్రెంచి జెసూట్‌ఫాదర్ అబె దుబాయ్ లాంటి పాశ్చాత్యులు సమకాలిక జీవితానికి ప్రతిస్పందించి తెలిపిన అంశాలను పరిశీలిస్తే, వీరశైవ, వైష్ణవ మతాలు సమాజంలో ఎంత అప్రధానమయ్యాయో విదితమవుతుంది. అబెదుబాయ్ వైష్ణవుల ఆచార రాహిత్యాన్ని గూర్చి, "Vaishnavites eat all kinds of meat ostentatiously and drink arrack, toddy or any other intoxicating liquors or drugs that they can procure without scruple or shame".[1]

తొలిదశలో పరిశుద్ధమైన జీవితాన్ని వాంఛించిన వైష్ణవులు వ్యసనాలకు అలవాటు పడినట్లు, అబెదుబాయ్ తెలుపగా వేమన,

''వైష్ణవులను వేద్ది వార్త మాత్రము కాని
భక్తులంతకన్న పరులు లేరు
కష్ట నరుల కిల్ల కలుగునా మోక్షంబు''[2] అని,

---

1. Abbe Dubois: Hindu Manners, Customs and Ceremonies, P.114.
2. ఇందులో ఉదాహృతమైన పద్యాలు సి.పి. బ్రౌన్ సంకలనం చేసిన ''వేమన పద్యాలు'' నుండి స్వీకరించడమైనది.

వీరబ్రహ్మం,

పద్మ వర్ణనాలు బాగుగా ధరియించి

పాపజాతి మనసు పట్టలేదు

మనసుపట్టి పట్టు మహిమ గనాను మయా'' అంటూ వైష్ణవుల్లోని ఆచార రాహిత్యాన్ని తెలిపారు. ఇది వైష్ణవులకు మాత్రమే పరిమితమైనది గాదు. శైవులను గూడా,

''బారెడేసి జడలు భస్మంబు పూతలు

మరుని తోడ మారు మలయుగలరు

ముండికోకలెల్ల లంజ కోకలంకాయి'' నని వేమన విశదపర్చాడు. 17, 18 శతాబ్దుల కాలంనాటికి ఆంధ్రదేశంలో బ్రాహ్మణాధిపత్యంగల వైదికమతంతో పాటు వీరశైవ, వైష్ణవమతాలు ప్రచారమై సమాజంలో ప్రాబల్యం కలిగి ఉన్నాయి. వేమన, వీరబ్రహ్మంలు రాయలసీమ వాసులు కావడంవల్ల వీరశైవ, వైష్ణవ సంప్రదాయాలను, జనంలో ఆమతానికి గల అనుసరణను పరిశీలించడానికి అవకాశం కలిగింది. వీరిరువురు జీవించిన రాయలసీమ ప్రాంతం భౌగోళికంగా కన్నడ దేశానికి సమీపంగా ఉండడం వల్ల వీరశైవ సంప్రదాయాలను, రాజకీయంగా విజయనగర సామ్రాజ్యంలో భాగమవడం వల్ల విజయనగర రాజుల కాలంనాటి రాజ్యమతమైన వైష్ణవ మతానుయాయుల ఆధిపత్యాన్ని, వారి ఆచార రాహిత్యాన్ని పరిశీలించి వై అభిప్రాయాలను చెప్పారు. ఈ మతాలలో వచ్చిన పరిణామాలవల్ల,

ఈ రెండు మతాలు ప్రజలకు స్ఫూర్తి నివ్వగలిగిన స్థితిని కోల్పోయాయని పై అంశాలు తెలుపుతున్నాయి.

## వే మ న

క్రీ.శ. 16వ శతాబ్ది వరకూ సమాజంలో ఉన్నతస్థానానికి ప్రయత్నం జరిపిన వర్గాలు మతజీవనంలో భాగమవడానికి ప్రయత్నించడం, వ్యక్తి ఔన్నత్యానికి తాము జన్మించిన కులమే ప్రధానమని తలచగా క్రీ.శ. 17వ శతాబ్దినుండి రాజకీయ విధానంలోనూ, వ్యాపార రంగంలోనూ వచ్చిన పరిణామాలు ధనం ప్రాధాన్యాన్ని గుర్తింపజేశాయి. వ్యక్తి సంబంధాలకు సామాజిక గౌరవానికి ధనం ప్రధానమనే అభిప్రాయాలు వేమన పద్యాల్లో విస్తారంగా కనిపిస్తాయి.

''కులములేనివాడు కలిమిచే వెలయును,
కలిమిలేని వాని కులము దిగును;
కులము కన్నమిగుల కలిమి ప్రధానంబు.''

ధనము లేమి కులముఁ దక్కువ పడవచ్చు
ధనము లేమి కీర్తిఁ దొలగిపోవు
ధనము లేమి శుచిని దగబట్టనియ్యదు
ధనము లేమి ఘనతఁ దప్పు వేమ -''

ధనమే మూలము జగతికి,
ధనమే మూలంబు సకల ధర్మంబులకున్
గానమే మూలము సిరులకు
మనమే మూలంబు ముక్తి మహిమకు వేమా''.

వీరశైవులు, వైష్ణవులు తమ మతాలను అనుసరించడం వల్ల కులవ్యాప్తతను అధిగమించవచ్చని తెలుపగా, వేమన ఆధ్యాత్మిక అంశాలకు భిన్నంగా లౌకిక పరమైన అంశాలను చర్చించాడు.

కులం, ధనసంబంధాలను గురించి అన్నమయ్య, వేమనలకు గల అవగాహనను పరిశీలిస్తే, వేమనలోని లౌకిక దృక్పథం విశదంకాగలదు. అన్నమయ్య,

'' కులమెంత గలిగెనది కూడించు గర్వంబు
....
ధనమెంత గలిగెనది దట్టమౌలోభంబు
మొనసి యీ రెండునను మోహములు రేచు
ఘనవిద్య గలిగినను కప్పుఁ బెట్టె మదము ....''

భక్తి నెన్నె దొకటి పరమ సుఖము
యుక్తి చూచిన నిజం బొక్కటిలేదు - ॥భక్తి॥

(అధ్యాత్మ సంకీర్తనలు, కీర్తన, 33.)

అంటూ కులం, ధనం వల్ల వ్యక్తిలో పెరిగే లోపాలను వేంకటేశ్వరుని భక్తిద్వారా అధిగమించవచ్చని తెలపగా, వేమన,

'' కులము వలన గొంత - బలము వలన గొంత
కలిమి వలన గొంత గర్వమునను
రంకు చదువు జదివి రంకునబడుదురు -'' అని వివరించాడు.

కులం, ధనం, విద్యలవల్ల వ్యక్తి సంతరించుకునే లక్షణానికి వ్యాఖ్యాన మిది. కులం, ధనం, విద్యలవల్ల కలిగే దుర్గుణాన్ని భక్తిద్వారా అధిగమించమనే ప్రబోధం వేమనలో కనిపించదు. ఆచారాలను అనుసరించడంవల్ల కులౌన్నత్యం చేకూరుతుందనే అభిప్రాయాన్ని గూడా వేమన ఖండిస్తాడు.

''తాడు మెడను వేసి తనకు శూద్రత్వంబు
బోయెననెడి దెల్ల బుద్ధి కొదువ
మనసు నిలక తాడు మరివన్ని దెప్పునా -''

అయితే వ్యక్తి ఔన్నత్యానికి వేమన పేర్కొనే అంశం గుణం.

''గుణములు గలవాని కులమెంచగ నేల
గుణములు గలిగెనేని గొప్పనేయు
గుణములు లేనివాని కులమెంత గొప్పైన
నెంచవలదు నేమ డనవేమ 6''

రామనామ పఠనసే మహా వాల్మీకి
పరగబోయయయ్యు బాపడయ్యె,
కులము ఘనము గాదు గుణము ఘనంబురా....''

పాల్కురికి సోమనాథుడు, వాల్మీక్యాది మునులు శివుడిని పూజించడం వల్ల బ్రాహ్మణ్యం పొందారని పేర్కొంటే, వేమన

'' అజ్ఞానము శూద్రజము
సుజ్ఞానము బ్రహ్మమౌట శ్రుతులను వినరా
యజ్ఞానమడిగి వాల్మీకి
సుజ్ఞానపు బ్రహ్మమొంది జూడరవేమా -''

అజ్ఞానాన్ని తొలగించుకోవడమే బ్రహ్మత్వానికి మార్గమని తెలుపడంలోగూడా ఆధ్యాత్మికాంశాల ప్రబోధం లేదు. అంతే వేమన నాస్తికుడుకాడు, ఈశ్వరుని కోసమై పరితపించాడు.

''తామర యందున నీరుబొ
వేమన( జరియించు చుండి వెదుకుచు శివునిన్
యీ మాయ నమ్మగా రా
దీ మనమున తెలియరాదు ఈశునివేమా''

వేమన ఒక ప్రత్యేక మత విశ్వాసాన్ని అనుసరిస్తూ, ఆమతభావాలను ప్రచారం చేయాలని సంకల్పించినవాడు గాక సమాజంలోని పలు అంశాలను హేతుబద్ధంగా పరిశీలించాడు. ఆచారాలకు వాటివల్ల ఆశిస్తున్న ప్రయోజనాలకు మధ్య కార్యకారణ సంబంధాన్ని పరిశీలించడం వల్లే, విభిన్నమతాలలోని లోపాలను ఖండించాడు. వర్ణవిధానం పట్ల నిరసన భావాలు తొలిదశలో మతాలరూపంలో అభివ్యక్తం కాగా తరువాత వ్యక్తి కేంద్రమైన భావాలతో కొనసాగాయి.

వ్యక్తిగత జీవితంలోని సమస్యలను భగవంతునికి నివేదించుకోవడం స్వీయ భక్తికవుల్లో కనిపిస్తుంది. తమ జీవితంలోని అంశాలకు మాత్రమే ప్రతిస్పందిస్తూ, వాటి పరిష్కారాన్ని ఆకాంక్షిస్తూ, భగవంతునికి నివేదించుకునే సంప్రదాయాన్ని స్వీయ భక్తిమార్గంగా పేర్కొనవచ్చు. ఈ మార్గాన్ని అనుసరించిన రామదాసు, త్యాగరాజులు ఒక ప్రత్యేక మత విశ్వాసాన్ని ప్రచారం చేయదలచినవారు కాకపోవడం వల్ల, ఒక నియమావళిని అనుసరించాలనే ప్రబోధం కనిపించదు. తమ అనుభవానికి సంబంధించిన అంశాలను భగవంతునికి నివేదించడం వీరి ముఖ్య లక్షణంగా చెప్పవచ్చు.

వీరశైవ, వైష్ణవ మతానుయాయులలాగే వర్ణవ్యవస్థపట్ల ప్రత్యేక అవగాహన కలిగి బ్రాహ్మణాధిపత్యాన్ని నిరసించిన వారిలో వేమన, వీరబ్రహ్మంలను పేర్కొనాలి. వీరిద్దరి అవగాహనలో కొన్ని భేదాలున్నప్పటికీ జీవించినకాలం, నివసించిన ప్రాంతం, జీవన నేపథ్యంలో పోలికలున్నాయి. క్రీ.శ. 17వ శతాబ్ది మధ్యభాగం నుండి 18వ శతాబ్దపు ప్రథమపాదం వరకూ జీవించిన వీరు ఆధిపత్య వ్యతిరేక భావాలకు మరింత లౌకిక దృక్పథాన్ని అలవరచారు. వీరు ఒక ప్రత్యేక మత విశ్వాసంతో ప్రభావితులై సామాజిక అంశాలను చర్చించిన వారు కారు. సమకాలంలో తమ జీవితంలోని సంఘటనలకు ప్రతిస్పందిస్తూ, వివిధ అంశాలపట్ల తమ అభిప్రాయాలను వెలువరించడం వల్ల, సమకాలిక జీవితం యొక్క మౌలిక లక్షణాలను బలంగా వ్యక్తీకరించడం కనిపిస్తుంది.

వేమన, వీరబ్రహ్మం యోగులుగా ప్రచారంలో ఉన్నారు. భక్తిలో

పరమప్రేమ రూపమైన భగవంతుడిని ఆరాధించాలనే ఆకాంక్ష వల్ల, మనసు భగవంతునిలో సంలీనమవు తుందని భావిస్తారు. ఇటువంటి లక్షణమే 'యోగ'లోను ఉంటుంది. ఒక వస్తువుతో ప్రత్యేక సంబంధం ఏర్పడినపుడు మనసులో చిత్తవికారం ఏర్పడడం సహజంగా జరిగే ప్రక్రియ. దానిని నిరోధించడమే యోగద్వారా సాధించే మానసిక స్థితి. వస్తువులపై ప్రత్యేక ఆకాంక్షను నిరోధించడం వల్ల, వస్తు సంచయంపట్ల, నిరాసక్తత ఏర్పడుతుంది. యోగను, యోగిని గూర్చి వేమన,

''ఆశగోసి వేసి యనలంబు చల్లార్చి
గోచి బిగియగట్టి కోపమడచి
ఆశ విడిచెనేని యతడు తా యోగిరా !

మనసులోని వాడి మానుగదెలిసిన
మునిజనులు వాని యోగియండ్రు
నీవు నిన్నెరుంగ నీవు నే శివుడవు

పగలు రేయి మరచి భావంబును మరచి
తాను నేనయను తలపు మరచి
యుండు వాని నెంచు నుత్తము యోగిరా ... అంటూ అనేక

అంశాలపట్ల, నిరాసక్తతను ప్రదర్శించే నిరాకార చిత్త స్థితిని సాధించడమే యోగద్వారా పొందగలిగే సిద్ధి. అయితే యోగవల్ల, ''కేవలం సంకల్పమాత్రాన దూరశ్రవణం, దూరదృష్టి, ఆకాశగమనం, సూక్ష్మరూపాన్ని పొందడం, మహాకాయాన్ని పొందడం

లభ్యమవుతాయని యోగగ్రంథాలు చెబుతాయి. అంతేగాక భూత, భవిష్యత్ కాలాల్లోని విషయాలను గురించి తెలుసుకోవడం, చనిపోయిన వారితో సంభాషించడం - మొదలైన అద్భుతశక్తులను గురించి యోగం ప్రస్తావిస్తుంది. అదిమమైన ఈ విశ్వాసాలను అంగీకరిస్తూ, చిత్తవృత్తిని నిరోధించడమే యోగానికి పరమావధి.[1]

ఈ లక్షణాలు వీరబ్రహ్మానికి అధికంగా వర్తిస్తాయి. భూత, భవిష్యత్ విషయాలను చర్చించే కాలజ్ఞానం చెప్పడం వీరబ్రహ్మంలోని ప్రత్యేక లక్షణం. భవిష్యదంశాలను చెప్పడం వీరబ్రహ్మంతో ప్రారంభమైన లక్షణం కాదు. మహాభారతంలోని అరణ్యపర్వంలో కల్క్యవతారాన్ని చర్చించే సందర్భంలో భవిష్యత్తులో జరగబోయే పరిణామాలను గూర్చి విపులమైన చర్చ ఉంది. విష్ణువు దశావతారాల్లో, చివరిదైన 'కల్కి' అవతారం సమాజంలో ఏర్పడబోయే అనేక ఉత్పాతాలను అంతమొందిస్తుందని పేర్కొనబడింది. మహాభారతంలోని భవిష్యద్వాణి బ్రాహ్మణధర్మాలను ఉద్ధరించడానికి ఉపకరిస్తుందని తెలుపగా, వీరబ్రహ్మం కాలజ్ఞానాలు శ్రామిక ప్రజలకు భవిష్యత్తుపట్ల ఆశ, విశ్వాసాన్ని ఇవ్వడానికి ఉద్దేశించాయి.

వీరశైవ, వైష్ణవ కవుల పిమ్మట భక్తిసంప్రదాయాన్ని అనుసరించిన కవులలో ప్రసిద్ధులు క్షేత్రయ్య, రామదాసు, త్యాగయ్యలు. వీరి వ్యక్తిత్వాల్లో అనేక అంతరాలున్నాయి. వీరు ముగ్గురూ భిన్నప్రాంతాల్లో, భిన్నరాజకీయ పరిస్థితుల్లో జీవించడం గూడ వారి సామాజిక అవగాహనను నిర్ణయించడానికి కారణంగా

---

1. దేవి ప్రసాద్ భట్టోపాధ్యాయ : భారతీయ తత్త్వశాస్త్రం, పే. 134.

భావించాలి. అన్నమయ్య అనుసరించిన మధురభక్తి, సంప్రదాయాన్ని క్షేత్రయ్య మరింత లౌకిక పరంచేసి మధురభక్తిని వ్యాపింపజేశాడు. రామదాసు ప్రభుత్వోద్యోగిగా ఉన్నప్పటికీ రాజులను కీర్తించడం వ్యర్థమని తలచాడు. క్షేత్రయ్య, రామదాసుల్లో లేని అనేక సామాజిక అంశాల చర్చ త్యాగరాజు కీర్తనల్లో ఉంది. త్యాగరాజులో సమకాలంలోని జీవితం పట్ల ప్రతిస్పందన కనిపిస్తుంది. సామాజిక బాధ్యతను గుర్తించని రాజులను నిరసించడం, సంపన్నవర్గాలను ఆశ్రయించకపోవడం, పండితుల మక్కికాళులను, యజ్ఞయాగాదుల్లాంటి ఆచారాల నిరుపయోగితను ప్రశ్నించడం త్యాగయ్య రచనల్లో చూస్తాం.

## రాక్షస - తంగిడి యుద్ధానంతర పరిణామాలు

మధ్యయుగాలనాటి ఆంధ్రదేశ చరిత్రలో రాక్షస - తంగడి యుద్ధం కొన్ని ముఖ్యమైన పరిణామాలకు దారితీసింది. క్రీ.శ. 1336నుండి శక్తివంతమైన రాజ్యంగా వృద్ధిచెందిన విజయనగర సామ్రాజ్యం క్రీ.శ. 1565లో తళ్ళికోట యుద్ధంలో అత్యంత బలహీనపడింది. విజయనగరానికి పాలకుడైన రామరాయలు మహమ్మదీయుల మతపర శాపాలను అవమాన పర్చడమే యుద్ధానికి కారణమని చరిత్రకారులు పేర్కొంటున్నారు.[1] విస్తృత భూభాగంపై ఆధిపత్యాన్ని నెరపి తమ ప్రత్యేకతను నిరూపించుకోవాలని తలచే రాజుల మధ్య యుద్ధం జరగడానికి బాహిరమైన అంశాలు అప్రధానమే అయినా ఆ ప్రత్యేక సందర్భంలో యుద్ధాలు జరగడానికి అవి ఉత్ప్రేరకాలుగా పనిచేస్తాయి.

---

1. K.A. Nilakanta Sastry & N. Venkata Ramanayya: Further Sources of Vijayanagara History, P.265.

రాక్షస - తంగడి యుద్ధం తరువాత విజయనగర సామ్రాజ్యం చిన్న చిన్న భాగాలుగా విడిపోయింది. ఈ యుద్ధం తర్వాత ఆరాజ్యంలోని భాగమైన పెనుగొండను రాజధానిగా చేసుకొని రామరాయల సోదరుడైన తిరుమలరాయలు పరిపాలించాడు. తర్వాతి కాలంలో ఈతని పెద్దకొడుకు శ్రీరంగరాయలు పెనుగొండను, రెండవకొడుకు రామరాయలు శ్రీరంగపట్టణాన్ని, మూడవకొడుకు వెంకటపతి చంద్రగిరి కేంద్రంగా తమిళప్రాంతాన్ని పాలించారు[1]. ఈ యుద్ధంవల్ల, రాజ్యకేంద్రం మారడంతో రాజధాని బలహీనపడింది. తిరుమలరాయుని వంశీకులు ఒక శతాబ్దం (క్రీ.శ. 1681) వరకూ పాలించినప్పటికీ నిరంతరం యుద్ధాలతో, పాలెగార్ల తిరుగుబాట్లతో కొనసాగడం వల్ల, ఆర్థికవిధానం ఛిన్నాభిన్నమై ఆ రాజ్యానికి గల పూర్వ ప్రాభవం కోల్పోయింది.

క్రీ.శ. 17వ శతాబ్దం ప్రథమపాదం నుండి ఉత్పాదక రంగంపై స్థానిక ప్రభువుల ఆధిపత్యం బలహీనపడి పాశ్చాత్య వ్యాపారుల ప్రమేయం అధికమయ్యింది. విజయనగర సామ్రాజ్యాన్ని శ్రీకృష్ణదేవరాయలు పరిపాలిస్తున్న కాలం (క్రీ.శ. 1509 - 1529)లోనే పోర్చుగీసుతో వాణిజ్య సంబంధాలు ప్రారంభమయ్యాయి. వీరు గోవాను కేంద్రంగా చేసుకుని విజయనగర రాజ్యంతో వ్యాపార సంబంధాలు కొనసాగించారు. క్రమంగా దక్షిణ భారతంలోని వివిధప్రాంతాల్లో కొచ్చిన్, మలబారు, నాగపట్నాలను కేంద్రాలుగా చేసుకుని వ్యాపారం నిర్వహించారు. అయితే క్రీ.శ. 1580లో పోర్చుగీసు స్పెయిన్ ఆధిపత్యంలోకి చేరడంతో భారతదేశంలో పోర్చుగీసుల వ్యాపారం

---

1. - ibid, P.298.

అంతరించింది.

క్రీ.శ. 1600లో తూర్పు ఇండియా వర్తకసంఘం ఏర్పడటం, క్రీ.శ. 1611లో నిజాంపట్నం, మచిలీపట్నంలలో ఏర్పడిన వర్తక సంఘాల వల్ల ఆంధ్రదేశంలో వ్యాపార సంబంధాలు పెరిగాయి. క్రమంగా మృత్తికారుల ఆర్థిక జీవనాన్ని వర్తకసంఘం ప్రభావితం చేస్తూవచ్చింది. ఈ కాలంలో ఉత్పాదక వర్గాలను మూడు వర్గాలు నిర్దేశించాయి - ప్రభుత్వం, పాలకుల్లోని ఉన్నతవర్గం, నూతనంగా రంగప్రవేశం చేసిన వ్యాపారవర్గం. వీరిమధ్య ఉండిన పోటీ ఉత్పాదక వర్గాల జీవనాన్ని విచ్ఛిన్నపరచడమేగాక ఉత్పాదక విధానానికే విఘాతంగా మారింది.

"Competition among surplus controllers, the State, the bureaucratic elite and traders - actually diminished the ability of all to act in harmony and thus constituted a contradiction of some importance especially when the competition among these various powerful hegemonic agencies threatened to damage the productive base itself"[1].

అయితే వర్తక సంఘానికి వ్యాపారమే ప్రధానధ్యేయంగా ఉండడంవల్ల, ఉత్పాదక వర్గాలపై క్రమంగా వారికి ఆధిపత్యం ఏర్పడింది. ఉత్పాదక వర్గాల సాంస్కృతిక జీవితంపై తొలిదశలో మఠాలు, దేవాలయాల ప్రమేయం ఉండగా కాల క్రమంలో వర్తకసంఘం వారి జీవనవిధానాన్ని నిర్దేశించింది. కుడి, ఎడమ కులాల సంఘర్షణ కంపెనీ అధికారులవద్ద ప్రాపకం సంపాదించుకోవడానికి పరిమిత మయ్యింది. ఈ కాలంనాటికి ప్రధాన మృత్తికారుల్లో ఒకరైన నేరసనివాండ్ర ఆర్థిక

1. Burton Stein: "Eighteenth Century India: Another View" in Studies in History, Vol. 5, No.1 Jan. - June 1989, P.11.

జీవనాన్ని విశదీకరిస్తూ, విజయారామస్వామి ఇలా పేర్కొంటుంది.

"The weavers gradually began losing their bargaining power and independence as they worked on a system of advances provided by the companies merchant middlemen. Their creations also suffered since they were compelled to copy mechanically the musters provided to them. Economically they were much worse off".[1]

రాజ్యంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, వృత్తికారుల ఆర్థిక జీవనాన్ని తీవ్ర నిరాశ నిస్పృహలకు గురిచేశాయి. వృత్తికారుల్లోని వేదనకు వీరబ్రహ్మం ఒక ఉద్యమ రూపాన్నిచ్చాడు.

## వీరబ్రహ్మం

క్రీ.శ. 17వ శతాబ్దిలో జీవించిన వీరబ్రహ్మం పంచాణం వారి కుటుంబంలో జన్మించి చివరివరకూ శ్రమలో భాగస్వామిగా ఉంటూ ఆధ్యాత్మిక జీవితం కొనసాగించాడు.[2]

---

1. Vijaya Ramaswamy: Textiles and Weavers in South India, P. 170.
2. చూ. కన్నెకంటి రాజమల్లాచారి : పోతులూరి వీరబ్రహ్మంగారి చరిత్ర, పే. 20 - 22.

అందువల్ల, శ్రామిక వర్గాల మనోభావాలను శక్తివంతంగా వెలువరించే అవకాశం ఏర్పడింది. వీరబ్రహ్మం కాలంలో రాయలసీమ రాజకీయంగా తీవ్ర అశాంతిస్థితిలో ఉండటం[1], ఉత్పాదక వర్గాలకు ప్రోత్సాహం లేకపోవడం, రాజ్యంలోని కరువు కాటకాలు వీరబ్రహ్మం వేదనకు కారణమయ్యాయి. సామాజికంగా శ్రామికవర్గం ఆశిస్తున్న స్థిరజీవనం, నిరాటంకంగా కొనసాగవలసిన వృత్తుల ఆవశ్యకతను వీరబ్రహ్మం ఆశించాడు. కరువు కాటకాలవల్ల, రైతులు, వృత్తికారులు, వ్యాపారులు పలురకాలుగా తీవ్ర బాధలకు లోనవుతున్న సమయంలోని నిరాశ, నిస్పృహలనుండే వీరబ్రహ్మం నూతన చైతన్యంకోసం పరితపించాడు. సమాజాన్ని ఉద్ధరించడానికి వీరభోగవసంతరాయలు ఉద్భవిస్తాడని బోధించాడు. తన సమకాలంలోని జీవితంలో ఒక నూతన స్థితిని ఆశిస్తూ, సమాజంలో రాబోయే పరిణామాలను కాలజ్ఞానరూపంలో బోధించాడు. సామాజిక జీవితంలో ఆశను కల్పించడం కోసమే వీరబ్రహ్మం కాలజ్ఞాన బోధ చేశాడు.

" పాతకాలు మంటగలిసేరు
పుణ్యాత్ములైన
సాధువులు సంతసించేరు
భూమిమీద భూమము ధాన్యములు పుష్టి పెరిగిన పిమ్మటాను
రామరామయని వారలు రాబోదురు తెలుసుకుండి

---

1. విజయనగర సామ్రాజ్యం అంతరించిన పిమ్మట రాయలసీమ ప్రాంతంలో అనేక యుద్ధాలు జరుగుతుండేవని బ్రిటీష్‌వారు రాజకీయ ఆధిపత్యం స్వీకరించిన పిమ్మటనే (19వ శతాబ్ది ప్రథమదశ) ప్రశాంతస్థితి నెలకొన్నట్లు బ్రౌన్ రాశాడు. See, C.P. Brown: Wars of Rajas, P. 67.

ఏమో ఏమో ఎరుగకున్నారు

ఎందెంత జూచిన

యముని పురికే పడవమందురు

భూతలంబున నిద్రవింతలు పుట్టి యణిగిన విష్ణు తాను

నీతి కృతయుగ ధర్మ మప్పుడు నిజము నిలకడవీరద తెలియును''

అంటూ రాజ్యంలోని అశాంతిస్థితి అంతరించబోతుందని వీరబ్రహ్మం తలచాడు.

వీరబ్రహ్మం తన భావాల ప్రచారానికి వ్యవస్థీకృతంగా కృషి జరపడం కూడా ఆయనభావాలు సామాజిక జీవనంలో భాగమవడానికి కారణమయ్యింది. తన బోధనలకు శిష్యులుగూడా శ్రామిక కులాలకు చెందినవారవడం వల్ల, వారిలో సాంఘికంగా ఒక చైతన్యం కలిగించడానికి దోహదపడింది. వీరశైవులు వృత్తి, ఆధ్యాత్మిక జీవితం అభేదమైన అంశంగా ప్రబోధించినట్లే, వీరబ్రహ్మం శ్రామికజీవనం యొక్క ప్రాధాన్యాన్ని గుర్తింపజేస్తూనే ఆధ్యాత్మికజీవితం అనుసరించుమంటాడు. ఆయన విశ్వకర్మలనుద్దేశించి,

''నడివీధి యందున నాటింతురా కొల్మి

నడిమండలంబందు నాటింతురా

నాసంధి తెలియనట్టి బద్ధకుక్కల బట్టి

బంధించి బాకుల కుమ్మింతురా ...'' ।।శివగోవింద - గోవిందా।।

విశ్వకర్ములతోపాటు మరోప్రధానవృత్తికారులైన నేతవారు తమవృత్తిని నిర్వహిస్తూ, ఆధ్యాత్మిక జీవితం కొనసాగించాలని

'' మగ్గం బట్ట నేసేటందుకు మొక్కుబడిగో వినరయ్యా
ధర్మ దేవస్మారయని మగ్గం వదిలవరచి తానేయవలెన్''

అంటూ ప్రముఖ వృత్తికారులైన పంచాణం, నేతవారిలో తన భావాలను ప్రచారం చేయడానికి కూడా ఈ రెండు వర్గాల్లో ఏర్పడిన వైరాశ్యాన్ని తొలగించడానికే.

వీరబ్రహ్మం రెండు ప్రధాన వృత్తికారులను సమీకరించడం తన కాలం నాటి చారిత్రక అవసరం. రాజ్యంలో ఏర్పడిన అశాంతస్థితి పంచాణం, నేత వృత్తులను తీవ్ర సంక్షోభంలో పడవేశాయని చారిత్రకులు విశదీకరించిన అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటే వీరబ్రహ్మం కాలజ్ఞానం గూడా ఈ వర్గాల్లో సులభంగా ప్రచారం పొందడానికి అవకాశం ఉందని విదితమవుతుంది. వీరబ్రహ్మం స్వయంగా వృత్తికారుల్లో జన్మించడంవల్ల, రాజ్య వాతావరణం ఈ వృత్తికారులను ఎంతగా వేధించిందో తెలుసుకోవడానికి అవకాశం కలిగి ఉంటుంది.

వీరబ్రహ్మం, వేమనలు సమకాలికులే అయినా వేమన సమకాలిక పరిస్థితులకు వ్యాఖ్యాతగా కనిపిస్తే, వీరబ్రహ్మం తనకాలంనాటి పరిస్థితులను పరిష్కరించుకోవడానికి ఒక ఉద్యమరూపమివ్వడానికి ప్రయత్నించాడు. అందుకు ఇరువురి వైయక్తిక నేపథ్యం గూడా కారణమని పరిశోధకులు ఊహిస్తున్నారు.

''వేమన పద్యాలు ఆనాటి పరిస్థితులకు ప్రత్యక్ష ప్రతిస్పందనలు. ప్రతిఘాతాలు. పైగా అతడు భూస్వామ్యవర్గ, గ్రామాధికార కుటుంబంనుండి వచ్చాడు. అందుకే మాట వెలుసు. వేమన ఒక నిరాపాక శక్తికాదు ... వీరబ్రహ్మం మఠాలు స్థాపించి ఒక వ్యవస్థీకృత పోరాటాన్ని పటిష్ఠంగా సాగించాడు. వీరబ్రహ్మం బలమైన నిరాపాక శక్తి. వృత్తికారులను ఏకం చెయ్యడమనే గొప్ప గమ్యానికి అవలంబించిన ఎత్తుగడ చరిత్రలోనే అపూర్వమైంది.[1] తానాశించిన సామాజిక లక్ష్యాలనూ వృత్తికారుల్లో ప్రచారం చేయడం, తన భావాల ప్రచారానికి శిష్యగణాన్ని ఏర్పర్చడం, తమ ప్రత్యేక అస్తిత్వాన్ని చాటుకోవడానికి మఠం స్థాపించడం-ఈ మూడంశాల ద్వారా వీరశైవ వైష్ణవ మతానుయాయులు నిర్వహించని సామాజిక బాధ్యతను వీరబ్రహ్మం నిర్వహించాడు.

## స్త్రీలపట్ల-వేమన, -వీరబ్రహ్మంల భిన్నదృక్పథాలు

వేమన, వీరబ్రహ్మంల మధ్య అనేక అంశాలలో సమాన భావాలున్నా స్త్రీలను గూర్చి వారి అవగాహనలో భిన్న అభిప్రాయాలు కనిపిస్తాయి. సమాజంలో స్త్రీలపట్ల పురుషులకుండే స్వాభావికమైన ఆధిపత్య అవగాహనతో వేమన స్త్రీలను పరిశీలించాడు. వేమన అవగాహనకు భిన్నంగా వీరశైవులు ఆధ్యాత్మిక జీవితంలో అక్కమహాదేవికి ప్రముఖస్థానమిచ్చి గౌరవించిన సంప్రదాయాన్ని వీరబ్రహ్మం కొనసాగించాడు.

---

1. ఎన్.గోపి : ''కర్మయోగి వీరబ్రహ్మం'' - వ్యాసనవమి, పే. 52.

తాను స్థాపించిన మతానికి తన మనుమరాలైన ఈశ్వరమ్మను వారసురాలిగా ప్రకటించడం ద్వారా సాంప్రదాయికంగా స్త్రీలపట్ల ఉండే అవగాహనకు భిన్నత్వాన్ని వీరబ్రహ్మం ప్రదర్శించాడు. స్త్రీలపట్ల వీరిరువురి అవగాహనను నిర్ణయించడంలో వారి వ్యక్తిగత జీవితంగూడా కారణం కావచ్చు. వేమన తన సంసారాన్ని త్యజించి, విరాగియై సంచరించగా[1] వీరబ్రహ్మం సంసారజీవితం కలిగివున్నాడు. అంతేగాక సామాజిక జీవితంలో ప్రశాంతస్థితిని వాంఛించిన వీరబ్రహ్మం కుటుంబంలో స్త్రీ పురుషుల మధ్య సహజీవనాన్ని కోరుకోవడానికి అవకాశం ఉంది. స్త్రీలవల్ల వచ్చే బాధలను వేమన -

''స్త్రీలు గలుగుచోట చెలాటములు గలుగు
స్త్రీలు లేనిచోట చిన్నబోవు
స్త్రీల చేత నరులు చిక్కుచున్నారయా'' అని,

స్త్రీలకును నడుదురు స్త్రీల శాస్త్రంబులు
స్త్రీల యోగ్యమేసి చెప్పవచ్చు
స్త్రీల కిడుట కంటె శిలల కిడుటమేలు'' అంటూ

స్త్రీలను శిలలకంటె హీనంగా తలచిన వేమన పురుషుడికి అణకువగా ఉండే వివాహపు తొలిరోజుల్లోనే తనకు విధేయురాలిగా మలచుకోవాలని,

---

1. V.R. Narla: Vemana, P.21.

''ఆలివంటిలేక యుద్ధమందుననుండి
వెనుకవంతునేమాట వెర్రితనము
పెట్టు మదెరనిమ్మ విడిచిపోవునా ...'' అని

భావించాడు. స్త్రీలు ఆధ్యాత్మిక జీవితానికి ఆటంకమని వారిపట్ల కోరికలు తొలగించుకోవడం వల్లనే ముక్తి సాధ్యమని వేమన తలచాడు.[1] అయితే పురుషుడికన్నా స్త్రీ అధమస్థానంలో లేదని, బాహ్యరూపంలోని స్త్రీ, పురుష భేదాలు ప్రకృతిసిద్ధంగా ఏర్పడినవని వీరబ్రహ్మం వివరించాడు. శివ, విష్ణువులు స్త్రీరూపం ధరించడమే వారికి స్త్రీలపట్ల గల సమానతా భావాలను విశదం చేస్తున్నాయని తెలిపాడు.

''స్త్రీ పురుషులనే కులము సృష్టిలోపలినుండి రూపులైయున్నవి రూఢిగాను
ఆ పరబ్రహ్మమే ఆదివిష్ణు శివుడు స్త్రీ పురుషుడైనాడు సృష్టిలోపల జాణ''

పురుషులకంటే స్త్రీలది అధమ స్థానం కాదని భావించడం వల్లనే తన మనుమరాలిని కందిమల్లయపల్లెలో స్థాపించిన మఠానికి వారసురాలుగా ప్రకటించి ఆధ్యాత్మిక జీవితానికి స్త్రీలు ఆటంకం కాదని విస్పష్టపరచాడు.

వివిధ కారణాలవల్ల అయినా రాజులపట్ల అసహిష్ణుత ప్రదర్శించడం రామదాసు, వేమన, వీరబ్రహ్మం, త్యాగయ్యల్లోని సామాన్య లక్షణం. సామాజికంగా బ్రాహ్మణాధిపత్యాన్ని ఖండించడం, ఆచారాల కారణంగా ఏర్పడిన భావాలను ప్రశ్నించడం వేమన, వీరబ్రహ్మం, త్యాగయ్యల్లో కనిపిస్తుంది. రామదాసు వర్ణవ్యవస్థను ప్రశ్నించక పోయినా ఆచారాలలోని లోపాలను విమర్శిస్తాడు.

---

1. ''చదువులందు రాజ్య పదవులందును పాడి
మొదవులందు స్త్రీల వెదవులందు
నాశలుడుగునెడ్డి యయ్యలు ముక్తులు''

## రా మ దా సు

రామదాసుగా ప్రసిద్ధి చెందిన కంచర్ల గోపన్న (క్రీ.శ. 1620 - 80) గోల్కొండ రాజ్యపాలకుడైన అబుల్‌హసన్ తానీషా ఆధీనంలోని భద్రాచలం ప్రాంతానికి తహశీల్దారుగా పనిచేస్తూ, భద్రాచలంలో దేవాలయ నిర్మాణానికి ప్రజలనుండి వసూలు చేసిన డబ్బును వినియోగిస్తాడు. ప్రభుత్వ కోశాగారానికి చేరవలసిన శిస్తుతో దేవాలయం నిర్మించడం వల్ల, రాజాగ్రహానికి గురయి 12 సం|| ల పాటు కఠిన కారాగార శిక్షను అనుభవించాడు. జైలుశిక్షను అనుభవిస్తున్న కాలంలో అనేక వార్ల దెబ్బలు తిన్నట్లు, ఆయన కీర్తనలు తెలుపుతున్నాయి.

''అబ్బబ్బ దెబ్బలకు తాళలేరా
రామప్ప గొబ్బున నన్నేలుకోరా ||అబ్బబ్బ||
పరులకొక్క రువ్వ యీయలేదు గదరా
ఓ పరమాత్మా నీ పాదముల్ నమ్మితిరా
కొరడాలు తీసుక గొట్టిరి గదరా ... (కీర్తన - 4) అని,

మరొక కీర్తనలో

అబ్బబ్బ దెబ్బలకు నోర్వలేరా జబ్బుసేయకురారా బొబ్బలాయెరా ||అబ్బా||
(కీర్తన - 5)

అంటూ శిక్ష సందర్భంలో ఎదుర్కొన్న బాధలను రాముడికి నివేదించుకున్నాడు. రామదాసు పలు బాధలను అనుభవిస్తూ,

> ''నరులను గొలుచుటకన్నా భద్రగిరి రాఘవుని వేడుకున్నా
> ఇహపరము లిలగలవని విన్నా నేను దరహాసము నా రామదాసప్రసన్నా''
>
> (కీర్తన - 36)

> ''నరహరిని నమ్మక నరులను నమ్మిన నరజన్మ మీడేరునా
> చెఱకుండగా వెర్రి చెరకును నమలిన పిప్పాకు రుచిపుట్టునా మనసా''
>
> (కీర్తన - 67)

అంటూ రాజును కీర్తించడానికి విముఖతను చూపాడు. రామదాసు జీవితం బాధలనుభవించడంలోని వాస్తవికతను గుర్తింపజేస్తుంది. సాధారణ జీవితంలో రాజ నియమాన్ని ఉల్లంఘించిన వ్యక్తులు శిక్షా సమయంలో పొందే వేదన రామదాసు కీర్తనల్లో వ్యక్తమవుతుంది. రామదాసు కీర్తనల్లోని ప్రధాన లక్షణం ఇదేనని బి. రజనీకాంతరావు అభిప్రాయపడ్డారు. " ... they deal with the mundane miseries of life, not only those, as experienced by the composer during his life, but also such as may occur to any one of us ".[1]

రామదాసుకు పూర్వం అన్నమయ్య సాళువ నరసింహనాయకుడి ఆగ్రహానికి

---

1. B. Rajanikantha Rao, Ramadasu, P.40.

గురయి బంధితుడు కాగా వేంకటేశ్వరుని కీర్తించగానే ఆతడి సంకెళ్ళు ఊడిపడినట్లు అన్నమయ్య జీవితచరిత్రలో వర్ణితమైంది. కాని రామదాసు 12 సంవత్సరముల పాటు జైలుశిక్షను అనుభవిస్తూ, తన బాధలను తీవ్రమైన ఆర్తితో రాముడికి నివేదించుకుంటూ ''అడుగుదాటి కదలనియ్యను నాకభయమియ్యక నిన్ను విడువను'' అంటూ తన శిక్షను తొలగింపచేయుమని వేడుకుంటాడు.

ప్రభుత్వానికి చెల్లించవలసిన పైకం ఎవరు చెల్లించారనే విషయంలో చారిత్రకంగా ఎలాంటి ఆధారం లేనప్పటికీ అతనిని బంధవిముక్తుడిని చేసింది రామలక్ష్మణులేనని రామదాసు అనేక కీర్తనల్లో ప్రస్తావించాడు. రామలక్ష్మణులు ''జల్లీలాగులు తొడిగి'' 'సర్వాత్మకమ్మకము' (కీర్తన - 47) చెల్లించడానికి తానీషా వద్దకు వచ్చినప్పుడు వారిని ఎందుకోసం, ఎవరు పంపగా ఎక్కడనుండి వచ్చారని ప్రశ్నించగా, తనను విడిపించడానికి రామదాసే పంపించగా భద్రాచలంనుండి వచ్చి, రామదాసు చెల్లించవలసిన పైకం చెల్లిస్తున్నట్లు (కీర్తన - 26) కీర్తనల్లో వర్ణితమైంది.

జీవితంలో అత్యంత కష్టపూరితమైన సమయాలు ఎదురైనప్పటికీ విశ్వసించిన ఆశయాన్ని ఆరాధ్య దైవమైన శ్రీరాముని విస్మరించలేదని రామదాసు జీవితం విశదీకరిస్తుంది.

12 సంవత్సరాలపాటు శిక్షను అనుభవించినా రాముడి కరుణ వల్లనే రామదాసుకు బంధవిముక్తి లభించిందనే విశ్వాసం త్యాగరాజుకు స్ఫూర్తినిచ్చింది.

రామదాసు జీవితంతో ప్రభావితుడై, త్యాగరాజు రామభక్తి మార్గాన్ని అనుసరించాడు.[1]

## త్యా గ రా జు

త్యాగరాజు (క్రీ.శ. 1767 - 1847) తమిళదేశంలోని తంజావూరుకు సమీపంలోని తిరువారూర్‌లో జన్మించడంవల్ల, ఆంధ్రదేశంలోని సామాజిక పరిణామాలతో సంబంధం ఏర్పడలేదు. కాని, తన ప్రాంతంలోని రాజకీయ పరిణామాలకు ప్రతిస్పందన ఉంది. త్యాగరాజు జీవించే కాలంలో తంజావూరు రాజకీయంగా అస్థిరతకు లోనైన సమయం.[2] క్రీ.శ. 1530 నుండి తంజావూరును పాలించిన నాయక రాజులను మరాఠా ప్రాంతానికి చెందిన ఏకోజీ (ఛత్రపతి శివాజీ సోదరుడు) క్రీ.శ. 1673లో ఓడించి తంజావూరును పరిపాలించాడు. మరాఠీవారి పాలన దాదాపు శతాబ్దిన్నరపాటు కొనసాగింది. ఈ కాలంలోనే తూర్పు ఇండియా వర్తక సంఘానికి వ్యాపార సంబంధాలు దక్షిణ భారతంలోని అనేక ప్రాంతాలతో ఏర్పడినట్లే, తంజావూరుతోనూ ఏర్పడ్డాయి. వీరు మరాఠీరాజులతో సంబంధాలు వృద్ధి పర్చుకుంటూ వ్యాపార కేంద్రాలను, కోటలను నిర్మించడమేగాక తాము స్వంత సైన్యాన్ని కలిగి ఉండడానికి అనుమతిని పొందారు. తద్వారా రాజకీయ ఆధిపత్యం సంపాదించడానికి ఆంగ్లేయులు

---

1. త్యాగరాజు తన ''ప్రహ్లాద భక్తివిజయము'' అనే నాటికకు రాసిన పీఠికలో

''కలియుగమున వర భద్రా
చలమున నెలకొన్న రామచంద్రుని పద భ
క్తుల కెల్ల వరుడనందగి
వెలసిన శ్రీరామదాసు వినుతింతు మదిన్'' అంటూ రామదాసుని కీర్తించాడు.

(త్యాగరాజు గేయనాటికలు - వివిధకృతులు (సం.) మరుపూరు కోదండరామరెడ్డి, పే.48)

2. See, M.S. Ramaswami Ayer: Thiagaraja - A great Musician Saint, PP 49-50.

ప్రయత్నించగా కన్నడదేశీయుడైన హైదరాలీ క్రీ.శ. 1781లో తంజావూరును హస్తగతం చేసుకున్నాడు. కాని కప్పం చెల్లించే ఒప్పందంపై శరభోజిని తిరిగి రాజుగా నియమించాడు. కొంతకాలమైన పిమ్మట శరభోజి హైదరాలీ ఆధిపత్యాన్ని నిరాకరించి బ్రిటిష్‌వారి సాహచర్యం పెంపొందించుకున్నాడు. కాలక్రమంలో బ్రిటిష్ వారికి, శరభోజికి ఏర్పడిన సంబంధాలవల్ల, క్రీ.శ. 1799లో శరభోజికి అధిక ధనమిచ్చి తంజావూరుపై రాజకీయ ఆధిపత్యం సంపాదించారు. నాటినుండి శరభోజి నామమాత్రపు రాజుగా మిగిలాడు. త్యాగరాజు జీవితంలోని ప్రధానభాగం ఈ శరభోజి కాలం (క్రీ.శ. 1798 - 1832) లోనే గడిచింది.

ఆంగ్లేయులు తంజావూరు ప్రాంతంపై వ్యాపార, రాజకీయ ఆధిపత్యాన్ని నెరపడంతోపాటు సాంస్కృతిక జీవితాన్ని ప్రభావితం చేయడానికి, క్రైస్తవమతవ్యాప్తికి ప్రయత్నిస్తూ వచ్చారు.[1] రాబర్ట్ డి. నోబిలి అనే ఇటాలియన్ జెసూట్ క్రైస్తవ మతాన్ని వ్యాపింపజేయడానికి తీవ్రంగా కృషి చేశాడు. ప్రజల్లో తమ మతంపట్ల భక్తిశ్రద్ధలు కలగడానికి తాను తూర్పుదేశాలనుంచి వచ్చిన రాజునని కొంతకాలం, మతప్రచారమే ధ్యేయంగా జీవించే సన్యాసిగా మరికొంతకాలం పాటు ప్రచారం చేసుకుంటూ ప్రజలను క్రైస్తవమతంలోకి ఆకర్షించాడు. అయితే స్థానికుల మతమార్పిడిని నిరోధించడానికి ప్రయత్నాలు జరిగేవి.[2] శహాజీ అనేరాజు క్రైస్తవులను బంధించి

---

1. See, William J. Jackson: Tyagaraja, P.80.

2. - ibid.

చర్చిలను కూలద్రోయించినట్లుగా నాటి చరిత్ర తెలుపుతుంది. క్రైస్తవులు తమ మత ప్రచారంలో భాగంగా హిందూ దేవతలను దూషించడం, తమను రోమన్ బ్రాహ్మణులుగా ప్రచారం చేసుకోవడం స్థానికుల ఆగ్రహానికి కారణమయ్యింది.

తంజావూరు రాజకీయంగా సంక్షోభాన్ని ఎదుర్కోవడం, హైదరాలీకి, ఆంగ్లేయులకు మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం, స్థానిక ప్రభువు నామమాత్రపు వ్యక్తిగా మారడం, ప్రజలసాంస్కృతిక జీవితంలో చోటుచేసుకుంటున్న నూతన పరిస్థితులు త్యాగరాజును కలచివేశాయి. ప్రజాశ్రేయస్సును కాంక్షించని రాజులు కళాకారులకు, కవులకు కానుకలివ్వడం, వాటిని పొందిన పండితులు రాజులను సేవించడం త్యాగరాజు వ్యర్థమని తలచాడు.

''కాసిచ్చేదిదే గొప్పాయెనురా కలిలో రాజులకు ||కాసిచ్చేదిదే||
రాజాంగము కొరకు నాల్గు జాతుల రక్షణ పరసుఖమా
రాజసులై సన్మార్గమెరుగక పరాకుసేయు ఘనమా
ఆ జన్మము గొలిచే విప్రవరుల కానందము గలదా''[1]...||కాసిచ్చేదిదే||

రాజు బాధ్యతను తెలిపిన త్యాగయ్య ప్రభువునుండి కానుకల రూపంలో వచ్చిన ధనాన్ని నిరాకరించి 'నిధికంటె రాముని సన్నిధి చాలా సుఖమని' తెలిపాడు.

---

1. కల్లూరి వీరభద్రశాస్త్రి (సం.) త్యాగరాజు కీర్తనలు, Vol.I, కీర్తన 131.

''ధనమే మున నుండు - మనుజుల నేమయ్యా
చనసేయుగ లేనురా ...'' ।కరుణా జలధే।।,

దుర్మార్గ చరాధములను - దొరనీవన జాలరా ।।దుర్మార్గ।।

''పలుకు బోటిని సభలోన పతితమానవుల కొసగే
ఖలుల నెన్నుట పొగడే[2]'' అంటూ విభువులను, పండితులను

తీవ్రంగా ఆక్షేపించాడు.

వేమన, వీరబ్రహ్మం, త్యాగరాజులు వర్ణవిధానాన్ని, ఆచారాల అనుసరణ కారణంగా సాంప్రదాయికంగా ఏర్పడిన భావాల సామంజస్యాన్ని ప్రశ్నించారు. కులాల మధ్య గల అంతరాలను

''కులము హెచ్చుతగ్గు గొడవలు పనిలేదు
సాను జాతమయ్యె సకల కులము
హెచ్చుతగ్గుమాట లెచ్చరుంగ వద్దు'' నని వేమన భావించగా,

వీరబ్రహ్మం,

''యేదిరా కులము ఒకే నాదుకులంబని నడవరా జాణ
నాదుకులము యెరుగక తిరిగేవు
నాదుకులంబని నడువరా జాణ'' అని ప్రతీ కులాన్ని తనదిగా

తలుచుకొమ్మని సామాజికులకు ఉద్బోధిస్తే, త్యాగయ్య,

---

1. కల్యూరి వీరభద్రశాస్త్రి : త్యాగరాజు కీర్తనలు - విశేష వివరణము సంపుటి-1, కీర్తన-116.
2. " సంపుటి-1, కీర్తన-192.

''బలము కులము ఏలరామ - భక్తి కారణము

వెలయు సకలసిద్ధులెల్ల - వెంటవచ్చు గానివేము'' ||బలము||

(త్యాగరాజు కీర్తనలు, సంపుటి-1, కీర్తన-38)

సమాజంలో కుల, బల ప్రాధాన్యంగాక రామభక్తిమార్గం ఉత్తమమైనదని త్యాగయ్య వివరిస్తాడు.

ఆచారాలలోని నిర్హేతుకతను ఖండించడం భక్తిసాంప్రదాయకుల సమాన లక్షణం. అయితే బ్రాహ్మణుల ఆచారాలు, పద్ధతులనుగూర్చి వ్రాస్తూ, అబెడుబాయ్, ఆచారాలను నామకః అనుసరించడమేగాని వాటిలోని అసంబద్ధమైన అంశాలను ఖండించిన తెలుగువారిలో వేమన ఒక్కడే ప్రసిద్ధుడని రాశాడు.[1] సాంప్రదాయకంగా కొనసాగుతున్న ఆచారాలను నిర్ద్వంద్వంగా ఖండించినవారిలో వేమన ముఖ్యుడే అయినా బాహ్య ఆచారాలద్వారా సమాజంలో గౌరవాన్ని పొందే యోగులను, ఋషులను అన్నమయ్య, వేమన, వీరబ్రహ్మం, త్యాగయ్యలు నిరసించారు.

భక్తిమార్గాన్ని, యోగమార్గాన్ని అనుసరించిన కవులందరూ బాహ్య ఆచారాల కారణంగా సమాజంలో ఏర్పడే గౌరవాగౌరవాలను ప్రశ్నించడం వల్ల, ఒకే భావం పునరావృతమయ్యింది. అన్నమయ్య,

---

1. "Amongst the few Hindu works which are written in a free philosophical vein, and in which the Hindu religion and its customs are openly criticised, not one that, I know of has been written by a Brahmin, All the works of this kind that I have seen have emanated from authors who were not of this caste ... One of the most famous is Vemana, whose poems originally written in Telugu, have since been translated into several other languages".

Abbe Dubois: Hindu Manners, Customs and Ceremonies, PP. 274-75.

''మిక్కిలి నీట మునింగే మీనుకేది స్నానమా
కొక్కెర ధ్యానము చేసుకోరే అది యోగమా
నిక్కి ఆకుమేయు నిండనది తపమా
పులులు గుహలనుండే వాల్మీక బుషులా
యెలుగు గడ్డము పెంచునింతలోనే యోగ్యుండా
యిలఁ బక్షులాకాశానకేగితే దేవతలా

(అధ్యాత్మ సంకీర్తనలు, కీర్తన, 62)

రామదాసు,

''పాముగ నూట యెనిమిది తిరుపతులెల్ల తిరుగపని లేదన్నా
మునుమటగా నాపుణ్య నదులలో మునుగుట పనియేమిటికన్నా
వెచ్చెడి పర్వపు దినములలో సుడిపడుటయు మానక యుండన్నా

(తారకమంత్రము)

అన్నమయ్య, రామదాసుల భావాలను వేమన మరింత స్పష్టంగా తెలిపాడు.

వేమన,

''నీళ్ళమునుగ నేల? నిధుల మెట్టగనేల?
మొనసి వేల్పులకును మొక్కనేల?
కపట కల్మషములు కడుపులో నుండగా ...''

'' అడవి దిరుగలేదు, యాకసమున లేదు
అవనిఁ దీర్థయాత్రలందు లేదు
ఒడలు శుద్ధి జేసి యొడయుని జూడరా ...''

వెర్రి నక్కల వలె వేదముల్ చదివేరు

యాశయంబు లెరుగరయ్యవార్లు,

ఇదే భావాన్ని వీరబ్రహ్మం,

''నీళ్ళలో మునిగి గొణుగుచునుండే

నిలకడ చెడునుర ఓరే ఓరే

ఒక్కపొద్దులని యెన్నుచునుండే

ఒనరుగ చెడుదువు ఓరే ఓరే ... అంటే

త్యాగయ్య,

'' నీట కాకి మునుగ - నిరతము దయస్నానమా

తేట కనులు కొంగగార్చు - దేవ దేవ ధ్యానమా

పత్రములను మేయు మేక - బలమైన యుపాసనమా

చిత్రపక్షి లెగయు సూర్యచంద్రులకు సామ్యమా ||బల ము కులము||

యజ్ఞ, యాగాదుల ద్వారా పొందగోరే సుఖాలను

''నామదమ్ము నాగసుగాండ్ర గోరిన

నాపయాకి సురాన్వదాన్ ...''

యజ్ఞాదులు సుఖమనువారికి సమ

మజ్ఞానులు గలరా '' అని యాగాల నిరుపయోగితను

విశదీకరించాడు.

భక్తిమార్గాన్ని అనుసరించిన అన్నమయ్య, రామదాసు, త్యాగయ్యలు యోగంలోని వేమన, వీరబ్రహ్మంలు ఆచారాలను పాటించడంలోని నిరుపయోగితను బహిరంగంచేసి, వాటిని అనుసరించడం ద్వారా సమాజంలో పొందే గౌరవాన్ని ప్రశ్నించి నూతన విలువలను అపేక్షించారు. అందువల్లే, వీరి భావాల్లో సామ్యాలు కనబడతాయి.

## భక్తిసంప్రదాయంలో క్షేత్రయ్య భిన్నత్వం

క్షేత్రయ్య క్రీ.శ. 17వ శతాబ్దిలో నేటి కృష్ణాజిల్లా, మొవ్వగోపాలుని ఆలయ కేంద్రంగా జీవించిన కవి. గీతగోవింద కర్తయైన జయదేవునిలాగే మధురభక్తి సంప్రదాయంలో మువ్వగోపాలుని రాసిక్యాన్ని వర్ణించిన కవి - క్షేత్రయ్య. మధురభక్తి సంప్రదాయంలో అన్నమయ్య వేలకొలది శృంగార సంకీర్తనలు రచించినా అన్నమయ్య శుద్ధమైన మధురభక్తిని అనుసరించినవాడు కాదు. అన్నమయ్య ఆధ్యాత్మిక సంకీర్తనలు సామాజిక జీవనంపట్ల, ఆయనకుగల అవగాహనను అందిస్తాయి. (ఈ అంశాలు గత ప్రకరణంలో విపులంగా చర్చితమైనాయి). కాని క్షేత్రయ్య పదాలు కేవలం శృంగారాత్మకాలు.

''ఎంతవాట లాడెనమ్మ - యింతిరో ! నా విభుడునన్ను
  చెంతజేరి మోవితేనె - చవునని మోమును దిక్కునేము ।।ఎంత।।
కులుకు గుబ్బలరొమ్ము గుమ్మ - కౌగిలియను నేటొత
ఉలికి లేచి కసరుకొని వనిత ! నీతో
పొందుబాలు పొమ్మనెను ।।ఎంత।।

చెలియ మావమువ్వగోపాలుని - చిత్తమురంజిల్లజేసి
యిలువిమ్మకొని ఉపరతి నేయగలో
ఈ పొందు వద్దు పొమ్మ నేను ॥ఎంత॥''[1]

నాయిక తన చెలికాండ్రకు చెప్పుకునే ఈ పదంలో మువ్వగోపాలుడి శృంగారకృత్యం కేవలం లౌకికపరమైందే.

క్షేత్రయ్య పదాలలో పరిపోషింపబడిన శృంగారాన్ని ఆధ్యాత్మిక పరంగా వ్యాఖ్యానిస్తూ, ''... మధుర రస పరిప్లావితమైన క్షేత్రయ్య శృంగార రసాధీనత అయిన గోపాలదేవుని యందు ఆత్మ నివేదనం గావించిన విధమనీ''[2] కొందరు భావించినా, క్షేత్రయ్య పదాల్లోని శృంగారం కాయికమేనని, దానిని ఆధ్యాత్మిక అంశంలో జీవాత్మ, పరమాత్మల సంయోగంగా అభివర్ణించడానికి వీలుకాదని అనేక మంది పరిశోధకులు భావిస్తున్నారు.[3] పి. వి. రాజమన్నారు క్షేత్రయ్యపై రాసిన వ్యాసంలో ఈ అంశాన్ని స్పష్టం చేస్తూ,

---

1. క్షేత్రయ్య పదములు : విస్సా అప్పారావు (సం.), పదం - 81.
2. డా. ఎస్. గంగప్ప : క్షేత్రయ్య పదసాహిత్యం, పే. 164.
3. (ఎ) ఆరుద్ర : సమగ్రాంధ్ర సాహిత్యం, Vol-7. నాయకరాజులయుగం, పే. 245.
   (బి) క్షేత్రయ్యపై వ్రాసిన వ్యాసంలో ప్రజాపరామేశ్వరయ్య క్షేత్రయ్య సృష్టించిన నాయికా నాయకుల శృంగార చేష్టలను వర్ణిస్తూ 'ఆయన రచించిన పదాలలో కామోన్మాదాన్ని ప్రకోపింప చేసే ప్రయోజనమే ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. ... క్షేత్రయ్య ప్రధానంగా కామతంత్ర కళాకోవిదుడుగా, లౌకిక శృంగార చక్షుష్కుడుగా మాత్రమే ఎన్నుకో బడతాడు కాని త్యాగయ్య, అన్నమయ్య వగైరాల వలె ఉజ్జ్వలభక్తి తత్పరుడైన వాగ్గేయకారుడుగా ఎన్నటికి పరిగణింపబడజాలడ'ని వివరించాడు. ప్రజాపరామేశ్వరయ్య : ''అలౌకిక శృంగార రసస్ఫూర్తిలేని క్షేత్రయ్య పదసాహిత్యం'' తెలుగు, ఫిబ్రవరి, 1991, పే.30.

"This theory may sublimate the patently erotic nature of the padams of Kshetrajna into expressions of spiritual experience. I am, however, unable to find any trace of a metaphysical exposition directly or indirectly, in the padams of Kshetrajna".[1]

అన్నమాచార్యుని వ్యక్తిత్వంలో కనిపించే స్వతంత్రతగూడా క్షేత్రయ్యలో కనిపించదు. అన్నమయ్య వేంకటేశ్వరునిపై శృంగార సంకీర్తన పాడగా విని సాళువ నరసనాయకుడు అటువంటి గీతాన్నే తనపై వినిపించుమని కోరగా రాజు కోరికను నిరాకరించి అతని ఆగ్రహానికి గురై చివరకు రాజాస్థానాలనే వ్యతిరేకించాడు. కాని, క్షేత్రయ్య తన దైవమైన మువ్వగోపాలునిపై గీతాలు రచించినట్లే తంజావూరు పాలకుడైన విజయరాఘవ నాయకునిపై, తుపాకుల వేంకట కృష్ణప్ప నాయకునిపై, గోల్కొండ పాలకుడైన అబ్దుల్లా కుతుబ్‌షా లపై శృంగార పదాలు చెప్పాడు.

కేవలం శృంగారాత్మకమైన పదాలు మినహా తన సమకాలంనాటి జీవనం పట్ల ఎలాంటి ప్రత్యేక అవగాహనను విశదం చేయని కారణాన క్షేత్రయ్య ఒక మార్గాన్ని వేయలేక పోయాడు.

అన్నమయ్య, క్షేత్రయ్యల మధ్యగల భేదాన్ని, క్షేత్రయ్యను త్యాగరాజు

---

1. P.V. Rajamannar: "Kshetrajna" in Composers, P. 9.

అనుసరించక పోవడానికి గల కారణాన్ని ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం పేర్కొనిన అంశంతో అంగీకరించవచ్చు. ''అన్నమయ్య అలమేలు మంగనూ, వేంకటేశ్వర స్వామినీ నాయికా నాయకులుగా భావించి దివ్యశృంగారభావనతో మధురభక్తిని పోషించాడు. క్షేత్రయ్య దేవుణ్నేకాదు, రాజులను కూడా సేవించాడు .... క్షేత్రయ్యలాగా తరువాతి కాలంలో త్యాగయ్య రాజులను సేవించలేదు. నిధికంటె రాముని సన్నిధిని వరించాడు. క్షేత్రయ్యలో సంశయాస్పదమైన మధుర భావ స్ఫూర్తిని త్యాగయ్య గ్రహించలేదు. ... త్యాగయ్య శృంగారం జోలికి పోకపోవడానికి కారణం క్షేత్రయ్య దానిని మొగం మొత్తేటట్టు చేయడమే.[1]

## ఉ ప సం హా రం

స్వీయ భక్తిమార్గాన్ని అనుసరించిన క్షేత్రయ్య, రామదాసు, త్యాగయ్య, యోగమార్గాన్ని అనుసరించిన వీరబ్రహ్మంకంటె వేమన సామాజిక జీవితంలోని అనేక అంశాలను చర్చించాడు. కులవిధానం పట్ల, ఆచారాలపట్ల, వివిధ మతాలపట్ల తన అవగాహనను విశదం చేశాడు. అయినా వేమన భావజాలం ఒక ఉద్యమరూపం సంతరించుకోలేకపోయింది. వ్యాపార రంగంలో పాశ్చాత్యులు స్థిరపడడం మొదలైనప్పటి నుండి షావుకారులు, ఇతర వర్గాలు మారుతున్న పరిస్థితుల్లో, నిరాశామయ పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో వేమన సమకాలంలోని సమస్యలకు వ్యాఖ్యాతగా వ్యవహరించాడేగాని ప్రజల్లో ఒక ఆశను కల్పించలేక పోయాడు. పైగా ఆయన అనేక అంశాలను హేతుబద్ధంగా ఆలోచించడంగూడా ప్రజలను ఆకర్షించడానికి వీలివ్వలేదు.

1. జి.వి. సుబ్రహ్మణ్యం : ''రతి రతికోసమే - శృంగారయోగకవుల ప్రతిపాదించిన నినాదం'' సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు, పే. 296.

వేమన కాలానికి చెందిన వీరబ్రహ్మం తనస్మృతికి చెందిన పంచాంగం, ఇతరస్మృతికారుల్లో ఒక ఆశావహ స్థితిని ప్రచారం చేశాడు. సమాజం తీవ్ర నిరాశామయ పరిస్థితుల్లో ఉన్న కాలంలో సామాజికంగా ఒక దేవుడు మేలుచేకూరుస్తాడని ఆశించడంలో ఉన్న ఆనందం, జీవితాన్ని హేతుబద్ధంగా పరిశీలించడంలో లేదు. వీరభోగ వసంతరాయుల అవతారంతో సమాజంలోని ఉత్పాతాలు అంతరిస్తాయని చెప్పడంవల్ల, వీరబ్రహ్మం ప్రజలకు చేరువ కాగలిగాడు.

# భక్తి తత్త్వకవుల ప్రచారవాహిక

## - పరిశీలన

వీరశైవ, వైష్ణవ మత సంప్రదాయాలను, స్వీయ భక్తిమార్గాన్ని యోగమార్గాన్ని అనుసరించిన కవులు తమ భావాలను ఏవర్గంలో ప్రచారానికి ఉద్దేశించారో వారు ఉపయోగించిన మాధ్యమంగూడా అందుకు ఉపకరించే రీతిలోనే కొనసాగింది. భక్తి సంప్రదాయాన్ని అనుసరించిన కవులు నన్నయ్య ప్రారంభించిన చంపూ కావ్య పద్ధతికి భిన్నంగా గేయ పద్ధతినే అధికంగా అనుసరించారు. పాల్కురికి సోమనాథుడు ద్విపద సంప్రదాయాన్ని, అన్నమయ్య సంకీర్తనామార్గం చేపట్టడానికి తమ భావాలను ప్రచారం చేయాలని తలచడమే ప్రధాన కారణం. వైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించిన కృష్ణమాచార్యులు గేయాల్ని రచించకపోయినా ఆయన వచనాలు గానానుకూలమైనవి.

మల్లికార్జున పండితుడికి భక్తిభావన పట్ల అనురక్తి ఉన్నా ప్రచారంపట్ల ఆసక్తి లేదు. అందువల్లే ఆయన ప్రత్యేక ఛందస్సును ఉపయోగించలేదు. పండితారాధ్యుడి వీరశైవ మార్గమే పాల్కురికి సోమనాథుడిని ప్రేరేపించినప్పటికీ సోమనాథుడు తాను అనుసరించే మతానికి విస్తృత సాహిత్యరూపమిచ్చి ప్రచారం చేయడానికి ప్రయత్నించాడు. సామాజికంగా బ్రాహ్మణాధిపత్యాన్ని వ్యతిరేకించడం, సాహిత్య సంప్రదాయంలో సంస్కృత ఆలంకారిక మార్గానికి భిన్నంగా నూతన సంప్రదాయాన్ని అనుసరించడం సోమనాథుడికి గల ప్రత్యేక ఆశయాన్ని తెలియజేస్తాయి.

వేమన ఆటవెలది పద్యాన్ని ఉపయోగించినా దానిని లిఖిత మార్గానికి సంబంధించిన పద్యంగా గాక గేయంగా ఉపయోగించాడని పరిశోధకులు విశ్లేషించారు.

భక్తిమార్గాన్ని అనుసరించిన కవుల గేయనిర్మాణానికి వేమన ఆటవెలది భిన్నమైనదే అయినప్పటికీ గానానుకూలమైన పద్య నిర్మాణాన్నే అనుసరించాడని అనేక అంశాలు విశదం చేస్తున్నాయి.

భక్తిమార్గాన్ని అనుసరించిన కవులు తమ భావాలను పండితులకోసం ఉద్దేశించక పోవడంవల్ల, లిఖిత సంప్రదాయానికి భిన్నంగా మౌఖిక రూపంలో ప్రచారం పొందడానికి అనువైన విధానాన్ని అనుసరించారు. తమ భావాలకు విస్తృత వ్యాప్తిని ఆశించిన కవులందరూ గేయఛందస్సును అనుసరించినవారే. తమిళ ఆళ్వారులు, నయనార్లు, కన్నడ వీరశైవులు, ఉత్తరభారతంలోని భక్తకవులూ మౌఖిక ప్రసారానికి వీలయ్యే గేయ రూపాలను ఉపయోగించారు. కన్నడదేశంలో వీరశైవాన్ని వ్యాపింప చేసిన బసవనను 'గానరసప్రవీణ', 'రాగపరాభోగ', 'అపూర్వ గీతగాంధర్వ', 'వినుతనవీనగాన' (వృషాధిపశతకం, పద్యాలు 11, 16, 27, 36) అంటూ సోమనాథుడు గానంలో ఆయనకున్న ప్రావీణ్యాన్ని పేర్కొంటాడు. కన్నడదేశంలో వీరశైవ మతాన్ని ప్రచారం చేసిన భక్తులకు గేయరచనలో ప్రత్యేక శిక్షణ లేకపోవడంవల్ల, వారికి ఆలంకారిక మార్గాలతో పరిచయం ఏర్పడలేదు. నిత్య వాగ్వ్యవహారానికి ఉపకరించే రీతిలోనే తమ వచనాలను ప్రజలకు బోధించారు. అందువల్ల, వారి వచనాల్లో, రాజాస్థానకవుల రచనల్లోని పద్యశిల్పం కనిపించదని విమర్శకులు తెలిపారు.[1]

ఉత్తరభారతంలోని భక్తకవులకు స్పష్టమైన లక్ష్యం ఉంది. సామాజికంగా

---

1. A.K. Ramanujan: Speaking of Siva, P.12.

మఠాధిపతుల ఆధిపత్యాన్ని ఖండించడంతోపాటు రాజకీయంగా శత్రువులను వ్యతిరేకించడం గూడా ముఖ్యమైన అంశంగా పరిగణించడం వల్ల, తమ గేయాలను ప్రజలకోసం ఉద్దేశించారు. ఆ కారణాన పాడుకోవడానికి వీల్మైన రీతిలో సులభమైన ఛందస్సును ఉపయోగించారు. మరాఠీ ప్రాంతంలో ప్రారంభమైన వర్కరీ సంప్రదాయం మౌఖిక మార్గంలోనే కొనసాగింది. ఈ ఉద్యమ ప్రారంభకుడైన జ్ఞానదేవుడు గీతకు భాష్యం రచించడం ద్వారా మరాఠీ లిఖిత సంప్రదాయానికి పునాదులు వేసినప్పటికీ ఈ ఉద్యమం లోని ఇతర భక్తులైన నామదేవ్, చొక్కమేలా, తుకారాం లాంటి భక్తులు మౌఖిక మార్గానికి బలమైన ప్రతినిధులుగా కనిపిస్తారు. మరాఠీ సాహిత్యంలో మౌఖిక, లిఖిత మార్గాలలో మౌఖిక సాహిత్య మార్గం శక్తివంతమైనదే గాక స్థిరంగా కొన సాగుతూ వస్తుంది. "In Maharastra the written culture is more or less prosaic, discontinuous, elitist, courtly, fluctuating and influenced by Sanskrit or Persian. while the oral culture is more or less poetic, continuous, proletarian, rural, standardized and associated with the reformation movements of the underprevileged"[1]. మరాఠీ సాహిత్యంలో బలమైన సాహిత్యమార్గం కొనసాగడానికి వర్కరీ సాంప్రదాయికుల కృషి అతిప్రధానమైంది. ఉత్తరభారతంలోని భక్తకవుల్లో, సామాజిక అంశాలను విపులంగా చర్చించిన కబీరు గేయాలు మిగుల ప్రచారంలో ఉండడానికి ఆగేయాలలో

---

1. Bhalchandra Nemade; "The Revolt of Underprevileged", P.119.

ఉన్న గానసౌలభ్యం ప్రధానకారణం. కబీరు ఉపయోగించిన దోహాల్లో, సంక్షిప్తత, దీర్ఘ సమాస ప్రయోగాలు ఉండవు.

## కబీరు దోహా

'దోహా' రెండు పాదాలతోకూడి సంపూర్ణ అర్థాన్నిచ్చే పద్యం. ఇది ముక్తకంలాంటిది. అభివ్యక్తిలో సంక్షిప్తతను అపేక్షిస్తుంది. ప్రతి పద్యం ఒక భావాన్ని అందించినట్లే, ఇరవైనాలుగు మాత్రలు లేదా అంతకంటే ఎక్కువ మాత్రలు కలిగి ఉండే ప్రతిపాదం ఒక భావంతో విరుగుతుంది. మొదటిపాదంలోని అక్షరాలు రెండవపాదంలో రావడానికి వీలులేదు.

ఉదా :- 'जहाँ दया तहाँ धर्म है, जहाँ लोभ तहाँ पाप ।
जहाँ क्रोध तहाँ काल है, जहाँ क्षमा तहाँ आप ॥'[1]

ఈ దోహాలోని ప్రతిపాదం 28 మాత్రలు కలిగి ఉంది. మొదటిపాదంలోని రెండు వాక్యాల్లో, "जहाँ दया तहाँ धर्म है" అనే వాక్యం పూర్తవడంతో విరుపు వచ్చింది. రెండవవాక్యంలోని ప్రథమాక్షరానికి యతిమైత్రితో శ్రవణ సుభగత్వం చేకూరింది. సుదీర్ఘ పదబంధాలు లేని ఈ దోహా పాడుకోవడానికి సౌలభ్యానిస్తుంది.

---

1. Kabir Granthavali 15-23.
   Cf. Karine Schomer: "The Doha as a vehicle of Sant Teachings" in The Sants, P.62.

కబీరు తన గేయాలను శ్రోతలకోసం ఉద్దేశించడంవల్ల, వారిని సంబోధించే అనేక అంశాలుంటాయి.

"కహా కబీర సునో భాయీ సాధో" (సోదరసాధులార ! కబీరు చెప్పినాడు)

"సునో హా సంతో ...!" (ఓ సంతులారా ! వినండి.)

అంటూ కబీరు తన శ్రోతలను నేరుగా ఉద్దేశించి గీతాలు పాడుతూ వారిని పదేపదే సంబోధిస్తాడు. ఇలా సంబోధించడంలో ప్రజలను మేల్కొల్పాలన్న ఆకాంక్ష వ్యక్తమవుతుంది.

కబీరు వస్తుపరంగా అనేక అంశాలను చర్చించినా గేయాల్లో శిల్పపరమైన నైపుణ్యంలేదని విమర్శకులు భావిస్తున్నారు.

"Even a little bit of polish would have immeasurably enhanced the charm of their utterances ... In the Nirgunis, it is not only the inadequacy of language, but the total disregard of form their one deplores to find. But it is not for the beauty of expression that one ought to go to the mystic. Though there is not beauty of form in their utterances, beauty of content there is... And it is in the content and not the form that the real poetry consists".[2]

1. P.D. Barthwal: The Nirguna School of Hindi Poetry, PP. 222-23.
   Cf. Linda Hess: "Kabir's Rough Rhetoric" in The Sants, P.147.

2. - ibid . P. 144.

ఒక ప్రత్యేక సామాజిక ప్రయోజనాన్ని ఆశించి తన భావప్రసారానికి కబీరు ఉపయోగించిన దోహాలలో శిల్పనైపుణ్యం కనిపించడానికి అవకాశం లేదు. కబీరుతోపాటు పలువురు ఔత్తరాహ భక్తకవులకు సంస్కృత సాహిత్య పరిచయం, కావ్యశిక్షణ లేకపోవడంవల్ల, వారి రచనలో శిల్పపరమైన లోపాలకు అవకాశం ఉంది.

ఔత్తరాహ భక్తకవులు సామాజికంగా ఆశించిన ప్రయోజనానికి, తెలుగు భక్తకవుల ఆశయానికి ఉన్న వైవిధ్యమే శిల్పంలోనూ కనిపిస్తుంది. తెలుగు భక్తకవులు ప్రచారానికి ఉపకరించే గేయరూపాన్ని స్వీకరించినా ప్రతి కవి పైనా లిఖిత సాహిత్య ప్రభావం ఉంది. అందువల్ల, పద్యనిర్మాణంలో శిల్పం సాధ్యమయ్యింది. పలువురు భక్తకవుల గేయాలను పరిశీలించినప్పుడు విశదమయ్యే అంశమిది.

## సోమనాథుడి ప్రచారవాహికగా ద్విపద

పాల్కురికి సోమనాథుడు తనకు పూర్వమున్న లిఖిత కవితా సంప్రదాయాన్ని తెలివిడి (Conscious)తో నిరాకరించినకవి. నన్నయ్య అనుసరించిన వైదిక మత ధర్మాలనేగాక ఆయన రచనామార్గాన్ని కూడా అంగీకరించలేదు. తెలుగు సాహిత్యంలో నన్నయ్య ప్రారంభించిన కవితామార్గం గద్య పద్యాత్మకమైన చంపూమార్గం. ఇది సంస్కృత ఆలంకారిక లక్షణాలను స్వీకరించి పటిష్ఠమైన లిఖిత సాహిత్య మార్గాన్ని ఏర్పర్చింది. నన్నయ్య సాహిత్ సంప్రదాయం ''చదువుకున్న వారితో సంబంధంలేని సాహిత్యం తప్పిస్తే, దేశి మార్గాన్ని అనుసరిస్తున్నామని చెప్పుకునే కవులను గూడా

ఈ మార్గం ప్రభావితం చేసింది.[1] పాల్కురికి సోమనాథుడుకూడా నన్నయ్య రచిస్తున్న మహాభారతాన్ని అధ్యయనం చేసినట్లు, 'చతుర్వేదసారం'లో రాసిన పద్యాన్ని బట్టి తెలుస్తుంది.[2] నన్నయ్య ఏర్పరిచిన చంపూ పద్ధతిని దృష్టిలో ఉంచుకునే సోమనాథుడు,

"ఆర్యాఖ్య గద్య పద్యాది ప్రబంధ
పూరిత సంస్కృత భూయిష్ఠ రచన
మానుగా సరస సామాన్యంబు..." (పండితారాధ్య చరిత్ర, పే. 5)

కాకపోవడంవల్లనే తాను తెనుగులో ద్విపద ఛందస్సును ఉపయోగించి కావ్యరచనచేసానని పేర్కొన్నాడు.

ద్విపదకు అత్యంత సమీపవర్తి, అయిన తరువోజను నన్నయ్యకు ముందు నుండి వివిధ శాసనాలలో ఉపయోగించినట్లు, అనేక ఆధారాలు లభిస్తున్నాయి. క్రీ.శ. 5వ శతాబ్దినాటి విప్పులూరు శాసనంలో, 9వ శతాబ్దికి చెందిన అద్దంకి శాసనంలో తరువోజను ఉపయోగించారు.[3] సోమనాథుడికి పూర్వం మౌఖిక గేయాల్లో, మాత్రమే ఉండిన ద్విపద[4] మూడింద్రగణాలు, ఒక సూర్యగణం కలిసి రెండేసి పాదాలతో ఉంటుంది. ఒక ద్విపదతో ఒకే భావం పూర్తికాక ఒక ద్విపదనుండి మరొక ద్విపదకు విస్తరిస్తూ, పోవడంవల్ల, సుదీర్ఘమైన గేయరూపాన్ని సంతరించుకుంటుంది. కావ్యనిర్మాణానికి ద్విపదను ఉపయోగించిన పిమ్మట రెండవ ఛందస్సును ఉపయోగించడానికి వీలు లేనందున

---

1. కె.కె. రంగనాథాచార్యులు : తెలుగు సాహిత్యం - మరోచూపు, PP. XVII-XVIII.
2. "వైదికులిరిది శుద్ధ వైదికంబని యున్న
   శాస్త్రజ్ఞులిరిది ధర్మ శాస్త్రమనగ ..." (చతుర్వేదసారం, పద్యం. 22)
3. సంగనభట్ల నరసయ్య : తెలుగులో దేశి ఛందస్సు, పే. 203.
4. చూ. బిరుదురాజు రామరాజు : తెలుగు జానపదగేయ సాహిత్యం, P.17, & 220.

కావ్య నిర్మాణమంతా ఒకే ఛందస్సులో కొనసాగించవలసి ఉంటుంది. ద్విపద మౌఖిక సంప్రదాయానికి సంబంధించింది కావడంతోపాటు కావ్యరచన మొత్తం ఒకే ఛందస్సులో కొనసాగించడంలాంటి అంశాలవల్ల ఈ ఛందస్సు మహాకావ్య రచనకు ఉపకరించదని సోమనాథుని కాలంనాటి పండితాభిప్రాయం.[1] ద్విపదపట్ల ఉన్న భావనను తొలగించడానికి ద్వి'పద' ఇహ పరలోక గతులకు ఉత్తమమార్గమని ఆదర్శీకరిస్తూ,

''... సత్పురుషులారఁ
దివ్యని సూక్తుల ద్విపద రచింతు
అదియును గాక యైహికాముష్మిక ద్వి
పద హేతువగుట ద్విపదనాఁగఁ బరగు
ద్విపదాంబు రుహముల ధృతి బసవేశు
ద్విపదాంబు రుహము లతిప్రీతిఁ బూన్తు'' (పండితారాధ్య చరిత్ర, పే.6) అని

---

1. సోమనాథుడి తర్వాత గోనబుద్ధారెడ్డి, గౌరన, తాళ్ళపాక తిమ్మక్క, తాళ్ళపాక చిన్నన్న ద్విపద ఛందస్సును తమ కావ్యరచనకు ఉపయోగించారు. వీరు రచించిన కావ్యాలన్నీ తిరిగి పద్యకావ్యాలుగా పరివర్తింపచేశారు. సోమనాథుడి బసవపురాణాన్ని పిడుపర్తి సోమన 'పద్య బసవపురాణం'గా, గౌరన హరిశ్చంద్రోపాఖ్యానాన్ని శంకరకవి, తిమ్మక్క సుభద్రాపరిణయాన్ని మేడకూర వెంకటకవి 'విజయవిలాసం'గా రాశారు. ద్విపదలో కూర్చబడిన కావ్యాలను తిరిగి పద్యమయంగా కూర్చడంలో ద్విపద ఛందం పట్ల ఉన్న హీనభావనే కారణం.
కోవెల సంపత్కుమారాచార్య : తెలుగు ఛందోవికాసం, పే. 111.

ద్విపదలో కావ్యనిర్మాణం చేయడానికి, గేయంగా ఉపయోగితమయ్యే ద్విపదను స్వీకరించి బసవపురాణం, పండితారాధ్య చరిత్ర కావ్యాలు రచించాడు. ఆ సందర్భంలో మౌఖిక గేయాల్లో, ఉపయోగించే ద్విపదకు యతిప్రాసాదులను చేర్చి ప్రామాణికతను కలిగించాడు. ''ద్విపదకు ప్రాసను నియతముగా చేసినవాడు పాల్కురికి సోమనాథుడు. ఈ ప్రాస నియతివలన ద్విపదకు పద్యత్వము కొంత కల్పితమగుచున్నది. తెలుగునందలి పద్యములలోని మరొక విశిష్టలక్షణము ఒక పదమే రెండు పాదములందు వ్యాపించి - అనగా ఒక పాదము చివర కొంత భాగము, తరువాతి పాదము మొదటి భాగమున ఉండుట, గేయము నందలక్షణముండదనియే చెప్పవలెను. మంజరీ ద్విపద (ద్విపద యొక్క ప్రాచీన స్వరూపము) యందు లేని ఈ లక్షణమును ద్విపదకాపాదించిన వాడు సోమనాథుడు. దీనిచే మరికొంత పద్యత్వము ద్విపదకు కల్పితమయినది[1]''.

సోమనాథుడు కన్నడ వీరశైవ మతభావాలను పండితలోకంచేత ఆమోదింప జేయడానికి జరిపిన ప్రయత్నం వంటిదే దేశిఛందస్సు పట్ల చేశాడు.

సోమనాథుడి రచనలో రెండు లక్షణాల సమ్మిశ్రణం కనిపిస్తుంది. సంస్కృత పద భూయిష్ఠమైన రచన సాధారణశ్రోత గ్రహించలేడని తెలుపుతూనే ఉత్తమ కావ్యంలో అపశబ్దాలు, క్రమరాహిత్యం, అసంగతి, విరసం, వైకల్యం, అత్యుక్తి, వైరిపదాలు, అసమగ్రతలాంటి దుర్లక్షణాలను పరిహరించినపుడే ఉత్తమ కావ్యంగా పరిగణింపబడుతుందని వివరించాడు[2]. కావ్యంలో ఈ లక్షణాలన్నీ పరిహరించడంకోసం

---

1. కోవెల సంపత్కుమారాచార్య : తెలుగు ఛందోవికాసం, పే. 102.
2. పండితారాధ్య చరిత్ర, పే. 5.

కవి ప్రయత్నించడమంటే కావ్యరచనలో ఉత్తమ శిక్షణ స్వీకరించినపుడు మాత్రమే సాధ్యమవుతుంది. సోమనాథుడు తుమ్మెద పదాలు, రోకటి పాటల గురించి ప్రస్తావించినప్పటికీ వాటిని సాహిత్యంగా గుర్తించడంలేదని ఈ అంశాలు విదితం చేస్తున్నాయి.

సోమనాథుడికి పౌరాణిక ప్రచారం ఆశయమే అయినా తన ఆశయానికి భిన్నంగా కావ్యాలను రచించాడు. సోమనాథుడు 'చతుర్వేద సారా'న్ని గూర్చి ప్రస్తావిస్తూ, కావ్యరచన తన ప్రధాన ఆశయంగా పేర్కొంటాడు.

" ఈ కృతి రచియించి యాలోకమందు
ప్రతిష్ఠింతు నీశ్వరాధిక్య మహిమ
నీకృతి పారించి యాలోక మందు
సంపాదింతు జంగమ పాత్ర మహిమ
నీకృతి యొనరించి యా లోకమందు
నిర్మింతు ప్రసాద సంసేవ మహిమ
నీకృతి గావించి యాలోకమున ప్రతి
పాదింతు పటుతర భక్తిమహిమ
నాది వృషభాంశజుడు బసవాధినాథు
డిట్టి గుతినాథు గృప చేత నిప్పుడాంధ్ర
భాతి బ్రకటింతు పద్య ప్రబంధముగను
వసుధ నతులిత సన్నుతి బసవలింగ !" (చతుర్వేదసారం, పద్యం. 18)

వీరశైవ మత భావాలకు మౌళిక ప్రచారం గాక పద్య ప్రబంధరూపమిచ్చి బసవన మతాన్ని స్థాపిస్తానని వివరించాడు.

సోమనాథుడి రచనలను పరికిస్తే, అతడు కావ్య లక్షణాలతో అమితంగా ప్రభావితుడైనట్లు గుర్తించవచ్చు. తొలికృతి అయిన 'అనుభవసారం' లో భక్తికి సంస్కృత ఆలంకారిక సిద్ధాంతాలను అన్వయింపచేసి పద్యాలు రచించాడు. బసవన్నై రాసిన 'వృషాధిపశతకం' లో అష్టభాషలలో బసవన మాహాత్మ్యాన్ని కీర్తించాడు. అయితే 'బసవపురాణం', 'పండితారాధ్య చరిత్ర' ల రచనా కాలంనాటికి దేశి మార్గం పట్ల, ద్విపద ఛందస్సు పట్ల విశ్వాసం ఏర్పడింది. అయినా 'పండితారాధ్య చరిత్ర' లో

'' తొమ్మిది రసములుఁ దొలుకాడు దాని
యిమ్మడి వర్ణన లెసగంగ ద్విగుణ
మగు నలంకారాల'' (పే. 4) తో ఈ కావ్యాన్ని నిర్మిస్తానని
వివరించాడు.

సోమనాథుడి ద్విపద రచనల్లో ఒక ముఖ్యలక్షణం ఉంది. భక్తకూటాల్లోని శ్రోతల్లో, తన కావ్య రచనను అర్థం చేసుకోగలిగిన భక్తుల్లో రసోద్భవన కలిగించడానికి దీర్ఘ వర్ణన, పునరుక్తి పాటించాడు. కావ్యంలో దీర్ఘ వర్ణన, పునరుక్తి అను సాహిత్య లక్షణాలని శైలీశాస్త్ర పరిశోధకులు భావిస్తారు.[1] పండితారాధ్య చరిత్ర లోని పురాతన ప్రకరణంలో,

1. వెల్చేరు నారాయణరావు : తెలుగులో కవితావిప్లవాల స్వరూపం, పే.32.

"నాయయ్య కంటిరా నాతండ్రి కంటి
నా యన్న కంటిరా నాసామి కంటి
నిట్టుండ వలవదా పుట్టిన ఫలము
నిట్టుండ వలవదా మెట్టిన చెలము

.... ...

ధీరత నాకొప్పుఁ దెగువ నీ కొప్పు
వీరత నీకొప్పు పెంపు నాకొప్పు
సద్భక్తి నీకొప్పుఁ జలము నీకొప్పు
సుద్భక్తి నీకొప్పు యుక్తి నీకొప్పు" (పే.64) అంటూ దీర్ఘంగా

సాగే ఈ గేయంలో ప్రతీ చివరలో ఒకే పదాన్ని పలుమార్లు ఆవృతం చేయడం వల్ల, శ్రోతను భావోద్వేగానికి లోను చేసే అవకాశం కలిగింది. శ్రోతకు రసోద్భవన కలగడానికి దీర్ఘ వర్ణన, పునరుక్తి తోడ్పడులాయి.

సోమనాథుడు తన కావ్య రచనలో గ్రామీణ జీవితంలోని ఉపమానాలను ఉపయోగించి దేశీయతావాదను సాధించాడు. శివభక్తుడి మనసులో కోపమున్నపుడు భక్తి భావనకు స్థలం ఉండదని, తాను పరులను ప్రేమించలేడని అంటూ,

" పిండి మనేంబునఁ గోపం
బుండిన నెడగలదె భక్తికుండగ, గరిదెన్
పిండి తప్పకుండగా నెడంబుల
కండముసకుఁ గలదె చోటుఖండిత చరితా !" (అనుభవసారం, పద్యం 130)

గరినినిండా శివుడున్నపుడు పులకండం పెట్టడానికి స్థలం లేనట్లే, మనసులో కోపం నిండినపుడు భక్తికి చోటేదని ప్రశ్నించాడు. అలాగే ఇహలోకంలోని జంగముడిని పూజించకుండా శివుడిని పూజించడం ప్రయోజన రహితమని చెప్పడానికి

''అంకురించు మోకానికి నీరుమాని
నెఱివట్టి కొఱడికి నీరెత్తినట్లు'' (పండితారాధ్య చరిత్ర, పే.50)

అంకురించే చెట్టుకు నీరుపోయక మోడుకు నీరు పోయడం వృథా అంటాడు. బౌద్ధ జైన, చార్వాక, కర్మ, వేదాంత మార్గాలు శివభక్తికి సాటి రావని,

'' ... వేయి నూలకలాశోష్న గూడి
యొక మోక్షగునే ....? '' (పండితారాధ్య చరిత్ర, పే.120)

అని ప్రశ్నిస్తాడు. శివభక్తుడు ఇతర భక్తుల దుష్ప్రవర్తనను తొలగింపజేయాలని తెలుపడానికి రజకమూర్తికి చెందిన ఉపమానాన్ని వాడాడు.

'' అలుగుమె భక్తుడు భక్తున
కలుగం దలిగి నను నతని యువగుణముల ప
ట్టలుగు రజకుండు చేరల
కలుగక మాలిన్యమెడల నరిగిన భంగిన్'' (అనుభవసారం, పద్యం 36)

రజకుడు బట్టలుతికే సమయంలో మాలిన్యాన్ని అసహ్యించుకుంటాడుగాని, వస్త్రాన్ని కాదని, ఎదుటివారి అవగుణాలపట్ల ఆక్షేపణ తెలపాలేగాని, వ్యక్తిపట్లకాదని వివరిస్తాడు.

చార్వాక వాదం గురించి చర్చించే సందర్భంలో దేహాత్మలగూర్చి చర్చిస్తూ, ఆత్మ వల్ల దేహం ప్రకాశిస్తుంది; అగ్నితోకూడిన ఇనుము ప్రకాశించినట్లు. ఇనుమును వేడిచేసినపుడు అది ఎర్రబడి అగ్నిగుణాన్ని, ఇనుము లక్షణాన్ని కలిగి ఉంటుంది. అయినప్పటికీ,

''ఇనుమగ్నిగాదగ్ని యినుమును గాదు
యాత్మయు దేహంబు నట్టుగూడి యున్న
నాత్మ దేహంబు గాదాత్మ గాదొడలు
గాన దేహంబు కంటెను వేఱ
లానాత్మ యది సుప్రసిద్ధం'' (పండితారాధ్య చరిత్ర, పే. 132)

అగ్నిలో కూడిన ఇనుములో ఆరెండింటి మధ్య భేదాని విశ్లేషించాడు. పలు సందర్భాలలో సోమనాథుడు ఉపయోగించిన దృష్టాంతాలు,

''తిరుగగ గుమ్మరి దిమ్మంగసారె
తిరుగునా? తనయంత తిరుగునో ధరణి?'' (పండితారాధ్య చరిత్ర, పే. 126)

''మండెడు వెనువున్న నుండి కాలుమను'' (పండితారాధ్య చరిత్ర, పే. 93)

మొదలైనవి సోమనాథుడికి గ్రామీణజీవితంలో ఉన్న బలీయమైన సంబంధాన్ని సూచిస్తాయి. అదే సందర్భంలో పలు శ్రామిక వృత్తుల పట్ల ఆయనకున్న గౌరవభావాన్ని వివరిస్తున్నాయి.

సోమనాథుడు ద్విపద ఛందస్సుకు ప్రామాణికత్వం కలిగించినా బసవపురాణం,

పండితారాధ్య చరిత్రలోని ఇతివృత్త, నిర్వహణ, సాంప్రదాయిక కవి సమయాలకు భిన్నంగా గ్రామీణజీవితానికి సంబంధించిన అంశాలను స్వీకరించడం సోమనాథుడికి గల ప్రత్యేక అవగాహనను తెలుపుతున్నాయి. సోమనాథుడు తెలుగుసాహిత్యంలో ప్రవేశపెట్టిన సాహిత్యమార్గాన్ని గూర్చి మల్లంపల్లి శరభయ్య చెప్పిన అభిప్రాయంతో అంగీకరించవచ్చు. ''ఇతివృత్తమునందలి దేశీయత, ప్రకృతిసిద్ధమైన భక్తియందలి సహజసుందరత, భాషాచ్ఛందములు అన్యోన్య సంవాదమునంది బసవపురాణమునకు నాస్తితో దర్శనీయమైన అనిర్వచనీయ మాధుర్యమును, మహత్తనుగల్పించుచున్నవి. ఈతని కవితాప్రస్థానమునకు 'దేశికవిత' అని వ్యవహార రూఢి కలుగుటలోనాంతరహేతు విదియే ; దేశీయములగు ద్విపద చ్ఛందమును గావ్యమునందు వాడుట వలనగాదు''.[1]

## కృష్ణమాచార్యులు - అన్నమయ్యల వర్ధనం

వైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించిన కృష్ణమాచార్యులు వచనాలు రచించినప్పటికీ అందులో గానానుకూలత ఉంది. కృష్ణమాచార్యుల వచనాలు తాళబంధచ్ఛందో విరహితమైనవి గనక వీటిని చూర్ణికలుగా పరిగణిస్తున్నారు. కృష్ణమాచార్యుల వచనాలపై రామానుజాచార్యుల గద్యత్రయ ప్రభావమున్నప్పటికీ తెలుగు సాహిత్యంలో వచనాన్ని ఒక విశిష్టప్రక్రియగా తొలిసారి ప్రయోగించిన కవి కృష్ణమాచార్యులు. ఈతడికి పూర్వం గానానికి అనుకూలమైన వచన రచన లేకపోవడంవల్ల, తాళ్ళపాక తిరువేంగళనాథుడు కృష్ణమాచార్యుల వచనాలకు లక్షణం

---

1. మల్లంపల్లి శరభయ్య : ''పాల్కురికి సోమనాథుడు'' - ప్రాచీన కవితావైజయంతి, పే. 21.

పేర్కొంటూ, 'మార్గికల'ని వ్యవహరించాడు.[1]

వైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించి ఆ మత భావనలను ప్రచారం చేయడానికి, సంకీర్తనా రూపాన్ని స్వీకరించిన కవి అన్నమాచార్యుడు. అన్నమయ్యకు పూర్వం వృత్తాలు, జాత్యుపజాతుల్లో రచించే సంప్రదాయం ఉండగా గేయకవితా పద్ధతిని అనుసరించి వేలకొలది గేయాలు రచించాడు. ఈ గేయాలలో ఉపయోగించిన పద్య నిర్మాణాన్ని లక్షణబద్ధం చేస్తూ, ' సంకీర్తన లక్షణం' అనే గ్రంథాన్ని సంస్కృతంలో రచించినట్లుగా ప్రచారంలో ఉంది. కాని నేడది అలభ్యం. అన్నమయ్య మనుమడైన తాళ్ళపాక చిన్నన్న సంకీర్తన లక్షణాన్ని తెలుగులో రచించాడు.

అన్నమయ్యకుపూర్వం పాల్కురికి సోమనాథుడు మతప్రచారం కోసమే ద్విపదను గేయంగా ఉపయోగించాలని తలచినా దానికి పద్యత్వం కల్పించినట్లు వివరించడమైంది. పాల్కురికిసోమనాథుని ఆశయమైన గేయరచనావిధానం అన్నమయ్యలో ఉత్కృష్టదశను సంతరించుకుంది. " ... it was left to Annamacharya in the 15th Century to give a well defined form to the Song (Padamu) in Telugu, and to raise it to literary

---

1. ''ధరఁ గృష్ణమాచార్యాదిక
పరికల్పిత పదము తాళబంధ మ్ముండో
విరహితమ్మై చూర్ణాఖ్యం
బరగున నిర్యుక్తనామ భాసితమగుచున్'' (సంకీర్తన లక్షణం, పద్యం. 54)

heights through his lofty thought and superb craftsmanship. It was on that account that his immediate successors conferred on him, quite appropriately, the title Padakavita Pitamaha"[1]

అన్నమయ్య రచించిన గేయాలకు 'పద' మని, సంకీర్తనమని పేరు. అందువల్లే ఆతనికి పదకవితా పితామహుడని బిరుదు.

అన్నమయ్య గేయరచననే చేపట్టినప్పటికీ ఆతడు మౌఖిక రూపాలన్నినే ఆధారపడినవాడు కాదు. అయినప్పటికీ లిఖిత సాహిత్య ప్రభావం బలీయంగా ఉంది. మధురభక్తి, సంప్రదాయంలో సంస్కృతగేయాలు రచించిన జయదేవుని ప్రభావంతో అన్నమయ్య అనేకగేయాలు రచించాడు. అన్నమయ్య జయదేవుని గీతాలను అనుసరించ డానికి రెండు కారణాలను ఊహించవచ్చు. అన్నమయ్య శృంగార సంకీర్తనలకు మాతృకలనదగిన మధురభక్తి, పరిపోషిత గేయాలు జయదేవుడు రచించడం. జయదేవుని గీతాల్లోని లయ మౌఖిక ప్రచారానికి ఉపకరించడం.

''వందే వాసుదేవం
బృందారకాధీశ వందిత పదాబ్జం ।।వందే।।
ఇందీవర శ్యామమిందిర కుచతట
చందనాంకితలసచ్చారు దేహమ్
మందార మాలికా మకుట సంశోభితం
కందర్ప జనక మరవింద నాభమ్ ।।వందే।।'' (అధ్యాత్మ సంకీర్తనలు, కీర్తన 53)

1. A. Ramakrishna Rao: Annamacharya, P.67.

అన్నమయ్య సంస్కృత గేయరచనలో జయదేవుని అనుసరించడమేగాక భావపరంగా జయదేవుని గీతాలకు అనువాదాలనదగిన సంకీర్తనలు రచించాడు. జయదేవ రచితమైన 'గీతగోవింద' కావ్యంలోని,

''ప్రాతర్నీల నిచోలమచ్యుత మురస్సంవీత పీతాంబరం
రాధా యాశ్చకితం విలోక్య హసతి స్వైరం సఖీమండలే
వ్రీడా చంచలమంచలం నయ నయా రాధాయ రాధాననే
స్మేరస్మేర ముఖోయమస్తు జగదానందాయ నందాత్మజః'' (VIII-9)

అనే గేయానికి అన్నమయ్య అనుసరణ:

''మగరూపునాడురూపు మారుమూకునిరిద్దరు
సొగినద్దము చూపరే చూచుకోనేరిద్దరు ||మగ||
కలికి కస్తూరి బొట్టు కాంతుని నొసలనంటి
నిలువు నామము మెచ్చి నెలత కంటి
అలివేణి కొప్పు జారి అతని కొప్పుమ్మైవాలె
అలరి నేతసిసిక అతని పాపిటమ్మైని'' గా రూపొందింది.

అన్నమయ్య వైష్ణవమత భావాలకు ప్రజల వ్యవహారంలో ఉన్న లాలి, జోలపాటలు, దోబూచులాటలు, కూగూగు లాంటి పాటల రూపమివ్వడం ద్వారా శ్రోతలను ఆకర్షించి

1. అన్నమయ్య శృంగార సంకీర్తనలు, Vol. 26, P. 309.

తన భావాలను మరింత చేరువ చేయడానికి ప్రయత్నించాడు. వేంకటేశ్వరునిపై జోలపాటలు పాడుతూ,

> ''జోజో ముకుంద జోజో ముకుంద
> రావె పరమానంద రావె గోవింద'' ॥జోజో[1]॥

లాలిపాటల రూపంలో,

> ''లాలనుచు నూచేరు లలన లిరుగడల
> బాల గండవరపు గోపాల నిను లాలి[2]''

అంటూ వేంకటేశ్వరుని కీర్తించిన గేయాలద్వారా అన్నమయ్య మౌఖిక ప్రచారాన్నే అపేక్షించాడు. మౌఖిక వ్యవహారంలో ఉన్న గేయరూపాలను స్వీకరించి కీర్తనలు రచించడంలో గేయానికి అన్నమయ్య ఇచ్చే ప్రాధాన్యం విశదమవుతుంది.

అన్నమయ్య వైష్ణవ మతప్రచారానికై గేయాలు రచించడంవల్ల, అవి వస్తు పరంగానేగాక సంగీత ప్రధానంగా కూడా ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి. ఇట్టి గేయంలోని సంగీత, సాహిత్య అంశాలను ధాతువు, మాతువులని, వాటిని రచించే కవులను వాగ్గేయకారులని వ్యవహరిస్తారు.[3]

---

1. వే. ప్రభాకరశాస్త్రి: అన్నమాచార్య చరిత్ర పీఠిక, పే. 62.
2. - ibid. పే. 63.
3. ''వాఙ్మాతురుచ్యతే గేయం ధాతురిత్యభిధీయతే
   వాచం గేయం చ కురుతే యః సవాగ్గేయకారకః''
   Cf. బి. రజనీకాంతరావు : ఆంధ్రవాగ్గేయకార చరిత్రము, పే. 47.

సైద్ధాంతికంగా క్షేత్రయ్య, రామదాసు, త్యాగయ్యలు అన్నమయ్యకంటే భిన్నమైనవారే అయినప్పటికీ అన్నమయ్య సంకీర్తనలు తరువాతికాలపు భక్తకవులపై ప్రభావం వేశాయి. ''అన్నమయ్య శృంగార సంకీర్తనాంశము మున్నూరేండ్ల తరువాత క్షేత్రయ్యగాను, అధ్యాత్మ సంకీర్తనాంశము తరువాత నూరేండ్లకు త్యాగయ్యగాను నవతరించెనన తెల్లునని[1]'' వేటూరి ప్రభాకరశాస్త్రి భావించడంలోనూ, ''జయదేవుని కవితాప్రభావం తాళ్ళపాకవారి కవితపై ప్రసరించినట్లే తాళ్ళపాకవారి కవితా ప్రభావము తరువాతి క్షేత్రజ్ఞాదుల కవితయందును ప్రసరించిన దనవచ్చును[2]''ని వేటూరి ఆనందమూర్తి వివరించడంలోనూ క్షేత్రయ్యపైగల అన్నమయ్య ప్రభావం తెలుస్తుంది. అన్నమయ్య కాలంనాటికి సంకీర్తనలుగా వ్యవహరింపబడుతున్న గేయాలకు క్షేత్రయ్య కాలంలో పదాలుగా ప్రసిద్ధి వచ్చింది[3].

## క్షేత్రయ్య పదాలు

క్షేత్రయ్య జయదేవుడు, అన్నమయ్యలను అనుసరించినా వారిలోని అనేక లక్షణాలు కనిపించవు. జయదేవుడు, అన్నమయ్యలు పోషించిన మధురభక్తి, సంప్రదాయం క్షేత్రయ్యలో కాయిక శృంగారంగా పరిణమించింది. క్షేత్రయ్య కేవలం కాయిక శృంగారాన్నే వర్ణించడంవల్ల, వాటిలో వస్తు వైవిధ్యం లోపించింది. అన్నమయ్య తన గేయ రచనలో మౌళిక గేయాలలోని అనేక

---

1. వేటూరి ప్రభాకరశాస్త్రి : అన్నమాచార్య చరిత్ర పీఠిక, పే. 84.
2. వేటూరి ఆనందమూర్తి : తాళ్ళపాక కవుల పదకవితలు : భాషాప్రయోగ విశేషాలు, పే. 136.
3. విస్సా అప్పారావు (సం.) : క్షేత్రయ్య పదములు, పే. 41.

రూపాలను ఉపయోగించగా, క్షేత్రయ్య పదాలలో రూప వైవిధ్యమూ కనిపించదు. క్షేత్రయ్య జయదేవ, అన్నమయ్యల మధురభక్తి సంప్రదాయాన్ని అనుసరించి గేయాలు రచించినప్పటికీ వారి గేయాల్లోని శబ్ద లాలిత్యాన్ని అనుసరించలేదు. గేయానికి అవసరమైన శబ్ద లయ లేకపోవడం క్షేత్రయ్య పదాలలోని ప్రధానలోపం. క్షేత్రయ్య ఒక పదంలో,

''అనుకూలుడైనట్టి మగవాడు గలిగితే - అంతకన్నను సంభ్రమమున్నదా
వినరమ్మ ! అరిగియుండినను కూటమిసేయు వేడుకలకు
వెలయున్నదా - ఓ చెలియ ! ||అను||

చెలమే నాతోడ బలుకవే ! యనిపేర - చిరివినను చెక్కునొక్కి
మొలకట్టు సవరించగరి నాభినిమిరి - పులకలు మేన బొడమజేసి
సొలపు చూపుల తనదు జాలిదేర్చవె ! యనుచు
మొలక చనుమొన నలుపుచు
అలివేణిరో ! యెంత కలిసి మెలిసినగాని
ఆడు కొమ్మని వేడునే ఓ చెలియ ! ||అను||[1]''

అంటూ మువ్వగోపాలుని శృంగార చేష్టలను గోపిక వివరిస్తుంది. ఇందులోని వస్తువు కాయిక శృంగారం. ఈ పదానికి గానానుకూలత చాలా పరిమితం. గేయం

1. విస్సా అప్పారావు (సం.) : క్షేత్రయ్య పదములు, పదం 12.

విషమ పాదాలతో నడవడమేగాక శ్రవణపేయమైన శబ్ద లాలిత్యం లేదు. క్షేత్రయ్య పదాలలో ఇటువంటి లోపాలుండడంవల్లే మౌఖిక ప్రచారం పొందలేకపోయాయి. క్షేత్రయ్య పదాలలోని లోపాలను రామదాసు అధిగమించగలిగాడు.

## రామదాసు కీర్తనలు

రామదాసుపై సంస్కృతగీతాల ప్రభావం ఉంది. రామదాసు స్వయంగా సంస్కృతంలో గీతాలను రచించగలిగినంతటి పాండిత్యాన్ని కలిగి ఉన్నాడు. ''కలయే గోపాలం, కస్తూరి తిలక సుఫాలం'' (కీర్తన, 38), ''నందబాలం భజరే నందబాలం, బృందావన వాసుదేవా బృందలోలం'' (కీర్తన, 64) లాంటి కీర్తనలు రామదాసుకు లిఖితవాఙ్మయంతోనూ, సంస్కృత సాహిత్యంతోనూ పరిచయం ఉన్నట్టు తెలుపుతాయి. రామదాసుపై లిఖిత వాఙ్మయ ప్రభావమున్నా, ఆయన గేయాలు మౌఖిక ప్రచారానికి బాగా ఉపకరిస్తాయి. మిశ్రగతిలో నడిచిన ఈ గేయంలోని లయ గానానికి, ధారణకు ఎంతటి అవకాశమిస్తుందో గుర్తించవచ్చు.

''కోదండరామ కోదండరామ కోదండరామ కోదండరామ
నీదండ నాకు నీవెందుబోకు వాదేలనీకు వద్దు పరాకు ॥కోదండ॥
శ్రీరామునమ్ము చేపట్టుకొమ్ము ఆదుకొనరమ్ము ఆరోగ్యమిమ్ము ॥కోదండ॥

ఈగేయంలోని ప్రథమపాదంలో రాముడిని ఉద్దేశిస్తూ 'కోదండరామ' పదాన్ని పలుమార్లు ఆవృతి చేయడంద్వారా ఆతనిపై గల తీవ్రమైనానురాగాన్ని వెలువరించాడు.

తృతీయ పాదంలో అంత్యప్రాసతో ద్విత్వమకారాన్ని ఊనిక చేయడంవల్ల, పదం అక్కడ విరిగి శ్రవణపేయత సాధ్యమయ్యింది. ఇదే గేయంలోని ఒక చరణంలో,

''ఎవరు మీ తోటి ఎవరు మీ సాటి రారు మీసాటి రాజులమేటి''

అంటూ 'ట' కారాన్ని పలుమార్లు ఉపయోగించడంలోనూ శ్రవణపేయత ఉంది.

రామదాసు లౌకిక అంశాల సమ్మిళితంతో భగవంతుని కీర్తించడంవల్ల, ఆయన గీతాలతో సామాన్యులు సహితం మమేకమై పాడుకుంటారు. రామదాసు గీతాల ప్రచారానికి గల కారణాలను రామదాసు సాహిత్యంపై పరిశోధన జరిపిన దాశరథుల బాలయ్య ఇలా రాశాడు. ''ఇవి భజన కూటాల వారికే పాడుకొనుటకు అనుకూలంగా ఉండుట వలనే బహుళవ్యాప్తి చెందినవని చెప్పనగును. ... సహజ భక్తి, భావావేశంలో, తన్మయత్వంలో అప్రయత్నంగా సంకీర్తన భావానుగుణంగా వెలికి పొంగిన సరళ రచనలు రామదాసుల వారివి''[1].

జీవితంలోని బాధలు రామదాసు కీర్తనల్లో అప్రయత్నంగా వ్యక్తమయినట్లే, సామాజిక జీవితంలోని పలు అంశాలు అప్రయత్నంగానే వేమన నుండి వెలువడ్డాయి.

---

1. దాశరథుల బాలయ్య : భక్తరామదాసు జీవితము - రచనలు, పే. 27.

## వేమన పద్యం

వేమన తన భావాల ప్రచారానికి స్పృహతో ప్రయత్నించకపోయినా ఆయన పద్యాలకు శ్రోతలు సాధారణ ప్రజలే. పండితుల్లో తన ప్రత్యేకతను స్థాపించుకోవడానికి లిఖిత మార్గంలో తాను పద్యాలు రచించలేదు. సామాజిక జీవనంపట్ల తన భావాలను నేరుగా ప్రజలకు తెలియజెప్పాలన్న ఆకాంక్షనే ఆయన పద్యాలకు గేయపు నడకను తీసుకువచ్చింది.

వేమన లిఖిత సాహిత్యంలో ఉపయోగితమయ్యే ఉపజాతుల్లోని ఆటవెలది పద్యాన్నే ఉపయోగించినా, దానికి గేయత్వాన్ని కల్పించి మిగుల ప్రచారానికి తీసుకువచ్చాడు. వేమన ''పదకవితలాగా పద్యాన్ని పాడాడు. అది ఆటవెలది కావటం యాదృచ్ఛికం కావచ్చు. పదకవులందరూ సంగీతాభినయాలకు సన్నిహితంగా ఉండే పాటల విశేషాలు ఆలపిస్తుంటే వేమన్న ఒక్కడే పద్యాన్ని ఒక బాణీగా పాడాడు. సంగీతపు బరువులేని సరళకవిత మాత్రువులోనే బ్రదుకు సాగించే మాత్రాగణాల ఛందం ఆటవెలది''[1]. వేమన కొన్ని సందర్భాలలో ఆటవెలది ఛందాన్ని అతిక్రమించినా గానంలో సౌలభ్యం కోసమే. ఆసందర్భంలో ''విసంధులు, వ్యవహారమందలి కొన్ని భాషా రూపములు, సామాన్యమైన పద్యపు నడకకు నష్టము రాని ఛందో భంగములు - ఇత్యాదులనతడు గమనించినవాడు కాదు''[2].

---

1. జి.వి. సుబ్రహ్మణ్యం : ''వేమన యోగి : పద్యం ప్రక్రియ : మకుటం ముద్ర'' సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు, పే. 313.

2. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ : వేమన పే. 8.

వేమన పద్యాల్లోని విషయం, వాటిలోని నడక గానానికి అనుకూలంగా ఉండటం వల్లనే మౌఖిక ప్రసారానికి బాగా వీలిచ్చాయి. వేమన పద్యాలు పొందిన విస్తృతవ్యాప్తి, తద్వారా పొందిన మార్పులు వేమన పద్యాల పాఠనిర్ణయం దుష్కరమవడానికి కారణమని పరిశోధకులు భావిస్తున్నారు.[1]

వేమన పద్యాల్లోని సౌలభ్యం సాధారణ పాఠకునికి సహితం గ్రాహ్యంగా ఉండటం వల్ల, ఆయన పద్యాలు విస్తృతవ్యాప్తిని పొందాయి. సి.పి. బ్రౌన్‌లాంటి పాశ్చాత్య దేశీయుడు వేమన పద్యాలపట్ల ఆకర్షితుడు కావడానికి సహితం ఈ అంశమే కారణమని వేమన పద్యాలపట్లగల అతని అవగాహన తెలుపుతుంది.[2] లిఖిత సాహిత్య మార్గానికి, వేమన పద్యానికి గల వ్యత్యాసాన్ని W.H. Campbell ఇలా విశ్లేషించాడు.

"The literary language is thus so remote from the colloquial that an ordinary man, of fair average intelligence, could not understand more than a few isolated words or phrases in a page or two of classical

---

1. ఎన్. గోపి : ''వేమనగారి ఏడు కొత్త పద్యాలు పారిస్‌ప్రతిలో లభ్యం''
వేమన పద్యాలు (పారిస్ ప్రతి క్రీ.శ. 1730) పే. XLVI

2. See, C.P. Brown : "My discovery of Vemana" in Vemana through western eyes, P.21.

verse. Vemana, even if he could have employed this high literary style, certainly never attempts to do so. He writes, as if he were speaking in terse simple language, which is always intelligible and almost always forcible[1]".

తెలుగు లిఖిత సాహిత్యం సంస్కృత సాహిత్యంచే అమితంగా ప్రభావితమైన కారణాన లిఖిత సాహిత్యంలో తత్సమ పదబాహుళ్యం అధికం. అందువల్ల లిఖితభాష సాధారణ పాఠకుడు సులభంగా గ్రహించ సాధ్యమవడం లేదు. అయితే వేమన సాధారణ శ్రోతను ఉద్దేశించడం వల్ల, భాషలో కాఠిన్యం ప్రదర్శించలేదు. ఆయనకు భాష ప్రధానం కాదు. భావవినిమయం ప్రధానం. ఆ విషయాన్నే ఒక పద్యంలో ఇలా చెప్పాడు :

''కుండ కుంభమండ్రు కొండ పర్వతమండ్రు
యుప్పు లవణమండ్రు యొకటిగాదె
భాషలింతె వేరు పరతత్వమొక్కటే. ॥విశ్వ॥

సాధారణ వ్యవహారంలోని కుండ, కొండ, ఉప్పు లాంటి పదాలను పండితులు, సాహిత్య ప్రభావం కలిగినవారు 'కుంభము, పర్వతము, లవణము' అని వ్యవహరిస్తారు.

---

1. W.H. Campbell : "The one great poet of the people" in Vemana through western eyes, P. 58.

వస్తువును సూచించే పదాలు వేరయినా వస్తువు ఒక్కటే. అయితే పండితులు ప్రజల వ్యవహారానికి అందని పదాలను ఉపయోగించి సాంస్కృతిక ఆధిపత్యాన్ని నెరపుతారు. ఈ పద్యం ద్వారా వేమన పండితుల సాంస్కృతిక ఆధిపత్యాన్ని ఆక్షేపించాడు.

ప్రజల జీవితంలోని వివిధ అంశాలకు స్పందించిన వేమన తన భావాలను ప్రజలు సులభంగా గ్రహించడానికి అవసరమైన భాషను గానానుకూలమైన పద్యాన్ని ఉపయోగించాడు.

<u>వీరబ్రహ్మం తత్వాలు</u>

వేమన పద్యాలలాగా ప్రచారాన్ని పొందిన గేయాలలో వీరబ్రహ్మం తత్వాలు ముఖ్యమైనవి. వీరబ్రహ్మం తత్వంలో సమకాలీన జీవితానికి సంబంధించిన అంశాలతో పాటు భూత, భవిష్యత్ కాలాలకు సంబంధించిన అంశాలు చేర్చింపబడడంవల్ల, భవిష్యత్తు అసందిగ్ధంగా కన్పించినపుడు వీరబ్రహ్మం గీతాలలోని భవిష్యదంశాలను తెలుసుకోవడానికి ప్రజలు ఉత్సాహం ప్రదర్శిస్తారు. ఆయన తత్వాలు గూడా అందుకోసమే ఉద్దేశించినట్లు తత్వం తెలుపుతుంది.

''చెప్ప లేరటనగ బొయ్యేరు
నరులార గురుని
చేరిమొక్కితే బతకనేర్చేరు ||చెప్ప||

ముందు వెనకలు గానకున్నారు

మూర్ఖులై భువిలో

ముందు గతియు నెరుగకున్నారు

కండకోవతో పిన్నపెద్దని కన్నుగానక గర్వములచే

మండి మేలము లాడువారిని

చందమందుగా గోసురక్కర ||చెప్పు|| అంటూ జీవితంలోని

భూత, భవిష్యత్తులను గుర్తించవలసిన అవసరాన్ని బోధించాడు.

నందామయా గురుడ నందామయా

వీరబ్రహ్మం మాట వేదామయా ||నందా||

ఇటువంటి పల్లవులు లిఖితసాహిత్యంలో కనిపించవు. కేవలం మౌఖిక ప్రచారంలో మాత్రమే వినిపిస్తాయి. అయితే వీరబ్రహ్మం తత్వాలలోని తాత్వికాంశాలను సాధారణ శ్రోతలు వెంటనే గ్రహించలేరని అందుకు గురువును ఆశ్రయించవలసి ఉంటుందని బి. రజనీకాంతారావు వివరిస్తున్నారు. ''ఈ తత్వకవులు పెద్దవ్యాకరణ పండితులూ, భాషాశాస్త్రజ్ఞులూ కాకపోయినా వేదాంత రహస్యాలను సంకేతార్థములుగల శబ్దాలమాటున గూఢంచేసి నేటి విద్యావంతులైన పండిత ప్రకాండులకు కూడ గురుముఖతః ఆరహస్యం తెలుసుకుంటేనేగాని సామాన్యంగా అర్థంకాకుండా రచించారు. ఈ తత్వాలలోపల పరమార్థమేమో వెంటనే స్ఫురింపకపోయినా పామర జనం మాత్రం ఆ సంకేత పదాలు కలిగించే మాయాజాలానికి ఆకర్షితులై సద్యోవినోదం పొంది వాటిని గానం చేసుకుంటూ,

ఏ తల నెరిసిన గురువు ద్వారానో వాటిలోని పరమార్థాన్ని బోధింపజేసి కొంటుంటారు[1]''.

ఈ తత్త్వాలలోని నిగూఢ అంశాల అవగాహన క్లిష్టతరమే అయినా పలు గేయాలలో అభివ్యక్తమైన అంశాలు తమ జీవితంలోని నిరాశను తొలగించి ఆశావహస్థితిని కల్పించడం వల్ల, గేయాలకు అమిత ప్రచారం కలిగింది.

## త్యాగరాజు కీర్తన

త్యాగరాజుకు వర్ణవిధానంపట్ల, తన కాలంనాటి రాజులపట్ల, సాంప్రదాయక ఆచారాలపట్ల తీవ్ర ఆక్షేపణలున్నాయని గత ప్రకరణంలో వివరించడమైంది. అయితే త్యాగరాజుకు సంగీతవేత్తగా వచ్చిన గుర్తింపు సామాజిక జీవనాన్ని పరిశీలించిన కవిగా రాలేదు. త్యాగరాజు కీర్తనలలో మాతువుకంటె ధాతువుదే ప్రాధాన్యం. ఆయనే పలుసందర్భాలలో సంగీతం యొక్క ప్రాశస్త్యాన్ని వివరించాడు.

పల్లవి : ''మోక్షము గలదా? భువిలో జీవన్ముక్తులు గాని వారలకు

అనుపల్లవి : సాక్షాత్కార నీ సద్భక్తి, సంగీతజ్ఞానవిహీనులకు ।।మోక్ష।।

చరణం : ప్రాణానల సంయోగము వల్ల

ప్రణవనాదము సప్తస్వరములై బరగ

వీణావాదన లోలుడే శివమనో

విధమెఱుగరు - త్యాగరాజ వినుత ! ।।మోక్ష।।[2]''

---

1. బి. రజనీకాంతారావు : ఆంధ్రవాగ్గేయకార చరిత్రము, పే. 420.
2. కల్లూరి వీరభద్రశాస్త్రి : త్యాగరాజకీర్తనలు, సంపుటం-2, కీర్తన 339, పే.101.

పల్లవి : ''సంగీత జ్ఞానము భక్తి వినా - సన్మార్గము గలదే? మనస[1]''

అంటూ సంగీత ప్రాధాన్యాన్ని వివరించాడు. త్యాగయ్య తన ఆరాధ్యదైవమైన రాముడిని కీర్తిస్తూ, సామవేదంలోని అమృతమయమైన గానాన్ని వివేచించ గలిగిన వాడిగా కీర్తిస్తాడు.[2] వేమన పద్యంలో చర్చితమైనట్లు, ఈ గేయంలోని పాండిత్య స్ఫోరకమైన వ్యక్తీకరణ సాధారణ శ్రోత గ్రహించడానికి సాధ్యమయ్యేది కాదు. త్యాగరాజు గానానికిచ్చిన ప్రాధాన్యం వల్లనే ఆయన సామాజిక అవగాహన అప్రధానమయ్యింది. అయితే త్యాగరాజు కీర్తనల్లోని శబ్ద సౌందర్యం గేయానికి అమోఘమైన లయను చేకూర్చింది.

పల్లవి : నాటి మాట మరచితివో? ఓరామ ! చిన్న ||నాటి||

అనుపల్లవి : మాటిమాటికి నాపై మన్నన జేయుచు

యేటికి యోచన? నీభాగ్యము నేదన్న ||నాటి||

చరణం : తరుణుల బాగు నర్తనముల జూచువేళ[3]''.

త్యాగరాజు కీర్తనలో పల్లవి, అనుపల్లవి, చరణం కలిగి ఉంటాయి. పల్లవి సాధారణంగా ఒక పాదం, క్వాచిత్కంగా రెండు పాదాలలో ఉండటంవల్ల, పల్లవి పలుమార్లు ఆవృతమవుతుంది. చరణం పూర్తయిన వెంటనే పల్లవిని అందుకోవడంతో గేయ ఆలాపనలో వేగం పెరిగి శ్రోతను భావోద్వేగానికి లోనుచేసే లక్షణం ఈ గీతాలలో ఉంది.

---

1. కల్లూరి వీరభద్రశాస్త్రి : త్యాగరాజకీర్తనలు, సంపుటం-2, కీర్తన 435, పే.203.
2. సామనిగమజ సుధామయ గాన వి
   చక్షణ ! గుణశీల ! దయాలవాల ! మాంపాలయ : ||సామ||
3. కల్లూరి వీరభద్రశాస్త్రి : త్యాగరాజకీర్తనలు, సంపుటం-1, కీర్తన 212, పే.454.

అయితే త్యాగరాజు కీర్తనలు సాధారణ శ్రోతను ఉద్దేశించినవిగాక పోవడం వల్ల, కొంత పాండిత్యం కలిగిన భజన కూటాలకు ఉపకరిస్తాయి. త్యాగరాజు కీర్తనలు భజన సంప్రదాయంనుండి రూపుదిద్దుకున్నవేనని త్యాగరాజు కీర్తనలపై విశేష పరిశోధన జరిపిన రాఘవన్ తెలిపాడు.

> "Tyagaraja was a flower that blossomed in Bhajana tradition from which music cannot be separated. The times were also such that the whole place abounded in musicians"[1].

త్యాగయ్య అతిలోకపురుషుడైన రాముడిని శ్రోతగా నిలుపుకోవడంవల్ల, భావాలను సులభంగా వ్యక్తీకరించాలని తలచలేదు. రామదాసుగూడా రాముడినే శ్రోతగా ఊహించుకున్నప్పటికీ రామదాసు కీర్తనల్లోని ఆర్తి, సులభవ్యక్తీకరణ మౌఖిక ప్రసారానికి బాగా అవకాశమిచ్చాయి. అయితే త్యాగయ్య అనేక సంస్కృత సమాసాలను ఉపయోగించడంవల్ల, ఆయన కీర్తనల మౌఖిక ప్రసారానికి పరిమితులు ఏర్పడ్డాయి.

## ఉపసంహారం

తెలుగులో భక్తి, తత్సంప్రదాయాన్ని అనుసరించిన కవులందరిపై లిఖితసాహిత్య ప్రభావముంది. సంస్కృత సాహిత్యాన్ని, తెలుగులో ప్రసిద్ధిచెందిన గద్యపద్యమయ చంపూమార్గాన్ని తెలిసినవారే అయినప్పటికీ (వీరబ్రహ్మం మినహా) మౌఖిక ప్రచారం నిమిత్తం

1. V. Raghavan, Tyagaraja, P.25.

గేయరూపాన్ని వాడుకున్నారు. లిఖితమార్గంలో ప్రసిద్ధంగా ఉన్న చంపూమార్గాన్ని తెలివిడితో నిరాకరించిన పాల్కురికి సోమనాథుడు మౌఖిక ప్రచారంకోసమే గేయరూపాన్ని స్వీకరించినా ఆయనకు కావ్యరచన ప్రధానమవడంతో గేయానికి పద్యత్వం చేకూరి తన ఆశయం సాధించలేకపోయాడు. అన్నమాచార్యుడు మతప్రచారమే ధ్యేయంగా భావించి మౌఖిక సంప్రదాయానికి చేరువకావడానికే కావ్యరచన చేపట్టలేదని భావించాలి.

స్వీయభక్తిమార్గాన్ని అనుసరించిన కవులు తమ జీవితంలోని అనుభవాలను భగవంతుడికి నివేదించుకునే క్రమంలో రామదాసు కీర్తనల్లో అభివ్యక్తమైన ఆర్తి, సులభ వ్యక్తీకరణ శ్రోతలను విశేషంగా ఆకర్షించగలిగాయి. అయితే త్యాగరాజు కీర్తనల్లోని సంస్కృతప్రయోగం ఆకీర్తనల ప్రచారానికి పరిమితులను ఏర్పర్చింది. వేమన పద్యరూపాన్ని వాడినా అందులో గేయపు నడకను సాధించి మౌఖిక ప్రచారానికి వీలుకలిగించాడు. అలాగే వీరబ్రహ్మం మౌఖిక ప్రచారంలోని పలుకులను స్వీకరించడం, ఆ గీతాల్లోని అంశాలు ప్రజలకు అత్యంత చేరువకావడానికి తోడ్పడ్డాయి.

భక్తి, తత్త్వ కవుల్లో పాండిత్య ప్రభావం అతిపరిమితంగా కలిగి వ్యక్తీకరణలో సౌలభ్యాన్ని సాధించినవారు రామదాసు, వేమన, వీరబ్రహ్మంలు. అందువల్లే రామదాసు కీర్తనలు, వేమన పద్యాలు, వీరబ్రహ్మం తత్త్వాలు విస్తృత మౌఖిక ప్రచారాన్ని కలిగివున్నాయి.

కన్నడ వీరశైవ మత వచనకారుల్లోనూ, ఔత్తరాహ భక్తకవుల్లోనూ కనిపించని లిఖితసాహిత్య ప్రభావం, శిల్పనైపుణ్యం తెలుగు భక్తకవుల సాహిత్యంలో కనిపిస్తుంది. ఆంధ్రదేశంలో కొనసాగిన భక్తిఉద్యమానికి, ఇతరప్రాంతాల్లోని భక్తిఉద్యమానికి సైద్ధాంతికంగా ఉన్న వైవిధ్యమే రూపంలోనూ కనిపిస్తుంది.

# ఉపసంహారం

## <u>ఉపసంహారం</u>

క్రీ.శ. 12వ శతాబ్దినుండి 19వ శతాబ్ది వరకూ తెలుగుసాహిత్యంలో కొనసాగిన భక్తికవిత్వాన్ని, వివిధ సామాజిక దృష్టిపథాలపట్ల భక్తకవుల అవగాహనను వేర్వేరు భాషాసాహిత్యాల్లోని భక్తికవితోద్యమాలను ఈ పరిశోధనలో పరిశీలించడమైంది.

భక్తిలో పరమప్రేమ రూపమైన భగవంతుడిని ప్రార్థించడం, అతని గుణాన్వితాన్ని కీర్తించడం ముఖ్యమైన అంశాలే అయినా ఆ భగవంతుడినే ఆలంబనగా చేసుకుని సామాజిక జీవితంలోని ప్రాశస్త్యతను అధిగమించాల్సిన అవసరాన్ని భక్తిఉద్యమం ప్రబోధించింది. అయితే వివిధ ప్రాంతాలకు చెందిన భక్తకవుల దృక్పథంలో భిన్నమైన అభిప్రాయాలున్నాయి. వారు పొందిన స్ఫూర్తి, అనుసరించిన తాత్త్విక సిద్ధాంతాలు భిన్నమైనవైనప్పటికీ భక్తకవులు చర్చించిన అంశాలలోని సామ్యంవల్ల, వారి సాహిత్యంలోని సామాన్యలక్షణాలను చర్చించడానికి వీలు కలుగుతుంది.

భారతీయ సామాజిక జీవితాన్ని అధ్యయనం చేసిన సామాజిక శాస్త్రవేత్తలు కొందరు సమాజం పూర్వదశనుండి నిశ్చలనంగా ఉన్నట్లు అభిప్రాయపడ్డారు. కాని మధ్యయుగాల నాటి మతోద్యమాలు ప్రచారం చేసిన భావాలు ఆకాలంనాటి ఆర్థిక, సాంఘిక జీవనంలో కుల సంబంధాలలో మార్పులు చోటుచేసుకుంటున్నట్లు వివరీకరిస్తున్నాయి.

ఉత్తరభారతంలో క్రీ.శ. 13వ శతాబ్దినుండి ప్రారంభమైన భక్తిఉద్యమం సామాజికంగా వర్ణవిధానాన్ని, రాజకీయంగా మహమ్మదీయుల చర్యలను, మతాంశాలలో

మౌల్వీలకు, బ్రాహ్మణార్చకులకూ ఉన్న ఆధిపత్యాన్ని నిరసించింది. ఈ కాలంలో ఉత్తరభారతంలోని రాజకీయ, ఆర్థిక అస్థిరత్వం ఉత్పాదక వర్గాల అభివృద్ధికి ఆటంకంగా పరిణమించిన తరుణంలో రాజకీయ, సాంస్కృతిక ఆధిపత్యాలను నిరసిస్తూ, పలు ప్రాంతాలలో ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. మరాఠ్వాడా ప్రాంతంలో వర్కరీ సంప్రదాయం, మధ్యభారతంలో కబీర్‌పంథ్, పశ్చిమప్రాంతంలో సిక్‌పంథ్ ఆ పాత్రను నిర్వహించాయి. ఈ ఉద్యమాలు ప్రత్యక్ష కార్యాచరణను ఉద్దేశించడంవల్ల వ్యవస్థీకృత రూపాన్ని సంతరించుకున్నాయి. రాజకీయంగా ఉత్తరభారతంలోని పరిస్థితులు భక్తకవులు నిర్వహించిన పాత్రవల్ల, వారి సాహిత్యంలో తాత్త్విక చర్చలు, ఆలంకారిక అంశాలు, శిల్పనైపుణ్యం కనిపించవు. అయితే ఆంధ్రదేశంలో కొనసాగిన వీరశైవ, వైష్ణవ మతోద్యమాలు ఔత్తరాహ భక్తిఉద్యమంతో పోల్చినపుడు అనేక అంశాలలో వైవిధ్యాన్ని కలిగి ఉన్నాయి.

క్రీ.శ. 12 - 16 శతాబ్దుల మధ్యకాలంలో రాజ్యవ్యవహారాలలో సంఘర్షణలు కొనసాగినా స్థూలంగా ఉత్తరభారత రాజకీయ పరిస్థితులకంటే ఆంధ్రదేశం రాజకీయ స్థిరత్వాన్ని కలిగిఉంది. తమ ఆధిపత్యాన్ని స్థిరపరచుకునేక్రమంలో రాజులు దేవాలయాలు నిర్మించి వ్యావసాయిక అభివృద్ధికి దోహదపడటంవల్ల, ఉత్పాదక వర్గాల ఆర్థికాభివృద్ధి సాధ్యమయ్యింది. అందువల్ల ఉన్నతవర్గాలనుండి సాధారణవర్గాల వరకూ సమాజ జీవనంలో ప్రత్యేకతను స్థాపించుకోవడానికి ప్రయత్నం కనిపిస్తుంది. తమ ఔన్నత్యాన్ని తెలుపుకోవడానికి రాజులు సూర్య, చంద్ర వంశాలతో సంబంధాన్ని ఆపాదించుకుని కావ్యాలు రచింపచేసినట్లే, సంపన్న వృత్తికారులు మతజీవనంలో, తద్వారా రాజ్యవ్యవహారాలలో ప్రాధాన్యం సంపాదించుకోవడానికి ప్రసిద్ధ మహర్షుల గోత్రాలతో సంబంధాలను ఆపాదించుకుని

కులపురాణాలు రాయించుకుని వర్ణవిధానంలో ఉన్నతగౌరవాన్ని పొందడానికి ప్రయత్నించాయి. ఆంధ్రదేశంలో ప్రచారమైన మతోద్యమాలు అందుకు దోహదపడ్డాయి.

వీరశైవం, కన్నడదేశంలో కుల లింగ సమానతాభావాలను ప్రచారం చేసిన బలమైన మతోద్యమం. అయినప్పటికీ ఆంధ్రదేశంలో ఆ మతాన్ని ప్రచారం చేసిన పండితారాధ్యుడు, ముఖ్యంగా పాల్కురికి సోమనాథుడు వీరశైవ మతాంశాలకు వేదోపనిషత్తులు, ధర్మశాస్త్రాలలోని భావాలతో తుల్యమైనవని నిరూపిస్తూ, ప్రామాణికత్వం కలిగించడానికి ప్రయత్నించారు.

పండితారాధ్య, పాల్కురికి సోమనాథులిరువురిదీ సాహితీ వ్యక్తిత్వం కావడంవల్ల, వారి భావాలకు సాహిత్యరూపం ఇవ్వడంపై కేంద్రీకరించినంతగా ప్రచారం చేయడంపై కృషి సలపలేదు. వారు మత ప్రామాణీకరణకు, బాహ్యాచారాలకు, తాత్త్విక చర్చలకు పరిమితమయ్యారు. బసవనకున్న రాజకీయ ఆధిపత్యం కన్నడదేశంలో వీరశైవం ఉద్యమ రూపం సంతరించుకోవడానికి, ప్రజలు అధికసంఖ్యలో ఆమతంలో చేరడానికి దోహదపడగా, ఆంధ్రదేశంలో వీరశైవ మతానుయాయులకు రాజకీయంగా ప్రజలను ఆకర్షించగలిగిన వ్యక్తిత్వం లేకపోవడం, ప్రచారానికి విశేషంగా ప్రయత్నించకపోవడం వల్ల ఆ మత భావాలకు ఉద్యమరూపం ఏర్పడడానికి పరిమితులు ఏర్పడ్డాయి.

ఉత్పాదక వర్గాల్లోని సామాజిక చలనాన్ని గుర్తించి అన్నమయ్య వైష్ణవమత భావాలను ప్రజలకు చేరువ చేయడానికి ప్రయత్నించినప్పటికీ, దానికి వ్యవస్థీకృత రూపం ఇవ్వలేదు. అయితే వీరశైవ, వైష్ణవ మతాలు ఉత్పాదక వర్గాలకు స్ఫూర్తిదాయకంగా

ఉండడానికి ప్రయత్నించడంవల్లే ఆధిపత్య సంస్కృతిని నిరసించి నైతిక నియమాలను ప్రబోధించాయి. సౌఖ్యాలను త్యజించి శ్రమలో భాగస్వాములు కావలసిన అవసరాన్ని విశదం చేశాయి.

క్రీ.శ. 16వ శతాబ్దిలో జరిగిన రాక్షస - తంగిడి యుద్ధంతో రాజ్య పాలనా వ్యవస్థ ఛిన్నాభిన్నం కావడంతోపాటు ఉత్పాదక వర్గాలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయి. ఈ కాలంనుండే ఉత్పాదక విధానంప్తె పాశ్చాత్యుల ఆధిపత్యం బలపడుతూ వచ్చింది. ఈ కాలంలో ఉత్పాదకవర్గాల్లో ఏర్పడిన నిరాశనిస్పృహలకు వేమన ప్రత్యక్ష వ్యాఖ్యాతగా కనిపించగా, వీరబ్రహ్మం ఉత్పాదక వర్గాలలో ఆశావహస్థితిని కల్పించడానికి ప్రయత్నించాడు.

భారతీయ సమాజంలో కులసంబంధాలు కొనసాగడానికి ఉత్పత్తివిధానంతో ఉన్న బలీయమైన సంబంధం కారణంకాగా, వర్ణవ్యవస్థను నిరసించి, వివిధ వర్గాలమధ్య సమానతాభావాలను ప్రతిపాదించిన మతాలు తమ అవగాహనను స్థిరంగా కొనసాగించక పోవడమేగాక కాలక్రమంలో ప్రజలకు స్ఫూర్తిదాయకమైన మతాలుగా కృషి సలుపలేక పోయాయి. ఆర్థిక పరిణామాలు సామాజిక సంబంధాలను నిర్ణయిస్తూ వచ్చాయి. క్రీ.శ. 12 - 16 శతాబ్దుల మధ్యకాలంలోని ఆర్థిక ప్రగతివల్ల వీరశైవ, వైష్ణవ మతాలు ఉత్పాదక వర్గాలకు మతజీవనంలో భాగం కల్పించడానికి కృషి సలుపగా విజయనగర సామ్రాజ్యం అంతరించిన తర్వాత ఆ స్థితి కనిపించదు. వేమన, వీరబ్రహ్మంలు వర్ణాధిపత్య లక్షణాలను, వర్ణవిధానంలో భాగమవడాన్ని నిరసించారు.

భక్తి, యోగ సంప్రదాయాన్ని అనుసరించిన కవులందరూ వారి భావాలకు ప్రచారాన్ని అపేక్షించినవారే. అందువల్లే గేయకవితారూపాన్ని స్వీకరించారు. సోమనాథుడు వీరశైవమతభావాలను వ్యాపింపచేయాలని ఆకాంక్షించినందువల్లే మౌఖిక ప్రచారానికి వీలయ్యే ద్విపద ఛందస్సును ఉపయోగించాడు. కానీ వీరశైవమతానికి ప్రామాణికత్వం కలిగించి పండితలోకంలో దాని ప్రాశస్త్యాన్ని నిరూపించడానికి ప్రయత్నించినట్లే అతడికి పూర్వం లిఖితవాఙ్మయంలో లేని ద్విపద ఛందస్సుకు యతి, ప్రాసలను నియతం చేసి ప్రామాణీకరించాడు. సోమనాథుడికి కావ్య రచన ప్రధాన ఆశయం అయినందున మౌఖిక ప్రచారం నిర్వహించలేక పోయాడు.

సామాజిక జీవితంలో వీరశైవ, వైష్ణవ మతోద్యమాలు బలమైన ప్రభావాన్ని వేయడానికి అనేక పరిమితులు ఏర్పడినా, ఆధిపత్య నిరసన భావాలను సాహిత్యంలో ప్రస్తావించిన తొలి సాహితీవేత్తలు - పండితారాధ్యుడు, పాల్కురికి సోమనాథుడు. సోమనాథుడు సంస్కృత సాహిత్య ఆలంకారిక నియమాలకు భిన్నమైన వస్తువును స్వీకరించి, నన్నయ్య చంపూ మార్గాన్ని త్యజించి సాహిత్యంలో ఒక నూతన భావధోరణిని ఆవిష్కరించగలిగాడు. సోమనాథుడు వీరశైవ మతోద్యమ భావాలకు ఆ ఉద్యమనాయకుల జీవితాలకు సాహిత్యరూపమిచ్చిన వాడేగాక, ఆమతాన్ని ప్రామాణీకరించడానికి ప్రయత్నించిన తార్కికుడు.

వీరశైవ మతానికి సోమనాథుడి కృషివంటిదే వైష్ణవమతానికి అన్నమయ్య నిర్వహించాడు. తనకాలంనాటికి విశేష ప్రాధాన్యాన్ని సంతరించుకొని వైష్ణవ మతానికి అన్నమయ్య

విస్తృత సాహిత్యరూపమిచ్చి ఆ మతాన్ని ప్రజలకు చేరువ చేయడానికి కృషి సల్పాడు.

కొందరు చరిత్రకారులు అభిప్రాయపడినట్లు, మధ్యయుగాలలో ప్రచారమైన భక్తి భావన భూస్వామ్య వర్గాలకు ఉపకరించిన సిద్ధాంతంగా పరిగణించడానికి అవకాశంలేదు. భగవంతునిపట్ల విధేయతను ప్రబోధించినా అది ప్రభువులకు అణకువగా ఉండడానికి ప్రతిపాదించినదికాక, వారి ఆధిపత్యాన్ని నిరాకరించడానికి ఉపయోగపడింది. సామాజికంగా కులానికి, ఉత్పత్తి విధానానికి ఉన్న బలీయమైన సంబంధంవల్ల ఉత్పత్తివిధానంలో మార్పులు చోటుచేసుకోకుండా సాంప్రదాయక విలువలు మారడానికి అవకాశంలేదు. అయితే భక్తిఉద్యమం ప్రచారం చేసిన భావాలు తమపట్ల ఉండే హీనతాభావాన్ని అధిగమించి ఉత్పాదక వర్గాలు సామాజిక గుర్తింపు పొందడానికి దోహదపడ్డాయి.

. . .

# SELECT BIBLIOGRAPHY

## గ్రంథ సూచిక - తెలుగు పుస్తకాలు


1. అన్నమాచార్య, తాళ్ళపాక : అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం - 2, మద్రాసు,
తిరుమల తిరుపతి దేవస్థానములు, 1936.

2. -do- అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం - 3,
సంపా. గౌరిపెద్ది రామసుబ్బశర్మ, తిరుపతి,
తిరుమల తిరుపతి దేవస్థానములు, 1986.

3. -do- అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం - 7,
సంపా. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, తిరుపతి,
తిరుమల తిరుపతి దేవస్థానములు, 1951.

4. -do- అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం - 8,
సంపా. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, తిరుపతి
తిరుమల తిరుపతి దేవస్థానములు, 1952.

5. -do- అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం - 9,
సంపా. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, తిరుపతి,
తిరుమల తిరుపతి దేవస్థానములు, 1952.

6. -డో- అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం - 10, సంపా. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, తిరుపతి, తిరుమల తిరుపతి దేవస్థానములు, 1955.

7. -డో- అధ్యాత్మ సంకీర్తనలు, సంపా. వేటూరి ప్రభాకరశాస్త్రి, తిరుపతి, తిరుమల తిరుపతి దేవస్థానములు, 1950.

8. -డో- అధ్యాత్మ సంకీర్తనలు, సంపా. యు. శ్రీనివాసాచార్యులు, తిరుపతి, తిరుమల తిరుపతి దేవస్థానములు, 1951.

9. -డో- శృంగార సంకీర్తనలు, సంపుటం - 26, తిరుపతి, తిరుమల తిరుపతి దేవస్థానములు,

10. అనుభవానందస్వామి : సర్వ సిద్ధాంత సౌరభము - శైవము, బాపట్ల, అనుభవానంద గ్రంథమాల, 1982.

11. అప్పారావు, విస్సా (సంపా.) : క్షేత్రయ్య పదములు, రాజమహేంద్రవరము, ఆంధ్రగానాకళాపరిషత్తు - 1963 (2వ ముద్రణ)

12. అనంతకృష్ణశర్మ, రాళ్ళపల్లి : వేమన, వాల్తేరు, ఆంధ్రాయూనివర్సిటీ ప్రెస్, 1971 (చతుర్థ ముద్రణ)

13. ఆనందమూర్తి, వేటూరి : తాళ్ళపాక కవుల పదకవితలు, భాషాప్రయోగ విశేషాలు, (ద్వితీయ భాగము) హైదరాబాద్, 1976.

14. ఆరుద్ర : సమగ్రాంధ్ర సాహిత్యం, 7 , నాయకరాజుల యుగం, విజయవాడ, ప్రజాశక్తి బుక్‌హౌస్, 1990.

15. ఎర్రన, నన్నయ్య : ఆంధ్రమహాభారతము : అరణ్యపర్వము, హైదరాబాద్, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, 1969.

16. కోదండరామిరెడ్డి, మరుపూరు : త్యాగరాజు గేయనాటికలు వివిధ కృతులు,

17. కృష్ణమాచార్య : సింహగిరి వచనములు, పరిష్కర్త : ఎమ్. కులశేఖరరావు, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1980.

18. గంగప్ప, ఎస్. : క్షేత్రయ్య పదసాహిత్యం, హైదరాబాద్, 'శక్తి' ప్రచురణలు, 1974.

19. గోపి, ఎన్. : ప్రజాకవి వేమన, హైదరాబాద్, 1991 (II ed).

20. - ఢం - : వ్యాసనవమి, హైదరాబాద్, చైతన్యపబ్లికేషన్స్, 1986.

21. గోపి, ఎన్. (సంపా.) : వేమన పద్యాలు (పారిస్ ప్రతి), హైదరాబాద్, చైతన్య ప్రచురణలు, 1990.

22. ఛటర్జీ, సునీతికుమార్ : జయదేవుడు, న్యూఢిల్లీ, సాహిత్య అకాడమీ, 1988.

23. ఛటోపాధ్యాయ, దేవప్రసాద్ : భారతీయ తత్వశాస్త్రం - సులభ పరిచయం, అను. గూడ సుందరరామయ్య, విజయవాడ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1984.

24. చినతిరువేంగళనాథుడు, తాళ్ళపాక : శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవిత చరిత్రము, తొలిపరిష్కరణ పీఠిక, వేటూరి ప్రభాకరశాస్త్రి, తిరుపతి, తిరుమల తిరుపతి దేవస్థానములు, 1978.

25. చినతిరుమలాచార్య, తాళ్ళపాక : సంకీర్తన లక్షణము, మద్రాసు, తిరుమల తిరుపతి దేవస్థానములు, 1935.

26. జయదేవుడు : గీతగోవింద కావ్యము, అనువాదం : యల్. నారాయణ, అనంతపురము, 1982.

27. తమ్మయ్య, బండారు : పాల్కురికి సోమనాథకవి, సికింద్రాబాద్, శివధర్మ గ్రంథమాల, 1948.

28. నన్నయ్య : ఆంధ్రమహాభారతము, సంపుటం - 1, హైదరాబాద్, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, 1968.

29. నరసయ్య, సంగనభట్ల : తెలుగులో దేశి ఛందస్సు, ప్రారంభ వికాసదశలు ధర్మపురి, ఆనందవర్ధన ప్రచురణలు, 1991.

30. నరసింహాచార్య, కిడాంబి : తిరునామములు - సమగ్ర పరిశీలన, హైదరాబాద్, 1984.

31. నర్సింహారెడ్డి, పి : పాల్కురికి సోమనాథుని కృతులు - పరిశీలన, పిహెచ్.డి. సిద్ధాంతవ్యాసం, (అముద్రితం) హైదరాబాద్, ఉస్మానియా విశ్వవిద్యాలయం, 1972.

32. నారాయణరావు, వెల్చేరు : తెలుగులో కవితావిప్లవాల స్వరూపం, హైదరాబాద్, హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, 1987.

33. నిర్వికల్పానందస్వామి : శ్రీమద్భగవద్గీత, మద్రాసు, రామకృష్ణమఠము, 1988.

34. ప్రభాకరశాస్త్రి, వేటూరి : వేటూరివారి పీఠికలు, హైదరాబాద్, వేటూరి ప్రభాకరశాస్త్రి మెమోరియల్‌ట్రస్ట్, 1985.

35. -do- : అన్నమాచార్య చరిత్ర పీఠిక, తిరుపతి, తిరుమల తిరుపతి దేవస్థానములు, 1949

36. పోతన, బమ్మెర : శ్రీ మహాభాగవతము, మొదటి సంపుటము (ప్రథమ నుండి షష్ఠ స్కందములు) హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1977.

37. -do- : శ్రీ మహాభాగవతము, రెండవ సంపుటము, (సప్తమ నుండి ద్వాదశ స్కందములు), హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1983.

38. బద్దెన : సుమతీ శతకము, రాజమండ్రి, లక్ష్మీనారాయణ బుక్‌డిపో, 1989.

39. బాలయ్య, దాశరథుల : భక్తరామదాసు జీవితము - రచనలు, మెదక్, 1991.

40. బ్రౌన్, సి.పి. : వేమన పద్యాలు, సంపా. బంగోరె, హైదరాబాద్, యోగివేమన తెలుగు విజ్ఞానకేంద్రం, 1980.

41. మల్లికార్జున పండితయ్య : శివతత్త్వసారము, పరిష్కర్త, నిడుదవోలు వెంకటరావు, కృష్ణా పత్రిక ప్రచురణ.

42. మధుసూదన సరస్వతి : భక్తి రసాయనము, వ్యాఖ్య : పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి, తెనాలి, సాధనగ్రంథమండలి, 1953.

43. రంగనాథాచార్యులు, కె.కె. (సంపా.) : తెలుగుసాహిత్యం మరోచూపు, హైదరాబాద్, ఆంధ్రసారస్వత పరిషత్తు, 1981.

44. - do - : తెలుగులో తొలిసమాజ కవులు, హైదరాబాద్, ఆంధ్రసారస్వత పరిషత్తు, 1983.

45. రజనీకాంతరావు, బాలాంత్రపు : ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము, విజయవాడ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, (1958) 1975 (ద్వితీయముద్రణ).

46. రాఘవయ్య, తిరువాయిపాటి : ఆళ్వారుల దివ్యవైభవం, తిరుపతి, తిరుమల తిరుపతి దేవస్థానములు, 1980.

47. రాజమల్లాచారి, కన్నెకంటి : పోతులూరి వీరబ్రహ్మంగారి జీవితం - రచనల పరిశీలన, నరసరావుపేట, సరోజాపబ్లికేషన్స్, 1988.

48. రాజశేఖరుడు : కావ్యమీమాంస, వ్యాఖ్యాత : పుల్లెల శ్రీరామచంద్రుడు, హైదరాబాద్, 1979.

49. రామయ్య, బాడాల : బసవేశ్వర వచనాలు - సమగ్ర సమీక్ష, సిరిగిరి, తరళబాళు జగద్గురు విద్యాసంస్థ, 1977.

50. రామకృష్ణశాస్త్రి, శిష్ట్లా : వీరశైవాంధ్ర వాఙ్మయం, తిరుపతి, తిరుమల తిరుపతి దేవస్థానములు, 1952.

51. రామదాసు : భద్రాచలరామదాసు మధుర కీర్తనలు, రాజమండ్రి గొల్లపూడి వీరాస్వామిసన్స్, 1988.

52. రామరాజు, బిరుదురాజు : తెలుగు జానపదగేయ సాహిత్యము, హైదరాబాద్, 1978 (ద్వితీయ ముద్రణ)

53. వరదరాజన్, ము. : తమిళ వాఙ్మయ చరిత్రము, అను. తిమ్మావజ్ఝల కోదండరామయ్య, న్యూఢిల్లీ, సాహిత్య అకాడమి, 1982.

54. వల్లభరాయుడు, వినుకొండ : క్రీడాభిరామము, మచిలీపట్నం, యం. శేషాచలం అండ్ కో. 1972.

55. వీరభద్రశాస్త్రి, కల్లూరి : త్యాగరాజు కీర్తనలు - విశేష వివరణము, సంపుటం - 1, మద్రాసు, స్వధర్మ స్వారాజ్య సంఘము, 1975.

56. –ఠం– : త్యాగరాజు కీర్తనలు - విశేష వివరణము, సంపుటం - 2, మద్రాసు, స్వధర్మ స్వారాజ్య సంఘము, 1978.

57. వెంకటరమణయ్య, నేలటూరు : విజయనగర చరిత్ర (మొదటి భాగము) హైదరాబాద్ పురావస్తుశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, 1973.

58. వేంకటరామిరెడ్డి, దొడ్ల (వ్యాఖ్యాత) : నారద భక్తిసూత్రములు, మద్రాసు, రామకృష్ణమఠము, 1987.

59. శంకరాచార్య : శ్రీ వివేక చూడామణి, వ్యాఖ్యాత. పుల్లెల శ్రీరామచంద్రుడు, తిరుపతి, తిరుమల తిరుపతి దేవస్థానములు, 1984.

60. శ్రీనాథుడు : పల్నాటివీరచరిత్ర, పరిష్కర్త : పింగళి లక్ష్మీకాంతం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1991 (ద్వితీయ)

61. శ్రీనివాసాచార్యులు, పుట్టపర్తి : తెలంగాణ శాసనములు (సం.2) హైదరాబాద్, లక్ష్మణరాయ పరిశోధక మండలి, 1960.

62. సత్యనారాయణ, కంభంపాటి : ఆంధ్రుల సంస్కృతి - చరిత్ర - 2, అను. మహీధర రామమోహనరావు, హైదరాబాద్, హైదరాబాదు బుక్‌ట్రస్ట్, 1982.

63. సర్దేశాయి, ఎస్.జీ. : ప్రాచీన భారతదేశంలో ప్రగతి, సాంప్రదాయవాదం అను. వి. వెంకటసుబ్బయ్య, హైదరాబాద్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1988.

64. సంపత్కుమారాచార్య, కోవెల : తెలుగు ఛందోవికాసము, హైదరాబాద్, తెలుగు అకాడమి, 1990 (ద్వితీయ)

65. సుబ్రహ్మణ్యం, జీ.వి. : సారస్వత వ్యాసములు (ప్రథమ సంపుటము) హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1981 (ద్వితీయ)

66. - ఠం - సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు, హైదరాబాద్, తెలుగు అకాడమి, 1991.

67. సింగన, మడికి : సకలనీతి సమ్మతము, సంపా. ఎన్. వెంకటరావు, వేటూరి శ్రీరామ అప్పారావు, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1970.

68. సోమనాథుడు, పాల్కురికి : చతుర్వేద సారము, బందరు, శ్రీ భైరవ ముద్రాక్షర శాల, 1914.

69. - ఠం - అనుభవసారము, మద్రాసు, వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, 1955.

70. - do - : వృషాధిప శతకము, కాకినాడ, శ్రీ నిర్మల శైవసాహితీ గ్రంథమాల, 1969.

71. - do - : బసవపురాణము, సంపా. బండారు తమ్మయ్య, చెన్నపురి, వావిళ్ళ రామస్వామిశాస్త్రులు, 1952.

72. - do - : బసవపురాణము, పరిష్కర్త. జి.వి. సుబ్రహ్మణ్యం, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, 1969.

73. - do - మల్లికార్జున పండితారాధ్య చరిత్ర, పరిష్కర్త. చిలుకూరి నారాయణరావు, హైదరాబాద్, తెలుగు విశ్వవిద్యాలయం, 1990.

...

## వ్యాసాలు


1. ఆనందమూర్తి, వేటూరి : ''తెలుగు సంకీర్తన లక్షణము : లక్ష్య లక్షణ సమన్వయము'' భారతి, సంపుటి - 48, సంచిక - 8, ఆగష్టు, 1971.

2. జగద్గురు సాహితీలహరి : సికింద్రాబాద్, యువభారతి, 1986.

3. పరిశోధన, పాల్కురికి సోమనాథ సంచిక, సంపా. తిరుమల రామచంద్ర, సంపుటి-2, సంచిక - 3, 1955.

4. ప్రాచీన కవితా వైజయంతి, విజ్ఞాన సర్వస్వ కేంద్రము, హైదరాబాద్, తెలుగు విశ్వవిద్యాలయం, 1988.

5. రామసుబ్బయ్య, ప్రతాప : ''అలౌకిక శృంగార రసస్ఫూర్తిలేని క్షేత్రయ్య పదసాహిత్యం'' తెలుగు వైజ్ఞానిక మాసపత్రిక, సంపుటి - 5, సంచిక - 2, ఫిబ్రవరి, 1991.

6. సోమశేఖర శర్మ, మల్లంపల్లి : భారతి, సెప్టెంబర్, 1945.


...

# BOOKS IN ENGLISH


Appadorai, A., **Economic Conditions in South India**, Vol.1, Madras, University of Madras, 1936.

Bhandarkar, R.G., **Vaisnavism, Saivism and Minor Religious Systems**, New Delhi, reprint by Asian Educational Societies, 1983.

Brown, C.P., **The Wars of the Rajas, Being the History of Anantapur**, first published in 1853, New Delhi, reprint by Asian Educational Services, 1988.

Chakraborthy, Haripada, **Ascetism in Ancient India**, Calcutta, Punthi Pustak, 1973.

Dasgupta, Surendranath, **History of Indian Philosophy**, Vol.5, first published in 1925, Delhi, reprint by Motilal Banarsidass, 1975.

Dubois, Abbe. J.A.,**Hindu Manners, Customs and Ceremonies**, first published in 1906, New Delhi, reprint by Asian Educational Services, 1985.

Halliday, Fearon, W., **Psychology and Religious Experience**, London, Hodder and Stoughton, 1929, 3rd edition 1930.

Hanumantha Rao, B.S.L., **Religion in Andhra**, Guntur, Tripura Sundari, 1973.

Haughton, G.C., **Manava Dharmasastra**, New Delhi, Asian Educational Services, 4th edition 1982.

Heras, Henry Rev., **The Aravidu Dynasty of Vijayanagara**, Madras, B.G.Paul & Publishers, 1927.

Iswaran, K., **Religion and Society among the Virasaivites**, Delhi, Vikas Publishing House.

Jackson, William J., **Tyagaraja: Life and Lyrics**, Madras, Oxford University Press, 1993.

Jha, D.N (ed.), **Feudal Social Formation in Early India**, Delhi, Chanakya Publications, 1987.

Jnandev, **Jnaneswari**, Translated by R.K.Bhagavati, Madras, Samara Books.

Kane, P.V., **History of Dharmasastras**, Vol.1, Part-II, Poona, Bhandarkar Oriental Research Institute, 1962.

Kane, P.V., **History of Sanskrit Poetics**, New Delhi, Motilal Banarsidass, 1961.

Kosambi, D.D., **An Introduction to the Study of Indian History**, Bombay, Popular Prakasan, 1956, reprint 1985.

Kosambi, D.D., **Culture and Civilization of Ancient India in Historical Outline**, New Delhi, Vikas Publishing House, 1987.

Kosambi, D.D., **Myth and Reality**, Bombay, Popular Prakasan, 1962, second edition 1983.

Krishna Kumari, M., **The Rule of the Chalukya Cholas in Andhra Desa**, Delhi, B.R.Publishing Corporation, 1985.

Ling, Trevor, **Karl Marx and Religion in Europe and India**, London, Macmillan Press, 1980.

Lorenzen, David. N., **The Kapalikas and Kalamukhas**, New Delhi, Thompson Press, 1972.

Machew, Prabhakar, **Kabir**, New Delhi, Sahitya Academe, 3rd edition 1984.

Madan, G.R., **Western Sociologists on Indian Society**, Bombay, Allied Publishers, 1979.

Mahalingam, T.V., **Administration and Social Life under Vijayanagara**, Madras, University of Madras, 1940.

Mahalingam, T.V., **Economic Life in the Vijayanagara Empire**, Madras, University of Madras, 1951.

Malik, S.C (ed.), **Dissent, Protest and Reform in Indian Civilization**, Simla, Indian Institute of Advanced Study, 1977.

Marx, Karl and Engels, Frederick, **Collected Works**, Vol.12, **(1853-54)** Moscow, Progress Publishers, 1979.

Marx, Karl and Engels, Frederick, **Selected Correspondence**, Moscow, Progress Publishers, 1955, 4th edition 1982.

**Marxism On Vedanta** (Anthology), New Delhi, People's Publishing House, 1975.

Miller, Barbara Stoler (ed.), **The Powers Of Art: Patronage in Indian Culture**, New Delhi, Oxford University Press, 1992.

Nandi, Ramendra Nath, **Social Roots of Religion in Ancient India**, Calcutta, K.P.Bagchi & Co., 1986.

Narayana Rao, Velcheru (translated), **Siva's Warriors: Basava Purana of Palkuriki Somanatha**, Princeton, Princeton University Press, 1990.

Narla, V.R., **Vemana**, New Delhi, Sahitya Academe, 3rd edition 1982.

Narla, V.R (ed.), **Vemana: Through Western Eyes**, Madras, M. Seshachalam & Co., 1969.

New, John F.H., **The Renaissance and Reformation**, New York, John wiley & Sons, 1969, 2nd edition 1977.

Nilakanta Sastri, K.A., **A History of South India**, New Delhi, Oxford University Press, 1955.

Nilankanta Sastri, K.A. & Venkta Ramanayya, N., **Further Sources of Vijayanagara History**, Madras, University of Madras, 1946.

Oppert, Gustav, **The Dravidians**, first published in 1888, reprint New Delhi, Asian Educational Services, 1988.

Pande, Susmita, **Birth of Bhakti in Indian Religion and Art**, New Delhi, Books and Books, 1982.

Pandey, Kanti Chandra, **An Outline of History of Saiva Philosophy**, New Delhi, Motilal Banarsidass, 1986.

Parabrahma Sastry, P.V., **The Kakatiyas**, Hyderabad, The Govt. of Andhra Pradesh, 1978.

Pickering, W.S.F., **Durkheim On Religion**, London, Routledge & Kegan Paul, 1975.

Raghavan, V (ed.), **Composers**, New Delhi, Publications Division, 1979.

Raghavan, V., **The Great Integrators**, New Delhi, Publications Division, 4th edition 1979.

Raghavan, V., **Tyagaraja**, New Delhi, Sahitya Akademy, 1983.

Rajanikantha Rao, B., **Ramadasu**, New Delhi, Sahitya Akademy, 1988.

Ramakrishna Rao, Adapa, **Annamacharya**, New Delhi, Sahitya Akademy, 1989.

Ramanujan, A.K., **Speaking of Siva**, Harmondsworth, Penguin Books, 1973.

Ramanujan, A.K., **The Hymns for the Drowning**, Princeton, Princeton University Press, 1981.

Ramaswamy Aiyer, **Thyagaraja: A Great Mu.ician Saint**, New Delhi, reprint by Asian Educational Services, 1986.

Ramaswamy, Vijaya, **Textiles and Weavers in Medieval South India**, New Delhi, Oxford University Press, 1985.

Ranade, R.D., **Mysticism in Maharastra**, first published in 1933, reprint New Delhi, Motilal Banarsidass, 1982.

Raychaudhuri, Tapan & Habib, Irfan (ed.), **The Cambridge Economic History of India**, Vol.1, Hyderabad, Orient Longman, 1982.
Redington, James. D., **Vallabhacharya on the Love Games of Krsna**, Delhi, Motilal Banarsidass, 1983.

Satyanarayana, K., **A Study of the History and Culture of the Andhras**, New Delhi, People's Publishing House, 1982.

Schomer, Karine & McLeod, W.H. (ed.), **The Sants Studies in a Devotional Tradition of India**, Delhi, Motilal Banarsidass, 1987.

Sen, Sukumar, **History of Bengali Literature**, New Delhi, Sahitya Akademy, 1960, 3rd edition 1979.

Sharma, R.S., **Indian Feudalism**, New Delhi, Macmillan India Ltd., 1965, reprint 1985.

Sharma, R.S. (ed.), **Indian Society: Historical Probings**, New Delhi, People's Publishing House, 2nd edition 1984.

Sharma R.S., **Perspectives in Social and Econimic History in India**, New Delhi, Munshiram Manoharlal Pub., 1983.

Sharma, R.S., **Survey of Research in Economic and Social History of India**, Delhi, Atlanta Publications, 1986.

Soma Reddy, R., **Hindu and Muslim Religious Institutions: Andhra Desa 1300-1600**, Madras, New Era Publications, 1984.

Somasekhara Sarma, M., **A Forgotten Chapter of Andhra History**, Madras, Ananda Press, 1945.

Somasekhara Sarma, M., **History Of The Reddy Kingdoms (Circa 1325 A.D. to Circa 1448 A.D.)**, Waltair, Andhra University, 1948, reprint Srisailam, Trinethra Publications, 1993.

Srinivasa Raghavan, A., **Nammalvar**, New Delhi, Sahitya Akademy, 1975, 2nd edition 1983.

Stein, Burton, **All The Kings Mana: Papers on Medieval South Indian History**, Madras, New Era Publications, 1984.

Stein, Burton, **Peasant State and Society in Medieval South India**, New Delhi, Oxford University Press, 1980.

Subrahmanya Sastri, Sadhu, **Tirupati Sri Venkateswara**, Tirupati, Tirumala Tirupati Devasthanam, 1981.

Sundaram K., **Studies in Economic and Social Conditions of Medieval Andhra**, Machilipatnam, Triveni Publishers, 1968.

Talib, Gurubachan Singh, **Guru Nanak**, New Delhi, Sahitya Academe, reprint 1989.

Thaper, Romila, **Interpreting Early India**, New Delhi, Oxford University Press, 1992, 2nd edition 1994.

Thurston, Edgar, & Rangachari, K., **Castes and Tribes of Southern India**, Vols.III & VI, reprint Delhi, Cosmo Publications, 1975 & 1987.

Umadevi, M., **Palkuriki Somanatha**, Hyderabad, Rasgangotri, 1990.

Varadachary, K.C., **Aspects of Bhakti**, Mysore, University of Mysore, 1956.

Venkata Ramanayya, N., **The Eastern Chalukyas of Vengi**, Madras, Vedam Venkataraya Sastri & Brs., 1950.

Weber, Max, **The Protestantic Ethic and The Spirit of Capitalism**, London, George Allen & Unwin Ltd., 1930, 2nd edition 1976.

Weber, Max, **The Religion of India**, New York, the Free Press, 1958.

Zahner, R.C., **Hinduism**, New Delhi, Oxford University Press, 1962, 3rd edition 1977.

## ARTICLES


Champakalakshmi, R., "Urbanization in South India: The Role of Ideology and Polity," in the **Proceedings of the Indian History Congress**, 1986.

Cynthia, Talbot, "Temples, Donors and Gifts," in **the Journal of Asian Studies**, Vol.50, No.2, May 1991.

**Epigraphica Indica**, Vols.XII and XXXII.

Habib, Irfan, "Problems of Marxist Historiography," in **social Scientist**, Vol.16, No.12, 1988.

Habib, Irfan, "Medieval Popular Monotheism and Its Humanism: The Historical Setting," in **Social Scientist**, Vol.21, March-April 1993.

Habib, Irfan, "The Historical Background of the Popular Monotheistic Movement of the 15th-17th Centuries," Unpublished article.

Jaiswal, Suvira, "Presidential Address: Ancient Indian History Section," in the **Proceedings of the Indian History Congress**, 38th Session, 1977.

Jaiswal, Suvira, "Studies in Early Indian Social History: Trends and Possibilities," in **Indian Historical Review**, Vol.VI, Nos.1-2, July 1979 - Jan 1980.

**Journal of Andhra Historical Research Society**, Vol.6, Rajahmundry, 1932.

**Journal of Asian and African Studies**, (ed.) K.Iswaran, Vol.XV, Nos.1-2, 1980.

Kanakadurga, P.S. and Sudhkar Reddy, Y.A., "Kings, Temples and Legitimation of Autochthonous Communities: A case study of a south Indian temple," in **Journal of the Economic and Social History of the Orient**, Vol.XXXV, Part-II, May 1992.

Namboodiripad, E.M.S., "Adi Sankara and His Philosophy: A Marxist view," in **Social Scientist**, Vol.17, Nos.1-2, 1989.

Nandi, R.N., "Growth of Rural Economy in Early Feudal India," in the **Proceedings of the Indian History Congress**, 45th Session, 1984.

Nandi, R.N., "Origins of the Virasaiva Movement," in the **Indian Historical Review**, Vol.2, No.1, 1975.

Sangari, Kum Kum, "Mirabai and the Spiritual Economy of Bhakti," in **Economic and Political Weekly**, 14 July 1990.

Sharma, R.S., "Indian Feudalism Retouched," in the **Indian Historical Review**, Vol.I, No.1, 1974.

Sharma, R.S., "Problem of Transition from Ancient to Medieval in Indian History," in the **Indian Historical Review**, Vol.I, No.II, 1974.

Srinivasachary, C.S., " The Origin of the Right and Left hand Castes Division," in **The Journal of the Andhra Historical Research Society**, Vol.IV, July-October 1929.

Stein, Burton, "Eighteenth Century India: Another View," in **Studies in History**, 1981.

Thaper, Romila, "Dissent and Protest in the Early Indian Tradition," in **Studies in History**, Vol.I, No.2, 1979.

## हिन्दी

1) द्विवेदि, हजारिप्रसाद : कबीर
नई दिल्ली, राजकमल प्रकाशन, 1976 (II ed)

2) मंजुलाचौबे : भक्ति का स्वरूप और महत्व

3) शंकराचार्य : श्री शंकर ग्रन्थावलि
ब्रह्मसूत्र भाष्यम् - 7
Madras, Samata Books, 1983.